23-05Pg1exHMNWJQE.qxd:23-05Pg1exHMNWJQE.qxd 1/1/02 6:59 AM Page 1



ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM విశాఖపట్నం : fb.com/vaartha Digital
Published from Visakhapatnam, Vijayawada, Hyderabad, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
23-5-2026 శనివారం సంపుటి: 32 సంచిక: 112 పేజీలు: 16 వెల: 6.50

## ఎమ్మెల్సీ అనంతబాబుకు బెయిల్ నిరాకరణ

2లో

## వచ్చే నెలలో సింగపూర్ పర్యటనకు చంద్రబాబు, లోకేష్



## 24 రాజ్యసభ సీట్లకు జూన్ 18న పోలింగ్

ఎపి నుంచి అయోధ్య రామిరెడ్డి, పిల్లి సుభాష్ చంద్రబోస్, పరిమళ నత్వానీ, సానా సతీష్ సీట్లు ఖాళీ

2లో

దేవగౌడ, ఖర్గే, దిగ్విజయ్ సింగ్ కూడా రిటైర్

మొత్తం 10 రాష్ట్రాలలో జరగనున్న ఎన్నికలు



## ఐఎఎస్‌ల పిల్లలకూ ఇంకా రిజర్వేషన్లా?

ఉన్నత స్థానాలకు చేరిన కుటుంబాలు కోటా ఆశించడమేమిటి?

సమాజంలోని చివరి వ్యక్తికీ రిజర్వేషన్ ఫలాలు అందాలి

జస్టిస్ నాగరత్న, జస్టిస్ ఉజ్జల్ భూయాన్ వ్యాఖ్యలు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సుప్రీం నోటీసులు

4లో



## సంచలనం సృష్టించిన ఐపిఎల్ ఉప్పల్ మ్యాచ్

ఆటలో

55 పరుగుల తేడాతో బెంగళూరుపై హైదరాబాద్ ఘన విజయం



శుక్రవారం న్యూఢిల్లీలో ప్రధాని మోడీతో భేటీ అయిన సైప్రస్ అధ్యక్షుడు నికోస్ క్రిస్టోడౌలిడ్స్

## ఇండో-సైప్రస్ వ్యూహాత్మక దౌత్యం

ప్రధాని మోడీతో సైప్రస్ అధ్యక్షుడు నికోస్ క్రిస్టోడౌలిడ్స్ ద్వైపాక్షిక చర్చలు

**న్యూఢిల్లీ,మే 22:** భారత్, సైప్రస్ దేశాల దౌత్య సంబంధాలలో సరికొత్త అధ్యాయం ప్రారంభం అయిందని, రెండుదేశాల మధ్య దశాబ్దాలుగా ఉన్న స్నేహ బంధాన్ని మరింత ఉన్నతమైన వ్యూహాత్మక భాగస్వామ్య స్థాయికి పెంచుతున్నట్లు ప్రధాని నరేంద్ర మోడీ ప్రకటించారు. శుక్రవారం ఢిల్లీలోని హైదరాబాద్ హౌస్‌లో భారత్ పర్యటనలో ఉన్న సైప్రస్ అధ్యక్షుడు నికోస్ క్రిస్టోడా లిడ్స్‌తో ప్రధాని మోడీ ప్రతినిధుల స్థాయి చర్చలు >>2

# ఎండ నిప్పులు






శుక్రవారం రాష్ట్రంలో తీవ్రస్థాయి ఉష్ణోగ్రతలపై అధికారులతో సమీక్షిస్తున్న సిఎం చంద్రబాబు

### హీట్‌వేవ్‌పై రాష్ట్రమంతా అప్రమత్తం

తీవ్రత అధికంగా ఉన్న చోట సెలవులు

ఉదయం 11 నుంచి సాయంత్రం 4గం. దాకా ప్రజలు బయటకు రావొద్దని సిఎం చంద్రబాబు సూచన

ఎన్టీఆర్‌జిల్లా నందిగామ: 44.7°

పల్నాడుజిల్లా పిడుగురాళ్ల: 43.8°

మన్యం జిల్లా సాలూరు: 42.4°

వడగాడ్పుల నుంచి రక్షణకు జాగ్రత్తలు

**విజయవాడ మే 22, ప్రభాతవార్తప్రతినిధి:** ఎండల తీవ్రత దృష్ట్యా అధికార యంత్రాంగం నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, ప్రజలను రక్షించేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని సీఎం చంద్రబాబునాయుడు ఆదేశించారు. రాష్ట్రంలో తీవ్రస్థాయిలో నమోదు అవుతున్న ఉష్ణోగ్రతలు, వడ గాల్పుల నేపథ్యంలో ప్రజారోగ్యం, వారి భద్రతపై ముఖ్యమంత్రి చంద్రబాబు అత్యవసర సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు అత్యధికంగా నమోదవుతున్న ప్రాంతాలను గుర్తించి ఆయా ప్రాంతాల్లోని ప్రజలకు నిరంతరం హెచ్చరికలు పంపాలని అధికారులకు సూచిం చారు. ఎండల తీవ్రత మరీ ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో పరిస్థి తులను బట్టి స్థానికంగా సెలవులు ప్రకటించాలని దిశానిర్దేశం చేశారు. తీవ్రస్థాయి ఎల్ నినో కారణంగా హీట్‌వేవ్ తీవ్రత కూడా గణనీయంగా పెరిగిందని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. దీనిపై స్పందించిన సీఎం ప్రజలకు ఎండ వేడిమి నుంచి ఉపశమనం పొందేలా రద్దీగా ఉన్న ప్రాంతాలు, ప్రజలు ఎక్కువగా తిరిగే చోట్ల చల్లని మంచినీరు, మజ్జిగ, ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచాలని స్పష్టం చేశారు. వడగాలుల నుంచి ఎలా రక్షించు కోవాలో ప్రజలకు అవగాహన కల్పించేందుకు జిల్లా కలెక్టర్లు మీడియా సమావేశాలు నిర్వహించాలని సూచించారు. మీడియాతో పాటు సామాజిక మాధ్యమాల ద్వారా నిరంతరం సమాచారాన్ని చేరవేయాలని నిర్దేశించారు. ప్రజల ప్రాణాలే ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యమని, ఎండ తీవ్రత నేపథ్యంలో బయటకు వచ్చేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా >>2

## సైకిల్‌పై మంత్రి నిమ్మల, పల్లా

'నో వెహికల్‌డే' సందర్భంగా 18 కి.మీ సైకిల్ తొక్కిన మంత్రి

పాలకొల్లు నుంచి విజయవాడకు రైల్లోనే..



శుక్రవారం నో వెహికల్ డే సందర్భంగా టిడిపి కేంద్ర కార్యాలయానికి ఒకే సైకిల్‌పై వెళ్తున్న మంత్రి నిమ్మల, పార్టీ అధ్యక్షుడు పల్లా

**విజయవాడ,మే 22,ప్రభాతవార్తప్రతినిధి:** 'నో వెహికల్‌డే' పిలుపును జలవనరుల మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు అంకిత భావంతో అనుసరిస్తున్నారు. 'నో వెహికల్‌డే' రెండో వారం సందర్భంగా శుక్రవారం పాలకొల్లు నుంచి విజయవాడ వరకు మంత్రి నిమ్మల రామానాయుడు రైలులో ప్రయాణించారు. అక్కడ నుంచి తానే కాకుండా టీడీపీ ఏపీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావును సైకిల్‌పై ఎక్కించుకుని ఏకంగా తెలుగుదేశం కేంద్ర కార్యాలయం వరకు తొక్కారు. శుక్రవారం నర్సాపురం నుంచి విజయవాడకు వచ్చే రైలులో పాలకొల్లు స్టాప్‌లో ఎటువంటి ఆర్భాటం లేకుండా ఎక్కారు. ట్రైన్‌లో ఎటువంటి హంగామా లేకుండా సాధారణ ప్రయాణికులతో కలిసి విజయవాడకు మంత్రి చేరుకున్నారు. విజయవాడ శాటిలైట్ రామవరప్పాడు రైల్వే స్టేషన్‌లో దిగారు. అక్కడ నుంచి మంగళగిరి పార్టీ కేంద్ర కార్యాలయం వరకు సైకిల్‌పై వెళ్లారు. >>2

## పోస్టాఫీసులో కుచ్చు'టోపీ'

### రూ.2కోట్ల సొమ్ము స్వాహా

నూజివీడులో ఓ పోస్టల్ ఉద్యోగి అరెస్టు

ఆందోళనలో ప్రజలు



**నూజివీడు, మే 22 ప్రభాతవార్త:** పోస్ట్ ఆఫీస్‌లో రూ.రెండు కోట్ల మేర ప్రజల సొమ్ము గోల్మాల్ జరగటంతో ఒక పోస్టల్ ఉద్యోగి కటకటాల పాలైన సంఘటన నూజివీడులో జరిగింది. కుటుంబ అవసరాలకు పిల్లల చదువు, అమ్మాయిల వివాహాలు, ఇతర భవిష్యత్తు అవసరాల కోసం కేంద్ర ప్రభుత్వ సంస్థ అయిన పోస్ట్ ఆఫీస్‌లో ఎంతో నమ్మకంతో ప్రజలు దాచుకున్న డబ్బులు ఒక ఉద్యోగి కైంకర్యం చేసిన సంఘటన ఆలస్యంగా వెలుగులోనికి వచ్చింది. సుకన్య సమృద్ధి యోజన పథకం, ఆర్. డి( రికరింగ్ డిపాజిట్), పి.ఎల్.ఐ (పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్) (టీ.డీ)టర్మ్ డిపాజిట్ , సీనియర్ సిటిజన్స్ , ఇతర పథకాలు పేరుతో వచ్చిన డబ్బులను కొంతమంది ఉద్యోగులు చేతివాటం ప్రదర్శించి ప్రజల నెత్తిన నిప్పులు పోశారు. పాస్‌పుస్తకాలలో ప్రభుత్వ ముద్ర ఉన్నంతవరకే ప్రభుత్వ గ్యారెంటీ లేని వాటికి ప్రజలకు ఒక్క రూపాయి కూడా తిరిగి రాదు. కొంతమంది దొంగ తపాలా ఉద్యోగుల స్వార్థ బుద్ధితో ప్రజలు దాచుకున్న డబ్బులను తపాలశాఖకు జమ చేయకుండా వారు రియల్ ఎస్టేట్ స్టేట్ వ్యాపారం, ఇతర అవసరాలకు వినియో గించుకుని ప్రజల నెత్తిన శటగోపం పెట్టారు. ఈ సమస్య ప్రస్తుతానికే వచ్చినది కాదు. పోస్టల్ వ్యవస్థ వచ్చినప్పటి నుంచి కూడా జరుగుతున్న సంఘటనలో కోకొల్లలు. అవినీతికి పాల్పడిన సిబ్బందిని మరల పోస్టింగ్ ఇవ్వడం, కఠినమైన శిక్షలు లేకపోవడంవలన వారి చేతివాటానికి ఎదురులేకుండా పోయింది. వారు దోచుకున్న డబ్బులలో కొంత మొత్తం పోస్టల్ ఉన్నతాధికారులకు లంచం ఇస్తే చాలు వారు కొన్ని నెలల తర్వాత ప్రజల్లో డబ్బులు దోచుకున్న దొంగ ఉద్యోగులకు మరలా పోస్టింగ్ ఇస్తారు. గ్రామీణ ప్రాంతాలలో పోస్ట్ ఆఫీస్‌లో ఆన్లైన్ లేకపోవడం మాన్యువల్‌గా ఖాతా పుస్తకాలలో పెన్నుతో రాయడం ఇంకా కొన సాగుతూనే ఉంది. ప్రైవేటు బ్యాంకులు కూడా ఆన్లైన్లో పనిచేస్తుంటే ప్రభుత్వం ఆధ్వర్యంలో కొనసాగుతున్న తపాలా శాఖ మాత్రం ఇంకా గ్రామీణ ప్రాంతాలలో డిజిటలైజేషన్ పూర్తిగా కాలేదు. సిబ్బంది బదిలీ అయి, మరో ఉద్యోగి వచ్చినప్పుడు ఈ స్కాములు బయటపడుతున్నాయి. మీ ఖాతాలో గత ఏడాది, రెండేళ్ల నుంచి బకాయిలు ఉన్నాయని వారు చెప్పడంతో ఖాతాదారులు ఒక్కసారిగా కంగుతింటున్నారు. ఇదేమిటి తాము ప్రతి నెల జమ చేస్తూనే ఉన్నామని వారు చెప్తున్నారు. ఇదే విధంగా గుడివాడ పోస్టల్ డివిజన్ పరిధిలోని నూజివీడు సబ్ పోస్టాఫీస్‌లో అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న కుమార్ >>2

# సోలార్ వెలుగుల సర్కార్



శుక్రవారం టి.కొండూరులో సౌరవిద్యుత్ ప్రాజెక్టును జ్యోతి నప్రజ్వలనతో నప్రారంభిస్తున్న మంత్రి లోకేష్. చిత్రంలో మంత్రులు సవిత, గొట్టిపాటి

జీరో బడ్జెట్, నేచురల్ ఫార్మింగ్ చంద్రబాబు లక్ష్యం

క్లీన్ ఎనర్జీని ఎగుమతి చేస్తాం

సేంద్రియ సాగువైపు రైతుల అడుగులు

టి.కొండూరులో సౌర విద్యుత్ ప్రాజెక్టును ప్రారంభించిన మంత్రి లోకేష్

**జమ్మలమడుగు మే 22 ప్రభాతవార్త:** ఈరోజు కేవలం ఒక సోలార్ విద్యుత్ ప్రాజెక్ట్ ప్రారంభోత్సవం మాత్రమే కాదు, దార్శనికత, నమ్మకం, వేగం, కార్యనిర్వహణ కలగలిసిన వేడుక అని రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి లోకేష్ పేర్కొన్నారు. జమ్మలమడుగు నియోజకవర్గం కొండాపురం మండలం టి.కొండూరు గ్రామంలో రూ.3వేలకోట్లతో నిర్మించిన సుఖ్ బీర్ ఆగ్రో ఎనర్జీ లిమిటెడ్ వారి 600 మెగావాట్ల సౌర విద్యుత్ ప్రాజెక్టులను మంత్రి నారా లోకేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభలో మంత్రి లోకేష్ మాట్లాడుతూ రికార్డ్ టైమ్‌లో SAEL ప్రాజెక్ట్ పూర్తిఅయింది. ఇదిస్థానిక రైతుల విజయం, జమ్మలమడుగు యువత విజయం. మీ సహకారం వల్లనే ఈ ప్రాజెక్ట్ 11 నెలల్లో పూర్తి అయింది. రాష్ట్రం మొతం జమ్మలమడుగు వైపు చూస్తోంది. ఈరోజు ఇతర నియోజకవర్గాల వాళ్ళు మాకు కూడా ఇటువంటి కంపెనీలు వస్తే బాగుంటుంది అనుకుంటున్నారు. పెట్టుబడుల సాధన, పరిశ్రమల స్థాపన, ఉద్యోగాల కల్పనలో ఏపీ విజయానికిముఖ్యమైన మూడు కారణాలున్నాయి. అవి ఏంటంటే మొదటిది బ్రాండ్ సీబీఎన్. పెట్టుబడిదారులు ఇప్పుడు మేము ఎంత త్వరగా ఆంధ్రప్రదేశ్‌కు రాగలం? అని అడుగుతున్నారు. ఎందుకంటే, ఇచ్చిన మాటను చేతల్లో చూపే నాయకత్వంతో నిర్మితమైన ఆంధ్రప్రదేశ్ నేడు ఒక గ్లోబల్ బ్రాండ్‌గా ఎదిగింది. >>2



## హోం గార్డులకు సమగ్ర ఆరోగ్య బీమా

పోలీసు శాఖకు ఎమర్జెన్సీ హ్యాండ్లింగ్ వాహనాలు ప్రారంభించిన హోంమంత్రి అనిత

**విశాఖపట్నం, మే 22 ప్రభాతవార్త:** హోం గార్డులకు సమగ్ర ఆరోగ్య బీమా పథకంను ఏపి రాష్ట్ర హోం, విపత్తు నిర్వహణ శాఖా మంత్రి వంగలపూడి అనిత శుక్రవారం ప్రారం భించారు. విశాఖ నగర పోలీసు కమిషనరేట్ లో కార్యక్రమం నగర పోలీస్ కమిషనర్ డా. శంఖబ్రత బాగ్చి ఆధ్వర్యంలో, నగర పోలీస్ కమిషనరేట్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న హోంగార్డులు వారి కుటుంబ సభ్యుల ఆరోగ్య భద్రత కోసం దేశంలోనే తొలి వినూత్న సంక్షేమ కార్యక్రమంగా సమగ్ర ఆరోగ్య బీమా పథకాన్ని అమలు చేశారు. విధి నిర్వహణలో హోంగార్డులు అధిక ఒత్తిడి, >>2



శుక్రవారం గోల్డ్‌మైన్ వద్ద మీడియాతో మాట్లాడుతున్న మంత్రి కొల్లు రవీంద్ర

# ఇక బంగారం పంట

వచ్చేనెల జొన్నగిరి గోల్డ్‌మైన్ ప్రారంభం

ఈ యేడాది 600 కిలోలు, వచ్చే యేడాది 1,500 కిలోల ఉత్పత్తి

స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు: మంత్రి కొల్లు రవీంద్ర

**కర్నూలు, మే 22, ప్రభాతవార్త :** జొన్నగిరి గోల్డ్ మైన్ త్వరలో వాణిజ్య బంగారం ఉత్పత్తిని ప్రారంభించనున్నట్లు రాష్ట్ర మైన్స్ అండ్ జియాలజీ, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. శుక్రవారం తుగ్గలి మండలం జొన్నగిరి గ్రామ సమీపంలో జియో మైసూర్ సర్వీసెస్ (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్ నిర్వహిస్తున్న గోల్డ్ మైన్స్‌ను మంత్రి కొల్లు రవీంద్ర, పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ దేశ చరిత్రలోనే తొలి ప్రైవేట్ గోల్డ్ మైనింగ్ ప్రాజెక్టులలో ఒకటిగా నిలుస్తున్న జొన్నగిరి బంగారు గనులలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చొరవతో వచ్చే నెల నుంచే వాణిజ్య స్థాయిలో బంగారం ఉత్పత్తి ప్రారంభమయ్యే అవకాశముందని తెలిపారు. ప్రస్తుతం రోజుకు సగటున ఒక కిలో బంగారం ఉత్పత్తి అవుతోందని, నెలకు సుమారు 30 కిలోల వరకు ఉత్పత్తి జరుగుతోందన్నారు. ఈఏడాది 600 కిలోల బంగారం, వచ్చే ఏడాది 1,500కిలోల బంగారం ఉత్పత్తిలక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించారు. >>2

## యుపిలో బస్సు ప్రమాదం



యాత్రకు వెళ్లిన నరసరావుపేట, చిలకలూరిపేట టీచర్స్ మిత్ర బృందం

బస్సు డ్రైవర్, గైడ్ మృతి

పలువురు టీచర్లకు గాయాలు

**నరసరావుపేట క్రైమ్,మే 22 ప్రభాతవార్త:** నరసరావుపేట, చిలకలూరిపేట నుంచి యాత్రకు వెళ్లిన ఉపాధ్యాయులు, వారి మిత్రల బస్సు శుక్రవారం ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని నైమిశారణ్యం వద్ద ప్రమాదానికి గురయ్యింది. పుణ్యక్షేత్రాలతో పాటు పర్యాటక కేంద్రాలను సందర్శించేందుకు ఆ బృందం ఈ పర్యటనకు వెళ్ళింది. ఈ ప్రమాదంలో బస్సు డ్రైవర్, పర్యాటక గైడ్ మృతి చెందారు. బస్సులో ప్రయాణిస్తున్న 50 మంది >>2

# 24 రాజ్యసభ సీట్లకు జూన్ 18న పోలింగ్

**న్యూఢిల్లీ, మే 22:** ఈయేడాది జూన్, జులైలో సభ్యుల పదవీ విరమణ కారణంగా 24 రాజ్యసభ స్థానాలను భర్తీ చేసేందుకు నిర్వహించే ద్వైవార్షిక ఎన్నికల షెడ్యూల్‌ను భారత ఎన్నికల సంఘం (ఇసిఐ) శుక్రవారం ప్రకటించింది. ఎన్నికల కమిషన్ తెలిపిన వివరాలప్రకారం, 10రాష్ట్రాల నుండి ఎన్నికైన 24 మంది రాజ్యసభ సభ్యుల పదవీకాలం జూన్-జులైలో ముగియనుంది. జూన్ 1న ఎన్నికల నోటిఫికేషన్లు జారీ చేయనుండగా, నామినేషన్ల దాఖలుకు చివరితేదీగా జూన్ 8ని నిర్ణయించారు. నామినేషన్ల పరిశీలన జూన్ 9న జరుగుతుంది, అభ్యర్థులు తమ నామినేషన్లను జూన్ 11 వరకు ఉపసంహరించుకోవడానికి అనుమతి ఉంటుంది. జూన్ 18న ఉదయం 9గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ నిర్వహించబడుతుంది, అదే రోజు సాయంత్రం 5 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుంది. మొత్తం ఎన్నికల ప్రక్రియ జూన్ 20నాటికి పూర్తి కావాల్సి ఉంది. స్వేచ్ఛాయుత, నిష్పక్షపాత ఎన్నికల నిర్వహణకు తగిన చర్యలు తీసుకుంటామని, ఇందులో భాగంగా పరిశీలకులను నియమించి ఎన్నికల ప్రక్రియను నిశితంగా పర్యవేక్షి స్తామని కూడా ఇసి తెలిపింది. ఈ ఎన్నికలు ఆంధ్రప్రదేశ్, గుజరాత్, జార్ఖండ్, మధ్యప్రదేశ్, మణిపూర్, మేఘా లయ, రాజస్థాన్, అరుణాచల్ ప్రదేశ్, కర్ణాటక, మిజోరాం రాష్ట్రాల లోని స్థానాలకు వర్తిస్తాయి. పదవీకాలం ముగియనున్న ప్రముఖ నాయకులలో మధ్యప్రదేశ్ నుండి దిగ్విజయ్ సింగ్, కర్ణాటక నుండి హెచ్.డి. దేవెగౌడ, మల్లికార్జున ఖర్గే ఉన్నారు. ఆగస్టు 4, 2025 నుంచి ఖాళీగా ఉన్న జార్ఖండ్ నుంచి దివంగత శిబు సొరేన్‌కు చెందిన స్థానానికి కూడా ఎన్నికలు జరగనున్నాయి. అయోధ్య రామిరెడ్డి, పరిమళ నత్వానీ, సానా సతీష్, పిల్లి సుభాశ్చంద్ర బోస్, రాంభాయ్ హార్జిభాయ్ మొకారియా, జార్జ్ కురియన్, మహారాజా సనజౌబా లీషెంబా, వాన్‌వీరోయ్ ఖర్లూఖీ, నీరజ్ డాంగి, రాజేంద్ర గెహ్లాట్, నబం రెబియా, ఈరన్నా కడాడి, మరియు కె. వనలాల్వేనా, ఇతర సభ్యులు పదవీ విరమణ చేస్తున్నారు.



శుక్రవారం పాలకొల్లు నుంచి విజయవాడకు రైలులో వెళుతున్న మంత్రి నిమ్మల రామానాయుడు



మునగాల ద్వారకానాథ రెడ్డి, అతని కుటుంబ సభ్యులతో మంత్రి లోకేష్

# సోలార్ వెలుగుల సర్కార్

>> రెండవది స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజి నెస్. మేము స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ ను నమ్ముతాం. నిర్ణయాలు వేగంగా తీసుకుని, ప్రాజె క్టులు సకాలంలో పూర్తి చేసినప్పుడే విధానాలకు విలువ ఉంటుంది. ఈ ప్రాజెక్టే అందుకు నిద ర్శనం. ప్రాజెక్ట్ భూమిపూజ నుండి ప్రారంభో త్సవం వరకు రికార్డు స్థాయిలో 11 నెలల్లో పూర్తయింది. మూడవది !! డబుల్ ఇంజిన్ బుల్లెట్ ట్రైన్ సర్కార్. కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వ మద్దతుతో ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి ప్రస్థానం మరింత వేగవంతమైంది. పంజాబ్ లీడర్ షిప్ నేతృత్వంలో పనిచేస్తున్న ఢిల్లీకి చెందిన ఒక కంపెనీ ఆంధ్రప్రదేశ్ లో కార్య కలాపాలు నిర్వహించగలదా? అనే ప్రశ్న నాలో మెదిలింది. SAEL బృందం అమరావతికి వచ్చి ముఖ్య మంత్రి చంద్ర బాబునాయుడుని, నన్ను కలిశారు. క్షేత్రస్థాయిలో పనిచేయడానికి సిద్ధమై, స్పష్టమైన కార్యాచరణ ప్రణాళికతో రావడం నా ప్రశ్నకు జవాబు దొరికింది. SAEL బృందం చక్కగా స్థానిక సమాజం, ప్రజలతో మమేకమయ్యారు. క్షేత్రస్థాయిలో గ్రామ స్థులు, రైతులు, స్థానిక యంత్రాంగం, ఇంజనీర్లు, కార్మికులు, అధికారులతో కలిసికట్టుగా పనిచేశారు. ఆ స్ఫూర్తే ఈ ప్రాజెక్టును విజయవంతం చేసింది. ఈ ఒక్క ప్రాజెక్ట్ ద్వారానే ఏటా సుమారు 11 లక్షల టన్నుల కర్బన ఉద్గారాలను నివారిం చవచ్చని అంచనా. ఇక్కడ ఉత్పత్తి అయ్యే స్వచ్ఛమైన విద్యుత్, సోలార్ ఎనర్జీ కార్పోరేషన్ ఆఫ్ ఇం డియాతో కుదిరిన 25ఏళ్ల విద్యుత్ కొనుగోలు ఒప్పందం ప్రకారం జాతీయ గ్రిడ్‌లోకి సరఫరా అవు తుంది. ఈ విద్యుత్ గుజరాత్‌తో సహా ఇతర రాష్ట్రాలకు కూడా ఉపయోగపడుతుంది. ఆంధ్రప్రదేశ్ ఇప్పుడు కేవలం క్లీన్ ఎనర్జీని వినియోగించడమే కాదు, భారతదేశానికి ఎగుమతి చేసే రాష్ట్రంగా ఎదుగు తోంది. ఈ ప్రాజెక్టు నిర్మాణ సమయంలోనే 1,000 మందికి పైగా కార్మికులు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉద్యోగ, ఉపాధి లభించింది. వీరిలో 80 శాతం మంది స్థానికులే. వీరి ఆదాయాలు మెరుగయ్యాయి. చుట్టుపక్కల గ్రామాల్లో ఆర్థిక కార్యకలాపాలు విస్తరించాయి. అన్నింటికన్నా ముఖ్యంగా, దీర్ఘకాలిక లీజు ఒప్పందాల ద్వారా 760 మంది రైతులు, వారి కుటుంబాలు లబ్ధి పొందాయి. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, జిల్లా ఇన్ చార్జ్ మంత్రి సవిత, కలెక్టర్ చెరుకూరి శ్రీధర్, సేల్ కోఫౌండర్ డైరెక్టర్ సుఖ్ భీర్ సింగ్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీఈవో లక్షి త్ ఆవ్లా, జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి, జమ్మలమడుగు టీడీపీ ఇంఛార్జ్ భూపేష్ రెడ్డి పాల్గొన్నారు.

**రైతులను సేంద్రియ సాగువైపు ప్రోత్సహించాలి:** రైతులను సేంద్రియ సాగువైపు ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని, జీరో బడ్జెట్ నేచురల్ ఫార్మింగ్ సీఎం చంద్రబాబు లక్ష్యమని మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. జమ్మలమడుగు నియోజకవర్గం ముద్దనూరు మండలం పెనికలపాడులో ప్రకృతి వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శించారు. సమీకృత సేంద్రియ సాగు చేస్తున్న రైతు మునగాల ద్వారకానాథ రెడ్డి, అతని కుటుంబ సభ్యులతో సంభాషించారు.

పెనికలపాడుకు చెందిన రైతు ద్వారకానాథ రెడ్డి, ఆయన సోదరుడు రమణారెడ్డిలు గత ఐదేళ్లుగా తమ ఉమ్మడి కుటుంబానికి చెందిన 17 ఎకరాల్లో ప్రకృతి సేద్యం చేస్తున్నారు. పంటలు, పశుపోషణ, కోళ్లు, చేపల పెంపకం వంటి వాటిని ఒకదానికొకటి అనుసంధానం చేసి సమీకృత సేంద్రీయ సాగు చేస్తూ స్థిరమైన ఆదాయం అర్జిస్తున్నారు. తమ పొలంలో మామిడి, బత్తాయి, ఉసిరి, కొబ్బరి, చిన్న నిమ్మ, నేరేడు, జామ, మునగ, రామాఫలం, సీతాఫలం పంటల సాగుతో పాటు 250 వరకు నాటుకోళ్ల పెంపకం, 60వరకు పొట్టేళ్లు, చేపల సాగు చేస్తున్నారు. ఈ సందర్భంగా రైతు ద్వారకానాథ రెడ్డి, అతని కుటుంబ సభ్యులతో మంత్రి సంభాషించారు.

# ఇక బంగారం పంట

>> జొన్నగిరి పరిసర ప్రాంతాల్లో సుమారు 13 వేల టన్నుల వరకు ఖనిజ నిల్వలు ఉన్నాయని అంచనా వేస్తున్నట్లు మంత్రి తెలిపారు. ఇప్పటివరకు రెండు లక్షల టన్నుల ఖనిజాన్ని ప్రాసెసింగ్ చేసినట్లు వివరించారు. ప్రస్తుతం సుమారు 300 మీటర్ల లోతు వరకు తవ్వకాలు జరుగుతున్నాయని, భవిష్యత్తులో రెండు కిలోమీటర్ల లోతు వరకు మైనింగ్ విస్తరించే అవకాశం ఉందన్నారు. లోతుకు వెళ్లే కొద్దీ బంగారం నిల్వలు మరింత పెరిగే అవకాశముందని పేర్కొన్నారు. రాష్ట్రానికి అవసరమైన బంగారంలో 50 నుంచి 60 శాతం వరకు జొన్నగిరి ప్రాజెక్ట్ ద్వారానే అందుబాటులోకి వచ్చే అవకాశం ఉందని మంత్రి తెలిపారు. ఈ ప్రాజెక్ట్ ద్వారా బంగారం దిగుమతుల భారం తగ్గి విదేశీ మారక ద్రవ్యాన్ని ఆదా చేయవచ్చన్నారు. జొన్నగిరిని దేశంలోని "గోల్డ్ హబ్"గా అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. రాష్ట్రంలో మైనింగ్ రంగంలో ఇంకా విస్తృత అవకాశాలు ఉన్నాయని, అనంతపురం జిల్లా రామగిరి ప్రాంతంలో కూడా గోల్డ్ మైనింగ్‌కు అనుకూల ప్రాంతాలను గుర్తించినట్లు మంత్రి వెల్లడించారు. విశాఖపట్నం పరిసర ప్రాంతాల్లో రేర్ ఎర్త్ మినరల్స్ అభివృద్ధికి అవసరమైన బ్లాకులను గుర్తించి టెండర్ ప్రక్రియలు పూర్తి చేస్తున్నామని తెలిపారు. క్వార్ట్జ్ ఖనిజానికి విలువ ఆధారిత పరిశ్రమలు తీసుకువచ్చి సోలార్ ప్యానెల్స్ వంటి ఉత్పత్తులను రాష్ట్రంలోనే తయారు చేసే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు మాట్లాడుతూ గత ప్రభుత్వ కాలంలో సరైన ప్రోత్సాహం లేకపోవడంతో జొన్నగిరి గోల్డ్ మైన్ ప్రాజెక్ట్ ముందుకు సాగలేదన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత గోల్డ్ మైనింగ్ కార్యకలాపాలు వేగవంతమయ్యాయని తెలిపారు. ఇప్పటికే 300 నుంచి 400 మందికి పైగా స్థానిక యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించినట్లు చెప్పారు. ప్రతి సంవత్సరం ఉపాధి కోసం వలస వెళ్లే పరిస్థితి ఉండేదని, ఇప్పుడు గోల్డ్ మైన్ కారణంగా స్థానికంగానే ఉపాధి లభిస్తోందన్నారు. భూసేకరణలో రైతులకు ఎలాంటి అన్యాయం జరగదని, గ్రామసభ ఆమోదం తప్పనిసరిగా ఉంటుందని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. పర్యావరణ నిబంధనల ఉల్లంఘన జరిగితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రాబోయే రోజుల్లో ఓపెన్ మైనింగ్ కార్యకలాపాలు కూడా ప్రారంభం కానున్నాయని, దాంతో మరింత పెద్దఎత్తున ఉపాధి అవకాశాలు ఏర్పడతాయని తెలిపారు. మైనింగ్ రంగం ద్వారా సంపద సృష్టితో పాటు ఉపాధి కల్పన ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. రాష్ట్ర ఖనిజ సంపదను సమర్థంగా వినియోగించి మైనింగ్ రంగంలో గత ఏడాదితో పోలిస్తే 30 శాతం వృద్ధి సాధించే దిశగా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. త్వరలోనే ముఖ్యమంత్రి చేతుల మీదుగా జొన్నగిరి గోల్డ్ మైన్ ప్రాజెక్ట్ ప్రారంభోత్సవం జరగనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో ఓబులేసు, టిడిపి జిల్లా అధ్యక్షులు గుడిసె కృష్ణమ్మ, బోయ కార్పొరేషన్ చైర్మన్ బొజ్జమ్మ, గ్రంథాలయ చైర్మన్ తుగ్గలి నాగేంద్ర, గనుల శాఖ డిప్యూటీ డైరెక్టర్ నాగిని, డీఎస్పీ వెంకటరామయ్య తదితరులు పాల్గొన్నారు.

# యుపిలో బస్సు ప్రమాదం

>> ఉపాధ్యాయులు వారి మిత్ర బృందం చిన్న గాయాలతో సురక్షి తంగా బయటపడ్డారు. ఈనెల 20వ తేదీన హైదరాబాద్ నుంచి విమానంలో లక్నో కి చేరుకున్న ఉపాధ్యాయ బృందం శుక్రవారం నైమిశారణ్యం చూసుకున్నారు. అక్కడి నుంచి వారి బస్సు అయోధ్య వెళ్లే సమయంలో ప్రమాదానికి గురి అయ్యింది. యాత్రలకు బయలుదేరిన బృందం లక్నో, నైమిశారణ్యం, అయోధ్య చూసుకొని నేపాల్ వెళ్లాల్సి ఉంది. కాగా ఈ ప్రమాదంలో ప్రయాణికులకు స్వల్ప గాయాలు మినహా, అందరూ సురక్షి తం గానే ఉన్నారని మిత్ర బృందంలోని కే.కోటేశ్వరరావు సోషల్ మీడియా ద్వారా తెలియజేశారు. ఉపా ధ్యాయ బృందంలోని కుటుంబ సభ్యులు ఎవరు ఆందోళన చెందవద్దని చెప్పారు. దీంతో ఆ బస్సు లో ప్రయాణిస్తున్న వారి కుటుంబసభ్యులు, మిత్రులు ఊపిరి పీల్చుకున్నారు. ప్రమాదానికి గల కారణాలను అక్కడి ప్రభుత్వ ఆదేశాల మేరకు స్థానిక పోలీసులు విచారణ చేస్తున్నారు. ప్రమాదానికి గురైన బస్సును భారీక్రేన్లతో బయటకు తీశారు. క్షతగాత్రులైన ప్రయాణికులను సురక్షి త ప్రాంతాలకు తరలించి, ప్రాథమిక వైద్య సేవలను అందజేశారు. ప్రమాదంలో బస్సు పూర్తిగా దెబ్బతింది.

# పోస్టాఫీసులో కుచ్చు'టోపీ'

>> రాజా రూ. 48 లక్షలు ప్రజల సొమ్మును ప్రజల ఖాతాకు జమ చేయకుండా స్వాహా చేశాడు. ఇటీవల నూజివీడు పోస్ట్ ఆఫీస్ కు పోలీసులు వచ్చి అతన్ని అరెస్టు చేయగా ఈ విషయం వెలుగులోనికి వచ్చింది. కుమార్ రాజా అనే ఉద్యోగి జి.డి.ఎస్ బ్రాంచ్ పోస్ట్ మాస్టర్ (బి .పి.ఎం) గా నందివాడ మండలం నందివాడ గ్రామంలో పనిచేస్తూ ప్రజల నెత్తిన కుచ్చుటోపి పెట్టాడు. ప్రజల సొమ్ము స్వాహా చేసిన ఈ గజదొంగకు పోస్టల్ ఉన్నత అధికారులు నూజివీడులో పదోన్నతి కూడా కల్పించారు. బి. పి.ఎం స్థాయి నుంచి పోస్టల్ అసిస్టెంట్‌గా ప్రమోషన్ కల్పించారు. భారీ స్థాయిలో ప్రజల డబ్బులు స్వాహా చేసిన నిందితునికి నూజివీడులో పోస్టింగ్ ఎలా ఇచ్చారనేది ఉన్నతాధికారులు విచారణలో తేలాల్సి ఉంది. నూజివీడు పట్టణంలో కూడా పలువురు ఖాతాదారులకు సంబంధించిన ఆర్ డి పి ఎల్ ఐ, ఇతర ఖాతాలో డబ్బులు కూడా కైంకర్యం జరిగి ఉంటాయని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఉద్యోగి నూజివీడులో కూడా పనిచేయడంతో నూజివీడు తపాలా కార్యాలయంలో గత నాలుగు నెలల నుంచి జమ చేసిన ప్రజలు ఖాతాలను చెక్ చేసుకోవాలని పలువురు కోరుతున్నారు. నిందితుడు పై కఠిన చర్యలు తీసుకుని ప్రజల సొమ్మును తిరిగి ఇప్పించాలని, పోస్టల్ అధికారులు దీనికి బాధ్యత వహించాలని ప్రజలు ముక్తకంఠంతో కోరుతున్నారు. గతంలో కూడా రెడ్డిగూడెం, మర్సపూడి, పల్లెర్లమూడీ , చాట్రాయి మండలం, పరిసర ప్రాంతాల్లో కూడా ఇటువంటి సంఘటనలు జరిగాయి. ఇప్పటికి వాటికి సంబంధించిన రికవరీని అధికారులు చేయలేకపోయారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి మెయిల్ వర్సెల్, ఏడాదికి ఒకసారి పోస్టల్ ఏ ఎస్ పి, కనీసం రెండు సంవత్సరాలకు ఒకసారి అయినా పోస్టల్ ఎస్పి గ్రామాలలో ఉన్న ప్రతి బ్రాంచ్ పోస్ట్ ఆఫీస్ ను సమగ్రంగా తనిఖీలు చేయవలసి ఉన్నది. ఆయా గ్రామాలలో ఉన్న పోస్టల్ ఖాతాలన్నిటిని పరిశీలించి, ప్రజలు జమ చేసిన డబ్బులు పోస్టల్ ఖాతాకు జమ చేస్తున్నది లేనిది పరిశీలించాలి, కానీ అవినీతి అధికారులు సక్రమంగా తనిఖీలు చేయకుండా ఉండటం వలన ఇటువంటి సంఘటనలు జరుగుతున్నాయి. కొంతమంది అధికారులు గ్రామస్థాయి పోస్ట్ ఆఫీస్ సిబ్బంది వద్ద ముడుపులు తీసుకుని సక్రమంగా తనిఖీలు చేయడం లేదని ఆరోపణ వ్యక్తం అవుతున్నాయి. పోస్ట్మాస్టర్ జనరల్, జిల్లా కలెక్టర్లు స్పందించి సమగ్రంగా విచారణ జరపాలని ఖాతాదారులు కోరుతున్నారు.

**పోస్టల్ ఎస్పీ వివరణ:** ఈ సంఘటనపై గుడివాడ డివిజన్ పరిధి పోస్టల్ ఎస్పీ కృష్ణమూర్తి వివరణ ఇస్తూ జరిగిన సంఘటనపై పోలీసులు విచారణ చేస్తున్నారని పేర్కొన్నారు. పోస్టల్ శాఖ తరపున తాము కూడా విచారణ చేస్తున్నామన్నారు.

# హోం గార్డులకు సమగ్ర ఆరోగ్య బీమా

>> ప్రమాదాలను ఎదుర్కొంటూ ప్రజల భద్రత కోసం రాత్రింబవళ్లు సేవలందిస్తున్నారు. అయితే తీవ్రమైన అనారోగ్య పరిస్థితుల్లో వారి కుటుంబాలు అధిక వైద్య ఖర్చులతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో, ఈ లోటును పూరించేందుకు విశాఖ నగర పోలీస్ శాఖ ప్రత్యేకంగా ఈ ఆరోగ్య బీమా పథకాన్ని రూపొందించింది. ఈ పథకం ద్వారా ప్రతి హోం గార్డ్ కుటుంబానికి రూ 3 లక్షల బేస్ పాలసీతో పాటు రూ 30 లక్షల టాప్‌అప్ కవరేజ్ అదనంగా రూ 3 లక్షల కాంప్లిమెంటరీ కవరేజ్ కల్పించబడుతోంది. మొత్తం రూ 33 లక్షల వరకు ఆరోగ్య బీమా సౌకర్యం అందించబడుతుంది. ఒక్క కుటుంబానికి సంవత్సరానికి గరిష్టంగా రూ 10,264 ప్రీమియం ఉండగా, మొదటి సంవత్సరానికి సంబంధించిన ప్రీమియాన్ని పోలీస్ సంక్షేమ నిధి ద్వారా చెల్లించడం జరిగింది. ఈ పథకం ద్వారా మొత్తం 975 కుటుంబాలకు బీమా కల్పించబడగా, సుమారు 3,144 మంది లబ్ధి పొందనున్నారు. ఇందుకోసం సంక్షేమ నిధినుండి రూ 87,97,809 వెచ్చించారు. ఈ పథకానికి సంబంధించి 24 గంటల ప్రత్యేక హెల్ప్‌లైన్, నగదురహిత చికిత్స సదుపాయం, ఆరోగ్య కార్డుల డేటాబేస్ నిర్వహణ, బీమా సంస్థలు ఆసుపత్రులతో సమన్వయం వంటి ప్రత్యేక సేవలు అందుబాటులో ఉంచారు. ప్రత్యేక హెల్ప్‌లైన్ నంబర్: 7995093606, ఈ మెయిల్: health4police!!gmail. ఈ కార్యక్రమం నందు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హోం, విపత్తు నిర్వహణ మంత్రి వంగలపూడి అనిత హోం గార్డులు వారి కుటుంబ సభ్యులకు ఆరోగ్య బీమా పాలసీ పట్టాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీ తో పాటుగా నగర పోలీసు ఉన్నతాధికారులు, హోం గార్డు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. అదే విధముగా దివీస్ యాజమాన్యం (సి ఎస్ ఆర్) కార్పోరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీలో భాగంగా విశాఖ నగర పోలీసు శాఖకు ఎమర్జెన్సీ హ్యాండ్లిగ్ నిమిత్తం రూపాయలు 19,92,130/ విలువ గల రెండు ఎల్.ఎం.వి ( బోలేరో నియో) వాహనాలను శుక్రవారం మంత్రి నగర పోలీసుశాఖకు అందజేశారు.

# ఎండ నిప్పులు

>> వృద్ధులు, గర్భిణీలు, చిన్నారులు, అనారోగ్యంతో ఉన్నవారు ఉదయం 11 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు బయటకు రాకుండా ఉండాలని సూచించారు. ఈ అత్యవసర పరిస్థితులను ఎదుర్కోవడానికి జిల్లా కలెక్టర్లు, మండల స్థాయి అధికారులు పూర్తి స్థాయిలో సన్నద్ధంగా ఉండాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ప్రస్తుతం పట్టణ ప్రాంతాల్లో 1349 హీట్ షెల్టర్లు, చలి వేంద్రాలు ఏర్పాటు చేసినట్టు అధికారులు సీఎంకు వివరించారు. 446 ట్రాఫిక్ జంక్షన్లలో వాహనదారులు, పోలీసులకు నీడ కల్పించేలా ఏర్పాట్లు చేశామని తెలియచేశారు. మరోవైపు ఎండ తీవ్రతతో ఇబ్బందులు పడుతున్న మూగ జీవులు, పక్షులకు కూడా నీటి తొట్టెలు, మట్టి కుండలతో నీటిని ఏర్పాటు చేయాలని సీఎం సూచించారు.

**పచ్చదనం పెంపుపై దృష్టి:** గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఎక్కడా తాగు నీటి కొరత రాకుండా చూడాలని సీఎం అధికారులకు దిశానిర్దేశం చేశారు. నీటి ఇబ్బందులు ఉన్న ప్రాంతాల్లో ట్యాంకర్ల ద్వారా సరఫరా చేయాలని స్పష్టం చేశారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో ఎమర్జెన్సీ రెస్పాన్స్ సెంటర్లను ఏర్పాటు చేయాలని నిర్దేశించారు. 2015లో బలమైన ఎల్ నినో కారణంగా రాష్ట్రంలో 50.1 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత రికార్డు అయ్యిందని.. ఈ ఏడాదిలోనూ ఎల్ నినో ప్రభావంతో ఇప్పటి వరకూ 48 డిగ్రీల అత్యధిక ఉష్ణోగ్రతలు రాష్ట్రంలో నమోదు అయినట్టు అధికారులు వివరించారు. గడచిన మూడు రోజులుగా 45 డిగ్రీల నుంచి 48 డిగ్రీలకు ఉష్ణోగ్రతలు పెరిగాయన్నారు. దీనిపై స్పందించిన ముఖ్యమంత్రి రాష్ట్రంలో పచ్చదనం పెంపుపై దృష్టి సారించాలని సూచించారు. భూగర్భ జలాలు పెరిగితే... పచ్చదనం పెరుగుతుందని, తద్వారా తీవ్ర ఉష్ణోగ్రతల ప్రభావం నుంచి కొంత మేర ఉపశమన లభిస్తుందని ముఖ్యమంత్రి అన్నారు. అన్నమయ్య జిల్లానే దీనికి ప్రత్యక్ష ఉదాహరణగా నిలుస్తోందని ముఖ్యమంత్రి వెల్లడించారు. ఇతర జిల్లాలతో పోలిస్తే అన్నమయ్య జిల్లాలో తక్కువ ఉష్ణోగ్రత నమోదైందని స్పష్టం చేశారు. తీవ్రస్థాయి ఉష్ణోగ్రతలు నమోదయ్యే ప్రాంతాల్లో హెచ్చరికలు, అప్రమత్తత కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు సమాచారం చేరవేయాలని ముఖ్యమంత్రి నిర్దేశించారు. వచ్చే వారం రోజుల పాటు నిత్యం ప్రజలను అప్రమత్తం చేసేలా కార్యాచరణ చేపట్టాలని సీఎం సూచించారు. ఈ సమీక్షకు సీఎస్ సాయి ప్రసాద్, పురపాలక, పంచాయితీరాజ్ గ్రామీణాభివృద్ధి, విపత్తు నిర్వహణ, వైద్యారోగ్య శాఖల ఉన్నతాధికారులు హాజరయ్యారు.

# ఇండో-సైప్రస్ వ్యూహాత్మక దౌత్యం

>> జరిపారు. తర్వాత జరిగిన సంయుక్త మీడియా సంక్షిప్తీకరణలో ప్రధాని మాట్లాడుతూ, ఈ నూతన నిర్ణయం ఇరు దేశాల ద్వైపాక్షిక సంబంధాలకు సరికొత్త ఉత్సాహాన్ని, స్పష్టమైన గమనాన్ని ఇస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. భారతసైప్రస్ బంధం కాల పరీక్షకు నిలబడిందని, దశాబ్ద కాలంలో సైప్రస్ నుండి భారతదేశానికి వచ్చే పెట్టుబడులు దాదాపు రెండు రెట్లు పెరిగాయని ప్రధాని మోడీ వెల్లడించారు. భారత్-యూరోపియన్ యూనియన్ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం వల్ల రెండు దేశాలకు అనేక కొత్త అవకాశాలు లభిస్తున్నాయని ఆయన అన్నారు. రానున్న ఐదేళ్ల కాలంలో ఇరు దేశాల మధ్య పెట్టుబడులను మరోసారి రెట్టింపు చేయాలనే అత్యున్నత లక్ష్యాన్ని నిర్దేశించుకున్నట్లు ప్రధాని ఉద్ఘాటించారు. రక్షణ, డిజిటల్ రంగాల్లో అవగాహన ఒప్పందాలు ఈ ఉన్నత ఆశయాలను వాస్తవ రూపంలోకి తీసుకురావడానికి ఇరు దేశాలు పలు కీలక రంగాలలో అవగాహన ఒప్పందాలు కుదుర్చు కున్నాయి. ముఖ్యంగా డిజిటల్ మౌలిక సదుపాయాలు, ఫిన్‌టెక్ ఎకోసిస్టమ్స్, సరికొత్త పరిశోధనా కేంద్రాల ఏర్పాటులో పరస్పర సహకారాన్ని పెంపొందించుకోవాలని నిర్ణయించారు. వీటితో పాటు విద్యాసంస్థల మధ్య సంస్థాగత భాగస్వామ్యాలు, విద్యార్థుల మార్పిడి కార్యక్రమాలు, ఉమ్మడి శాస్త్రీయ పరిశోధనలను ప్రోత్సహించడంపై దృష్టి పెట్టారు.

ఇరు దేశాల మధ్య తరలివెళ్లే ఉద్యోగుల హక్కుల రక్షణ కోసం సమగ్ర వలస రవాణా ఒప్పందంతో పాటు సామాజిక భద్రతా ఒప్పందాన్ని తీసుకురావడానికి ఇరు దేశాలు ఏకీభవించాయి. తూర్పు మధ్యధరా ప్రాంతంలో సైప్రస్ భౌగోళిక స్థానం అత్యంత కీలకమని మోడీ గుర్తుచేసారు. సరిహద్దు ఉగ్రవాద బెదిరింపులు, రాడికలైజేషన్, సైబర్ నేరాలను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు వీలుగా ఉగ్రవాద నిరోధకతపై ఒక ఉమ్మడి కార్యనిర్వాహక బృందాన్ని అధికారికంగా ఏర్పాటు చేసుకున్నారు.

ఈ సందర్భంగా ప్రధాని మాట్లాడుతూ సైబర్ సెక్యూరిటీ, సముద్ర భద్రత, ఉగ్రవాద నిర్మూలన రంగాలలో సహకారాన్ని మరింత విస్తరిస్తామని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యం, చట్టబద్ధత, అన్ని దేశాల సార్వభౌమత్వం మరియు ప్రాదేశిక సమగ్రతను గౌరవించడమే ఈ భాగస్వామ్యానికి ప్రధాన సూత్రాలని మోడీ వివరించారు. ఉన్నత స్థాయి ప్రతినిధుల బృందంలో విదేశాంగ మంత్రి కాన్స్టాంటినోస్ కొంబోస్, రవాణా మంత్రి అలెక్సిస్ వాఫియాడెస్ సహా భారత్ వచ్చిన అధ్యక్షుడు క్రిస్టోడౌలిడ్స్ పర్యటన మహారాష్ట్రలో ప్రారంభమైంది. ముంబైలో ఆయనకు గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ, సిఎం దేవేంద్ర ఫడ్నవీస్ ఘనంగా స్వాగతం పలికారు. అక్కడ జరిగిన బిజినెస్ మీట్‌లో గ్లోబల్ షిప్పింగ్, లాజిస్టిక్స్, ఫైనాన్షియల్ సర్వీసెస్ రంగాల్లోని భారీ పెట్టుబడి అవకాశాలను భారతీయ పారిశ్రామిక ప్రముఖుల ముందు సైప్రస్ ప్రతినిధులు ప్రవేశపెట్టారు. తర్వాత ఢిల్లీ చేరుకున్న సైప్రస్ అధ్యక్షుడికి రాష్ట్రపతి భవన్‌లో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అధికారిక స్వాగతం పలికి, ఆయన గౌరవార్థం అధికారిక విందును ఏర్పాటు చేశారు.

# సమాచార చట్టహక్కు పరిధిలో దేవాలయాలు, వక్ఫ్ సంస్థలు, మసీదులు, చర్చిలు

**విజయవాడ,మే 22, ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ సమాచార కమిషన్ చరిత్రాత్మక తీర్పును వెలువరించింది. రాష్ట్రంలోని దేవాలయాలు, వక్ఫ్ సంస్థలు, మసీదులు, చర్చిలు వంటి మతపరమైన సంస్థలు సమాచార హక్కు (ఆర్టీఐ) చట్టం2005 పరిధిలోకి వస్తాయని స్పష్టం చేసింది. ప్రభుత్వ నియంత్రణ, పర్యవేక్షణ, ఆర్థిక సహాయం పొందుతున్న ఈ సంస్థలు చట్టప్రకారం కోరిన సమాచారాన్ని దరఖాస్తుదారులకు అందించడానికి కట్టుబడి ఉండాలని కమిషన్ అంది. ఈ మేరకు చీఫ్ ఇన్ఫర్మేషన్ కమిషనర్ వజ్జా శ్రీనివాసరావు నేతృత్వంలోని బెంచ్ కీలక ఆదేశాలు జారీ చేసింది. విశాఖపట్నంకు చెందిన సమాజసేవకుడు కె.ఎస్.ఎన్. పట్నాయక్ బురుజుపేటలోని కనక మహాలక్ష్మి మ్మ అమ్మవారి దేవస్థానానికి సంబంధించి 2012లో నిర్వహించిన ఉత్సవాల వివరాలను కోరుతూ ఆర్టీఐ చట్టం కింద దరఖాస్తు చేశాడు. దేవాలయాలు సమాచార హక్కు చట్టం పరిధిలోకి రావంటూ గతంలో హైకోర్టు ఇచ్చిన ఒక తీర్పును ఉటంకిస్తూ ఆలయ పబ్లిక్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్ (పిఐఒ) సమాచారం ఇచ్చేందుకు నిరాకరించాడు. దీనిపై రాష్ట్ర సమాచార కమిషన్‌ను పట్నాయక్ తాజాగా విచారణ జరిపారు. విచారణ అనంతరం తీర్పును వెలువరించారు.

# సైకిల్‌పై మంత్రి నిమ్మల, పల్లా

>> వరుసగా రెండో వారం కూడా నో వెహికల్ డే సందర్భంగా సుమారు 18 కిలోమీటర్ల మేర మంత్రి నిమ్మల సైకిల్ తొక్కారు. తాడేపల్లి దగ్గరలో నిమ్మలకు టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాస్ స్వాగతం పలికారు. ఒకే సైకిల్‌పై ఇద్దరూ కూడా పార్టీ కార్యాలయానికి వెళ్లారు.

**జగన్ పిచ్చి తుగ్లక్: మంత్రి నిమ్మల**

జగన్ ఒక పిచ్చి తుగ్లక్ అంటూ మంత్రి నిమ్మల రామానాయుడు వ్యాఖ్యానించారు. పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ అసమర్ధ పాలకునిగా ప్రజలు గుర్తించినందునే జగన్‌ను అధికారం నుంచి దించారన్నారు. ఆయన పార్టీని 11 సీట్లకే పరిమితం చేసారన్నారు. జగన్ మావిగన్ అంటే కూటమి భయపడటం లేదనిన్నారు. ప్రజలే భయపడుతున్నారని తెలిపారు. అధికారం కోసం జగన్ ఎంతకైనా తెగిస్తారని మండిపడ్డారు. హత్యా రాజకీయాలు జగన్‌కు అలవాటన్నారు. అమరావతిలో జరుగుతున్న పనులు చూసి వైసీపీ అధినేతకు భయం మొదలైందని అందుకే అమరావతిపై విషం కక్కుతున్నారంటూ ఆగ్రహం వ్యక్తంచేశారు. జగన్ మళ్లీ సీఎం అయితే పొట్టేలు తలల స్థానంలో ప్రజల తలలు నరుకుతారన్నారు. వచ్చే ఎన్నికల్లో జగన్‌కు 11 సీట్లు కూడా రావని మంత్రి నిమ్మల రామానాయుడు స్పష్టం చేశారు. రెండేళ్ళలో కూటమి ప్రభుత్వం ప్రచార ఆర్భాటాలకు దూరంగా కార్యచరణకు ప్రాధ్యానతను ఇచ్చి సాగిస్తున్న ప్రగతిని చూసి జగన్ ఈర్ష్యపడుతున్నారన్నారు.

# పవన్, నాదెండ్లపై వ్యాఖ్యలు ఉపసంహరించుకున్న ప్రొ.నాగేశ్వర్

**విజయవాడ,మే 22, ప్రభాతవార్తప్రతినిధి:** పవన్ కళ్యాణ్, నాదెండ్ల మనోహర్‌పై తాను చేసిన వ్యాఖ్యలను ఉపసంహరించుకుంటున్నట్టు ప్రొఫెసర్ నాగేశ్వర్ ప్రకటించారు. తనకు తప్పుడు సమాచారం ఇచ్చారని, దానిని క్రాస్ చెక్ చేసుకోకుండా అలా మాట్లాడకుండా ఉండాల్సింది కాదని నాగేశ్వర్ వెల్లడించారు. ఈ చర్చకు ఇంతటితో ముగింపు పలకాలని విజ్ఞప్తి చేశారు. పవన్ కల్యాణ్, నాదెండ్లపై ఇటీవల ఒక ప్రసార మాధ్యమంలో చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదంగా మారాయి. ఆయనపై ఏపీ,టీజీల్లో జనసేన నేతలు కేసులు నమోదు చేసారు. ఈ క్రమంలో నాగేశ్వర్‌పై కేసులు పెట్టడాన్ని సీపీఎం, సీపీఐ నేతలతో సహా పలు ప్రజాసంఘాల నేతలు ఖండించారు. ఈ క్రమంలో పవన్ కల్యాణ్ స్వయంగా జోక్యం చేసుకుని నాగేశ్వర్‌పై ఆయా స్టేషన్లలో కేసులు పెట్టడంపై అసంతృప్తి వ్యక్తం చేసారంటున్నారు. ఈ నేపథ్యంలో పవన్ కళ్యాణ్, నాదెండ్ల మనోహర్ పై వ్యాఖ్యలు ఉపసంహరించుకున్నట్లు ప్రొఫెసర్ నాగేశ్వర్ ప్రకటించారు. దాంతో జనసేన ఈ వివాదానికి ఫుల్ స్టాప్ పెట్టాలని భావిస్తున్నట్లు సమాచారం.

# ఎమ్మెల్సీ అనంతబాబుకు బెయిల్ నిరాకరణ

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి, మే 22 ప్రభాతవార్త:** సాక్షుల బెదిరింపు కేసులో ఎమ్మెల్సీ అనంతబాబుకు జిల్లా కోర్టు బెయిల్ నిరాకరించింది. ఎమ్మెల్సీ అనంత బాబు తన కారు డ్రైవర్ వీధి సుబ్రహ్మణ్యం హత్య కేసులో సాక్షులను బెరించారంటూ కాకినాడ పోలీసులు కేసు నమోదు చేసి సుప్రీం కోర్టు ఇచ్చిన బెయిల్ పై తిరుగుతున్న అనంతబాబును అరెస్ట్ చేశారు. ఈ కేసులో రాజమండ్రి బెయిల్ నిరాకరించింది. అలాగే డ్రైవర్ సుబ్రహ్మణ్యం హత్య కేసులో జరుగుతున్న సాక్షుల విచారణలో బాగంగా శుక్రవారం న్యాయమూర్తి మరో ఇద్దరు సాక్షులను విచారించారు. సుబ్రహ్మణ్యం స్నేహితులు ఆరవ మణికంఠ, అరవ ప్రసాద్ వాంగ్మూలం నమోదు చేశారు.

పిటి వారంట్‌పై కోర్టుకు హాజరైన అనంతబాబు సాక్షులను బెదిరించిన కేసులో బెయిల్ పిటిషన్ ఇవ్వాలని దాఖలు చేశారు. ఈ బెయిల్ పిటిషన్‌ను న్యాయమూర్తి కొట్టివేశారు. ఇంటిభోజనం ప్రత్యేక సదుపాయాలు కల్పించాలని వేడుకోగా తిరస్కరిం చారు. తదుపరి విచారణ సోమవారం జరగనున్నదని పబ్లిక్‌ప్రాసిక్యూటర్ ముప్పాళ్ళ సుబ్బారావు తెలిపారు.

# వచ్చే నెలలో సింగపూర్ పర్యటనకు చంద్రబాబు, లోకేష్

**విజయవాడ,మే 22, ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీ సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ సింగపూర్‌లో పర్యటించనున్నారు. జూన్ నెల 14 నుంచి 16 మధ్య పర్యటనకు వెళ్లనున్నారు. అక్కడి ప్రభుత్వ ఆహ్వానం మేరకు' వరల్డ్ సిటీస్ సమ్మేళనం'లో పాల్గొననున్నారు.

రాష్ట్రానికి పెట్టుబడుల సాధనే లక్ష్యంగా చంద్రబాబు, లోకేశ్ పర్యటన కొనసాగనుంది. పలువురు పారిశ్రామికవేత్తలతో వీరు భేటీ కానున్నారు. పలువురు ఉన్నతాధికారులు కూడా సింగపూర్ పర్యటనకు వెళ్లనున్నారు.

## వారం - వర్జ్యం

23-05-2026, అధికజ్యేష్ఠ శనివారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
అధిక జ్యేష్ఠమాసం, ఉత్తరాయణం
గ్రీష్మ ఋతువు, శుక్లపక్షం, రోహిణి కార్తె
అష్టమి తె.4.28
మఖ రా.2.11
వర్జ్యం : మ.2.11-మ.3.47
దు.తె.5.34-ఉ.7.14
రాహుకాలం - ఉ.9.00-10.30

## వార్తాఫలం

**మేషం:** పోటీ పరీక్షలు, విదేశీయానం, ఉద్యోగం వంటి విషయాలు కుటుంబానికి కలిసి వస్తాయి. స్వల్పధనలాభం.

**వృషభం:** సంతాన పురోగతి బాగుంటుంది. మీరు సుఖపడక పోయినా మీ కృషి వల్ల మీ వాళ్ళు సౌఖ్యంగా వుంటారు.

**మిథునం:** హడావుడిగా నిర్ణయాలు చేయాల్సి వస్తుంది. కృషి వ్యర్థం కాదన్న సంగతి కొన్ని సంఘటనలు ఋజువు చేస్తాయి.

**కర్కాటకం:** శుభకార్యాల విషయంలో మీ నిర్ణయాలు చర్చనీయాంశమవుతాయి. పూర్వపు మిత్రులను కలుసుకుంటారు.

**సింహం:** ముఖ్య ప్రయాణాలు మీకు మీరుగా వాయిదా వేస్తారు. విలువైన కొనుగోళ్ళకు సంబంధించి నిర్ణయాలు చేస్తారు.

**కన్య :** భాగస్వాముల తెలివితక్కువ నిర్ణయాల వల్ల కొన్ని అవకాశాలు మీకు ఇష్టం లేనివారికి దక్కుతాయి. వస్త్ర లాభం.

**తుల :** ప్రతి విషయంలోను జాగ్రత్తగా ఉండాలని నిర్ణయించుకుంటారు. భద్రపరిచే విషయంలో ప్రత్యేక శ్రద్ధ చూపిస్తారు.

**వృశ్చికం:** పెద్ద స్థాయిని గలిగిన వ్యక్తులు కూడా చిన్న చిన్న పనులను చేసికోవలసి వస్తుంది. వ్యాపారాలు ప్రోత్సాహకరం.

**ధనుస్సు:** పెట్టుబడి ఖర్చు, అభివృద్ధికి భవిష్యత్ ప్రణాళికలు ఉపయోగము అవుతాయి. ప్రయాణాలు జాగ్రత్త.

**మకరం :** మీరు చెబితేనే గాని, అభివృద్ధి విషయములు మీ కార్యాలయంలోని వారికి నీ తెలియవు. స్థలాలు కొనుగోలు.

**కుంభం:** కొంత మంది విదేశీ ద్రవ్యమును, విశేషముగా ఆర్జించగలరు. పేరు ప్రఖ్యాతలు అధికమగును. శుభవార్తలు అందుకుంటారు.

**మీనం:** గృహాలంకరణలకు ధనమును ఖర్చు చేస్తారు. శుభవార్తా శ్రవణం చేస్తారు. వివాదాలకు దూరంగా వుండండి.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

23-5Pg3exHMNWJQEBPGOLTK.qxdo*-pp:23-5Pg3exHMNWJQEBPGOLTK.qxd 1/1/02 7:42 AM Page 1



## తిరుమల సమాచారం



### టిటిడి చరిత్రలో తొలిసారిగా శ్రీవారి అభిషేక సేవలో

# సర్వదర్శన భక్తులకు దర్శనం

### రికార్డు స్థాయిలో 79 వేల మందికి దర్శనభాగ్యం

**తిరుమల, మే 22 ప్రభాతవార్త ప్రతినిధి:** కలియుగ వైకుంఠవాసుడు తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామికి శుక్రవారం వేకువజామున జరిపించే అత్యంత విశిష్టమైన, పవిత్రమైన అభిషేకంసేవ వీక్షణమే సామాన్యుడికి గగనం. జీవిత కాలం నిరీక్షించినా సామాన్యుడికి అభిషేకదర్శనం దుర్లభమే. అలాంటిది వేసవి సెలవుల్లో టిటిడి చరిత్రలో ఎరుగని రీతిలో శుక్రవారం వేకువజామున తిరుమల ఆలయంలో ఓవైపు ఏడుకొండల వేంకటేశ్వరస్వామి అభిషేకం సేవ నిర్వహిస్తుండగా మరోవైపు సామాన్యభక్తులను సర్వదర్శనంలో అనుమతించి దర్శనం కల్పించడం జన్మధన్యమైందని భావిస్తున్నారు. తిరుమలలో కొనసాగుతున్న వేసవి సెలవుల నేపథ్యంలో భక్తుల రద్దీ గణనీయంగా పెరిగినప్పటికీ సామాన్య భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా టిటిడి అత్యంత సమర్థవంతంగా దర్శన ఏర్పాట్లు చేస్తోంది. స్వయంగా క్యూలైన్ల పర్యవేక్షణ, సౌకర్యాలపై టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్య చౌదరి ఆరా తీస్తున్నారు. శుక్రవారం ఉదయం ఆయన శ్రీవారి ఆలయం ముందు మీడియాతో మాట్లాడుతూ ఇంటిగ్రేటెడ్ ఏఐ కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా భక్తుల రద్దీని ముందుగానే అంచనా వేసి టైమ్ మేనేజ్మెంట్, క్యూలైన్ల నిర్వహణ, నిరంతర పర్యవేక్షణపై ప్రత్యేక దృష్టి సారించడంతో దర్శనాల సంఖ్యలో గణనీయమైన వృద్ధి సాధ్యమైందన్నారు.ప్రతిరోజూ సాధారణ దర్శనాలతో పాటు అదనంగా 15 వేల మందికి పైగా భక్తులకు శ్రీవారి దర్శనం కల్పిస్తున్నామని వెల్లడించారు. ముఖ్యంగా శుక్రవారం జరిగిన శ్రీవారి అభిషేక సేవ సమయంలోనూ ఐదు వేల మంది సర్వదర్శన భక్తులకు దర్శనం కల్పించడం ద్వారా సామాన్య భక్తులకు పెద్దపీట వేస్తున్నామని స్పష్టం చేశారు. సాధారణంగా గురువారం రోజు శ్రీవారికి నిర్వహించే వారపు కైంకర్యాల కారణంగా దర్శన సమయం తక్కువగా ఉన్నా కూడా తొలిసారి రికార్డు స్థాయిలో 79 వేల మందికి శ్రీవారి దర్శనం కల్పించడం టిటిడి అధికారుల సమన్వయానికి, పనితీరుకు నిదర్శనమన్నారు. ప్రతి గంటకు క్యూలైన్ల పరిస్థితిని ఉన్నతాధికారులు సమీక్షి స్తూ, అవసరమైన నిర్ణయాలను తక్షణమే అమలు చేయడం వల్ల దర్శన ప్రక్రియ మరింత వేగవంతమైందన్నారు. వేసవి రద్దీ నిర్వహణలో టిటిడి విభాగాలతో పాటు విజిలెన్స్, పోలీసు శాఖలు పరస్పర సమన్వయంతో పని చేయడం విశేష ఫలితాలను ఇచ్చిందని తెలిపారు. భక్తులకు తాగునీరు, అన్నప్రసాదాలు, వైద్య సేవలు, క్యూలైన్లలో సౌకర్యాలు నిరంతరాయంగా అందించేలా అన్ని విభాగాలు అప్రమత్తంగా పనిచేస్తున్నాయని చెప్పారు. సామాన్య భక్తులకు సౌకర్యవంతమైన, వేగవంతమైన దర్శనం కల్పించడమే టిటిడి ప్రధాన లక్ష్యమని, ఇందుకోసం అధికార యంత్రాంగం అంకితభావంతో సేవలందిస్తోందని అదనపు ఇఒ వెంకయ్యచౌదరి తెలిపారు.

## భక్తుల రద్దీకి అనుగుణంగా అన్నప్రసాదాలు

**• టిటిడి అదనపు ఇఒ వెంకయ్యచౌదరి**

**తిరుమల, మే 22 ప్రభాతవార్త ప్రతినిధి:** వేసవి సెలవులతో తిరుమల కిటకిటలాడుతోంది. లక్షమందికిపైగా భక్తులు వెలుపల క్యూలైన్లలో, వైకుంఠమ్ కంపార్టుమెంట్లలో ఉన్నారు. వీరందరికీ దర్శనం సంగతి దేవుడెరుగున్నట్లు మారినా నిరంతరాయంగా అల్పాహారం, అన్నప్రసాదాలు అందించేలా అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి చర్యలు తీసుకుంటున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం సాయంత్రం తిరుమలలో అన్నప్రసాద తయారీ కేంద్రాలను తనిఖీ చేశారు. పెరిగిన భక్తుల రద్దీకి అవసరమైన అన్ని ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు. సమయానికి పాలు, మజ్జిగ, అల్పాహారం పంపిణీ చేస్తున్నామన్నారు. అన్నప్రసాదాల పంపిణీ మరింత మెరుగ్గా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉదయం 3 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు నిర్విరామంగా సేవలు అన్నప్రసాద కేంద్రాలు నిరంతరం పనిచేస్తున్నాయని స్పష్టం చేశారు. రోజుకు లక్ష మందికి పైగా భక్తులకు అన్నప్రసాదాల పంపిణీ జరుగుతోందన్నారు. పాలు, మజ్జిగ కూడా టిటిడి, శ్రీవారి సేవకులు భారీ స్థాయిలో అందిస్తున్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకున్నామని అదనపు ఇఒ వెంకయ్యచౌదరి వెల్లడించారు.

## టిటిడి విద్యాదాన ట్రస్ట్‌కు రూ.10 లక్షలు విరాళం



**తిరుమల, మే 22 ప్రభాతవార్త ప్రతినిధి:** ధార్మికసంస్థ టిటిడి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పలు పథకాలు, ట్రస్టలలో ఎస్వీ విద్యాదాన ట్రస్ట్ కూడా ప్రధానం. బెంగళూరుకు చెందిన తరుణ్ గౌడ వేంకటేశ్వర విద్యాదాన ట్రస్టుకు శుక్రవారం రూ.10,10,001 లక్షలు విరాళమిచ్చారు. తిరుమల అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్య చౌదరికి విరాళం డిడిని అందజేశారు.

# 'పవర్'లో రాజీలేదు



**• వేసవికాలం డిమాండ్‌కు అనుగుణంగా విద్యుత్ సరఫరా చేస్తాం • మే 21న రికార్డు స్థాయిలో 288.9 మిలియన్ యూనిట్ల వినియోగం • సిఎం ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ వెల్లడి**

**విజయవాడ, మే 22 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ విద్యుత్ సంస్థలు రాష్ట్ర చరిత్రలోనే అత్యధిక విద్యుత్ డిమాండ్‌ను సమర్థవంతంగా నిర్వహిస్తూ నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్ సరఫరాను విజయవంతంగా కొనసాగిస్తున్నాయని ముఖ్యమంత్రి ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేసారు. రాష్ట్ర గ్రిడ్ మే 21న (గురువారం) రాష్ట్ర చరిత్రలోనే అత్యధికంగా 288.9 మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగాన్ని నమోదు చేసిందని వివరించారు. అదే రోజు పగటి సమయంలో గరిష్ట విద్యుత్ డిమాండ్ 15,016 మెగావాట్లు, సాయంత్రం గరిష్ట డిమాండ్ 12,474 మెగావాట్లుగా నమోదైందని ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర విద్యుత్ వ్యవస్థ ఇప్పటివరకు నిర్వహించిన అత్యధిక లోడ్ ఇదే కావడం విశేషమని, ఇది ఒక మైలురాయిగా నిలిచిందని అయన తెలిపారు. ఈ అపూర్వమైన విద్యుత్ డిమాండ్ పెరుగుదలకు ప్రధాన కారణాలు రాష్ట్రవ్యాప్తంగా నెలకొన్న తీవ్రమైన వడగాలుల పరిస్థితులు, అధిక ఆర్ద్రత, పలు జిల్లాల్లో ఉష్ణోగ్రతలు దాదాపు 46 డిగ్రీల సెల్సియస్ వరకు నమోదయ్యాయని ఆయన వివరించారు. ఎయిర్ కండిషనర్లు, శీతలీకరణ పరికరాలు (ఫ్రిడ్జ్‌లు), తాగునీటి సరఫరా వ్యవస్థలు, వ్యవసాయ పంప్ సెట్ల వినియోగం భారీగా పెరగడంతో అన్ని రంగాల్లో విద్యుత్ వినియోగం గణనీయంగా పెరిగిందని విజయానంద్ తెలిపారు.

విద్యుత్ అత్యధిక డిమాండ్ ఉన్నప్పటికీ ఎపి ట్రాన్స్‌కో. ఎపి జెన్‌కో విద్యుత్ పంపిణీ సంస్థల సమన్వయంతో రాష్ట్రవ్యాప్తంగా ఎలాంటి అంతరాయం లేకుండా స్థిరమైన విద్యుత్ సరఫరాను కొనసాగించినట్లు తెలిపారు. విద్యుత్ సరఫరాకు సంబంధించి ముందస్తు ప్రణాళిక, 24 గంటల గ్రిడ్ పర్యవేక్షణ, సమర్థవంతమైన లోడ్ నిర్వహణ, అందుబాటులో ఉన్న విద్యుత్ వనరుల సద్వినియోగం వల్ల ఈ విజయాన్ని సాధించగలిగామని పేర్కొన్నారు.

రాష్ట్రంలోని ప్రజలు, వినియోగదారులకు నాణ్యమైన, నమ్మకమైన నిరంతరాయ విద్యుత్తును అందించాలనే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆకాంక్షలకనుగుణంగా పకడ్బందీ ముందస్తు ప్రణాళికతో అధికారులు, సిబ్బంది కృషితో ఈ మైలురాయిని అధిగమించామని ఆయన వివరించారు. తీవ్ర వేసవి కాలంలో ప్రజల సౌకర్యం, సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని, అవసరమైనప్పుడు స్వల్పకాలిక మార్కెట్ కొనుగోళ్ల ద్వారా అదనపు విద్యుత్‌ను కూడా రాష్ట్ర విద్యుత్ సంస్థలు సమకూర్చమని, ఈ ముందస్తు చర్యల వల్ల గ్రిడ్ స్థిరత్వం కొనసాగడమే కాకుండా, గరిష్ట డిమాండ్ సమయంలో కూడా గృహ వినియోగదారులు, రైతులు, పరిశ్రమలు, వాణిజ్య సంస్థలు, అత్యవసర సేవలకు అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా అందించగలిగామని తెలిపారు. రికార్డు స్థాయి డిమాండ్‌ను సమర్థవంతంగా నిర్వహించడం ద్వారా ఆంధ్రప్రదేశ్ విద్యుత్ రంగ సంస్థల ముందస్తు సిద్ధత, నిర్వహణ సామర్థ్యం, సమన్వయ కృషి ప్రతిఫలించాయని, ఇంజనీర్లు, ఫీల్డ్ సిబ్బంది, సిస్టమ్ ఆపరేటర్లు, నిర్వహణ బృందాలు వడగాలుల పరిస్థితుల్లో ప్రజలకు నిరంతరాయ విద్యుత్ సరఫరా అందించేందుకు రాత్రింబవళ్లు నిరంతరం కృషి చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

రాష్ట్రవ్యాప్తంగా నిరంతరాయ విద్యుత్ సరఫరాను కొనసాగిస్తూ చారిత్రాత్మక డిమాండ్‌ను విజయవంతంగా నిర్వహించిన ఎపిట్రాన్స్‌కో, ఎపి జెన్‌కో, డిస్కమ్‌ల సిబ్బందిని ఆయన అభినందించారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ మౌలిక వసతులను మరింత బలోపేతం చేసి, అన్ని వర్గాల వినియోగదారులకు నాణ్యమైన, నమ్మకమైన విద్యుత్ సేవలను అందించేందుకు కట్టుబడి ఉందని ఆయన తెలిపారు. ప్రస్తుత వేసవి కాలంలో రాష్ట్రవ్యాప్తంగా సురక్షితమైన, నిరంతరాయ విద్యుత్ సరఫరా అందించేందుకు గ్రిడ్ వ్యవస్థను మరింత బలోపేతం చేయడం, వ్యవస్థ విశ్వసనీయతను కొనసాగించడం కోసం అవసరమైన అన్ని ముందస్తు చర్యలు నిరంతరం తీసుకుంటున్నామని ముఖ్యమంత్రి ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్ తెలిపారు.

# మైన్స్, ఎక్సైజ్ శాఖలను ప్రక్షాళన చేస్తున్నాం

**• ఇసుక విధానం, క్వారీ నిధుల విషయంలో సమస్యలను పరిష్కరించి త్వరితగతిన అనుమతులు ఇవ్వాలి • రాష్ట్ర ఎక్సైజ్, గనులు, జియాలజీ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర**



**అనంతపురం(కలెక్టరేట్), మే 22 ప్రభాతవార్త:** అనంతపురం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో శుక్రవారం జిల్లా గనులు, ఎక్సైజ్ శాఖ అధికారులతో వేరువేరుగా రాష్ట్ర ఎక్సైజ్, గనులు, జియాలజీ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, ఆర్టీసీ జోనల్ చైర్మన్ పూల నాగరాజు, డిఆర్ఓ ఏ.మాలోల, మైన్స్ డిడి ఆదినారాయణ, శ్రీ సత్యసాయి జిల్లా డిఎంజివో షేక్ అమీర్ బాష, డివిజనల్ అధికారి ఓబుల్ రెడ్డి, టెక్నికల్ అసిస్టెంట్ వరప్రసాద్ రెడ్డి, ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య, అసిస్టెంట్ కమిషనర్ కె.ఎస్.వి.ప్రసాద్, జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ బి.రామ్మోహన్ రెడ్డి, శ్రీ సత్యసాయి జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ గోవిందనాయక్, అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్లు రేవతి, నరసింహులు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు. ముందుగా గనులు శాఖపై మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వం ఉచిత ఇసుక విధానాన్ని అమలు చేస్తోందని, జిల్లాలో సానుకూల ప్రజా దృక్పథం మరింత మెరుగుపడాలన్నారు. ఉచిత ఇసుక విధానంలో, క్వారీ నిధుల విషయంలో అనుమతులకు సంబంధించి సమస్యలను పరిష్కరించి త్వరితగతిన అనుమతులు ఇవ్వాలని ఆదేశించారు. ఇసుకను కర్ణాటక, ఇతర ప్రాంతాలకు తరలించకుండా అప్రమత్తంగా ఉంటూ గట్టి చర్యలు తీసుకోవాలన్నారు. వచ్చే వానాకాలంలో ఇబ్బంది లేకుండా అవసరమైన ఇసుకను అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకోవాలన్నారు. కొత్త ఇసుక రీచ్‌లను కూడా గుర్తించాలని ఆదేశించారు. అనంతరం జిల్లా ఎక్సైజ్ శాఖపై మంత్రి సమీక్ష నిర్వహించారు. ఉమ్మడి జిల్లాలలో నమోదవుతున్న ఆదాయ వృద్ధి, నేరాల గుర్తింపు, అలాగే మద్యం దుకాణాలు మరియు బార్లలో జరుగుతున్న ఉల్లంఘనలను అరికట్టేందుకు తీసుకుంటున్న చర్యలపై మంత్రి సమగ్రంగా సమీక్షించారు. తదనంతరం అక్కడే అర్బన్ ఎమ్మెల్యే, ఆర్టీసీ జోనల్ చైర్మన్‌లతో కలిసి మంత్రి ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ ఉచిత ఇసుక విషయంలో మైనింగ్ అధికారులు పకడ్బందీగా ఉండాలనీ మైనింగ్ అక్రమాలకు తావు లేకుండా చర్యలు తీసుకోవాలనీ సూచించారు. నాటు సారా, మద్యం అక్రమ రవాణా, షాపుల టైమింగ్స్, ఎంఆర్‌పి విషయంలో అధికారులకు కీలక సూచనలు చేశారు. గత ప్రభుత్వంలో మైన్స్, ఎక్సైజ్ శాఖను భ్రష్టు పట్టించారనీ, ప్రస్తుత ప్రభుత్వం వాటన్నింటినీ ప్రక్షాళన చేస్తోందనీ అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు బాధ్యతలు చేపట్టిన వెంటనే ప్రజల సౌకర్యార్థం ఉచిత ఇసుక విధానాన్ని తీసుకువచ్చారని, కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత ఉచిత ఇసుక పాలసీ అమలుతో ప్రభుత్వానికి ఎలాంటి ఆదాయం లేకుండా ప్రజలకు నామ మాత్రము రుసుముతో అందిస్తున్నామని తెలిపారు. 3 లక్షల టన్నులు ఇసుకను అనంతపురము జిల్లాలోని ప్రజలకు అందించామనీ, దీనివల్ల ప్రభుత్వానికి రావాల్సిన 30 కోట్ల రూపాయల ఆదాయాన్ని వదులుకుని ప్రజలకు మేలు చేకూర్చడమే లక్ష్యంగా పెట్టుకున్నామనీ అన్నారు. అక్రమాలకు తావులేకుండా కలెక్టర్ల ఆధ్వర్యంలో జిల్లా స్థాయి కమిటీల ద్వారా పర్యవేక్షణ జరుగుతోంది అని అన్నారు. రామగిరి ప్రాంతంలో కూడా కొత్త గనుల కోసం టెండర్ల ప్రక్రియ పూర్తి చేస్తామనీ తెలిపారు. అనంతపురం జిల్లాలోని కలర్ గ్రానైట్ సమస్యలను పరిష్కరించి, కర్ణాటకతో ఉన్న రాయల్టీ వివాదాలను సర్దుబాటు చేస్తామనీ అన్నారు.

## అభినయ్ దర్శన్ వ్యవహారంలో కుట్ర కోణం

**• హోంమంత్రి వంగలపూడి అనిత**



**విజయవాడ, మే 22 ప్రభాతవార్త ప్రతినిధి:** అభినయ్ దర్శన్ వ్యవహారంలో విచారణ జరుగుతోందని, ఇందులో కుట్ర కోణం దాగి ఉందనే అనుమానం ఉందని హోంమంత్రి వంగలపూడి అనిత స్పష్టం చేసారు. ఒక పథకం ప్రకారమే ఈ నేరపూరిత కార్యకాలపం నిర్వహించారన్నారు. క్రైస్తవ మత ప్రచారకుడు, నటుడు అభినయ్ దర్శన్ వ్యవహారంపై హోం మంత్రి అనిత తీవ్రంగానే స్పందించారు. ఈ మేరకు మంత్రి కార్యాలయం నుంచి ఒక ప్రకటన విడుదలైంది. ఈ వ్యవహారంలో రాజకీయ కోణంపైనా పోలీసులు విచారణ చేస్తున్నట్లు తెలిపారు. కుట్రకోణం లేకపోతే కడప నుంచి అల్లూరి జిల్లాకు రావాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు. అమాయకపు గిరిజనులను అభినయ్ దర్శన్ నమ్మించి పాస్టర్ అవతారం ఎత్తారని.. ఆయనపై దాడి జరగకపోయినా జరిగిందని నమ్మించారన్నారు. అభినయ్ దర్శన్ వ్యవహారంలో ఎవరు ఉన్నారనేది త్వరలో బయటపడుతుందని తెలిపారు. దర్శన్‌పై క్రిమినల్ కేసులు ఉన్నాయని, వర్గాల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టే విధంగా ప్రయత్నం చేశారని హోంమంత్రి వెల్లడించారు. ప్రభుత్వాన్ని బదనాం చేసే దృక్పథం ఏమైనా ఉందా అనే కోణంలో విచారణ జరుగుతోందని చెప్పారు. కూటమి ప్రభుత్వ హయాంలో ఇటువంటి నాటకాలు చెల్లవని, ఇలాంటి ఆలోచనలు ఇంకెవరికైనా ఉంటే మానుకోవాలని హితవుపలికారు. ఎవరైనా ఇటువంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అభినయ్ దర్శన్‌ను కస్టడీలోకి తీసుకొని విచారణ చేస్తామని హోం మంత్రి అనిత పేర్కొన్నారు.

## కుట్రపూరిత ప్రచారాలపై కేసులు: జనసేన

**విజయవాడ, మే 22 ప్రభాతవార్త ప్రతినిధి:** జనసేన పార్టీపై కుట్రపూరిత ప్రచారాలపై న్యాయపరమైన కేసులు పెడతామని ఆ పార్టీ హెచ్చరించింది. ఈ మేరకు పార్టీ కేంద్రాలయం ఒక కీలక ప్రకటన విడుదల చేసింది. రాజకీయాల పవిత్రతను భ్రష్టు పట్టించడానికి క్షుద్రశక్తులు కొందరు వృత్తిగా మార్చుకుంటున్నారని జనసేన పార్టీ పేర్కొంది. ముఖ్యంగా ప్రచార మాధ్యమాలలో ఊసరవెల్లులుగా మారుతున్నారు. జరిగింది జరగనట్టు.. జరగని దానిని జరిగినట్టు ప్రచారం చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ప్రజలు ఏది నిజమో ఏది అబద్ధమో తెలుసుకోలేనంతగా మసిపూసి మారేడుకాయలా చేస్తున్నారు. రాజకీయ వ్యవస్థకు, సమాజానికి చేటుగా ప్రమాదభరితంగా మారుతున్న ఇటువంటి ప్రచార కాలుష్యానికి అడ్డుకట్టవేయడానికి జనసేన సంకల్పించింది. దేశం, రాష్ట్రం, ప్రజల అభివృద్దే పరమావధిగా పని చేసే జనసేన పార్టీ పైన, పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ మీదా, నాయకులపై ఎటువంటి అవాస్తవాలు, నిందారోపణలు చేసినా ఇకపై పోలీస్ కేసులు, న్యాయపరమైన చర్యలు చేపట్టాలని జనసేన పార్టీ నిర్ణయించింది. అవాస్తవాలు ప్రచారం చేసేవారు ఎవరైనా, ఎంతటి స్థాయిలో ఉన్నా సరే కేసులు ఎదుర్కొనక తప్పదు.

## ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి జెఎస్‌సి

**విజయవాడ, మే 22 ప్రభాతవార్త ప్రతినిధి:** ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ (జెఎస్‌సి) సమావేశాలకు సంబంధించిన షెడ్యూల్‌ను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. అందులో 2026-27 సంవత్సరానికి జెఎస్‌సి సమావేశాల షెడ్యూల్‌ను వివరించింది. అందుకు సంబంధించిన జిఒ ఆర్‌టీ నంబర్ 1032ను సాధారణ పరిపాలన శాఖ శుక్రవారం రాజధాని అమరావతిలో విడుదల చేసింది. ఈ ఆర్థిక సంవత్సరంలో జూన్, అక్టోబర్, ఫిబ్రవరి నెలల్లో జిల్లా స్థాయి జెఎస్‌సి సమావేశాలు ఉంటాయని తెలిపింది. జూన్, అక్టోబర్, ఫిబ్రవరి నెలల్లో హెచ్ఒడి స్థాయి సమావేశాలు నిర్వహిస్తామని స్పష్టం చేసింది. అదే విధంగా జులై, నవంబర్, మార్చిలో సచివాలయంలోని వివిధ శాఖల జెఎస్‌సి సమావేశాలు ఉంటాయని పేర్కొంది. ఉద్యోగుల ఫిర్యాదుల పరిష్కారానికి వేదికగా జాయింట్ స్టాఫ్ కౌన్సిల్స్ ఉంటుందని రాష్ట్ర ప్రభుత్వం స్పష్టత ఇచ్చింది. గుర్తింపు పొందిన ఉద్యోగ సంఘాలు లేవనెత్తిన అంశాలపై త్వరితగతిన చర్యలు తీసుకోవాలని అధికారులను ప్రభుత్వం ఆదేశించింది. ఈ సమావేశాల మినిట్స్, యాక్షన్ టేకెన్ రిపోర్టులను ఉన్నతాధికారులకు పంపాలని రాష్ట్ర ప్రభుత్వం కోరింది. నిర్దేశిత షెడ్యూల్ ప్రకారం సమావేశాలు నిర్వహించాలని జిల్లా కలెక్టర్లతోపాటు వివిధ విభాగాల అధిపతులు (హెచ్ఒడి)లకు ప్రభుత్వం స్పష్టం చేసింది.





## 'వార్త' కథనంతో తిరుమలలో భక్తుల కష్టాలు వింటూ... అధికారుల పరుగులు

**తిరుమల, మే 22 ప్రభాతవార్త ప్రతినిధి:** వేసవి సెలవులు... ఆపై ఏడుకొండలస్వామి మొక్కులు తీర్చుకునేందుకు అనూహ్యంగా భక్తులు తిరుమలకు రావడంతో కొండ కిటకిటలాడుతోంది. సామాన్యభక్తులను వెలుపల క్యూలైన్ల లోనికి కూడా 14గంటలు టిటిడి అనుమతించలేని పరిస్థితి మారింది. ఈ నేపథ్యంలో భక్తుల బాధలు చూసే వారేదీ శీర్షికతో శుక్రవారం 'వార్త' దినపత్రిక ప్రచురించింది. ఈ వార్తతో టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు, ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం, అధికారులతో కలసి ఆలయం వెలుపల వ్యాపించిన ఐదు కిలోమీటర్లలో భక్తుల బాధలు వినేందుకు కదిలారు. శుక్రవారం సాయంత్రం అధికారగణం తిరుమలలోని సామాన్యభక్తులు వేచిఉంటున్న క్యూలైన్ల తనిఖీ చేశారు.

**భక్తుల రద్దీ నిర్వహణకు పకడ్బందీ చర్యలు:** క్యూలైన్లు, ట్రాఫిక్, అన్నప్రసాదాల పంపిణీపై సంయుక్త తనిఖీలు చేశారు. అధికారులు ఏకంగా కాలినడకన వెళ్తూ భక్తులతో స్వయంగా మాట్లాడి టిటిడి కల్పిస్తున్న సౌకర్యాలపై అభిప్రాయాలు తెలుసుకున్నారు. అనంతరం క్యూలైన్లలో భక్తులకు అందిస్తున్న అన్నప్రసాదాలు, పాలు, మజ్జిగ పంపిణీ, తాగునీటి సదుపాయాలను పరిశీలించారు. క్యూలైన్లలో భక్తులను క్రమబద్ధంగా పంపిస్తూ తొక్కిసలాటలు జరగకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటున్నామని తెలిపారు. చిన్నపిల్లలు, వృద్ధులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా సిబ్బందికి ప్రత్యేక సూచనలు ఇచ్చినట్లు చెప్పారు.

## శ్రీవేంకటేశ్వరస్వామి కిరీటం మాయం కొలిక్కి

**విజయవాడ మే 22 ప్రభాతవార్త ప్రతినిధి:** కృష్ణా జిల్లా గుడివాడలో శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామి కిరీటం మాయం వ్యవహారం కొలిక్కి వచ్చింది. తాకట్టు వ్యాపారి నుంచి కోటి రూపాయల స్వర్ణ కిరీటాన్ని దేవస్థానం కమిటీ సభ్యులు విడిపించారు. పట్టణంలోని ఆర్యవైశ్య కల్యాణ్ మండపం ప్రాంగణంలో మీడియా ఎదుట ప్రదర్శించారు. కిరీటానికి సంప్రోక్షణ చేసి స్వామివారికి అలంకరిస్తామని కమిటీ ఛైర్మన్ పోకూరి మోహనరావు తెలిపారు. కిరీటం తాకట్టు పెట్టలేదంటూ తొలుత కమిటీ సభ్యులు బుకాయించారు. మీడియా ఆధారాలు చూపించగా కిరీటం వ్యవహారం మా కుటుంబ సమస్య మీడియాకు సంబంధం లేదు అంటూ దౌర్జన్యానికి దిగారు. ఈ క్రమంలో వైశ్య సంఘాల పెద్ద జోక్యంతో వివాదం సద్దుమణిగింది. కల్యాణ మందిర నిర్మాణ నిధుల కోసమే కిరీటాన్ని తాకట్టు పెట్టినట్లు కమిటీ ఛైర్మన్ అంగీకరించారు. తప్పు జరిగిందని మన్నించాలని కోరారు. దాత కుటుంబంతో మాట్లాడి కిరీటం స్వామివారికి అలంకరిస్తామని చెప్పారు. జరిగిన తప్పును ఇక్కడితో వదిలేయాలని విజ్ఞప్తి చేశారు.

## రైతులకు అండగా విజ్ఞాన్ వర్సిటీ

**• వాతావరణ సమాచారాన్ని క్షేత్రస్థాయిలోనే అందించేందుకు ఐఎండితో కీలక ఒప్పందం**

**విజయవాడ, మే 22 ప్రభాతవార్త ప్రతినిధి:** రైతులకు వ్యవసాయంలో అండగా నిలిచేందుకు విజ్ఞాన్ యూనివర్సిటీ కీలక నిర్ణయం తీసుకుంది. అత్యాధునిక, కచ్చితమైన వాతావరణ సమాచారాన్ని పొలం స్థాయిలోనే రైతులకు అందించేందుకు భారత వాతావరణ శాఖ (ఐఎండి)తో కీలక ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ఒప్పంద పత్రాలను ఢిల్లీలో విజ్ఞాన్ యూనివర్సిటీ వైస్‌ఛాన్సలర్ ప్రొఫెసర్ కె.వి. కృష్ణ కిషోర్, ఐఎండి కార్యదర్శి డాక్టర్ ఎం. రవిచంద్రన్ మార్చుకున్నారు. ఈ ఒప్పందం ప్రకారం, ఐఎండి తమ వద్ద ఉన్న అత్యంత కచ్చితమైన వాతావరణ సమాచారాన్ని 12 కిలోమీటర్ల పరిధిలో ఎపిఐల ద్వారా విజ్ఞాన్ యూనివర్సిటీకి అందిస్తుంది. ఈ డేటాను విశ్లేషించి, పంటల ప్రణాళిక, నీటిపారుదల యాజమాన్యం, పురుగు మందుల వాడకం, ప్రకృతి వైపరీత్యాల నుంచి పంటలను కాపాడుకోవడం వంటి అంశాలపై విజ్ఞాన్ రైతులకు నిర్దిష్ట సలహాలు, సూచనలు అందిస్తుంది. ఈ భాగస్వామ్యం ద్వారా వాతావరణ శాస్త్ర పరిజ్ఞానాన్ని వ్యవసాయ పరిశోధనలతో అనుసంధానం చేస్తున్నామని విజ్ఞాన్ విసి ప్రొఫెసర్ కృష్ణకిషోర్ వివరించారు. దీనివల్ల వాతావరణ మార్పులు, అకాల వర్షాలు, అధిక ఉష్ణోగ్రతల వంటి సవాళ్లను రైతులు సమర్థంగా ఎదుర్కోగలరని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ ఒప్పందంతో వాతావరణ శాస్త్రం, వ్యవసాయం, విపత్తు నిర్వహణ వంటి రంగాల్లో పరిశోధనలకు, విద్యా కార్యక్రమాలకు ప్రోత్సాహం లభిస్తుందని నరసరావుపేట ఎంపి, విజ్ఞాన్ విద్యా సంస్థల వైస్ ఛైర్మన్ లావు శ్రీకృష్ణ దేవరాయలు తెలిపారు. విద్యార్థులు, అధ్యాపకులు, శాస్త్రవేత్తల మధ్య శిక్షణా కార్యక్రమాలు, పరిశోధన ప్రాజెక్టులకు కూడా ఇది దోహదపడుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ ఒప్పందం ద్వారా వ్యవసాయ రంగంలో శాస్త్రీయ విధానాలను ప్రోత్సహించడం సులభతరం అవుతుందని నిపుణులు భావిస్తున్నారు.

# కెనాల్ పనులను నాసిరకం చేస్తే ఊరుకోను

**• అధికారులకు జెసి ప్రభాకర్‌రెడ్డి వార్నింగ్ • ఐఎస్ఓ స్టాండర్డ్‌తో పనులు చేయాలని హుకుం**

**• మా ఇంటి పనులు చేసినట్లు చేస్తామని అధికారులు హామీ**



విలేకరులతో మాట్లాడుతున్న జెసి ప్రభాకర్ రెడ్డి

**అనంతపురం, మే 22 ప్రభాతవార్త బ్యూరో:** అనంతపురం జిల్లా సింగనమల మండలం యల్లనూరు, పుట్లూరు మండల ప్రాంత రైతులతో కలిసి టిడిపి నేత, తాడపత్రి మున్సిపల్ మాజీ చైర్మన్ జెసి ప్రభాకర్ రెడ్డి శుక్రవారం అనంతపురంలోని హెచ్.ఎల్.సి ఆఫీస్‌కి వచ్చి సంబంధిత అధికారులకు తనదైన స్టైల్‌లో సుతిమెత్తగా హెచ్చరిక చేశారు. మిడ్ పెన్నార్ సౌత్ కెనాల్ ఆధునీకరణ పనులకు కోట్లాది రూపాయల నిధులు వచ్చాయని ఐఎస్ఓ స్టాండర్డ్‌తో పనులు చేయాలని, నాసిరకం పనులు చేస్తే ఊరుకోమని హెచ్చరిక చేశారు. అనంతపురం హెచ్ఎల్‌సి కార్యాలయ అధికారికి రైతులతో పూలదండలు వేయించి శాలువా కప్పి రైతుల సమక్షంలోనే జెసి ప్రభాకర్ రెడ్డి సౌత్ కెనాల్ పనుల విషయంలో హెచ్చరికలు చేయడం విశేషం. ఈ సందర్భంగా జెసి ప్రభాకర్ రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ ఎప్పుడు లేని విధంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సౌత్ కెనాల్ పనులు మీద, గేట్ల మీద ప్రత్యేక దృష్టి పెట్టారు. గత ప్రభుత్వంలో అన్నమయ్య ప్రాజెక్టు గేట్లు కొట్టకపోయినాయి అంటే అప్పట్లో గేట్లకు గ్రీస్ కూడా పెట్టలేదని ఆరోపణలు సంధించారు. ఇప్పుడు రాష్ట్ర నీటిపారుల శాఖ మంత్రి రామానాయుడు, సిఎం చంద్రబాబు నాయుడుకు ప్రత్యేకంగా రాజకీయ నాయకులు విన్నపం చేసుకుంటే గేట్లకు రూ.5 కోట్ల 10 లక్షలు మంజూరు చేశారన్నారు. సౌత్ కెనాల్ ఆధునికరించడంతోపాటు కాలువల్లో పూడిక మట్టి తీసేందుకు రూ.కోటి 10 లక్షలు మంజూరు చేసినట్లు జెసి ప్రభాకర్ రెడ్డి వెల్లడించారు. సౌత్ కెనాల్ కింద బ్రాంచ్ కెనాల్ మరమ్మతి చేసేందుకు దాదాపు రెండు కోట్ల చిల్లర రూపాయలను ప్రభుత్వం ఇచ్చింది అన్నారు. మిడ్ పెన్నార్ సౌత్ కెనాల్ కింద అన్ని పనులకు ఎనిమిదిన్నర కోటి వచ్చిందని ఆయన వివరించారు. తాము ఇక్కడి ఆఫీసుకు ఎందుకు వచ్చామంటే ఇద్దరో.. ముగ్గురో.. నలుగురో... కాంట్రాక్టర్లు ఉంటారు. ఇప్పుడు నాసిరకం పనులు చేసిపోతే నీళ్లు సరిగా రాక రైతులు ఇబ్బంది పడతారు. ఆ విషయాన్ని నీటిపారుదల శాఖ అధికారులు గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నాను. కాంట్రాక్టులు చేసే పనులు ఇండియన్ స్టాండర్డ్ ప్రకారం ఉండాలి. పనులు పూర్తయిన తర్వాత కాలువలు తెగిపోతే మళ్ళీ వేసే పరిస్థితులు లేరు అన్న విషయాన్ని గుర్తించాలని జెసి విజ్ఞప్తి చేశారు. అధికారులు సిబ్బంది ఏమన్నారంటే మీతో కలిసి మరో మీటింగ్ పెట్టుకుని చర్చిస్తావని చెప్పారని ఆయన వెల్లడించారు. మా ఇంటి పనులు చేసినట్లు కాలువ ఆధునీకరణ పనులు చేస్తామని సంబంధిత అధికారులు చెప్పినట్లు జెసి ప్రభాకర్ రెడ్డి వెల్లడించారు. ఈ సందర్భంగా హెచ్ఎల్‌సి అధికారులు విలేకరులతో మాట్లాడుతూ రైతుల సమస్యల పరిష్కారం కోసం జెసి ప్రభాకర్ రెడ్డి ఇక్కడికి వచ్చినందుకు సంతోషం. చిన్న చిన్న సమస్యలు ఉన్నాయి వాటిని జిల్లా అధికారులు దృష్టికి తీసుకుపోయి ఆధునీకరణ పనులు త్వరితగతిన పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తాడపత్రి టిడిపి నాయకులు రవీంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పంజాబ్ నేషనల్ బ్యాంకు punjab national bank ...the name you can BANK upon!

జోనల్ ఆఫీస్: 6-1-73, 2వ అంతస్తు, సయీద్ ప్లాజా, లక్డీ-కా-పూల్, హైదరాబాద్-500004. ఫోన్: 040-24475118 ఈ-మెయిల్: zohydsec@pnb.co.in

దరఖాస్తులు ఆహ్వానిస్తూ ప్రకటన

తెలంగాణ & ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో, హైదరాబాద్ జోనల్ ఆఫీస్ వద్ద దాని శాఖలు/కార్యాలయాల వద్ద AMC ద్వారా CCTV సిస్టమ్‌ యొక్క నిర్వహణ, సరఫరా, స్థాపన, టెస్టింగ్ & కమిషనింగ్(SITC)కొరకు SIs యొక్క జాబితా కొరకు టెండర్. పంజాబ్ నేషనల్ బ్యాంకు, హైదరాబాద్ జోనల్ ఆఫీస్ క్రింద శాఖలు/కార్యాలయాలలో ప్రస్తుతం ఉన్న మరియు కొత్త CCTV సిస్టమ్ లు నెలకొల్పడానికి CCTV సిస్టమ్ యొక్క నిర్వహణ మరియు SITC కు SIs యొక్క జాబితా కొరకు అర్హులైన SIs నుండి సీల్డ్ దరఖాస్తులు కోరబడుచున్నవి. OEM లు మరియు వారి CCTV ఉపకరణాలు ఇప్పటికే బ్యాంకుచే జాబితా చేయ్య అయినవి. (అనుబంధం VII గా జతపరచబడినది) పంజాబ్ నేషనల్ బ్యాంకు ప్రధాన కార్యాలయంచే ఇప్పటికే అధీకృత విక్రేత (SI) ఒరిజినల్ ఉపకరణాల ఉత్పత్తిదారుని యొక్క ఛానల్ భాగస్వాములు (ఇకనుండి OEM లుగా పిలువబడతారు) M/s. సమృద్ధి ఆటోమేషన్ ప్రైవేట్ లిమిటెడ్ (Sparsh) మరియు M/s. ఆదిత్య ఇన్ఫోటెక్ లిమిటెడ్ (CP Plus) వంటి సిస్టమ్స్ ఇంటిగ్రేటర్ లు (SIs) ఇప్పటికే జాబితాలో చేర్చబడినారు. అర్హతా ప్రమాణం (అనుబంధం-I) నియమాలు మరియు నిబంధనలు (అనుబంధం-III) జాబితాలో చేర్చబడింది CCTV ఉపకరణ వివరాలు, ఎంప్యానెల్మెంట్ డాక్యుమెంట్‌లో పేర్కొనబడినవి.

ఆసక్తి గల SIs వారి దరఖాస్తు నిర్దేశిత ఫారంపై, నిర్దేశించబడిన డాక్యుమెంట్‌లతోసహా డిప్యూటీ జోనల్ మేనేజర్, పంజాబ్ నేషనల్ బ్యాంకు, జోనల్ ఆఫీస్ హైదరాబాద్, 6-1-73, 2వ అంతస్తు, సయీద్ ప్లాజా, లక్డీకాపూల్, హైదరాబాద్-500004 వారికి 01-06-2026న సా. 16.00 గం. లేదా ముందు అందేటట్లుగా దాఖలు చేయవచ్చును. మా వెబ్‌సైట్ https://www.pnbindia.in నుండి టెండర్ డాక్యుమెంట్ లు డౌన్‌లోడ్ చేసుకోనవచ్చును.

తేది: 23-05-2026 ప్రదేశం: హైదరాబాద్ డిప్యూటీ జనరల్ మేనేజర్



# చొరబాట్ల కట్టడికి స్మార్ట్ బోర్డర్‌ప్రాజెక్టు!

## కేంద్ర హోంమంత్రి అమిత్‌షా

**న్యూఢిల్లీ, మే 22:** దేశంలోకి భూమార్గం ద్వారా అక్రమ చొరబాట్లను నివారించేందుకు త్వరలో దేశ సరిహద్దుల్ని స్మార్ట్ బార్డర్ ప్రాజెక్ట్ పరిధిలోకి మార్చనున్నట్లు కేంద్ర హోం మంత్రి అమిత్ షా వెల్లడించారు. న్యూఢిల్లీలో శుక్రవారం జరిగిన ఒక కార్యక్రమంలో అమిత్ షా పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమిత్ షా మాట్లాడారు. త్వరలో స్మార్ట్ బార్డర్ ప్రాజెక్ట్ చేపట్టనున్నట్లు వెల్లడించారు. సరిహద్దుల్లో రక్షణ వ్యవస్థ మరింత బలోపేతం చేసేందుకు సాంకేతికతను ఉపయోగించుకుంటున్నట్లు చెప్పారు. ముఖ్యంగా బంగ్లాదేశ్, పాకిస్తాన్ సరిహద్దుల నుంచి అక్రమ చొరబాట్లను ఆపేందుకు ఆధునిక నిర్మాణాలు చేపడుతున్నట్లు చెప్పారు. అత్యాధునిక సెక్యూరిటీ కెమెరాలు, రాడార్లు, సెన్సర్లు, సర్వైలెన్స్ టూల్స్, రియల్ టైమ్ మానిటరింగ్ ప్లాట్‌ఫామ్స్ వంటివి ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. బంగ్లా, పాక్ సహా అంతర్జాతీయ సరిహద్దు కలిగి ఉన్న వివిధ రాష్ట్రాల్లో ఇందుకోసం ప్రత్యేకంగా భూమిని కేటాయిస్తున్నట్లు చెప్పారు. ఈ ఏడాదిలోనే వీటిని ఏర్పాటు చేస్తామన్నారు. ఇందుకోసం పశ్చిమ బెంగాల్‌లో కూడా ప్రభుత్వం భూమిని కేటాయించిందన్నారు. కొత్త నిర్మాణాల ద్వారా అక్రమ చొరబాట్లను వెంటనే గుర్తించి అడ్డుకోవచ్చన్నారు. సరిహద్దులో డ్రోన్ యాక్టివిటీస్, పశువులు అక్రమ రవాణా, డ్రగ్ ట్రాఫికింగ్ సహా ఎలాంటి అనుమానాస్పద కదలికలనైనా వెంటనే గుర్తించవచ్చని తెలిపారు. ఎలాంటి చొరబాటు, చర్యను గమనించినా వెంటనే సెక్యూరిటీ సిబ్బందికి అలర్ట్ వెళ్తుందని వెల్లడించారు. దేశానికి ఐదు దశాబ్దాలుగా ఉన్న నక్సల్స్ సమస్య ముగింపు దశకు చేరుకుందన్నారు. త్వరలో ఇండియా నక్సల్ ఫ్రీ దేశం అవుతుందని అభిప్రాయపడ్డారు. మన సైన్యం ఈ విషయంలో తమ సత్తా చాటిందని, సమస్యను కూకటివేళ్లతో సహా పెకిలించామని చెప్పుకొచ్చారు. పాకిస్తాన్ ఉగ్ర చర్యలకు పాల్పడిన ప్రతిసారీ ఇండియా ఘాటుగా స్పందించిందన్నారు. తమ హయాంలో మూడుసార్లు పాక్‌కు సమాధానం చెప్పామని అమిత్ షా వివరించారు. రాష్ట్రాలు, కేంద్రం కలిపి సరిహద్దులో భద్రతను కట్టుదిట్టం చేస్తున్నాయని తెలిపారు. పాకిస్తాన్, బంగ్లాదేశ్ నుంచి ఇండియాలోకి అక్రమంగా చొరబడుతున్న సంగతి తెలిసిందే.

# కొడుకు పెళ్లికి వెళ్తానో .. లేదో!

## భద్రతా కారణాల రీత్యా సందేహిస్తున్న ట్రంప్



**వాషింగ్టన్, మే 22:** ఇరాన్‌తో ఉద్రిక్తతల నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. త్వరలో జరగనున్న తన పెద్ద కుమారుడు డొనాల్డ్ ట్రంప్ జూనియర్ పెళ్లికి తాను హాజరుకాకపోవచ్చని పేర్కొన్నారు. ఆ వేడుకకు హాజరైనా.. హాజరుకాకపోయినా తప్పుడు వార్తలతో తనను చంపేస్తారని చమత్కరించారు. అందుకే వివాహానికి హాజరయ్యేందుకు ప్రయత్నిస్తానని.. అయితే ప్రస్తుత అంతర్జాతీయ పరిణామాలు, భద్రతాపరమైన ఆందోళనల నేపథ్యంలో అది కష్టంగా మారే అవకాశం ఉందని తెలిపారు. 48 యేళ్ల డొనాల్డ్ ట్రంప్ జూనియర్ ఈ వారాంతంలో తన ప్రియురాలు బెట్టినా ఆండర్సన్‌ను వివాహం చేసుకోనున్నారు. ఈ వేడుక బహామాస్‌లో జరగనుంది. భద్రతా కారణాల దృష్ట్యా ఈ వివాహానికి సన్నిహితులను మాత్రమే ఆహ్వానిస్తున్నట్లు తెలుస్తోంది. కాగా ట్రంప్ జూనియర్ 2005లో వెనెసాను వివాహం చేసుకున్నారు. ఆ తర్వాత వీరి మధ్య విభేదాలు రావడంతో 13 యేళ్ల తమ వైవాహిక బంధానికి స్వస్తి పలుకుతూ 2018లో విడాకులు తీసుకున్నారు. వీరికి ఐదుగురు సంతానం. 2020లో ట్రంప్ జూనియర్‌కు ఫాక్స్‌న్యూస్ మాజీ హోస్ట్ కింబర్లీతో నిశ్చితార్థం జరగ్గా.. తర్వాత దానిని రద్దు చేసుకున్నారు. తర్వాత మోడల్, సామాజికవేత్త అయిన బెట్టినా ఆండర్సన్‌తో ట్రంప్ జూనియర్ గతేడాది ఎంగేజ్‌మెంట్ చేసుకున్నారు.

# హిందూదేవాలయాలపై ప్రభుత్వ నియంత్రణ చట్టాలను సవాల్ చేస్తూ పిటిషన్

### తామే మొత్తం విచారణచేస్తామని సుప్రీం ధర్మాసనం స్పష్టీకరణ

**న్యూఢిల్లీ, మే 22** తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, పుదుచ్చేరిలో హిందూ దేవాలయాలపై ప్రభుత్వ నియంత్రణ చట్టాలను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లపై హైకోర్టును ఆశ్రయించాలంటూ గత ఏడాది ఏప్రిల్‌లో ఇచ్చిన ఆదేశాలను సుప్రీంకోర్టు వెనక్కి తీసుకుంది. దేవాలయాలపై ప్రభుత్వాల నియంత్రణ చట్టాలపై విచారణకు సుప్రీంకోర్టు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. దక్షిణ భారతదేశంలోని హిందూ దేవాలయాలను ప్రభుత్వాలు తమ అధీనంలో ఉంచుకోవడాన్ని సవాలు చేస్తూ దాఖలైన కీలక పిటిషన్ల విచారణకు సుప్రీంకోర్టు శుక్రవారంనాడు అంగీకరించింది. కేసును హైకోర్టులకు బదిలీ చేస్తూ గతంలో ఇచ్చిన పాత ఆదేశాలను జస్టిస్ బివి నాగరత్న, జస్టిస్ సతీశ్ శర్మతో కూడిన ధర్మాసనం రద్దు చేసింది. చట్టాల చెల్లుబాటుపై జూలై 24 నుంచి మెరిట్స్ ఆధారంగా తామే తుది విచారణ జరుపుతామని ధర్మాసనం స్పష్టంచేసిం. ఏపీ, తెలంగాణ, తమిళనాడు, పుదుచ్చేరిలో హిందూ ధార్మక సంస్థల నియంత్రణ చట్టాలను పిటిషన్లరు సవాలు చేశారు. కేవలం హిందూ ఆలయాలనే నియంత్రించడం రాజ్యాంగం కల్పించిన మతస్వేచ్ఛ, సమానత్వ హక్కులకు విరుద్ధమని తమ పిటిషన్‌లో స్వామి దయానంద సరస్వతి ట్రస్ట్ పేర్కొంది. ఆలయాల హుండీ ఆదాయం, మిగులు నిధులను ప్రభుత్వాలు ఇతర కార్యకలాపాలకు మళ్లించడంపై పలువురు పిటిషనర్లు అభ్యంతరం వ్యక్తం చేశారు. సామాజిక సమానత్వం, నిధుల అవినీతిని అరికట్టేందుకే ఆలయాల నిర్వహణలో ప్రభుత్వాలు జోక్యం చేసుకుంటున్నాయని రాష్ట్రాలు వాదన వినిపించాయి. ఈ క్రమంలో న్యాయంకోసం హైకోర్టును ఆశ్రయించాలంటూ గతంలో ఆదేశించిన సుప్రీంకోర్టు ఇపుడు తామే స్వయంగా విచారణ జరుపుతామని స్పష్టం చేసింది. సుప్రీంకోర్టు నిర్ణయంతో కేంద్ర ప్రభుత్వం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా ఏకీభవించారు. వేర్వేరు హైకోర్టుల కంటే సుప్రీంకోర్టు తేల్చడమే సముచితమని పేర్కొన్నారు.

# ఐఏఎస్‌ల పిల్లలకూ ఇంకా రిజర్వేషన్లా?

### ఉన్నత స్థానాలకు చేరిన కుటుంబాలు కోటా ఆశించడమేమిటి?
### సమాజంలోని చివరి వ్యక్తికీ రిజర్వేషన్ ఫలాలు అందాలి
### జస్టిస్ నాగరత్న, జస్టిస్ ఉజ్జల్ భూయాన్ వ్యాఖ్యలు
### కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సుప్రీం నోటీసులు



**న్యూఢిల్లీ, మే 22:** దేశంలో రిజర్వేషన్లు, క్రీమీ లేయర్ అంశాలపై భారత సుప్రీంకోర్టు శుక్రవారం సంచలన వ్యాఖ్యలు చేసింది. విద్య, ఆర్థిక రంగాల్లో ఇప్పటికే ఉన్నత స్థానాలకు చేరుకున్న కుటుంబాలు, ఇంకా కోటా ప్రయోజనాల కోసం పట్టుబట్టడాన్ని న్యాయస్థానం తీవ్రంగా ప్రశ్నించింది. రిజర్వేషన్ల ఫలాలు అందుకొని సామాజికంగా, ఆర్థికంగా ఉన్నత స్థాయికి చేరిన కుటుంబాలు తరతరాలుగా అదే కోటాను కోరుకోవడంపై సుప్రీంకోర్టు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. "తల్లిదండ్రులు ఇద్దరూ ఐఏఎస్ అధికారులై, ప్రభుత్వ సర్వీసుల్లో ఉంటూ పూర్తి స్థాయిలో స్థిరపడినప్పుడు, ఇక వారి పిల్లలకు రిజర్వేషన్ల కోటా ఎందుకు?" అని అత్యున్నత న్యాయస్థానం సంచలన ప్రశ్నలు సంధించింది. వెనుకబడిన వర్గాల్లోని "క్రీమీలేయర్" (ధనిక, ఉన్నత శ్రేణి) పరిమితులు, రిజర్వేషన్ల మినహాయింపులపై దాఖలైన పిటిషన్లను విచారించిన జస్టిస్ బి.వి. నాగరత్న, జస్టిస్ ఉజ్జల్ భుయాన్‌లతో కూడిన ధర్మాసనం శుక్రవారం ఈ కీలక వ్యాఖ్యలు చేసింది. విచారణ సందర్భంగా జస్టిస్ బి.వి. నాగరత్న మాట్లాడుతూ.. విద్య, ఆర్థిక సాధికారత ద్వారా సమాజంలో ఒక స్థాయి (సోషల్ మొబిలిటీ) లభిస్తుందని పేర్కొన్నారు. 'రిజర్వేషన్ల ద్వారా ఒకసారి ఉన్నత స్థాయికి చేరుకున్నాక కూడా, మళ్లీ వారి పిల్లల కోసం కోటాను ఆశించడం సరికాదు. ఇలాగైతే మనం రిజర్వేషన్ల వ్యవస్థ నుంచి ఎప్పటికీ బయటపడలేం. ఈ అంశాన్ని తీవ్రంగా పరిగణించాల్సి ఉంది' అని వ్యాఖ్యానించారు. ఒక వ్యక్తి సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడి ఉండవచ్చని.. కానీ, రిజర్వేషన్ల ప్రయోజనం పొంది తల్లిదండ్రులు ఉన్నత స్థానాలకు వెళ్లినప్పుడు వారి పిల్లల పరిస్థితి మారుతుందని, ఇక్కడ ఒక సమతుల్యత (బ్యాలెన్స్) అవసరమని కోర్టు స్పష్టం చేసింది. ఒకే కుటుంబంలో ఉన్నత వర్గాలే అన్ని అవకాశాలను చేజిక్కించుకుంటే, అదే వర్గంలోని అత్యంత వెనుకబడిన పేదలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని ధర్మాసనం ఆందోళన వ్యక్తం చేసింది. రిజర్వేషన్ల ఫలాలు కేవలం కొందరికే పరిమితం కాకుండా, సమాజంలో కిందిస్థాయిలో ఉన్న చివరి వ్యక్తికి కూడా అందాల్సిన అవసరం ఉందని కోర్టు అభిప్రాయపడింది. ప్రస్తుతం ఓబిసిలకే పరిమితమైన 'క్రీమీ లేయర్' నిబంధనలను, మరింత శాస్త్రీయంగా అమలు చేయడంపై న్యాయస్థానం దృష్టి సారించింది. ఇంద్ర సాహ్నీ తీర్పును ప్రస్తావిస్తూ, ప్రస్తుత నిబంధనలు 1992 నాటి చారిత్రాత్మక 'ఇంద్ర సాహ్నీ' (మండల్ కమిషన్) కేసులో సుప్రీంకోర్టు ఓబీసీలకు 27 శాతం రిజర్వేషన్లను సమర్థిస్తూనే, వారిలో 'క్రీమీలేయర్' వర్గాలను మినహాయించాలని స్పష్టం చేసింది. ప్రస్తుతం వార్షిక ఆదాయం రూ.8 లక్షలు దాటిన వారితో పాటు ఉన్నత రాజ్యాంగ పదవుల్లో ఉన్నవారు, ఐఏఎస్, ఐపిఎస్ వంటి సీనియర్ బ్యూరోక్రాట్లు, మిలిటరీలో టాప్ ఆఫీసర్ల పిల్లలను ఆదాయంతో సంబంధం లేకుండా క్రీమీలేయర్ కింద పరిగణించి కోటా నుంచి మినహాయిస్తున్నారు. అయితే, ఈ మినహాయింపులను సవాల్ చేస్తూ కోర్టులో పిటిషన్లు దాఖలయ్యాయి. ఇక, ఈ కేసులో సుప్రీంకోర్టు.. కేంద్ర, కర్ణాటక ప్రభుత్వాలకు నోటీసులు జారీ చేస్తూ తదుపరి విచారణను వాయిదా వేసింది.

# బలూచ్ దెబ్బకు వ్యూహాం మారుస్తున్న షరీఫ్ సర్కార్

### - లష్కరేనేతలతో దౌత్యం నెరపేందుకు కసరత్తులు
### - హాఫీజ్ స్థానంలో కొత్త నేత ఎంపికకు ఒత్తిళ్లు



**ఇస్లామాబాద్, మే 22:** భారత సైన్యం జరిపిన ఆపరేషన్ సిందూర్ దెబ్బకు పాకిస్థాన్‌కు చెందిన లష్కరే తోయిబా ఉగ్రవాద సంస్థ కోలుకోలేని విధంగా దెబ్బతింది. మురిద్కేలో ఉన్న ప్రధాన శిక్షణా కేంద్రాన్ని భారత సైన్యం పూర్తిగా ధ్వంసం చేసింది. దీంతో తీవ్ర నష్టాల్లో ఉన్న ఈ ఉగ్ర సంస్థను మళ్లీ బలోపేతం చేసేందుకు ఈసారి పాకిస్థాన్ సైన్యంతో పాటు అక్కడి రాజకీయ నాయకులూ రంగంలోకి దిగారు. లష్కరే తోయిబా వ్యవస్థాపకుడు హాఫీజ్ సయీద్ కుమారుడు తల్హా సయీద్, పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ ముఖ్య అనుచరుడు రాణా సనావుల్లాతో ఫైసలాబాద్‌లో భేటీ అయ్యాడు. దీనిపై భారత నిఘా సంస్థలు దృష్టి పెట్టాయి. పాక్ సైన్యం, ఐఎస్ఐపై లష్కరే ఉగ్రవాదులకు నమ్మకం సడలడంతోనే పాక్ ప్రభుత్వం నేరుగా రాజకీయ నేతలను రంగంలోకి దించి ఈ చర్చలు జరుపుతున్నట్లు తెలుస్తోంది. లష్కరే తోయిబాకు కొత్త నాయకుడిని అధికారికంగా ప్రకటించాలని పాక్ రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. ప్రస్తుతం 75 ఏళ్ల హాఫీజ్ సయీద్ వయసు పైబడటం, సంస్థలో తీవ్ర అసంతృప్తి నెలకొనడంతో నాయకత్వ సంక్షోభం ఏర్పడింది. అందుకే 50 ఏళ్ల తల్హా సయీద్‌ను అధికారికంగా ఆపరేషన్స్ చీఫ్‌గా మార్చాలని చూస్తున్నారు. కొత్త టెక్నాలజీలపై పట్టున్న తల్హా అయితేనే ఉగ్రవాదులను నడిపించగలడని పాక్ భావిస్తోంది. బలూచిస్థాన్ సమస్యకు లష్కరే పరిష్కారమా పాకిస్తాన్‌కు బలూచిస్థాన్, ఖైబర్ పఖ్తూంక్వా ప్రాంతాల్లో భద్రత కల్పించడం పెద్ద సవాలుగా మారింది. ముఖ్యంగా బలూచిస్థాన్ లిబరేషన్ ఆర్మీ దాడులతో పాక్ సైన్యం తీవ్రంగా నష్టపోతోంది. బీఎల్ఏ గ్రూపులు పాక్ ప్రభుత్వం లేదా సైన్యంతో చర్చలకు అస్సలు అంగీకరించవు. అందుకే లష్కరే తోయిబా నేతలను రాయబారానికి పంపి బీఎల్ఏతో ఒప్పందం కుదుర్చుకోవాలని చూస్తోంది. బలూచిస్థాన్ మీదుగా వెళ్లే చైనాపాకిస్థాన్ ఎకనామిక్ కారిడార్ ఫేజ్2 ప్రాజెక్ట్‌కు భద్రత కల్పించడం పాక్‌కు ముఖ్యం. బలూచిస్థాన్‌లోని మైనింగ్ ప్రాజెక్ట్ కోసం అమెరికా 1.3 బిలియన్ డాలర్ల పెట్టుబడి పెట్టింది. స్థానిక వనరులను దోచుకుంటున్నారంటూ బలూచ్ ప్రజలు ఈ ప్రాజెక్టులను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు.

# సిఎం విజయ్‌కేబినెట్‌లో మరో ఇద్దరికి చోటు!



**చెన్నై, మే 22:** తమిళనాడులో ముఖ్యమంత్రి విజయ్ సారథ్యంలోని టీవీకే ప్రభుత్వం శుక్రవారంనాడు ప్రభుత్వంలో మరో ఇద్దరికి చోటు కల్పించింది. టీవీకేకు బయట నుంచి మద్దతిస్తామని ఇంతకుమందు ప్రకటించిన విడుదలై చిరుత్తైగళ్ కట్చి (విసికె), ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ (ఐయుఎంఎల్) అధికార కూటమిలో చేరాయి. పాపనాశం అసెంబ్లీ నియోజకవర్గం ఐయూఎంఎల్ ఎమ్మెల్యే ఏఎం షాజహాన్, తిండివనం నియోజకవర్గం వీసీకే ఎమ్మెల్యే వన్ని అరసు శుక్రవారంనాడు మంత్రులుగా ప్రమాణస్వీకారం చేశారు. టీవీకే ప్రభుత్వం కీలకమైన మంత్రివర్గ విస్తరణ గురువారంనాడు జరిపింది. వీసీకే, ఐయూఎంఎల్‌ను కూడా ప్రభుత్వంలో చేరాలని కోరింది. అయితే పేర్ల ఖరారు విషయంలో ఆ రెండు పార్టీలు జాప్యం చేశాయి. దీంతో 23 మంది ఎమ్మెల్యేలు మంత్రులుగా ప్రమాణస్వీకారం చేశారు. వీరిలో కాంగ్రెస్‌కు చెందిన ఇద్దరు, టీవీకేకు చెందిన 21 మంది ఉన్నారు. దీనికంటే ముందు ముఖ్యమంత్రితో పాటు తొమ్మిది మంది ఎమ్మెల్యేలు క్యాబినెట్ మంత్రులుగా ప్రమాణ స్వీకారం ప్రమాణస్వీకారం చేశారు. మొత్తం 35 మందికి క్యాబినెట్‌లో అవకాశం రెండు ఖాళీలు మిగిలాయి. వీసీకే, ఐయూఎంఎల్ తాజాగా ప్రభుత్వంలో చేరడంలో మంత్రి కొలువుల భర్తీ పూర్తయింది. ఇటీవల అసెంబ్లీలో ప్రభుత్వ విశ్వాస తీర్మానికి అనుకూలంగా ఓటు వేసిన అన్నాడీఎంకే రెబల్ వర్గానికి చెందిన 25 మంది ఎమ్మెల్యేలకు టీవీకే ప్రభుత్వంలో చోటు దక్కలేదు. మంత్రివర్గ విస్తరణ సందర్భంగా రెబల్ ఎమ్మెల్యేలలోని తొమ్మిది మంది షణ్ముగం వర్గానికి దూరంగా ఉండిపోయారు. రాబోయే రోజుల్లో చాలామంది పార్టీ తిరుగుబాటు ఎమ్మెల్యేలు వెనక్కి తిరిగి వస్తారని అన్నాడీఎంకే గట్టి నమ్మకంతో ఉంది.

# పాకిస్థాన్‌కూ ఎగబాకిన సోషల్ మీడియా కాక్రోచ్‌పార్టీ ట్రెండ్!




**కరాచి, మే 22:** భారత్‌లో సంచలనం సృష్టిస్తున్న 'కాక్రోచ్ జనతా పార్టీ డిజిటల్ ట్రెండ్ ఇప్పుడు పాకిస్థాన్‌కూ పాకింది. అక్కడ కూడా కాక్రోచ్ అవామీ పార్టీ కాక్రోచ్ అవామీ లీగ్ వంటి కొత్త గ్రూపులు సోషల్ మీడియాలో పుట్టుకొచ్చాయి. నిరుద్యోగ యువత వేదికగా సాగుతున్న ఈ పొలిటికల్ ట్రెండ్ ఇరు దేశాల్లోనూ హాట్ టాపిక్‌గా మారింది. పాక్‌లో ప్రధాన రాజకీయ పార్టీలైన ఇమ్రాన్ ఖాన్ నేతృత్వంలోని పీటీఐ, నవాజ్ షరీఫ్ పీఎంఎల్ఎన్, పీపీపీలకు ప్రత్యామ్నాయంగా ఈ'కాక్రోచ్ పార్టీలు రంగంలోకి దిగుతున్నాయి. కాక్రోచ్ అవామీ పార్టీ తమ ఇన్‌స్టా బయోలో అవును కాపీ కొట్టాం, కానీ ఎవరికి నష్టం? మా మోటో ఒక్కటే అంటూ భారత్ నుంచి స్ఫూర్తి పొందినట్లు బాహాటంగానే అంగీకరించింది. ఈ అకౌంట్లు పూర్తిగా పాక్ నిరుద్యోగ జనరేషన్ జెడ్ యువత గొంతుకగా మారుతామని ప్రకటిస్తున్నాయి. వ్యవస్థ ఎవరినైతే బొద్దింకలుగా భావించిందో.. మేం ఆ ప్రజల గొంతుకల్లం అంటూ ఎలాంటి పరిస్థితుల్లోనైనా పోరాడతాం అనే ఉర్దూ నినాదంతో పాక్ యువత సోషల్ మీడియాలో హోరెత్తిస్తోంది. నిరుద్యోగం, దేశ పాలన, రాజకీయ వ్యవస్థలపై తమకున్న అసంతృప్తికి ఈ బొద్దింక గుర్తును వాడుకుంటూ మీమ్స్ రూపంలో అక్కడి ప్రభుత్వాలపై నిరసనగా వ్యక్తం చేస్తోంది

## కేన్స్ ఫిలింఫెస్ట్‌లో మిస్ వెనిజులాపై దాడి

**న్యూయార్కు,మే 22:** ప్రపంచ ప్రఖ్యాత కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో తీవ్ర కలకలం రేగింది. మిస్ వెనిజులా 2025 టైటిల్ విజేత ఆండ్రియా డెల్ వాల్‌పై ఆమె సెలబ్రిటీ స్టైలిస్ట్ గియోవన్నీ లగునా భౌతిక దాడికి పాల్పడినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ ఘటనకు సంబంధించి వెనెజులా, మెక్సికన్ మీడియా కథనాలను ఉటంకిస్తూ న్యూయార్క్ పోస్ట్ ఒక కథనాన్ని ప్రచురించింది. మంగళవారం కేన్స్‌లోని ఒక హోటల్ గదిలో ఈ దాడి జరిగినట్లు తెలుస్తోంది. దాడి అనంతరం 29 ఏళ్ల ఆండ్రియా డెల్ వాల్ తన ముఖానికి అయిన గాయాలను చూపిస్తూ సోషల్ మీడియాలో ఒక వీడియోను షేర్ చేశారు. ఆ వీడియోలో ఆమె ముఖం నుంచి రక్తం కారుతుండగా, తీవ్ర ఆవేదనతో కనిపించారు. స్పానిష్ భాషలో మాట్లాడుతూ, చూడండి, గియోవన్నీ లగునా నాకు చేసిన పని ఇది. కంగ్రాట్స్ గియోవన్నీ, నువ్వు ఎవరో చూపించడానికే ఇది చేశావని ఆమె తన స్టైలిస్ట్‌ను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. వీడియోలో ఆ హోటల్ గది మొత్తం చిందరవందరగాపడి ఉండటం కనిపించింది.



# ట్విషా శర్మ మృతి కేసు: సిబిఐ విచారణ

### - మధ్యప్రదేశ్ ప్రభుత్వం సిఫార్సు
### - రీపోస్టుమార్టంకు హైకోర్టు అనుమతి
### - నిందితుడు లొంగిపోయేందుకు యత్నం

**భోపాల్, మే 22:** తెలుగు సినీ నటి ట్విషా శర్మ విషాద మరణంపై సిబిఐ విచారణకు మధ్యప్రదేశ్ ప్రభుత్వం శుక్రవారం సిఫార్సు చేసింది. కేంద్ర దర్యాప్తు సంస్థతో స్వతంత్ర విచారణ జరపాలని ఆమె కుటుంబం పదేపదే చేస్తున్న డిమాండ్‌కు ప్రభుత్వం తలొగ్గి, ఒక కీలక పరిణామంలో ఈ నిర్ణయం తీసుకుంది. మే 12న ట్విషా శర్మ భోపాల్‌లోని తన అత్తగారి ఇంటి డాబాపై ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటనపై మృతురాలి కుటుంబం అనుమానాలు వ్యక్తం చేస్తూ హైకోర్టును ఆశ్రయించింది. ఇటు మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్‌ను కలిసి ట్విషా శర్మ మృతిపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేసింది. ఈ నేపథ్యంలోనే ట్విషా శర్మ మృతి కేసును సిబిఐకి అప్పగించాలని మధ్యప్రదేశ్ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు కేంద్ర హోం కార్యదర్శికి, న్యూఢిల్లీలోని సిబిఐ డైరెక్టర్‌కు లేఖలు రాసింది. ట్విషా శర్మ మృతదేహానికి రెండోసారి పోస్ట్‌మార్టం.



# ఆఫ్రికాకు తలనొప్పిగా మారిన ఎబోలా కట్టడి

**బ్రజ్జావిల్లే, మే 22:** ఆఫ్రికా దేశాల్లో ఎబోలా వ్యాప్తి తీవ్ర కలకలం సృష్టిస్తోంది. వైరస్‌తో పాటు తప్పుడు సమాచార వ్యాప్తి ఇక్కడి ప్రజలను తీవ్రంగా ఇబ్బంది పెడుతోంది. మృతదేహాన్ని అప్పగించలేదని ఎబోలా చికిత్సా కేంద్రానికి స్థానికులు నిప్పంటించడం అందుకు ఉదాహరణ. ప్రస్తుత వ్యాప్తికి కేంద్రంగా ఉన్న కాంగోలోని ర్వాంపారా ప్రాంతంలో ఈ ఘటన చోటు చేసుకుంది. వైరస్ ప్రతిస్పందన విషయంలో ప్రజల్లో నెలకొన్న అపనమ్మకం, ఆగ్రహం ఈ పరిస్థితికి కారణమైంది. 1976లో కాంగోలో తొలిసారి ఎబోలా వైరస్‌ను గుర్తించగా, ఇప్పుడు 17వసారి వ్యాప్తి చెందుతోంది. పాజిటివిటీ రేటు.. వైరస్ బారిన పడుతున్న వారి సంఖ్య క్రమంగా పెరుగుతుండటం ఆందోళన కలిగిస్తోంది. ఈ వైరస్‌కు ప్రత్యేకంగా ఆమోదించిన చికిత్సలు, వ్యాక్సిన్లు లేకపోవడం వల్ల దీనిని వెంటనే అరికట్టడం కూడా అసాధ్యమని పేర్కొన్న ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యుహెచ్ఒ.. గ్లోబల్ హెల్త్ ఎమర్జెనీని ప్రకటించిన సంగతి తెలిసిందే. ఇలాంటి సమయంలో వైరస్ కట్టడికి వైద్య సిబ్బంది తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. కానీ, కాంగో తరహా ఘటనలు వారికి తలనొప్పిగా మారాయి. అంతర్జాతీయ మీడియా కథనాల ప్రకారం.. ఎబోలా లక్షణాలతో ఓ వ్యక్తి మృతి చెందగా, అతని మృతదేహాన్ని అప్పగించేందుకు వైద్య సిబ్బంది నిరాకరించడం స్థానిక యువత ఆగ్రహానికి గురైంది. దీంతో వారు వైద్య కేంద్రంలోకి జొరబడి, నిప్పంటించారు. పోలీసులు అడ్డుకునేందుకు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. మామూలుగా ఎబోలా వైరస్ జంతువులు, గబ్బిలాలకు సోకుతుంది. ఆ వరస్ సోకిన జంతువులను వేటాడి (బుష్‌మీట్) తినడం వల్ల మనుషులకు చేరుతుంది. వ్యాధి లక్షణాలు కనిపించడానికి 21 రోజులు పడుతుంది. వైరస్ సోకి వ్యక్తి శరీర ద్రవాల ద్వారా ఇది ఇతరులకు వ్యాపిస్తుంది. ఆ వైరస్ లక్షణాలతో చనిపోయిన వ్యక్తి మృతదేహాన్ని పిపిఇ కిట్లు ధరించిన ప్రత్యేక బృందాలు ఖననం చేయాలని అంతర్జాతీయ వైద్య సంస్థలు.

# సంక్షిప్తంగా..

## సగం అమెరికా వైమానిక రక్షణ క్షిపణులు ఖాళీ



**వాషింగ్టన్, మే 22:** ఇరాన్‌తో యుద్ధంలో ఇజ్రాయెల్‌కు మద్దతుగా నిలిచే క్రమంలో అమెరికా భారీగా తన క్షిపణి నిల్వలు కోల్పోయినట్లు తెలుస్తోంది. ఇప్పటివరకు దాని అమ్ములపొదిలోని సగం ఎయిర్ డిఫెన్స్ క్షిపణులు ఖాళీ అయినట్లు సమాచారం. ఈ మేరకు మీడియాలో కథనాలు వస్తున్నాయి. వాటి ప్రకారం.. ఇరాన్‌పై అమెరికా 200కు పైగా థాడ్ క్షిపణులను ప్రయోగించింది. వీటితోపాటు మధ్యధరా సముద్రంలో మోహరించిన యుద్ధనౌకల నుంచి 100కుపైగా స్టాండర్డ్ మిస్సైల్-3, స్టాండర్డ్ మిస్సైల్-6లను వినయోగించింది. దీంతో పెంటగాన్ వద్ద ఉన్న ఇంటర్‌సెప్టర్ నిల్వలు సగానికి పడిపోయాయి. అమెరికా వద్ద ఇంకా సుమారు 200 థాడ్ ఇంటర్ సెప్టర్‌లు మాత్రమే మిగిలి ఉన్నట్లు తెలుస్తోంది.

## ఉమర్ ఖలీద్‌కు 3 రోజుల బెయిల్!



**న్యూఢిల్లీ, మే 22:** ఢిల్లీ అల్లర్ల కేసులో ప్రధాన నిందితుడు ఉమర్ ఖలీద్‌కు మూడు రోజుల తాత్కాలిక బెయిల్ మంజూరుచేశారు. ఢిల్లీ హైకోర్టు శుక్రవారం ఖలీద్‌కు బెయిల్ జారీ చేసింది. ఖలీద్ తల్లికి వైద్య చికిత్స జరగాల్సి ఉంది, ఈ నేపథ్యంలో తల్లిని చూసేందుకు కోర్టు అతనికి అనుమతి ఇచ్చింది. జస్టిస్ ప్రతిభా ఎం సింగ్, జస్టిస్ మధూ జైన్‌తో కూడిన ధర్మాసనం ఈ ఆదేశాలు జారీ చేసింది. విస్తృతమైన కోణంలో ఈ సమస్యను పరిశీలించి, తల్లికి సర్జరీ ఉన్న నేపథ్యంలో ఉమర్ ఖలీద్‌కు మూడు రోజుల తాత్కాలిక బెయిల్ మంజూరీ చేస్తున్నట్లు ధర్మాసనం తెలిపింది. జూన్ ఒకటో తేదీ నుంచి జూన్ 3వ తేదీ వరకు బెయిల్ అమలులో ఉంటుంది. ఆ సమయంలో ఖలీద్ తన తల్లితో గడపనున్నాడు. బెయిల్ సమయంలో ఖలీద్ తన అడ్రెస్‌లోనే ఉండాలని కోర్టు స్పష్టం చేసింది.

## భోజ్‌శాలను టచ్‌చేసి చూడండి తెలుస్తుంది: ఎస్పీ



**భోజ్‌శాల, మే 22:** మధ్యప్రదేశ్‌లోని భోజ్‌శాల వివాదాస్పద కట్టడం కేవలం హిందూ దేవాలయమేనని మే 15న రాష్ట్ర హైకోర్టు తీర్పునిచ్చిన విషయం తెలిసిందే. అంతకుముందు వరకు అక్కడ ప్రతి శుక్రవారం ముస్లింలు నమాజ్ చేసుకునేందుకు అనుమతి ఉండేది. అయితే కోర్టు తీర్పు తర్వాత వస్తున్న మొదటి శుక్రవారం కావడంతో అక్కడ ఉద్రిక్తతలు తలెత్తకుండా పోలీసులు భారీ భద్రతను ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో ధార్ జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ సచిన్ శర్మకు సంబంధించిన ఓ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఆయన జీపుపై నిలబడి అల్లరి మూకలను గట్టిగా హెచ్చరించారు. ఎవరికైనా చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవాలనే ధైర్యం ఉంటే, శుక్రవారం ప్రయత్నించి చూడండి. మేము పూర్తిగా సిద్ధంగా ఉన్నాం. ఎవరినీ వదిలిపెట్టం అంటూ ఎస్పీ సవాల్ విసిరారు.

## ఎవరెస్ట్ అధిరోహించి తిరిగి వస్తూ ఇద్దరు భారతీయులు మృతి

**ఖాట్మండు, మే 22:** నేపాల్‌లో ఎవరెస్ట్ శిఖరాన్ని ఎక్కిన ఇద్దరు భారతీయులు మృతిచెందారు. ఎవరెస్ట్ నుంచి కిందకు దిగుతున్న సమయంలో ఆ ఇద్దరు ప్రాణాలు కోల్పోయినట్లు శుక్రవారం తెలిసింది. నేపాల్ పర్వతారోహణ అధికారి రిషి భండారి వివరాలప్రకారం ఎవరెస్ట్ నుంచి కిందకు దిగుతున్న సమయంలో ఓ పర్వతారోహకుడు తీవ్రంగా అలసిపోయినట్లు చెప్పారు. అయితే అతని ప్రాణాలను కాపాడేందుకు షెర్పాలు తీవ్రంగా ప్రయత్నించినట్లు తెలిపారు. హిల్లరీ స్టెప్ వద్ద అరుణ్ తివారి అనే పర్వతారోహకుడు మృతిచెందినట్లు భండారి చెప్పారు. సందీప్ ఆరె అనే వ్యక్తి రెండో క్యాంప్ వద్ద ప్రాణాలు కోల్పోయాడు. ఎవరెస్ట్‌ను అత్యధికంగా 32 సార్లు అధిరోహించిన నేపాలీ షెర్పా కామి రీటా ఇవాళ అభ్యర్థన చేశారు.

## మిస్టరీ వీడిన స్లీపర్‌కోచ్ మృతదేహం బాక్స్

**లక్నో, మే 22:** రైలు స్లీపర్ కోచ్‌లో వదిలేసిన పెట్టెలోని యువతి మృతదేహం మిస్టరీవీడింది. సీసీటీవీ ఫుటేజ్ ద్వారా నిందితులను గుర్తించారు. ఒక యువకుడితో సంబంధం నేపథ్యంలో కుమార్తెను ఆమె తండ్రి హత్య చేసినట్లు నిర్ధారించారు. ఈనెల 17న ఉత్తరప్రదేశ్ రాజధాని లక్నోలోని గోమతి నగర్ స్టేషన్‌లో ప్రయాణాన్ని ముగించిన ఎక్స్‌ప్రెస్ రైలు స్లీపర్ కోచ్‌లో వదిలేసిన ఇనుప పెట్టె, ఒక బ్యాగ్‌ను క్లీనింగ్ సిబ్బంది గుర్తించారు. రక్తం మరకలు ఉండటంతో అనుమానించి రైల్వే పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఇనుప పెట్టె తాళం పగులగొట్టి చూడగా మహిళ మొండెం అందులో ఉన్నది.

## బంటుపల్లి పంచాయితీ సమస్యలపై ఎమ్మెల్యే, కలెక్టర్‌కు వినతి



ఆనందపురం, మే 22, ప్రభాతవార్త:

ఆనందపురం మండలంలోని బంటుపల్లి పంచాయితీలో సమస్యలపై శుక్రవారం ఆనంద పురంలో నిర్వహించిన ఒక నియోజకవర్గం, ఒక గ్రామం, నాలుగు సందర్శన కార్యక్రమంలో స్థానికులు సమస్యలు పరిస్కారం కోరుతూ వినతి పత్రం సమర్పించారు. ఈ ప్రజా వేదిక కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అభిషేక్త కిషోర్, భీమిలి శాసనసభ్యులు గంటా శ్రీనివాసరావు భీమిలి సబ్ డివిజనల్ అధికారి సంగీత్ మాధుర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వేములవలస పిఎసిఎస్ చైర్మన్ నాగరాజు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలు అందించారని అయితే అక్కడ కనీస మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయకపోవడంతో లబ్ధిదారులు ఇల్లు నిర్మించుకోలేకపోతున్నారని వివరించారు. పంచాయతీ పరిధిలో పలు సిమెంట్ రోడ్లు, మురుగునీటి కాలువలు మంచినీటి కొళాయిలు, వాటర్ ట్యాంక్, బీటీ రోడ్లు ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా ఆ వినతి పత్రంలో కోరారు.

## ఉపాధి కూలీలకు మజ్జిగ పంపిణి

ఆనందపురం, మే 22, ప్రభాతవార్త



ఆనందపురం మండలంలోని కణమాంలో శుక్రవారం ఉపాధి హామీ పథకం కూలీలకు టీడీపీ నాయకుడు చందవరపు కుమార్ మజ్జిగని పంపిణి చేశారు. సుమారు 150 మంది కూలీలకు మజ్జిగ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎండ వేడిమి తీవ్రంగా ఉన్న దృష్ట్యా కూలీలు వాడ దెబ్బ తగలకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో యర్ర రాము తదితరులు పాల్గొన్నారు.

## సమస్యలు పరిష్కారానికి ప్రజల వద్దకే అధికార యంత్రాంగం

### ఒక నెల - ఒక గ్రామం - 4 విజిట్స్ ఒక వినూత్న కార్యక్రమం

### ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు



ఆనందపురం, మే 22, ప్రభాతవార్త

గ్రామాల్లో రెవిన్యూ సహా ఇతర అంశాల పరిష్కారం లక్ష్యంగా "ఒక నెల – ఒక గ్రామం – 4 విజిట్స్" పేరుతో రాష్ట్ర ప్రభుత్వం వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. ఆనంద పురం మండల పరిషత్ సమావేశ మందిరంలో శుక్రవారం జరిగిన ఈ కార్యక్రమంలో మాట్లాడుతూ సాక్షాత్తు జిల్లా కలెక్టర్ సహా యావత్ యంత్రాంగం నెలలో 4 సార్లు ఒకే గ్రామాన్ని సందర్శిస్తే అనేక సమస్యలకు సమాధానం దొరుకుతుందని పేర్కొన్నారు. ఈ ప్రయత్నంతో వ్యక్తుల మధ్య వివాదాలు.. ప్రభుత్వంతో వివాదాలు.. సర్వే చేయని గ్రామాలు.. వంటి రెవెన్యూ సమస్యలు కొలిక్కి వచ్చి గ్రామాలు వివాదరహితమవుతాయని చెప్పారు. ప్రజల వద్దకు పాలన, జన్మభూమి పథకాల స్ఫూర్తితోనే సీఎం చంద్రబాబు నాయుడు ఈ కార్యక్రమాన్ని రూపొందించారని తెలిపారు. సాధారణ పౌరులు తమ సమస్యలు పరిస్కారం కోసం కలెక్టరేట్ కు వెళ్లి అక్కడ అనేక కార్యక్రమాలతో బిజీగా ఉండే జిల్లా కలెక్టర్ ను కలవడం కష్టసాధ్యమైన విషయమన్నారు. అలాంటి జిల్లా కలెక్టర్ తన యంత్రాంగంతో కలిసి రెవెన్యూ రికార్డులతో గ్రామానికి రావడమనేది కార్యక్రమంలో గొప్పతనమని వివరించారు. దీన్ని తన నియోజకవర్గం లోని ఆనందపురం గ్రామం నుంచి ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న "ఒక నెల – ఒక గ్రామం – 4 విజిట్స్" సేవలు ప్రజలందరూ వినియోగించుకుని విజయవంతం చేయాలని కోరారు. నియోజకవర్గం నుంచి వచ్చిన అనేకమంది ప్రజలు వివిధ సమస్యలకు పరిష్కారం కోరుతూ అందించిన అర్జీలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ కె. సంగీత్ మాధుర్, పీజీఆర్ఎస్ ప్రత్యేక అధికారి గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

## జలదార-జలహారతి ద్వారా చెరువులు అభివృద్ధి

ఆనందపురం, మే 22, ప్రభాతవార్త



జాతీయ ఉపాధి హామీ పథకం నిధులతో జలదార–జలహారతి పథకం ద్వారా జిల్లాలోని పలు చెరువులను అభివృద్ధి పరుస్తున్నామని జిల్లా నేటియాజమన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ సిహెచ్. నిర్మలా దేవి తెలిపారు. ఆమె శుక్రవారం కణమాం, సొంట్యాం గ్రామాలలోని అయ్యవారి చెరువు, పెద్దచెరువు, రామసాగరం పనులను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ పనులలో అవకతవకులు లేకుండా సక్రమంగా చెయ్యాలన్నారు. అధిక ఉష్ణోగ్రతలు వలన వడదెబ్బకు గురయ్యే అవకాశం ఉందని పనులను ఉదయం 5 గంటలకు ప్రారంభించి 10 గంటలు లోపు ముగించాలని సూచించారు. మజ్జిగ, మంచి నీరు వంటి వాటిని ఎక్కువగా తీసుకువాలని చెప్పారు. ఏపీడీ కె.ఆంజనేయులు పాల్గొన్నారు.

## జర్నలిస్టులకు ప్రభుత్వ సాయం అందించండి

### ఇజ్రాయిల్ కుటుంబానికి అండగా నిలవాలి -అనారోగ్యం బారిన పడిన పాత్రికేయులను పరామర్శించిన గంట్ల -ఆర్థిక సహాయం అందజేత -ముఖ్యమంత్రి సహాయ నిధికి లేఖ..



అక్కయ్యపాలెం, మే 22, ప్రభాతవార్త

సమాజం కోసం నిరంతరం పాటుపడుతూ అనారోగ్యం బారిన పడిన జర్నలిస్టులు, వారి కుటుంబ సభ్యులకు ప్రభుత్వం పెద్ద మనస్సుతో సహాయం అందించాలని జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి, ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ రాష్ట్ర నాయకులు గంట్ల శ్రీనుబాబు కోరారు. ఈ మేరకు అనారోగ్యం బారిన పడిన ఇద్దరు సీనియర్ జర్నలిస్టులను శుక్రవారం గంట్ల శ్రీనుబాబు పరామర్శించి ధైర్యం చెప్పారు. ఇదే సమయంలో వారి కుటుంబ సభ్యులతో కూడా మాట్లాడి తాము అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అలాగే ఇద్దరు పాత్రికేయులకు తన వంతు ఆర్థిక సహాయం అందజేశారు.

### ఇజ్రాయిల్ కుటుంబానికి అండగా నిలవాలి

సీనియర్ పాత్రికేయుడిగా సుదీర్ఘ కాలం పాటు పత్రికా రంగంలో సేవలందించిన ఇజ్రాయిల్ ఇటీవలే రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. దీంతో నడుము విరిగిపోగా కాలు, చేతులుకు కూడా బలమైన గాయాలయ్యాయి. దీంతో మూడుచోట్ల ఆపరేషన్‌లు జరిగాయి. ప్రస్తుతం నడవలేని స్థితిలో ఇంటివద్దనే ఉంటూ వైద్య సహాయం పొందుతున్నారు. అలాగే ఇజ్రాయిల్ కుమారుడు సువర్ణరాజ్ కూడా తీవ్ర అనారోగ్యం పాలయ్యారు. ప్రస్తుతం వారంలో మూడు రోజులు డయాలసిస్ చేసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. ఇజ్రాయిల్ భార్య కూడా అనారోగ్యం కారణంగా ఇంటికే పరిమితమయ్యారు. దీంతో ఒకే కుటుంబంలో ముగ్గురు అనారోగ్యం కారణంగా తీవ్ర ఇబ్బందులతో అల్లాడుతున్నారు. అయితే అటువంటి కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలవాల్సి ఉంది. మరో జర్నలిస్టు బి.సూరిబాబు తాజాగా రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. ప్రస్తుతం వైద్య చికిత్స పొందుతున్నాడు.

### ముఖ్యమంత్రి సహాయ నిధికి లేఖ..

అనారోగ్యం బారిన పడిన సీనియర్ జర్నలిస్టు ఇజ్రాయిల్ కుటుంబాన్ని ఆదుకోవాలని రాష్ట్ర ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడుకు లేఖ రాయనున్నట్లు గంట్ల శ్రీనుబాబు తెలిపారు. అలాగే ముఖ్యమంత్రి సహాయ నిధి కింద వైద్య ఖర్చుల నిమిత్తం నిధులు కేటాయించాలని కూడా ఆ లేఖలో కోరనున్నట్లు చెప్పారు. ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు అనారోగ్యం బారిన పడడం, ఆపై ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న జర్నలిస్టు ఇజ్రాయిల్ కుటుంబాన్ని ఆదుకోవడానికి ముఖ్యమంత్రి తప్పకుండా సహాయం అందించే అవకాశం ఉందని గంట్ల శ్రీనుబాబు ఆశాభావం వ్యక్తం చేశారు. జర్నలిస్టులకు ఆర్థిక భరోసా కల్పించే విధంగా ప్రభుత్వం తగిన చర్యలు చేపట్టాల్సి ఉందన్నారు. లేని పక్షంలో పేదరికం కారణంగా చాలీచాలని వేతనాలుతో చాలా మంది జర్నలిస్టులు రోడ్డున పడే అవకాశం ఉందన్నారు.

## పోలీస్ స్టేషన్లలో సీపీ ఆకస్మిక తనిఖీలు

విశాఖపట్నం మే22 ప్రభాతవార్త

విశాఖ పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చి శుక్రవారం ద్వారకా , నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్లను ఆకస్మికంగా తనిఖీలు చేశారు. శుక్రవారం ద్వారకా , ఫోర్త్ నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్లను సందర్శించి అధికారుల పనితీరును సమీక్షించారు. పోలీస్ స్టేషన్ పరిసరాల పరిశుభ్రత, మరుగుదొడ్ల నిర్వహణను ప్రత్యేకంగా తనిఖీ చేసి శుభ్రత విషయంలో నిర్లక్ష్యం లేకుండా చూడాలని సూచించారు. స్టేషన్ పరిశుభ్రంగా ఉంచుకోవాలని సీఐలకు ఆదేశించారు. శాంతి భద్రతలను కట్టుదిట్టంగా కొనసాగించేందుకు క్రైమ్,లా అండ్ ఆర్డర్ పోలీస్ స్టేషన్లు, ఏసీపీ సబ్ డివిజన్లలో ఇటీవల కాలంలో సీపీ ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఈ సందర్భంగా స్టేషన్ పరిధిలో ఉన్న సమస్యలు, పెండింగ్ కేసులు, కేసుల రికార్డుల నిర్వహణ, స్టేషన్ పరిపాలన తదితర అంశాలను సీపీ పరిశీలించారు. స్టేషన్‌లలో రికార్డులు సక్రమంగా నిర్వహిస్తున్నారా లేదా అన్నదానిపై అధికారులను ప్రశ్నించి తగిన ఆదేశాలు జారీ చేశారు. అదేవిధంగా పోలీస్ స్టేషన్ పరిసరాల పరిశుభ్రత, మరుగుదొడ్ల నిర్వహణను ప్రత్యేకంగా తనిఖీ చేసి శుభ్రత విషయంలో నిర్లక్ష్యం లేకుండా చూడాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. విధుల్లో క్రమశిక్షణతో పనిచేస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని,వచ్చే ఫిర్యాదులు మర్యాదగా స్వీకరించి బాధితులకి న్యాయం జరిగేలా చూడాలని చెప్పారు.ప్రతి ఒక్కరూ తో ఫ్రెండ్లి పోలీసింగ్ ఉండాలని తెలిపారు.

## ఏపీఈపీడీసీఎల్‌కు ప్రతిష్టాత్మక

7వ పేజీ తరువాయి ..

ట్రాటజీ ఆఫ్ ది ఇయర్–2026" విభాగంలో ఏపీఈపీడీసీఎల్ ఈ ప్రతిష్టాత్మక అవార్డును సాధించినట్లు సంస్థ సీఎండి ఇమ్మడి పృథ్వీతేజ్ తెలిపారు. ఈ అవార్డును సంస్థ తరపున ప్రాజెక్ట్స్, ఐటీ అండ్ హెచ్ఆర్డీ డైరెక్టర్ టి.వనజ, సీజీఎం (హెచ్ఆర్డీ) డి.సుమన్ కళ్యాణి అందుకున్నారు. ఈ అవార్డును నీతి ఆయోగ్ శాశ్వత సభ్యులు డాక్టర్ విజయ్ కుమార్ సరస్వత్ చేతుల మీదుగా స్వీకరించారు. ఈ సందర్భంగా ఏపీఈపీడీసీఎల్ సీఎండి ఇమ్మడి పృథ్వీతేజ్ మాట్లాడుతూ, ఉద్యోగుల నైపుణ్యాభివృద్ధి, శిక్షణా కార్యక్రమాల అమలుకు సంస్థ ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ప్రతి ఉద్యోగికి సంవత్సరంలో కనీసం మూడు రోజుల పాటు శిక్షణ అందించే విధంగా చర్యలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఉద్యోగులకు నిరంతర శిక్షణా కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా సేవల నాణ్యతను మరింత మెరుగుపరుస్తూ వినియోగదారులకు నాణ్యమైన, విశిష్ట సేవలు అందించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఇదే స్ఫూర్తితో ఉద్యోగుల నైపుణ్యాభివృద్ధికి మరింత ప్రాధాన్యత ఇస్తూ వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సేవలు అందించేందుకు సంస్థ కృషిని కొనసాగిస్తోందని తెలిపారు.

## 'గోవాడ' చెరకు రైతులకు ..

7వ పేజీ తరువాయి ..

జరిగినప్పటికీ, రైతులకు గానుగ ఆదాయం అందకపోవడం ఆందోళన కలిగిస్తోంది. 2024–2025 సీజన్‌లో కేవలం ఒక లక్ష ఎడు వేల టన్నుల చెరకు మాత్రమే గానుగ ఆడటం జరిగిందని సమాచారం. అప్పటికే ఫ్యాక్టరీలో ఉన్న పాత యంత్రాలతోనే క్రషింగ్ పని చేసిన కారణంగా పలుమార్లు ఫ్యాక్టరీ చక్రాలు మధ్యలోనే నిలిచిపోయిన పరిస్థితులు నెలకొన్నాయి. క్రషింగ్ సీజన్ పూర్తై మూడు నెలలు గడుస్తున్నా రెండేళ్లుగా చెరకు సరఫరా చేసిన సమయానికి ఇవ్వాల్సిన గానుగ రైతులకు సుమారు రూ.40 కోట్ల మేర బకాయిలు చెల్లించకపోవడం విమర్శలకు తావిస్తోంది. ప్రస్తుతం చెరకు పేమెంట్లకు రైతులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు.

### ఏపీ హామీలు అమలు

గోవాడ నగర ఫ్యాక్టరీ ప్రభుత్వ పరంగా అన్ని విధాలుగా ఆదుకుని, ఈ ప్రాంతంలో ఉన్న ఏకైక పరిశ్రమను కాపాడుతామని ఎన్నికల సమయంలో నేతలు హామీలు ఇచ్చారు. ముఖ్యంగా అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్, చోడవరం ఎమ్మెల్యే కేఎస్ఎన్ రాజు ఇచ్చిన హామీలు ఇప్పటికీ అమలు కాలేదని రైతులు ఆరోపిస్తున్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ఫ్యాక్టరీ మూతపడకుండా రైతులు అహర్నిశలు శ్రమ చేస్తున్నప్పటికీ, చెరకు రైతుల బకాయిల చెల్లింపులపై ప్రభుత్వ స్పందన లేకపోవడం ఆగ్రహానికి దారితీస్తోంది. ఫ్యాక్టరీలో ఉన్న పాత యంత్రాల కారణంగా చెరకు క్రషింగ్‌కు అంతరాయం ఏర్పడిందని, దీంతో రైతులకు నష్టం వాటిల్లిందని పేర్కొంటున్నారు. గత ఏడాది మిల్లింగ్ సీజన్ ప్రారంభంలో రూ.300 కోట్లతో డిస్టిలరీ ప్లాంట్ ఏర్పాటు చేసి సీఎం చంద్రబాబు ప్రారంభించనున్నట్లు గోవాడ ఎమ్మెల్యే కేఎస్ఎన్ రాజు ప్రకటించినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి పురోగతి కనిపించలేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రస్తుతం ఫ్యాక్టరీలో చెరకు సరఫరా చేసిన రైతులకు పేమెంట్లు చెల్లించాలని, ఫ్యాక్టరీ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

## అండమాన్ స్ఫూర్తితో వైజాగ్ తీర సంరక్షణకు ...

విశాఖపట్నం, మే 22, ప్రభాతవార్త

ఆస్ట్రేలియాలోని టాస్మేనియా విశ్వవిద్యాలయంలో ఉన్నత చదువులు చదువుకుచే సువర్ణావకాశం ముంగిట నిలిచినా, కళ్ళెదుటే కలుషితమవుతున్న స్వదేశీ సముద్ర తీరాల ఆర్తనాదాలను విని ఆ అవకాశాన్ని వదులుకున్నారు ఒక గీతం విద్యార్థి. ప్లాస్టిక్ వ్యర్థాలతో ఊపిరాడక కొట్టుమిట్టాడుతున్న బంగాళాఖాతాన్ని రక్షించేందుకు తన వంతు సహాయంగా, పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో బిఎస్సీ ఎన్విరాన్‌మెంటల్ సైన్సెస్ కోర్సు అభ్యసిస్తున్న పి.సిద్దార్థ పట్టుదలతో స్కూబా డైవింగ్ లో శిక్షణ పొంది సముద్ర గర్భంలో విశాఖ తీరం వెంట పేరుకుపోతున్న ప్లాస్టిక్ వ్యర్థాలను వెలికి తీయడంలో కృషి చేస్తున్నాడు. గతంలో అండమాన్ నికోబార్ దీవులలో స్నార్కెలింగ్ చేస్తున్నప్పుడు సముద్ర గర్భంలోని అద్భుత జీవజాలం, ప్రకృతితో ఏర్పడిన విడతీయరాని బంధం తన ఆలోచనలను పూర్తిగా మార్చేసిందని, ఆ తరువాత వైజాగ్ బస్ స్టాప్‌లో మాజీ టెడెక్స్ స్పీకర్, ప్రముఖ స్కూబా డైవర్ సుభాష్ చంద్రన్ (మలయాళీ మెర్మెన్) తో జరిగిన యాదృచ్ఛిక పరిచయం ఈ ప్రయాణాన్ని మరింత ముందుకు నడిపించిందని, ఆయన మార్గదర్శకత్వంలో స్కూబా డైవింగ్ నేర్చుకున్నానని సిద్దార్థ తెలిపారు. విశాఖ సముద్రతీరంలోని దయనీయ స్థితి ముఖ్యంగా ప్లాస్టిక్ వ్యర్థాలు, శుద్ధి చేయని డ్రైనేజీ నీరు, చనిపోతున్న పగడపు దిబ్బలు తనను తీవ్రంగా కలచి వేశాయని తెలిపారు. ప్రముఖ స్కూబా డైవర్ సుభాష్ చంద్రన్ నిర్వహిస్తున్న ప్లాటిపస్ ఎస్కేప్స్ మరియు దాని పర్యావరణ విభాగమైన "ప్లాటిపస్ ఫౌండేషన" లో కీలక సభ్యునిగా కొనసాగుతూ స్వయంగా స్కూబా డైవింగ్ చేస్తూ సముద్ర గర్భంలో పేరుకుపోయిన ప్లాస్టిక్ సీసాలు, ప్రాణాంతకమైన పాత చేపల వలలను తొలగిస్తున్నామని వెల్లడించాడు. కేవలం వ్యర్థాలను తొలిగించడమే కాకుండా పర్యావరణ మార్పులపై అవగాహన కల్పిస్తున్న సిద్దార్థ ఇటీవల ప్రతిష్టాత్మక 14వ ఐకాన్ స్విమ్స్ కాన్ఫరెన్స్‌లో తన పరిశోధనా పత్రాన్ని సమర్పించారు. తీర ప్రాంత క్షీణత వల్ల నష్టపోతున్న స్థానిక మత్స్యకార కుటుంబాలతో నిరంతరం చర్చిస్తూ వారి జీవనోపాధిని, తీరప్రాంత పర్యావరణాన్ని రక్షించడానికి ప్రణాళికలను రూపొందిస్తున్నారు. యువతను ఏకం చేస్తూ క్యాంపస్ విద్యార్థులలో పర్యావరణ స్పృహను పెంచడానికి గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో గ్రీన్ పోయెట్స్ సొసైటీ ని స్థాపించారు. ఒక చిన్న ఆలోచనతో మొదలైన ఈ గ్రూప్‌లో ప్రస్తుతం లా, ఫార్మసీ, మేనేజ్‌మెంట్ వంటి వివిధ విభాగాలకు చెందిన 30 మందికి పైగా విద్యార్థులు చురుగ్గా పాల్గొంటున్నారు. అలాగే గీతం ప్రొఫెసర్ హరీష్ ప్రకాష్ వంటి అధ్యాపకుల మార్గదర్శకత్వంలో గ్రేట్ బ్యాక్‌యార్డ్ కౌంట్ లో భాగంగా గీతం క్యాంపస్‌లో "ఇండియన్ గ్రేహార్నబిల" వాటర్ హెన్ తో సహ 43 రకాల పక్షి జాతులను గుర్తించి, క్యాంపస్ ఒక అద్భుతమైన పర్యావరణ ఆశ్రయమని నిరూపించారు. అంతర్జాతీయ భాగస్వామ్యం :ఎఐఈఎసఈసి మరియు ప్లాటిపస్ ఫౌండేషన్ మధ్య ఒక ఒప్పందాన్ని కుదుర్చి అంతర్జాతీయ ఇంటర్న్‌షిప్ పైప్‌లైన్‌ను ఏర్పాటు చేశారు. దీని ద్వారా గ్లోబల్ టాలెంట్‌ను వైజాగ్ సముద్ర సంరక్షణ కార్యక్రమంలో భాగస్వాములను చేస్తున్నారు. మేము సముద్రంలో ఒక చిన్న నీటి చుక్క లాంటి వాళ్లమే కావచ్చు కానీ మా అధ్యాపకులు, మత్స్యకార సోదరులు మరియు గ్రీన్ పోయేట్స్ సొసైటీ లోని 30 మంది విద్యార్థులం కలిస్తే మా మాతృభూమిని, సముద్రాలను కాపాడుకునే ఒక గొప్ప సైన్యంగా మారుతాం అని సిద్దార్థ నమ్మకంగా చెబుతున్నారు.

## హోం గార్డులకు సమగ్ర ఆరోగ్య బీమా పథకం

7వ పేజీ తరువాయి ..

పాటు రూ 30 లక్షల టాప్–అప్ కవరేజ్ అదనంగా రూ 3 లక్షల కాంప్లిమెంటరీ కవరేజ్ కల్పించబడుతోంది. మొత్తం రూ 33 లక్షల వరకు ఆరోగ్య బీమా సౌకర్యం అందించబడుతుంది. విశాఖ నగర పోలీస్ శాఖలో సేవలందిస్తున్న అన్ని హోం గార్డులు ఈ పథకానికి అర్హులు. భార్య లేదా భర్తతో పాటు ఇద్దరు పిల్లలకు కూడా బీమా రక్షణ వర్తిస్తుంది. ఒక్క కుటుంబానికి సంవత్సరానికి గరిష్టంగా రూ 10,264 ప్రీమియం ఉండగా, మొదటి సంవత్సరానికి సంబంధించిన ప్రీమియాన్ని పోలీస్ సంక్షేమ నిధి ద్వారా చెల్లించడం జరిగింది. ఈ పథకం ద్వారా మొత్తం 975 కుటుంబాలకు బీమా కల్పించబడగా, సుమారు 3,144 మంది లబ్ధి పొందనున్నారు. ఇందుకోసం సంక్షేమ నిధి నుండి రూ 87,97,809 వెచ్చించారు. ఈ కార్యక్రమం ద్వారా హోం గార్డ్ కుటుంబాలకు ఆర్థిక భద్రత కల్పించబడటంతో పాటు, మానసిక ఒత్తిడి తగ్గి విధి నిర్వహణలో మరింత ఉత్సాహం పెరుగుతుంది, అదేవిధంగా వైద్య ఖర్చుల కారణంగా అప్పుల పాలయ్యే ప్రమాదం కూడా తగ్గనుంది. ఈ పథకానికి సంబంధించి 24 గంటల ప్రత్యేక హెల్ప్‌లైన్, నగదురహిత చికిత్స సదుపాయం, ఆరోగ్య కార్డుల డేటాబేస్ నిర్వహణ, బీమా సంస్థలు ఆసుపత్రులతో సమన్వయం వంటి ప్రత్యేక సేవలు అందుబాటులో ఉంచబడినాయి.ప్రత్యేక హెల్ప్‌లైన్ నంబర్: 7995093606, ఈ -మెయిల్: హెల్త్ 4పోలీస్ ఎట్ ద రేట్ ఆఫ్ జీమెయిల్ ఈ కార్యక్రమం నందు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హోం, విపత్తు నిర్వహణ శాఖా మంత్రివర్యులు వంగలపూడి అనిత చేతుల మీదుగా హోం గార్డులు వారి కుటుంబ సభ్యులకు ఆరోగ్య బీమా పాలసీ పట్టాలను అందజేశారు. ఈ కార్యక్రమం లో సీపీ తో పాటుగా నగర పోలీసు ఉన్నతాధికారులు, హోం గార్డు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. అదే విధముగా దివీస్ యాజమాన్యం (సి ఎస్ ఆర్) కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీలో భాగంగా విశాఖ నగర పోలీసు శాఖకు ఎమర్జెన్సీ హ్యాండ్లిగ్ నిమిత్తం రూపాయలు 19, 92,130/– విలువ గల రెండు ఎల్.ఎం.వి ( బోలేరో నియో ) వాహనాలను శుక్రవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హోం విపత్తు నిర్వహణ శాఖా మంత్రి వంగలపూడి అనిత చేతుల మీదుగా నగర పోలీసు శాఖకు అందజేశారు.

## వ్యర్థాల వేరు చేసి అందించడం ద్వారా పరిశుభ్రమైన నగర నిర్మాణం సాధ్యం

### - జీవీఎంసీ అడిషనల్ కమిషనర్ ఎస్.ఎస్.వర్మ

### పశ్చిమ జోన్ వార్డు నెం.91లో ఇంటింటా వ్యర్థాల విభజనపై అవగాహన కార్యక్రమం -తడి, పొడి వ్యర్థాలను వేర్వేరుగా అందించడం ప్రతి పౌరుడి బాధ్యత

విశాఖపట్నం, మే 22, ప్రభాతవార్త

గృహ స్థాయిలోనే తడి, పొడి వ్యర్థాలను వేర్వేరుగా విభజించి అందించడం ద్వారా పరిశుభ్రమైన ,సుస్థిరమైన నగర నిర్మాణానికి ప్రతి పౌరుడు భాగస్వామి కావాలని జీవీఎంసీ అడిషనల్ కమిషనర్ ఎస్.ఎస్. వర్మ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన పశ్చిమ జోన్ జోనల్ కమిషనర్ బి.హేమావతి తో కలసి పశ్చిమ జోన్ పరిధిలో స్వచ్ఛత, వ్యర్థాల శాస్త్రీయ నిర్వహణపై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు వార్డు నెం.91, పాత గోపాలపట్నం ప్రాంతంలో ఇంటింటా వ్యర్థాల విభజనపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన అధికారులతో కలసి ఇంటింటికీ వెళ్లి ప్రజలకు మూలస్థాయిలోనే వ్యర్థాల విభజన ప్రాముఖ్యతను వివరించారు. తడి వ్యర్థాలు, పొడి వ్యర్థాలను వేర్వేరుగా సేకరించి అందించడం వలన పర్యావరణ పరిరక్షణకు తోడ్పడటమే కాకుండా వ్యర్థాల నిర్వహణ సులభతరం అవుతుందని తెలిపారు. అలాగే పరిశుభ్రమైన పరిసరాలు, సుస్థిర పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి కుటుంబం వ్యర్థాలను విభజించి పారిశుద్ధ్య కార్మికులకు నిత్యం అందించాలని కోరారు. స్వచ్ఛతను ప్రతి ఒక్కరూ తమ బాధ్యతగా భావించి జీవన విధానంలో భాగం చేసుకోవాలని , జరుగనున్న స్వచ్ఛ సర్వేక్షన్ 2025 –26 లో దేశంలోనే విశాఖ నగరం పరిశుభ్ర నగర ఖ్యాతిలో ఉత్తమ స్థానం పొందేందుకు ప్రజలు విశాఖ నగర అభివృద్ధికి సహకారం అందించాలని అదనపు కమిషనర్ ప్రజలకు సూచించారు . ఈ కార్యక్రమంలో ఏఎంహెచ్ఓ, శానిటరీ ఇన్స్పెక్టర్, వార్డు శానిటేషన్ కార్యదర్శులు.,స్థానిక ప్రజలు , ఇతర జీవీఎంసీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## అయినాడలో నిధులు లేక అసంపూర్తిగా నిలిచిపోయిన భవనాలను పూర్తి చేయాలి

పద్మనాభం, మే 22, ప్రభాతవార్త



మండలంలో అయినాడ గ్రామంలో నిధులు లేక అసంపూర్తిగా నిలిచిపోయిన రైతు భరోసా, ఆరోగ్య కేంద్ర భవనాలను పూర్తి చేయాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు. గత ప్రభుత్వ హయామాలో లక్షలాది రూపాయల వ్యయంతో సచివాలయం వద్ద నిర్మాణం చేపట్టారు. నాలుగు సంవత్సరాల నుండి ఈ భవనాలు అసంపూర్తిగా నిలిచిపోయాయి.అప్పటి నుండి ప్రస్తుత పాలకులు ఈ భవనాలు ఊసెత్తలేదని ప్రజలు వాపోయారు. దీంతో వ్యవసాయ, ఆరోగ్య శాఖ అధికారులు విధులు నిర్వాహణకు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ఈ భవనాలను పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

## జివిఎంసి టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరమ్‌కు 16 వినతులు



విశాఖపట్నం మే 22, ప్రభాతవార్త

మహా విశాఖపట్నం నగరపాలక సంస్థ టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరమ్ కార్యక్రమంలో 16 వినతులు స్వీకరించడమైనదని జీవీఎంసీ చీఫ్ సిటీ ప్లానరు ఎ.ప్రభాకారరావు తెలిపారు. శుక్రవారం ఆయన జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో గల తన ఛాంబర్ లో డీసీపీలు, ఏసీపీలతో కలిసి ప్రత్యేకంగా టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరమ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. శుక్రవారం టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరమ్ కార్యక్రమానికి సంబంధించి 16 వినతులు స్వీకరించడం జరిగినదని, అందులో ముఖ్యంగా మధురవాడ జోన్ కు 02, ఈస్ట్ జోన్ కు 03, సౌత్ జోన్ కు 03, నార్త్ జోన్ కు 02, వెస్ట్ జోన్ కు 02, అనకాపల్లి జోన్ కు 04 వినతులు వచ్చాయని తెలిపారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయం ప్రాంగణంలో ఒక వినతి పత్రాన్ని ఒక దివ్యాంగుని వద్దకు వెళ్ళి స్వయంగా స్వీకరించడమైనదని తెలిపారు. స్వీకరించిన వినతులను /ఫిర్యాదులను నిర్ణీత సమయంలో టౌన్ ప్లానింగు అధికారులు వెంటనే స్పందించి పరిష్కరించాలని ఆదేశించడమైనదని సీసీపీ ప్రభాకర్ వివరించారు. పట్టణ ప్రణాళికా విభాగమునకు సంబంధించి ఫిర్యాదులు, అర్జీలు మొదలైనవి ప్రతి శుక్రవారం టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరం కార్యక్రమంలో ప్రజలు నమోదు చేసుకోవచ్చునని తెలిపారు.


వార్త VAARTHA CLASSIFIEDS

CLASSIFIEDS

**CHANGE OF NAME**

★ I, KONA VENKATA LAKSHMI W/O KONA SIMHACHALAM, previously called MOLLI VENKATA LAKSHMI R/O 19-7-17, MUSALI NAIDU PALEM, BC ROAD, PEDAGANTYADA, VISAKHAPATNAM, now changed my name from MOLLI VENKATA LAKSHMI to KONA VENKATA LAKSHMI. Hence forth I will be called as **KONA VENKATA LAKSHMI** for all purposes. (Ro.No.7348)

**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగినరీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో "వార్త" దినపత్రికకు ఏ విధమైన సంబంధం లేదు.



**యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా**
రీజనల్ ఆఫీస్, విజయనగరం, 2వ అంతస్తు, లలిత టవర్స్, కలెక్టరేట్ జంక్షన్ దగ్గర, పవర్‌హౌస్ ఎదురుగా, ఎస్.కోట రోడ్డు, విజయనగరం-535003.

**బంగారు నగల వేలం ప్రకటన**

ఈ క్రింద ఉదహరించిన ఖాతాదారు మా బ్యాంకు నందు బంగారు నగలు తనఖా పెట్టి అప్పు తీసుకున్నారు. రిజిష్టర్డ్ పోస్ట్ ద్వారా ఋణగ్రహీతలకు పంపిన నోటీసు వారి తీసుకోని కారణంగా బ్యాంకు వారికి తిరిగి వచ్చినవి. **తేది.29-05-2026 లోపు** వారు తమ బకాయిలను తిరిగి చెల్లించి తాకట్టు పెట్టిన బంగారు ఆభరణములను విడిపించుకొనవలసినదిగా కోరడమైనది. లేనిచో **తేది.30-05-2026, మ॥ 12.00 గం॥ల నుండి యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, దిగువ తెలిపిన** బ్రాంచ్ ఆవరణలో బహిరంగ వేలం వేయబడును. వేలము వేయగా వచ్చిన సొమ్ముతో సదరు అకౌంటు పూర్తిగా చెల్లుబాటు కాని యెడల వారిపై చట్టరీత్యా తగు చర్యలు తీసుకొని మిగిలిన బకాయి వసూలు చేయబడును. ఈ దిగువ ఖాతాదారులు ఎవరైనా మరణించి యున్నచో వారి వారసులకు ఈ నోటీసు వర్తిస్తుంది. అప్పు నోటీసులు అందని వారికి మరియు నోటీసులను తిరస్కరించిన వారికి పత్రికా ముఖమున చివరిసారిగా ఈ నోటీసు ద్వారా తెలియజేయడమైనది.

| క్ర.స | బ్రాంచ్ పేరు | ఋణగ్రహీత పేరు & చిరునామా | ఖాతా నెం. | లోన్ యొక్క తేది |
|---|---|---|---|---|
| 1 | తామరం ఫోన్: 94918 06165 | శ్రీ గొలుగూరి వెంకట రామ రెడ్డి, తండ్రి: లేటు జి వి రెడ్డి, హెచ్.నెం.8-76, కొత్తవీధి, చూకపపాలెం గ్రామం & మండలం, ఆం.ప్ర-531113. | 255716540005724 | 24-12-2024 |
| | | | 255716540005756 | 18-01-2025 |

నియమ నిబంధనలు: (1) వేలంలో పాడిన సొమ్మును అంగీకరించుటకు లేక తిరస్కరించుటకు బ్యాంకు వారికి పూర్తి అధికారం కలదు. (2) ఏ స్థితిలోనైనా వేలం రద్దు చేయుటకు గాని, నిలుపుదల చేయుటకు గాని, నియమ నిబంధనలు మార్చుటకు గాని బ్యాంకు వారికి పూర్తి అధికారం కలదు. 3) వేలంలో పాల్గొనే ప్రతి బిడ్డరు మొత్తము విలువలో కనీసం 25% లేదా రూ.5,000/- (అక్షరాల ఐదు వేల రూపాయలు మాత్రమే) బిడ్ ధరావత్తు చెల్లించవలెను.

తేది : 22.05.2026
స్థలం: విజయనగరం
సం/- బ్రాంచ్ మేనేజర్
యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా



**యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా**
పూల్‌భాగ్ బ్రాంచ్, డోర్ నెం.21-13-9/3, పూల్‌భాగ్ రోడ్డు, విజయనగరం-535003. ఫోన్ : 08922-251106.
ఇ-మెయిల్ : ubin0825310@unionbankofindia.bank

**స్థిరాస్తుల అమ్మకం కొరకు అమ్మకం ప్రకటన**

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్సు, 2002లో రూలు 8 (6) ప్రొవిజన్‌తో చదివే సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 ప్రకారం స్థిరాస్తుల ఇ-వేలం అమ్మకం ప్రకటన.

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, పూల్‌భాగ్ బ్రాంచ్ వారికి తనఖా పెట్టిన / ఛార్జ్ చేసిన, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అధీకృత అధికారిచే లాంఛనాత్మకంగా స్వాధీనం చేసుకున్న దిగువ తెలిపిన స్థిరాస్తులు దిగువ వివరించిన ఋణగ్రహీత(లు)/ హామీదారు(లు) నుండి యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, పూల్‌భాగ్ బ్రాంచ్‌కు రావల్సిన బకాయి దానిపై తదుపరి వడ్డీ మరియు ఛార్జీలు. వ్యయాలతో కలిపి మొత్తమును రాబట్టుకొనుటకు "ఎక్కడ ఎలా ఉన్నదో అలాగే" "అక్కడ ఏమి ఉన్నదో అదే" మరియు "అక్కడ ఏది ఉన్నా" పద్ధతిలో తేది. 24-06-2026న విక్రయించబడుతుందని ముఖ్యంగా దిగువ వివరించిన ఋణగ్రహీత (లు) మరియు హామీదారు(లు)కు మరియు సాధారణ ప్రజానీకానికి ఇందుమూలంగా నోటీసు జారీచేస్తూ తెలియజేయడమైనది.

**ఇ-వేలం తేది & సమయం: 24-06-2026, మ॥ 12.00 గం.ల నుండి సా॥ 5.00 గం.ల వరకు**
(అమ్మకం ముగిసేవరకు ప్రతి 10 నిమిషముల వ్యవధిలో అపరిమిత పొడిగింపుతో)
ధరావత్తును సమర్పించుటకు ఆఖరి తేది: వేలం ప్రక్రియలో పాల్గొనే ముందుగా ధరావత్తును డిపాజిట్ చేయాలి

ఋణగ్రహీత : 1) శ్రీ గుర్రాల శ్రీనివాసరావు, S/o. జి వెంకటేశ్వరరావు, డోర్ నెం. 53-33-1, కె ఆర్ ఎం కాలనీ, సీతమ్మధార, విశాఖపట్నం(అర్బన్), విశాఖపట్నం, ఆం.ప్ర.-530013. 2) శ్రీ గుర్రాల వెంకటేశ్వరరావు, S/o. జి లక్ష్మయ్య, డోర్ నెం. 53-33-1, కె ఆర్ ఎం కాలనీ, సీతమ్మధార, విశాఖపట్నం (అర్బన్), విశాఖపట్నం, ఆం.ప్ర.-530013.

బకాయి మొత్తం: తేది.18-05-2026 నాటికి రూ. 26,13,974.59/- (అక్షరాల ఇరవై ఆరు లక్షల పదమూడు వేల తొమ్మిది వందల డెబ్బై నాలుగు రూపాయల యాభై తొమ్మిది పైసలు మాత్రమే) + తదుపరి వడ్డీ, ఖర్చులు మరియు ఇతర ఛార్జీలు.

**అమ్మకానికి పెట్టిన సెక్యూర్డ్ స్థిరాస్తి వివరములు**

షెడ్యూల్-ఎ : విజయనగరం జిల్లా, విజయనగరం యస్ఆర్ఓ, విజయనగరం మున్సిపాలిటీ, బిట్-2 పూల్‌బాగ్ రోడ్ అనగా విజయనగరం-పాలకొండ రోడ్డు కు పడమరవైపు, డోర్ నెం.12-15-1 లైన్, సర్వే నెం. 167 భాగంలో 2348 చ॥గ॥ల విస్తీర్ణంలో ఖాళీ స్థలం. హద్దులు: తూర్పు: సీర కన్నంనాయుడు యొక్క ఆస్తి, దక్షిణం: రహదారి, పడమర: సీర గణపతి నాయుడు యొక్క ఆస్తి, ఉత్తరం: 40 అ॥ల రోడ్డు. మొత్తం 2348 చ॥గ॥లలో అవిభాజ్యపు మరియు అనిర్దేశ్యపు వాటా 31 చ॥గ॥లు.

షెడ్యూలు-బి: పైన తెలిపిన షెడ్యూల్-ఎ లో నిర్మించిన సాయికృపా ఎన్‌క్లేవ్ పేరు గల బిల్డింగ్ నందు స్టిల్ట్ ఫ్లోర్‌లో 80 చ॥అ॥ల కారు పార్కింగ్ మరియు నాల్గువ అంతస్తులో ప్లింత్ ఏరియా 960 చ॥అ॥ల (ఉమ్మడి ఏరియా కలుపుకొని) తో ఆర్‌సిసి స్లాబ్ రెసిడెన్షియల్ ఫ్లాట్ నెం.FF-7 కలదు. హద్దులు: తూర్పు: ఉమ్మడి వరండా, దక్షిణం: శూన్యాకాశం, పడమర: ఉమ్మడి వరండా, ఉత్తరం: ఫ్లాట్ నెం.FF-8.

రిజర్వు ధర: రూ. 14,00,000/- ధరావత్తు: రూ. 1,40,000/- బిడ్ పెంపుదల: రూ. 14,000/-

బ్యాంకుకు తెలిసిన ఏమైనా తాకట్టు ఋణభారములు: లేవు
బిడ్‌ను సమర్పించే ముందు మరియు ఇ-వేలం అమ్మకపు ప్రక్రియలలో పాల్గొనే ముందు, వేలం అమ్మకానికి సంబంధించిన వివరణాత్మక నిబంధనలు మరియు షరతుల కోసం సర్వీస్ ప్రొవైడర్ వెబ్‌సైట్: https://baanknet.com మరియు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వెబ్‌సైట్: https://www.unionbankofindia.bank.in/auction-property/view-auction-property.aspx లను పూర్తిగా పరిశీలించాలని బిడ్డర్లకు సూచించడమైనది. ఆస్తిపై బ్యాంకుకు తెలిసిన మేరకు ఎటువంటి ఎన్‌కంబ్రెన్స్ లేవు.

తేది : 19.05.2026, స్థలం : పూల్‌భాగ్
సం/- అధీకృత అధికారి, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

23-5Pg6exHMNWJQE.qxd OK:23-5Pg6exHMNWJQE.qxd 1/1/02 7:23 AM Page 1



# ప్రజలకు సురక్షిత తాగునీరు అందివ్వాలి

**● ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్**



**గన్నవరం(కృష్ణా), మే 22 ప్రభాతవార్త:** ప్రజల వద్ద నుండి డబ్బులు తీసుకుని నీటిని విక్రయిస్తున్న వాటర్ ప్లాంట్‌లు సురక్షిత తాగు నీటిని ప్రజలకు అందివ్వాలని, గన్నవరం నియోజకవర్గంలోని తాగునీటి ప్లాంట్‌లలో సరఫరా చేస్తున్న తాగునీటికి నాణ్యత పరీక్షలు నిర్వహించాలని ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్ అధికారులను ఆదేశించారు. గన్నవరం నియోజకవర్గంలోని పబ్లిక్, ప్రయివేటు వాటర్ ప్లాంట్‌లలో తనిఖీలు నిర్వహించి, సదరు ప్లాంటులు సరఫరా చేస్తున్న నీటిని ల్యాబ్‌లలో పరీక్షలు చేయించి, తగు నాణ్యతా ప్రామాణాలు పాటించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తాగునీరు కలుషితం కావటం ద్వారా పలు వ్యాధులు ప్రభలే ప్రమాదం ఉన్నందున ప్రజల ఆరోగ్య భద్రత దృష్ట్యా ముందస్తు జాగ్రత్తగా నీటికి పరీక్షలు నిర్వహించాలన్నారు. నిర్ధిష్ట నాణ్యతా ప్రమాణాలు పాటించని నీటిప్లాంట్‌లపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గ్రామపంచాయతీల ఆధ్వర్యంలో పనిచేస్తున్న ప్లాంట్‌లలో తరచు ఫిల్టర్‌లు మార్చేలా అధికారులు చర్యలు తీసుకోవాలని, వాటర్‌ప్లాంట్లపై అధికారుల పర్యవేక్షణ ఉండాలని యార్లగడ్డ సూచించారు.



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్

# సమస్యల పరిష్కారానికే పిజిఆర్‌ఎస్

**● ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశా**

**విజయవాడ, మే 22 ప్రభాతవార్త:** రెవెన్యూ సమస్యల పరిష్కారం కోసం గ్రామాల్లో ప్రత్యేక ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశా తెలిపారు. శుక్రవారం రెడ్డిగూడెం గ్రామంలో ప్రత్యేక పిజిఆర్‌ఎస్, ఒక నెల– ఒక గ్రామం– నాలుగు సందర్శనలు కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈసందర్భంగా ప్రజల నుండి అర్జీలు స్వీకరించి వాటిని సత్వరమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నేరుగా ప్రజల వద్దకు వెళ్ళి వారి సమస్యలు తెలుసుకుని వాటిని నిర్ధిష్ట గడువులోగా పరిష్కరించేందుకు ఈకార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. గ్రామస్థాయిలో సమస్యలు పరిష్కారమైతే గ్రామస్తులకు సమయం, వ్యయం తగ్గుతుందని, పరిపాలనపై నమ్మకం కలుగుతుందన్న అభిప్రాయం వ్యక్తం చేసారు. ఈ కార్యక్రమంలో తిరువూరు ఆర్డీఓ ఏ.కుమార్, తదితరులు పాల్గొన్నారు.

**బడి పిలుస్తోంది:** రెడ్డిగూడెం గ్రామ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం జరిగిన బడి పిలుస్తోంది కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో చేరిన విద్యార్థినీవిద్యార్థులతో కలెక్టర్ ముచ్చటించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామస్తుల సహకారంతో బడిఈడు పిల్లలు అందరూ బడిలో చేరేలా ఉపాధ్యాయులు, సిబ్బంది కృషి చేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన వసతులు కల్పించటంతో పాటు, నాణ్యమైన విద్య, మధ్యాహ్నాభోజనం, ఉచితంగా పుస్తకాలు, యూనిఫాం అందిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం ఇస్తున్న తోడ్పాటుని సద్వినియోగం చేసుకుని విద్యార్థులు ఉన్నత స్తానాలకు చేరుకోవాలని కలెక్టర్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డిఇఒ ఎల్.చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.



విద్యాసంస్థల బస్సులను తనిఖీ చేస్తున్న పోలీస్ అధికారులు

# విజయవాడలో విద్యాసంస్థల బస్సుల తనిఖీలు

**విజయవాడ, మే 22 ప్రభాతవార్త:** విద్యాసంవత్సరం ప్రారంభం కానున్న నేపథ్యంలో విజయవాడలో పోలీసులు విద్యాసంస్థల బస్సుల్లో తనిఖీలు చేపట్టారు. విజయవాడ ట్రాఫిక్ డిసిపి షిరిన్ బేగం ఆధ్వర్యంలో పడమటలోని కెకెఆర్ గౌతం పాఠశాలలో బస్సులను తనిఖీ చేసారు. బస్సులకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్, ఇన్స్యూరెన్స్, పొల్యూషన్ సర్టిఫికెట్లు పరిశీలించారు. బస్సుల్లో ఫస్ట్ ఎయిడ్ కిట్, అత్యవసర మార్గము అగ్నిమాపక పరికరాలు పరిశీలించి డ్రైవర్‌లకు హెవీలైసెన్స్‌తోపాటు అనుభవం ఉందో లేదో సరి చూసారు. ఈ సందర్భంగా షిరిన్ బేగం డ్రైవర్లతో మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడపవద్దని, బస్సు ఫిట్‌నెస్ సర్టిఫికెట్, ఇన్స్యూరెన్స్, పొల్యూషన్ సర్టిఫికెట్‌లు యాక్టివ్‌గా ఉండేలా చూడాలని ఆదేశించారు. బస్సుల్లో సీటింగ్‌కు మించి విద్యార్థులను ఎకి్కంచవద్దని నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని, భారీ జరిమానాలు విధించటంతోపాటు బస్సులను సీజ్‌చేస్తామని హెచ్చరించారు. రహదారి భద్రతా నియమాలు పాటిస్తూ ప్రతిఒక్కరూ ప్రమాదాల నివారణకు కృషిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో 4వ ట్రాఫిక్ ఎసిపి డి.పవన్‌కుమార్, ఇన్‌స్పెక్టర్‌లు కృష్ణబాబు, రామారావు, రమేష్ సిబ్బంది పాల్గొన్నారు.



# నేటి నుండి తిరుపతిలో అరసం రాష్ట్ర మహాసభలు

**తిరుపతి, మే 22 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం (అరసం) 20వ రాష్ట్ర మహాసభలు తిరుపతి నగరంలో శనివారం నుండి రెండు రోజుల పాటు జరగనున్నాయి. రాష్ట్ర మహాసభలతో పాటు 83వ వార్షికోత్సవాన్ని కలిపి నిర్వహిస్తున్నారు. నగరంలో సిపిఐ కార్యాలయంలోని గంధమనేని శివయ్య కృష్ణారెడ్డి భవన్ అరసం రాష్ట్ర మహాసభలకు వేదిక కానుంది. 40 సంవత్సరాల అనంతరం అరసం మహాసభలు మరోసారి తిరుపతిలో జరుగుతున్నాయి. ఈ సందర్భంగా సదస్సులు, పుస్తకావిష్కరణలు, సాంస్కృతిక ప్రదర్శనలు ఉంటాయి. ఆంధ్రప్రదేశ్, తెలంగాణతో పాటు వివిధ రాష్ట్రాల నుండి 300 మంది ప్రతినిధులు ఈ మహాసభలకు హాజరు అవుతున్నారు.

రెండు రోజులు పాటు తిరుపతిలో జరిగే అరసం మహాసభల ఏర్పాట్లను ఆ సంఘం నాయకులు శుక్రవారం ఉదయం పర్యవేక్షి ంచారు. ఈ కార్యక్రమంలో అఖిలభారత అభ్యుదయ రచయితల సంఘం జాతీయ అధ్యక్షుడు పెనుగొండ లక్ష్మీ ్మనారాయణ అభ్యుదయ రచయితల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లూరి శివప్రసాద్, నాయకులు సాకం నాగరాజు, గంటా మోహన్ డాక్టర్ నెమిలేటి కిట్టన్న, నాదెండ్ల శ్రీమన్నారాయణ, ఏడుకొండలు, ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిన్నం పెంచలయ్య, సత్యాల బాదుల్లా తదితరులు పాల్గొన్నారు.

# టిడ్కో కాలనీలకు రోల్ మోడల్‌గా ఆత్మకూరు రామాలయం

**● మంత్రి ఆనం రామనారాయణరెడ్డి**



**ఆత్మకూరు (నెల్లూరు), మే 22, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని టిడ్కో కాలనీలకు రోల్ మోడల్‌గా ఆత్మకూరు టిడ్కో కాలనీలో నిర్మాణంలో ఉన్న రామాలయం నిలుస్తోందని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం ఆత్మకూరు పట్టణం టిడ్కో కాలనీలో నిర్మిస్తున్న శ్రీ సీతారామాంజనేయ స్వామి ఆలయాన్ని అధికారులు, స్థానిక నేతలతో కలిసి మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ శ్రీవాణి భజన మందిరాల్లో రాష్ట్రంలోని మొట్టమొదటి ఆలయంగా నిర్మాణం పూర్తి కావస్తున్న ఆత్మకూరు టిడ్కో కాలనీలోని రామాలయాన్ని త్వరలోనే రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణచే ప్రారంభిస్తామని, ఆలయ నిర్మాణంతోపాటు పలు అభివృద్ధి కార్యక్రమాలను కూడా మంత్రి నారాయణ ఆధ్వర్యంలో శ్రీకారం చుడుతున్నామన్నారు. ఆలయ ప్రాంగణాన్ని ఆధ్యాత్మిక శోభతో ప్రశాంత వాతావరణంతో తీర్చిదిద్దుతామన్నారు. ప్రతి భక్తుడు ఆహ్లాదకర అనుభూతి పొందేలా అభివృద్ధి చేస్తామన్నారు. ఆత్మకూరు నమూనాను ఆదర్శంగా తీసుకొని రాష్ట్ర వ్యాప్తంగా టిడ్కో కాలనీల్లో దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో రామాలయాల నిర్మాణానికి మంత్రి రామనారాయణరెడ్డి శ్రీకారం చుట్టినట్లు చెప్పారు. ఈకార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

**సిఎం స్ఫూర్తితో జిల్లాలో అభివృద్ధిని పరుగులు పెట్టిద్దాం:** రాష్ట్రంలోని ప్రభుత్వ శాఖల పనితీరు విషయంలో నెల్లూరు జిల్లా ముందువరుసలో ఉండడం గర్వకారణమని మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఆత్మకూరు ఆర్‌అండ్‌బి అతిథిగృహంలో పలు ప్రభుత్వ శాఖలపై మంత్రి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. మంత్రి ఆనం మాట్లాడుతూ జిల్లాలో ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ యంత్రాంగం సమన్వయంతో పని చేయడం వలన సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలు సమర్ధవంతంగా అమలవుతున్నాయన్నారు. ఈ విషయమై ముఖ్యమంత్రి ప్రశంసించడం జిల్లా అధికారులందరికీ గర్వకారణమన్నారు. ఈసందర్భంగా జిల్లా అధికారులకు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. సిఎం ఇచ్చిన స్ఫూర్తితో జిల్లాలో అభివృద్ధిని మరింత హైస్పీడ్ పెంచాలని అధికారులకు మంత్రి పిలుపునిచ్చారు. వేసవిలో ఎక్కడా నీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఆత్మకూరు నియోజకవర్గ అభివృద్ధికి ఉన్న ప్రతి అవకాశాన్ని వదులు కోకుండా నిధులు సమీకరించి సమగ్రంగా ఆత్మకూరును అభివృద్ధి చేయడమే లక్ష్యమని మంత్రి రామనారాయణ రెడ్డి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు, నియోజకవర్గ స్థాయి అధికారులు పాల్గొన్నారు.

**సిఎం రిలీఫ్ ఫండ్ ద్వారా 7.49 కోట్లు ఆర్థికసాయం:** పేద, మధ్య తరగతి ప్రజల ఆరోగ్య భద్రతకు ఎన్‌డిఎ కూటమి ప్రభుత్వం అండగా నిలస్తుందని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఆత్మకూరు పట్టణంలో 49మంది లబ్ధిదారులకు 44.89 లక్షలు విలువైన సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను మంత్రి అందజేశారు. మంత్రి ఆనం మాట్లాడుతూ వివిధరకాల వ్యాధులకు వైద్యం చేయించుకొని ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న కుటుంబాలకు సిఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ముఖ్యమంత్రి చంద్రబాబు ఉదారంగా ఆర్థిక సాయం అందించి అండగా నిలుస్తున్నారన్నారు. తమ ప్రభుత్వం అధికారం చేపట్టినప్పటి నుంచి ఇప్పటివరకు ఆత్మకూరు నియోజకవర్గంలోనే 809మంది లబ్ధిదారులకు 7,49,67,338 రూపాయలను అందించి ఆ కుటుంబాలకు తోడుగా నిలిచామని మంత్రి పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# గోవిందరాజస్వామి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ



**తిరుపతి, మే 22 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుపతి గోవిందరాజ స్వామి ఆలయంలో తొమ్మిది రోజులపాటు నిర్వహించనున్న వార్షిక బ్రహ్మోత్సవాలకు శుక్రవారం సాయంత్రం శాస్త్రోక్తంగా అంకురార్పణ మహోత్సవం జరిగింది. ఆలయ వేదఘోషలు, మంగళవాయిద్యాలు, వైదిక మంత్రోచ్చారణల నడుమ నిర్వహించిన ఈ పవిత్ర కార్యక్రమం భక్తులను ఆధ్యాత్మిక ఆనందంలో ముంచెత్తింది. యాగశాలలో ప్రత్యేక పూజల అనంతరం అంకురార్పణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. గోవిందరాజస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల నేపథ్యంలో టిటిడి విస్తృత ఏర్పాట్లు చేపట్టింది. వేసవి నేపథ్యంలో చలువ పందిళ్లు, వైట్ పెయింట్, ఆలయం పరిసరాలలో ఆకట్టుకునేలా రంగోలీలు, విద్యుత్ అలంకరణలు, పెయింటింగ్స్, పుష్పలంకరణలు తదితర ఏర్పాట్లు చేపట్టారు. నేటి ఉదయం 07.35 గంటల నుండి 08.49 గంటల మధ్య మిథున లగ్నంలో ధ్వజారోహణ మహోత్సవం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో పెద్ద జీయర్ స్వామి, చిన్న జీయర్ స్వామి, ఆలయ డిప్యూటీ ఇఒ వి.ఆర్.శాంతి, ఎఇఒ ఎబి నారాయణ చౌదరి, సూపరింటెండెంట్లు శేషగిరి, చిరంజీవి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ధనుంజయరావు, అర్చకులు, పాల్గొన్నారు.

# రాప్తాడులో ఏం జరుగుతున్నదో మంత్రి లోకేష్ తెలుసుకోవాలి

**● ప్రాణహాని ఉందని నివేదికలు ఉన్నా గన్‌మెన్‌లను తొలగించారు?**

**● కూటమి ప్రభుత్వాన్ని మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి**



**అనంతపురం, మే 22 ప్రభాతవార్త బ్యూరో:** రాప్తాడు శాసనసభ నియోజకవర్గంలో జరుగుతున్న దారణాలతో పాటు ప్రభుత్వం వైఫల్యాలను ప్రశ్నించినందుకే తనకు గన్ మెన్లను తొలగించారని, తనకు ప్రాణహాని ఉందని పోలీస్ అధికారుల నివేదికలు ప్రభుత్వం వద్ద ఉన్నా తనకు గన్‌మెన్లను ఎలా తొలగిస్తారని మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి ప్రశ్నించారు. తనకు గన్‌మెన్ లేకపోయినా ప్రజల రక్షణతో తన పోరాటాన్ని కొనసాగిస్తానని, ప్రజా సమస్యలను ప్రశ్నిస్తూ ఉంటానని ఆయన వెల్లడించారు. వైసిపి జిల్లా పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ తాను లేవనెత్తిన ప్రశ్నలకు సమాధానం చెప్పలేక.. గన్ మెన్లను తొలిగిస్తారా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. నారా లోకేష్ తొలి సారి మంత్రి అయ్యాడని.. అసలు రాప్తాడు వంటి ప్రాంతంలో జరుగుతున్న దారుణాలు గురించి తెలుసుకోవాలన్నారు. నియోజకవర్గంలో జరుగుతున్న దౌర్జన్యాలు, దురాగతాలు, అక్రమాలు తెలుసుకొని సరిదిద్దే పనులను మంత్రి చేయాల్సింది ఉందన్నారు. రాప్తాడు నియోజకవర్గంలో కురుబ లింగమయ్య హత్య, దళిత మైనర్ బాలికపై అత్యాచారం, భూ వివాదంలో హత్య గురించి, హంద్రీనీవా కాలువకు లైనింగ్, పేరూరు డ్యాంకు నీరు ఇవ్వని పరిస్థితి నెలకొందన్నారు. ఎమ్మెల్యే పరిటాల సునీత, ఆమె సోదరులు, కుమారుల వసూళ్లు, అక్రమాలు గురించి, ఇసుక అక్రమ రవాణా, టమోటా మండీల్లో వసూళ్లు, కర్ణాటక అక్రమ మద్యం, రేషన్ బియ్యం అక్రమ రవాణా వంటి అంశాల గురించి తాను ప్రశ్నించాన్నారు. అనంతపురం శివారులో పాపంపేటలో అమాయక ప్రజల భూములు కాజేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని, దీనిని నేను అడ్డుకుంటున్నాను అన్న ఉద్దేశంతోనే మంత్రి నారా లోకేష్ దృష్టికి తనపై తప్పుడు సమాచారం ఇచ్చి గన్‌మెన్‌లు లేకుండా చేశారన్నారు. తనకు ప్రాణహాని ఉందని పదేళ్లపాటు గన్‌మెన్లు ఉండాలని గతంలో నివేదిక ఉందని అయితే ఇప్పుడు కనీస సమాచారం ఇవ్వకుండా తొలగించారన్నారు. నియోజకవర్గ ప్రజల రక్షణతో తన పోరాటాన్ని కొనసాగిస్తారని ఆయన హెచ్చరించారు. సమావేశంలో అనంతపురం రూరల్ జడ్‌పిటిసి సభ్యుడితోపాటు వైసిపి నాయకులు గోపాల్‌రెడ్డి, రాప్తాడు రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# లోక్‌సభ స్థానాల సంఖ్య పెంచడం ద్వారా దక్షిణాది రాష్ట్రాలకు రక్షణ లభించదు

**- ఎపి కాంగ్రెస్ అధ్యక్షురాలు షర్మిల**



**విజయవాడ, మే 22 ప్రభాతవార్త ప్రతినిధి:** లోక్‌సభ స్థానాల సంఖ్యను పెంచడం ద్వారా దక్షిణాది రాష్ట్రాలకు రక్షణ లభించదని ఎపి కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల వ్యాఖ్యానించారు. పార్లమెంటులో వాటి సాపేక్ష ప్రాతినిధ్యం, రాజకీయ పలుకుబడి తగ్గకుండా చూడటమే అసలైన సవాల్ అని ఆమె అన్నారు. లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన అంశంపై టిడిపి నేత నారా లోకేష్ లేనిపోని గందరగోళం సృష్టించే ప్రయత్నం చేస్తున్నారని తీవ్రంగా విమర్శించారు. జనాభా నియంత్రణను విజయవంతంగా అమలు చేసి, మెరుగైన మానవాభివృద్ధి సూచికలను సాధించిన దక్షిణాది రాష్ట్రాలను రాజకీయంగా శిక్షించకూడదన్నదే తమ పార్టీ స్పష్టమైన వైఖరి అని ఆమె పునరుద్ఘాటించారు.

కేవలం లోక్‌సభ స్థానాల సంఖ్యను పెంచడం ద్వారా దక్షిణాది రాష్ట్రాలకు రక్షణ లభించదని, కాంగ్రెస్ అగ్రనేత పి.చిదంబరం ట్వీట్‌కు బదులిస్తూ నారా లోకేష్ చేసిన పోస్ట్ పై షర్మిల ఈ విధంగా స్పందించారు. "దక్షిణాది రాష్ట్రాల గొంతుకను తగ్గించే ఎలాంటి పునర్విభజన ప్రక్రియనైనా కాంగ్రెస్ పార్టీ మొదటి నుంచీ వ్యతిరేకిస్తోంది. దీనిపై తిరుగులేని రాజ్యాంగ హామీ ఉండాలని మేం డిమాండ్ చేశాం. ఆర్టికల్ 81 ప్రకారం చూస్తే, ఆంధ్రప్రదేశ్‌కు సంఖ్యాపరంగా సీట్లు పెరిగినా, అధిక జనాభా ఉన్న ఉత్తరాది రాష్ట్రాలతో పోలిస్తే దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్య బలం, నిర్ణయాధికారం తగ్గిపోయే ప్రమాదం ఉంది" అని షర్మిల ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఈ సమస్యకు ప్రత్యామ్నాయాలను అన్వేషించడంలో విఫలమైందని ఆరోపించారు.

మోడీ ప్రభుత్వ హయాంలో పార్లమెంటు సమావేశాల రోజుల సంఖ్య గణనీయంగా తగ్గిపోయిందని, ఇప్పటికే జాతీయ చర్చల్లో దక్షిణాది రాష్ట్రాల వాణిని అణచివేస్తున్నారని షర్మిల విమర్శించారు. 'సమాఖ్య సమతౌల్యాన్ని, పార్లమెంటరీ పనితీరును కాపాడకుండా సభను విస్తరిస్తే, వ్యక్తి గత ప్రాతినిధ్యం, అర్థవంతమైన చర్చ మరింత బలహీనపడతాయి. దక్షిణాది రాజకీయ ప్రాబల్యాన్ని శాశ్వతంగా కాపాడతామని బిజెపి నేతృ త్వంలోని ఎన్డీయే ఎప్పుడూ స్పష్టమైన రాజ్యాంగ హామీ ఇవ్వలేదు. ఒకప్పుడు సమాఖ్య స్ఫూర్తి కోసం, దక్షిణాది ప్రయోజనాల కోసం పోరా డిన టిడిపి, ఇప్పుడు ఆంధ్రప్రదేశ్‌కు, దక్షిణాదికి ఎలాంటి రక్షణలు కోర కుండా బిజెపి అస్పష్ట వైఖరిని సమర్థించడం విడ్డూరంగా ఉంది" అని ఆమె అన్నారు.

# మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండండి

**విజయవాడ, మే 22 ప్రభాతవార్త:** విద్యార్థులు, యువత మాదక ద్రవ్యాల వినియోగానికి దూరంగా ఉండాలని పలువురు వక్తలు సూచించారు. విజయ వాడలోని ఎస్‌ఆర్‌ఆర్ డిగ్రీ కళాశాల ఆవరణలో జిల్లా యువజన సంక్షేమశాఖ, స్టెప్, కృషి ఆధ్వర్యంలో శుక్రవారం మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలను వివరిస్తూ అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా యువజన సంక్షేమశాఖ ముఖ్య కార్యనిర్వహణాధికారి డాక్టర్ కొల్లేటి రమేష్ మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వినియోగానికి అలవాటు పడితే బంగారు భవిష్యత్ నాశనం అవుతుందని ఆందోళన వ్యక్తం చేసారు. ఈ మత్తు నుండి బయటకు రాలేరని మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని హితవు పలికారు. విజయవాడలో పోలీసులు నిరంతరాయంగా తనిఖీలు చేస్తున్నారని మాదకద్రవ్యాలు సేవించి పట్టుబడితే జైలుకి వెళ్ళాల్సి వస్తుందని హెచ్చరించారు. విద్యార్థులు కెరీర్ పైన దృష్టిసారించి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సైకాలజిస్టు జగదీష్, ఎస్‌ఆర్‌ఆర్ స్కిల్‌హబ్ కోఆర్డినేటర్ విజయదీప్, నరేష్, తదితరులు పాల్గొన్నారు.

# వేగంగా ఆర్‌టిసి ఇవి చార్జింగ్ స్టేషన్ల ఏర్పాటు

**- ఎస్‌పిడిసిఎల్ సిఎండి శివశంకర్ లోతేటి**

**తిరుపతి, మే 22 ప్రభాతవార్త ప్రతినిధి:** ఎస్‌పిడిసిఎల్ పరిధిలోని నెల్లూరు, కడప, అనంతపురం, కర్నూలు, తిరుపతి జిల్లాల్లో ఏర్పాటు చేస్తున్న రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఇవి చార్జింగ్ స్టేషన్ల ఏర్పాటు పనులను వేగవంతం చేయాలని ఎస్‌పిడిసిఎల్ సిఎండి శివశంకర్ లోతేటి ఆదేశించారు. ఎస్‌పిసిడిసిఎల్ కార్పొరేట్ కార్యాలయం నుండి శుక్రవారం ఆయా జిల్లాల సూపరింటెండింగ్ ఇంజనీర్లు, ఆర్‌టిసి అధికారులు, కాంట్రాక్టర్లతో సిఎండి శివశంకర్ లోతేటి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్పిడీసీఎల్ పరిధిలో నెల్లూరు, కడవ, అనంతపురం, కర్నూలు, మంగళం వద్ద ఆర్‌టిసి బస్సుల కోసం ఎస్‌పిడిసిఎల్ ఆధ్వర్యంలో ఇవిచార్జింగ్ స్టేషన్లను ఏర్పాటు చేయడం జరుగుతోందని సిఎండి శివశంకర్ తెలిపారు. ఈ పనుల్ని చేపడుతున్న కాంట్రాక్టర్లు పనుల్లో నాణ్యతకు ప్రాధాన్యతనివ్వాలని, ఎస్‌పిడిసిఎల్, ఎపిఎస్‌ఆర్‌టిసి అధికారులతో సమన్వయం చేసుకుంటూ, ఈ యేడాది జూన్ 20 లోగా పనులను పూర్తి చేయాలని సిఎండి శివశంకర్ లోతేటి సూచించారు. పనులను చేపట్టే సందర్భాల్లో ఏవైనా అడ్డంకులు ఏర్పడినట్లయితే సంబంధిత సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజనీర్‌ను సంప్రదించి, సమస్యల్ని పరిష్కరించుకుని, పనులను సకాలంలో పూర్తి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ (ప్రాజెక్ట్స్ ఐటి) పి.ఆయూబ్ ఖాన్, డైరెక్టర్ (టెక్నికల్ హెచ్‌ఆర్‌డి) కె.గురవయ్య, చీఫ్ జనరల్ మేనేజర్ కె.సంపత్ కుమార్, జనరల్ మేనేజర్ జగదీష్, సూపరింటెండింగ్ ఇంజనీర్లు రాఘువేంద్రం, శేషాద్రి శేఖర్, ప్రదీప్ కుమార్, చంద్రశేఖర్, ఆర్‌టిసి రీజనల్ మేనేజర్లు, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.





థార్ జీప్‌లతో ఢీకొట్టుకున్న దృశ్యం

# యువతి కోసం నడిరోడ్డుపై వీరంగం

**● థార్ జీప్‌లతో ఢీకొట్టుకున్న ఆకతాయి మిత్రులు**

**విజయవాడ, మే 22 ప్రభాతవార్త ప్రతినిధి:** ఒకే యువతి ప్రణయ ప్రాపకం కోసం విజయవాడ నడివీధుల్లో ప్రళయం సృష్టించారు ఇద్దరు ఆకతాయి మూకల యువనాయకులు. స్పాట్ ముందే పెట్టుకుని సినిమా తరహాల్లో క్రైమ్ చేసి, జనాన్ని గడగడలాడించారు. కచ్చితంగా శుక్రవారం తొలిగంటల్లో (గురువారం అర్ధరాత్రి దాటిన తరువాత) ఈ ఘటన జరిగింది. తాడిగడపకు చెందిన రోహిత్, భారతీనగర్‌కు చెందిన బొల్లా ఓమ్ చిన్నప్పటి నుంచి స్నేహితులు. అయితే, ఒక యువతి వ్యవహారంలో గత కొంతకాలంగా వీరి మధ్య తీవ్ర మనస్పర్థలు తలెత్తాయి. ఈ క్రమంలో ఇరువురి మధ్య ఫోన్లలో సవాళ్లు, ప్రతిసవాళ్లు నడిచాయి. ఆ క్రమంలోనే నువ్వో నేనో తెల్చుకుందామంటూ ముందుగానే సవాల్ చేసుకుని అందుకు అర్ధరాత్రి సమయాన్ని ఎంచుకున్నారు. గురునానక్ కాలనీ పరిధిలోకి చేరుకున్న ఇద్దరు యువకులు తమ థార్ వాహనాలతో బరితెగించారు. ఎదురెదురుగా వస్తూ ఒకరి వాహనాన్ని మరొకరు అత్యంత వేగంతో, కక్షతో బలంగా ఢీకొట్టుకున్నారు. అలా ఢీకొట్టుకుంటూనే దాదాపు 100 మీటర్ల మేర రోడ్డుపై ఈడ్చుకెళ్లారు. వాహనాల టైర్లు ఊడిపోయేలా సాగిన ఈ రౌడీయిజం చూసి అటుగా వెళ్తున్న వాహనదారులు భయంతో పరుగులు తీశారు. అంతటితో ఆగకుండా, వాహనాల నుంచి కిందికి దిగిన ఓమ్, అతని అనుచరులు ఇనుప రాడ్లు, కర్రలతో రోహిత్ జీపు అద్దాలను పగలగొట్టి ధ్వంసం చేశారు. ఘర్షణ సమయంలో ఒకరి వాహనంలో సదరు యువతి, మరో వాహనంలో కొందరు యువకులు ఉన్నట్లు సమాచారం. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న పటమట పోలీసులు తక్షణమే ఘటనా స్థలానికి చేరుకున్నారు. పోలీసులను చూడగానే రోహిత్ వాహనాన్ని వదిలి పరారవ్వగా బొల్లా ఓమ్‌ను మరో ఇద్దరు యువకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ ప్రమాదంలో ఎవరికీ ప్రాణనష్టం జరగలేదని, పరారీలో ఉన్న రోహిత్ కోసం గాలిస్తున్నామని సిఐ పవన్ కిషోర్ తెలిపారు. ఈ వ్యవహారంపై పటమట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# పోక్సో కేసులో నిందితుడు అరెస్ట్

**● కేసు నుండి తప్పించేందుకు సహకరించిన అధికారిణి అరెస్ట్**

**తిరుపతి, మే 22 ప్రభాతవార్త ప్రతినిధి:** వేసవి సెలవుల్లో తిరుపతిలో పిన్ని ఇంటికి వచ్చిన ఓ బాలిక(16)పై బాబాయి అయిన రామ్మూర్తి (51) లైంగికంగా వేధించి ఇబ్బందిపెట్టిన నిందితుడిని తిరుపతి ఈస్టు పోలీసులు ఎట్టకేలకు అరెస్ట్ చేశారు. తిరుపతిలో జిఎస్‌టి డిపార్టుమెంటులో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తూ, బాధితురాలిపై పలుమార్లు లైంగిక దాడికి పాల్పడిన ఘటనపై తిరుపతి ఈస్ట్ పోలీస్ స్టేషన్‌లో పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసిన విషయం విదితమే. నిందితుడు తిరుపతిలో బాలిక ఇష్టానికి వ్యతిరేకంగా బలవంతంగా లైంగిక దాడికి పాల్పడినట్లు దర్యాప్తులో వెల్లడైంది. అదేవిధంగా బాధితురాలితో ఫోన్ షేర్ చాట్ ద్వారా జరిపిన చాట్స్, కలిసి దిగిన సన్నిహిత ఫోటోలను తన వద్ద ఉంచుకొని, తాను పిలిచినప్పుడు రాకపోతే వాటిని సామాజిక మాధ్యమంలో వైరల్ చేస్తానని, ఈ విషయం ఎవరితోనైనా చెబితే ఆమె తల్లిదండ్రులను హత్య చేస్తానని బెదిరింపులకు పాల్పడినట్లు తెలిసింది. ఈ విషయాన్ని తెలుసుకున్న బాధితురాలి తల్లిదండ్రులు హైదరాబాద్‌లోని జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, అక్కడ పోలీసులు జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసి, కేసును సంబంధిత పరిధిలోని తిరుపతి ఈస్ట్ పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేశారు. ఆ జీరో ఎఫ్ఐఆర్ ఆధారంగా తిరుపతి ఈస్ట్ పోలీస్ స్టేషన్‌లో పోక్సో చట్టం కింద కేసు నమోదు చేయబడింది. తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు ఆదేశాల మేరకు తిరుపతి డిఎస్పీ భక్తవత్సలం కేసును లోతుగా దర్యాప్తు చేసి కీలక ఆధారాలను సేకరించారు. దర్యాప్తులో ప్రధాన నిందితుడు రామ్మూర్తితో పాటు, కేసు నుంచి అతన్ని తప్పించేందుకు సహకరించిన బాధితురాలి పిన్ని మానస, రైల్వే కోడూరు డిప్యూటీ తహసీల్దార్ పాత్ర కూడా ఉన్నట్లు గుర్తించారు. దీంతో ఇద్దరినీ పోలీసులు అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించారు. ప్రస్తుతం కేసు దర్యాప్తు కొనసాగుతోంది.

# రేణిగుంటలో ట్రాన్స్‌కో సబ్‌స్టేషన్ దగ్ధం



**తిరుపతి, మే 22 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుపతి జిల్లా రేణిగుంటలోని ఎపి ట్రాన్స్‌కో పరిధిలోని 120/కెవి విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మంటలు వ్యాపించి సబ్ స్టేషన్ దగ్ధమైంది. ఉన్నఫళంగా గురువారం అర్ధరాత్రి జరిగిన ఈ ఘటనతో సబ్‌స్టేషన్‌లోని సిబ్బంది పరుగులు తీశారు. అధిక వేడికి తోడు విద్యుత్ సబ్ స్టేషన్‌లో ఊహించని ఘటనతో మంటలు వ్యాపించాయి. విలువైన పరికరాలు కాలిపోయాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది, ట్రాన్స్‌కో సిబ్బంది మంటలను అదుపుచేశారు. అధిక వేడి కారణంగానే ఈ ప్రమాదం జరిగిందని ట్రాన్స్‌కో అధికారులు తెలిపారు. ఎటువంటి ప్రాణనష్టం జరగలేదు.

# విజయవాడలోని ఓ హోటల్‌లో అగ్నిప్రమాదం

**విజయవాడ, మే 22 ప్రభాతవార్త ప్రతినిధి:** విజయవాడ సత్యనారాయణపురంలోని ఒక హోటల్‌లో అగ్నిప్రమాదం జరిగింది. దీంతో ఆ హోటల్ కస్టమర్లు పరుగులు తీస్తూ బయటకు వచ్చారు. సమీప ప్రాంత ప్రజలు భయాందోళనకు గురయ్యారు. ఈ పరిస్థితిపై స్థానికులు ఇచ్చిన అత్యవసర సమాచారంపై అగ్నిమాపక సిబ్బంది సకాలంలో స్పందించింది. హూటాహూటిన ఘటన స్థలానికి చేరుకుంది. మంటలను అదుపు చేసింది. హోటల్ లోపల ఉన్న గ్యాస్ సిలిండర్లు వెంటనే బయటకు తీయడంతో ప్రమాదం తప్పింది. దీంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.



## ఏపీఈపీడీసీఎల్‌కు ప్రతిష్టాత్మక
# గ్లోబల్ హెచ్ఆర్ ఎక్సలెన్స్ అవార్డు

విశాఖపట్నం, మే 22, ప్రభాతవార్త

ఉద్యోగుల శిక్షణ, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాల అమలులో విశేష కృషి చేస్తున్న ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఏపీఈపీడీసీఎల్)కు ప్రతిష్టాత్మక జాతీయ స్థాయి అవార్డు లభించింది. న్యూఢిల్లీలోని ఐటీసీ మౌర్య హోటల్‌లో శుక్రవారం నిర్వహించిన "ది గీఫ్ గ్లోబల్ హెచ్ఆర్ ఎక్సలెన్స్ అవార్డ్స్-2026" కార్యక్రమంలో విద్యుత్ పంపిణీ విభాగంలో "గ్లోబల్ బెస్ట్ లెర్నింగ్ అండ్ డెవలప్‌మెంట్ 8వ పేజీలో

## ముఖ్యమంత్రి సహాయనిధి
# నిరుపేదలకు ఒక వరం
### స్పీకర్ అయ్యన్నపాత్రుడు



నర్సీపట్నం, ప్రభాతవార్త

ఆపదలో ఉన్న పేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) కొండంత అండగా నిలుస్తోందని, ప్రజాసేవయే పరమావధిగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు పేర్కొన్నారు. శుక్రవారం నర్సీపట్నంలోని స్పీకర్ క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గానికి చెందిన పలువురు లబ్ధిదారులకు ఆయన చేతుల మీదుగా సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గ పరిధిలోని నాతవరం మండలానికి చెందిన నలుగురికి, గొలుగొండ మండలానికి చెందిన ఒకరికి, మాకవరపాలెం మండలానికి చెందిన ఐదుగురికి, నర్సీపట్నం రూరల్ పరిధిలో ఒకరికి, మున్సిపాలిటీ పరిధిలో ఇద్దరికి చొప్పున.. మొత్తం 13 మంది బాధితులకు రూ. 7,29,692 విలువైన చెక్కులను స్పీకర్ అందజేశారు. ఈ సందర్భంగా స్పీకర్ అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ.. అనారోగ్యం, ఆర్థిక ఇబ్బందులతో సతమతమయ్యే నిరుపేదలకు సీఎంఆర్ఎఫ్ ఒక వరంలా మారిందని కొనియాడారు. నర్సీపట్నం నియోజకవర్గంలో ఇప్పటివరకు 199 మంది లబ్ధిదారులకు సుమారు రూ. 1 కోటి 82 లక్షల 30 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని ఈ నిధి ద్వారా అందించగలిగామని వివరించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సహాయం అందేలా భవిష్యత్తులోనూ ప్రత్యేక చొరవ చూపుతానని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తాండవ ప్రాజెక్ట్ చైర్మన్ కరక సత్యనారాయణ, అనకాపల్లి పార్లమెంట్ అధికార ప్రతినిధి లాలం శ్రీ రంగం స్వామి, అడిగర్ల నాని బాబు, టీడీపీ మండల అధ్యక్షులు సుకల నాయుడు, నందిపల్లి వెంకటరమణ, ఆర్ వై పాత్రుడు, రావనపల్లి నీటి సంఘం ప్రెసిడెంట్ రాజేశ్వరరావు, పలువురు మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# భోగాపురం కొత్త ఎయిర్‌పోర్ట్ నుంచి

(ప్రభాతవార్త-విశాఖపట్నం)

విశాఖపట్నం ప్రయాణికులకు స్కూట్ ఎయిర్‌లైన్స్ కీలక ప్రకటన చేసింది. ప్రస్తుతం విశాఖకు నడుస్తున్న తమ విమాన సర్వీసులను ఈ ఏడాది జూలై 8 నుంచి భోగాపురం కొత్త విమానాశ్రయానికి మార్చనున్నట్లు వెల్లడిం చింది. ఇకపై స్కూట్ విమానాలు అల్లూరి సీతారామ రాజు ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టు టెర్మినల్-1 నుంచి రాకపోకలు నిర్వహించనున్నాయి. అయితే విమానాశ్రయ కోడ్‌లో ఎలాంటి మార్పు ఉండదని, ప్రస్తుతం ఉన్నట్టుగానే విటిజెడ్ కోడ్ కొనసాగుతుందని సంస్థ తెలిపింది. కొత్త ఎయిర్‌పోర్ట్ విశాఖ నగరానికి సుమారు 50 కిలోమీటర్ల దూరంలో ఉండనున్నట్లు పేర్కొంది. ప్రయాణికులు విమాన బయలుదేరే సమయానికి కనీసం రెండు గంటల ముందే ఎయిర్ పోర్ట్‌కు చేరుకోవాలని స్కూట్ సూచించింది. చెక్-ఇన్ కౌంటర్లు టెర్మినల్-1లో ఏర్పాటు చేయబడతాయని, విమానం బయలుదేరే సమయానికి రెండున్నర గంటల ముందే ప్రారంభమవుతాయని తెలిపింది. ఇప్పటికే టికెట్లు బుక్ చేసుకున్న ప్రయాణికులకు ఈ మార్పు సమాచారాన్ని తప్పనిసరిగా చేరవేయాలని ట్రావెల్ భాగస్వాములకు స్కూట్ ఎయిర్‌లైన్స్ సూచించింది.




# నగరాన్ని తాకిన వాన చినుకులు
### వడగాల్పుల నుంచి విశాఖ వాసులకు ఉపశమనం


9లో

## టిడ్కో ఇళ్లపై రాజకీయాలు కాదు..
# పేదలకు ఇళ్లు అందించడమే లక్ష్యం
### :విశాఖ ఎంపీ శ్రీభరత్ -పద్మనాభనగర్‌లో 96 మంది లబ్ధిదారులకు ఇంటి తాళాల అందజేత



విశాఖపట్నం, మే 22, ప్రభాతవార్త:

టిడ్కో ఇళ్ల విషయంలో రాజకీయ క్రెడిట్ కంటే పేదలకు త్వరగా ఇళ్లు అందించడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని విశాఖపట్నం పార్లమెంట్ సభ్యులు ఎం.శ్రీభరత్ స్పష్టం చేశారు. విశాఖ పశ్చిమ నియోజక వర్గంలోని పద్మనాభనగర్‌లో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో 96 మంది టిడ్కో లబ్ధిదారులకు ఆయన ఇంటి తాళాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే గణబాబు, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవి రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ శ్రీభరత్ మాట్లాడుతూ, గత ఐదేళ్లలో టిడ్కో ఇళ్ల పంపిణీ నిలిచిపోవడం వల్ల పేదలు ఇబ్బందులు పడ్డారని అన్నారు. ప్రస్తుతం ఇళ్లపై ఉన్న రంగులు వైఎస్సార్సీపీ పార్టీ రంగులేనని, రాజకీయ అభద్రతా భావం తమకు కూడా ఉంటే వాటిని మార్చేవారమని, కానీ ప్రజలకు ఇళ్లు అందించడమే తమ ప్రాధాన్యత అని వ్యాఖ్యానించారు. విశాఖ పశ్చిమ నియోజకవర్గంలో రూ.71.52 కోట్ల వ్యయంతో 816 ఇళ్లు నిర్మించగా, మిగిలిన బ్లాకుల పనులను కూడా త్వరలో పూర్తి చేసి మరో రెండు మూడు నెలల్లో లబ్ధిదారులకు తాళాలు అందజేస్తామని ఎమ్మెల్యే గణబాబు తెలిపారు. మౌలిక వసతులు పూర్తి చేసిన తర్వాతే ఇళ్లను అప్పగిస్తున్నామని ఎమ్మెల్సీ చిరంజీవిరావు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గృహనిర్మాణ శాఖ అధికారులు, కూటమి పార్టీల నేతలు, టిడ్కో లబ్ధిదారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# హోం గార్డులకు సమగ్ర ఆరోగ్య బీమా పథకం

విశాఖపట్నం, మే 22 ప్రభాతవార్త

హోం గార్డులకు సమగ్ర ఆరోగ్య బీమా పథకం ను ఏపి రాష్ట్ర హోం , విపత్తు నిర్వహణ శాఖా మంత్రి వంగలపూడి అనిత శుక్రవారం ప్రారంభించారు. విశాఖ నగర పోలీసు కమిషనరేట్ లో కార్యక్రమం నగర పోలీస్ కమిషనర్ డా.శంఖబ్రత బాగ్చి ఆధ్వర్యంలో, నగర పోలీస్ కమిషనేంట్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న హోం గార్డులు వారి కుటుంబ సభ్యుల ఆరోగ్య భద్రత కోసం దేశంలోనే తొలి వినూత్న సంక్షేమ కార్యక్రమంగా సమగ్ర ఆరోగ్య బీమా పథకాన్ని అమలు చేశారు. విధి నిర్వహణలో హోం గార్డులు అధిక ఒత్తిడి, ప్రమాదాలను ఎదుర్కొంటూ ప్రజల భద్రత కోసం రాత్రింబవళ్లు సేవలందిస్తున్నారు. అయితే తీవ్రమైన అనారోగ్య పరిస్థితుల్లో వారి కుటుంబాలు అధిక వైద్య ఖర్చులతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో, ఈ లోటును పూరించేందుకు విశాఖ నగర పోలీస్ శాఖ ప్రత్యేకంగా ఈ ఆరోగ్య బీమా పథకాన్ని రూపొందించింది. ఈ పథకం ద్వారా ప్రతి హోం గార్డ్ కుటుంబానికి రూ 3 లక్షల బేస్ పాలసీతో 8వ పేజీలో



పోలీసు శాఖకు ఎమర్జెన్సీ హ్యాండ్లిగ్ వాహనాలు ప్రారంభం : హోం మంత్రి అనిత

# కూటమి ప్రభుత్వంలో పాఠశాలలకు మహర్దశ..
### ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో అధిక శాతం ఉత్తీర్ణత మార్కులు సాధించిన విద్యార్థులు.. ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్


9లో

## 'గోవాడ' చెరకు రైతులకు
# తప్పని తిప్పలు!
### బిల్లుల కోసం రెండేళ్లుగా నిరీక్షణ -రూ.40 కోట్ల బకాయిలు చెల్లింపుపై ఆందోళన -ఎన్నికల హామీల్ని అమలు చేయని 'రాజా గోరు'

చోడవరం, మే 22, ప్రభాతవార్త

చెరకు పంట సాగు చేసే గోవాడ సహకార చక్కెర ఫ్యాక్టరీకి 2024-2025 సీజన్‌లో సరఫరా చేసిన రైతులకు చెల్లించాల్సిన బిల్లులు పడుతున్నాయి. ప్రస్తుతం రెండు లక్షల టన్నులకు పైగా చెరకు క్రషింగ్ 8వ పేజీలో



# పోలీస్ స్టేషన్లలో సీపీ ఆకస్మిక తనిఖీలు
### ద్వారకా, నాలుగవ పట్టణ పోలీస్ స్టేషన్‌లో క్షుణ్ణంగా కేసుల రికార్డుల పరిశీలన - ఇద్దరు సీఐలతో సమీక్ష


8లో

## సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో
# రిటైల్ క్రెడిట్ అవుట్‌రీచ్ ప్రోగ్రాం


9లో

## అండమాన్ స్ఫూర్తితో వైజాగ్ తీర సంరక్షణకు
# నడుం బిగించిన గీతం విద్యార్థి


8లో

## బంటుపల్లి పంచాయితీ సమస్యలపై ఎమ్మెల్యే, కలెక్టర్‌కు వినతి



ఆనందపురం, మే 22, ప్రభాతవార్త:

ఆనందపురం మండలంలోని బంటుపల్లి పంచాయితీలో సమస్యలపై శుక్రవారం ఆనంద పురంలో నిర్వహించిన ఒక నియోజకవర్గం, ఒక గ్రామం, నాలుగు సందర్శన కార్యక్రమంలో స్థానికులు సమస్యలు పరిస్కారం కోరుతూ వినతి పత్రం సమర్పించారు. ఈ ప్రజా వేదిక కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అభిషేక్త కిషోర్, భీమిలి శాసనసభ్యులు గంటా శ్రీనివాసరావు భీమిలి సబ్ డివిజనల్ అధికారి సంగీత్ మాధుర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వేములవలస పిఎసిఎస్ చైర్మన్ నాగరాజు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలు అందించారని అయితే అక్కడ కనీస మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయకపోవడంతో లబ్ధిదారులు ఇల్లు నిర్మించుకోలేకపోతున్నారని వివరించారు. పంచాయతీ పరిధిలో పలు సిమెంట్ రోడ్లు, మురుగునీటి కాలువలు మంచినీటి కొళాయిలు, వాటర్ ట్యాంక్, బీటీ రోడ్లు ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా ఆ వినతి పత్రంలో కోరారు.

## ఉపాధి కూలీలకు మజ్జిగ పంపిణి

ఆనందపురం, మే 22, ప్రభాతవార్త



ఆనందపురం మండలంలోని కణమాంలో శుక్రవారం ఉపాధి హామీ పథకం కూలీలకు టీడీపీ నాయకుడు చందవరపు కుమార్ మజ్జిగని పంపిణి చేశారు. సుమారు 150 మంది కూలీలకు మజ్జిగ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎండ వేడిమి తీవ్రంగా ఉన్న దృష్ట్యా కూలీలు వాడ దెబ్బ తగలకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో యర్ర రాము తదితరులు పాల్గొన్నారు.

## సమస్యలు పరిష్కారానికి ప్రజల వద్దకే అధికార యంత్రాంగం

### ఒక నెల - ఒక గ్రామం - 4 విజిట్స్ ఒక వినూత్న కార్యక్రమం

### ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు



ఆనందపురం, మే 22, ప్రభాతవార్త

గ్రామాల్లో రెవిన్యూ సహా ఇతర అంశాల పరిష్కారం లక్ష్యంగా "ఒక నెల – ఒక గ్రామం – 4 విజిట్స్" పేరుతో రాష్ట్ర ప్రభుత్వం వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. ఆనంద పురం మండల పరిషత్ సమావేశ మందిరంలో శుక్రవారం జరిగిన ఈ కార్యక్రమంలో మాట్లాడుతూ సాక్షాత్తు జిల్లా కలెక్టర్ సహా యావత్ యంత్రాంగం నెలలో 4 సార్లు ఒకే గ్రామాన్ని సందర్శిస్తే అనేక సమస్యలకు సమాధానం దొరుకుతుందని పేర్కొన్నారు. ఈ ప్రయత్నంతో వ్యక్తుల మధ్య వివాదాలు.. ప్రభుత్వంతో వివాదాలు.. సర్వే చేయని గ్రామాలు.. వంటి రెవెన్యూ సమస్యలు కొలిక్కి వచ్చి గ్రామాలు వివాదరహితమవుతాయని చెప్పారు. ప్రజల వద్దకు పాలన, జన్మభూమి పథకాల స్ఫూర్తితోనే సీఎం చంద్రబాబు నాయుడు ఈ కార్యక్రమాన్ని రూపొందించారని తెలిపారు. సాధారణ పౌరులు తమ సమస్యలు పరిస్కారం కోసం కలెక్టరేట్ కు వెళ్లి అక్కడ అనేక కార్యక్రమాలతో బిజీగా ఉండే జిల్లా కలెక్టర్ ను కలవడం కష్టసాధ్యమైన విషయమన్నారు. అలాంటి జిల్లా కలెక్టర్ తన యంత్రాంగంతో కలిసి రెవెన్యూ రికార్డులతో గ్రామానికి రావడమనేది కార్యక్రమంలో గొప్పతనమని వివరించారు. దీన్ని తన నియోజకవర్గం లోని ఆనందపురం గ్రామం నుంచి ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న "ఒక నెల – ఒక గ్రామం – 4 విజిట్స్" సేవలు ప్రజలందరూ వినియోగించుకుని విజయవంతం చేయాలని కోరారు. నియోజకవర్గం నుంచి వచ్చిన అనేకమంది ప్రజలు వివిధ సమస్యలకు పరిష్కారం కోరుతూ అందించిన అర్జీలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ కె. సంగీత్ మాధుర్, పీజీఆర్ఎస్ ప్రత్యేక అధికారి గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

## జలదార-జలహారతి ద్వారా చెరువులు అభివృద్ధి

ఆనందపురం, మే 22, ప్రభాతవార్త



జాతీయ ఉపాధి హామీ పథకం నిధులతో జలదార–జలహారతి పథకం ద్వారా జిల్లాలోని పలు చెరువులను అభివృద్ధి పరుస్తున్నామని జిల్లా నేటియాజమన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ సిహెచ్. నిర్మలా దేవి తెలిపారు. ఆమె శుక్రవారం కణమాం, సొంట్యాం గ్రామాలలోని అయ్యవారి చెరువు, పెద్దచెరువు, రామసాగరం పనులను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ పనులలో అవకతవకులు లేకుండా సక్రమంగా చెయ్యాలన్నారు. అధిక ఉష్ణోగ్రతలు వలన వడదెబ్బకు గురయ్యే అవకాశం ఉందని పనులను ఉదయం 5 గంటలకు ప్రారంభించి 10 గంటలు లోపు ముగించాలని సూచించారు. మజ్జిగ, మంచి నీరు వంటి వాటిని ఎక్కువగా తీసుకువాలని చెప్పారు. ఏపీడీ కె.ఆంజనేయులు పాల్గొన్నారు.

## జర్నలిస్టులకు ప్రభుత్వ సాయం అందించండి

### ఇజ్రాయిల్ కుటుంబానికి అండగా నిలవాలి -అనారోగ్యం బారిన పడిన పాత్రికేయులను పరామర్శించిన గంట్ల -ఆర్థిక సహాయం అందజేత -ముఖ్యమంత్రి సహాయ నిధికి లేఖ..



అక్కయ్యపాలెం, మే 22, ప్రభాతవార్త

సమాజం కోసం నిరంతరం పాటుపడుతూ అనారోగ్యం బారిన పడిన జర్నలిస్టులు, వారి కుటుంబ సభ్యులకు ప్రభుత్వం పెద్ద మనస్సుతో సహాయం అందించాలని జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి, ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ రాష్ట్ర నాయకులు గంట్ల శ్రీనుబాబు కోరారు. ఈ మేరకు అనారోగ్యం బారిన పడిన ఇద్దరు సీనియర్ జర్నలిస్టులను శుక్రవారం గంట్ల శ్రీనుబాబు పరామర్శించి ధైర్యం చెప్పారు. ఇదే సమయంలో వారి కుటుంబ సభ్యులతో కూడా మాట్లాడి తాము అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అలాగే ఇద్దరు పాత్రికేయులకు తన వంతు ఆర్థిక సహాయం అందజేశారు.

### ఇజ్రాయిల్ కుటుంబానికి అండగా నిలవాలి

సీనియర్ పాత్రికేయుడిగా సుదీర్ఘ కాలం పాటు పత్రికా రంగంలో సేవలందించిన ఇజ్రాయిల్ ఇటీవలే రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. దీంతో నడుము విరిగిపోగా కాలు, చేతులుకు కూడా బలమైన గాయాలయ్యాయి. దీంతో మూడుచోట్ల ఆపరేషన్‌లు జరిగాయి. ప్రస్తుతం నడవలేని స్థితిలో ఇంటివద్దనే ఉంటూ వైద్య సహాయం పొందుతున్నారు. అలాగే ఇజ్రాయిల్ కుమారుడు సువర్ణరాజ్ కూడా తీవ్ర అనారోగ్యం పాలయ్యారు. ప్రస్తుతం వారంలో మూడు రోజులు డయాలసిస్ చేసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. ఇజ్రాయిల్ భార్య కూడా అనారోగ్యం కారణంగా ఇంటికే పరిమితమయ్యారు. దీంతో ఒకే కుటుంబంలో ముగ్గురు అనారోగ్యం కారణంగా తీవ్ర ఇబ్బందులతో అల్లాడుతున్నారు. అయితే అటువంటి కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలవాల్సి ఉంది. మరో జర్నలిస్టు బి.సూరిబాబు తాజాగా రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. ప్రస్తుతం వైద్య చికిత్స పొందుతున్నాడు.

### ముఖ్యమంత్రి సహాయ నిధికి లేఖ..

అనారోగ్యం బారిన పడిన సీనియర్ జర్నలిస్టు ఇజ్రాయిల్ కుటుంబాన్ని ఆదుకోవాలని రాష్ట్ర ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడుకు లేఖ రాయనున్నట్లు గంట్ల శ్రీనుబాబు తెలిపారు. అలాగే ముఖ్యమంత్రి సహాయ నిధి కింద వైద్య ఖర్చుల నిమిత్తం నిధులు కేటాయించాలని కూడా ఆ లేఖలో కోరనున్నట్లు చెప్పారు. ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు అనారోగ్యం బారిన పడడం, ఆపై ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న జర్నలిస్టు ఇజ్రాయిల్ కుటుంబాన్ని ఆదుకోవడానికి ముఖ్యమంత్రి తప్పకుండా సహాయం అందించే అవకాశం ఉందని గంట్ల శ్రీనుబాబు ఆశాభావం వ్యక్తం చేశారు. జర్నలిస్టులకు ఆర్థిక భరోసా కల్పించే విధంగా ప్రభుత్వం తగిన చర్యలు చేపట్టాల్సి ఉందన్నారు. లేని పక్షంలో పేదరికం కారణంగా చాలీచాలని వేతనాలుతో చాలా మంది జర్నలిస్టులు రోడ్డున పడే అవకాశం ఉందన్నారు.

## పోలీస్ స్టేషన్లలో సీపీ ఆకస్మిక తనిఖీలు

విశాఖపట్నం మే22 ప్రభాతవార్త

విశాఖ పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చి శుక్రవారం ద్వారకా , నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్లను ఆకస్మికంగా తనిఖీలు చేశారు. శుక్రవారం ద్వారకా , ఫోర్త్ నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్లను సందర్శించి అధికారుల పనితీరును సమీక్షించారు. పోలీస్ స్టేషన్ పరిసరాల పరిశుభ్రత, మరుగుదొడ్ల నిర్వహణను ప్రత్యేకంగా తనిఖీ చేసి శుభ్రత విషయంలో నిర్లక్ష్యం లేకుండా చూడాలని సూచించారు. స్టేషన్ పరిశుభ్రంగా ఉంచుకోవాలని సీఐలకు ఆదేశించారు. శాంతి భద్రతలను కట్టుదిట్టంగా కొనసాగించేందుకు క్రైమ్,లా అండ్ ఆర్డర్ పోలీస్ స్టేషన్లు, ఏసీపీ సబ్ డివిజన్లలో ఇటీవల కాలంలో సీపీ ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఈ సందర్భంగా స్టేషన్ పరిధిలో ఉన్న సమస్యలు, పెండింగ్ కేసులు, కేసుల రికార్డుల నిర్వహణ, స్టేషన్ పరిపాలన తదితర అంశాలను సీపీ పరిశీలించారు. స్టేషన్‌లలో రికార్డులు సక్రమంగా నిర్వహిస్తున్నారా లేదా అన్నదానిపై అధికారులను ప్రశ్నించి తగిన ఆదేశాలు జారీ చేశారు. అదేవిధంగా పోలీస్ స్టేషన్ పరిసరాల పరిశుభ్రత, మరుగుదొడ్ల నిర్వహణను ప్రత్యేకంగా తనిఖీ చేసి శుభ్రత విషయంలో నిర్లక్ష్యం లేకుండా చూడాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. విధుల్లో క్రమశిక్షణతో పనిచేస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని,వచ్చే ఫిర్యాదులు మర్యాదగా స్వీకరించి బాధితులకి న్యాయం జరిగేలా చూడాలని చెప్పారు.ప్రతి ఒక్కరూ తో ఫ్రెండ్లి పోలీసింగ్ ఉండాలని తెలిపారు.

## ఏపీఈపీడీసీఎల్‌కు ప్రతిష్టాత్మక

7వ పేజీ తరువాయి ..

స్ట్రాటజీ ఆఫ్ ది ఇయర్–2026" విభాగంలో ఏపీఈపీడీసీఎల్ ఈ ప్రతిష్టాత్మక అవార్డును సాధించినట్లు సంస్థ సీఎండి ఇమ్మడి పృథ్వీతేజ్ తెలిపారు. ఈ అవార్డును సంస్థ తరపున ప్రాజెక్ట్స్, ఐటీ అండ్ హెచ్ఆర్డీ డైరెక్టర్ టి.వనజ, సీజీఎం (హెచ్ఆర్డీ) డి.సుమన్ కళ్యాణి అందుకున్నారు. ఈ అవార్డును నీతి ఆయోగ్ శాశ్వత సభ్యులు డాక్టర్ విజయ్ కుమార్ సరస్వత్ చేతుల మీదుగా స్వీకరించారు. ఈ సందర్భంగా ఏపీఈపీడీసీఎల్ సీఎండి ఇమ్మడి పృథ్వీతేజ్ మాట్లాడుతూ, ఉద్యోగుల నైపుణ్యాభివృద్ధి, శిక్షణా కార్యక్రమాల అమలుకు సంస్థ ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ప్రతి ఉద్యోగికి సంవత్సరంలో కనీసం మూడు రోజుల పాటు శిక్షణ అందించే విధంగా చర్యలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఉద్యోగులకు నిరంతర శిక్షణా కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా సేవల నాణ్యతను మరింత మెరుగుపరుస్తూ వినియోగదారులకు నాణ్యమైన, విశిష్ట సేవలు అందించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఇదే స్ఫూర్తితో ఉద్యోగుల నైపుణ్యాభివృద్ధికి మరింత ప్రాధాన్యత ఇస్తూ వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సేవలు అందించేందుకు సంస్థ కృషిని కొనసాగిస్తోందని తెలిపారు.

## 'గోవాడ' చెరకు రైతులకు ..

7వ పేజీ తరువాయి ..

జరిగినప్పటికీ, రైతులకు గానుగ ఆదాయం అందకపోవడం ఆందోళన కలిగిస్తోంది. 2024–2025 సీజన్‌లో కేవలం ఒక లక్ష ఎడు వేల టన్నుల చెరకు మాత్రమే గానుగ ఆడటం జరిగిందని సమాచారం. అప్పటికే ఫ్యాక్టరీలో ఉన్న పాత యంత్రాలతోనే క్రషింగ్ పని చేసిన కారణంగా పలుమార్లు ఫ్యాక్టరీ చక్రాలు మధ్యలోనే నిలిచిపోయిన పరిస్థితులు నెలకొన్నాయి. క్రషింగ్ సీజన్ పూర్తై మూడు నెలలు గడుస్తున్నా రెండేళ్లుగా చెరకు సరఫరా చేసిన సమయానికి ఇవ్వాల్సిన గానుగ రైతులకు సుమారు రూ.40 కోట్ల మేర బకాయిలు చెల్లించకపోవడం విమర్శలకు తావిస్తోంది. ప్రస్తుతం చెరకు పేమెంట్లకు రైతులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు.

### ఏపీ హామీలు అమలు

గోవాడ నగర ఫ్యాక్టరీ ప్రభుత్వ పరంగా అన్ని విధాలుగా ఆదుకుని, ఈ ప్రాంతంలో ఉన్న ఏకైక పరిశ్రమను కాపాడుతామని ఎన్నికల సమయంలో నేతలు హామీలు ఇచ్చారు. ముఖ్యంగా అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్, చోడవరం ఎమ్మెల్యే కేఎస్ఎన్ రాజు ఇచ్చిన హామీలు ఇప్పటికీ అమలు కాలేదని రైతులు ఆరోపిస్తున్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ఫ్యాక్టరీ మూతపడకుండా రైతులు అహర్నిశలు శ్రమ చేస్తున్నప్పటికీ, చెరకు రైతుల బకాయిల చెల్లింపులపై ప్రభుత్వ స్పందన లేకపోవడం ఆగ్రహానికి దారితీస్తోంది. ఫ్యాక్టరీలో ఉన్న పాత యంత్రాల కారణంగా చెరకు క్రషింగ్‌కు అంతరాయం ఏర్పడిందని, దీంతో రైతులకు నష్టం వాటిల్లిందని పేర్కొంటున్నారు. గత ఏడాది మిల్లింగ్ సీజన్ ప్రారంభంలో రూ.300 కోట్లతో డిస్టిలరీ ప్లాంట్ ఏర్పాటు చేసి సీఎం చంద్రబాబు ప్రారంభించనున్నట్లు గోవాడ ఎమ్మెల్యే కేఎస్ఎన్ రాజు ప్రకటించినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి పురోగతి కనిపించలేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రస్తుతం ఫ్యాక్టరీలో చెరకు సరఫరా చేసిన రైతులకు పేమెంట్లు చెల్లించాలని, ఫ్యాక్టరీ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

## అండమాన్ స్ఫూర్తితో వైజాగ్ తీర సంరక్షణకు ...

విశాఖపట్నం, మే 22, ప్రభాతవార్త

ఆస్ట్రేలియాలోని టాస్మేనియా విశ్వవిద్యాలయంలో ఉన్నత చదువులు చదువుకుచే సువర్ణావకాశం ముంగిట నిలిచినా, కళ్ళెదుటే కలుషితమవుతున్న స్వదేశీ సముద్ర తీరాల ఆర్తనాదాలను విని ఆ అవకాశాన్ని వదులుకున్నారు ఒక గీతం విద్యార్థి. ప్లాస్టిక్ వ్యర్థాలతో ఊపిరాడక కొట్టుమిట్టాడుతున్న బంగాళాఖాతాన్ని రక్షించేందుకు తన వంతు సహాయంగా, పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో బిఎస్సీ ఎన్విరాన్‌మెంటల్ సైన్సెస్ కోర్సు అభ్యసిస్తున్న పి.సిద్ధార్ధ పట్టుదలతో స్కూబా డైవింగ్ లో శిక్షణ పొంది సముద్ర గర్భంలో విశాఖ తీరం వెంట పేరుకుపోతున్న ప్లాస్టిక్ వ్యర్థాలను వెలికి తీయడంలో కృషి చేస్తున్నాడు. గతంలో అండమాన్ నికోబార్ దీవులలో స్నార్కెలింగ్ చేస్తున్నప్పుడు సముద్ర గర్భంలోని అద్భుత జీవజాలం, ప్రకృతితో ఏర్పడిన విడదీయరాని బంధం తన ఆలోచనలను పూర్తిగా మార్చేసిందని, ఆ తరువాత వైజాగ్ బస్ స్టాప్‌లో మాజీ టెడెక్స్ స్పీకర్, ప్రముఖ స్కూబా డైవర్ సుభాష్ చంద్రన్ (మలయాళీ మెర్మెన్) తో జరిగిన యాదృచ్ఛిక పరిచయం ఈ ప్రయాణాన్ని మరింత ముందుకు నడిపించిందని, ఆయన మార్గదర్శకత్వంలో స్కూబా డైవింగ్ నేర్చుకున్నానని సిద్దార్థ తెలిపారు. విశాఖ సముద్రతీరంలోని దయనీయ స్థితి ముఖ్యంగా ప్లాస్టిక్ వ్యర్థాలు, శుద్ధి చేయని డ్రైనేజీ నీరు, చనిపోతున్న పగడపు దిబ్బలు తనను తీవ్రంగా కలచి వేశాయని తెలిపారు. ప్రముఖ స్కూబా డైవర్ సుభాష్ చంద్రన్ నిర్వహిస్తున్న ప్లాటిపస్ ఎస్కేప్స్ మరియు దాని పర్యావరణ విభాగమైన "ప్లాటిపస్ ఫౌండేషన" లో కీలక సభ్యునిగా కొనసాగుతూ స్వయంగా స్కూబా డైవింగ్ చేస్తూ సముద్ర గర్భంలో పేరుకుపోయిన ప్లాస్టిక్ సీసాలు, ప్రాణాంతకమైన పాత చేపల వలలను తొలగిస్తున్నామని వెల్లడించాడు. కేవలం వ్యర్థాలను తొలిగించడమే కాకుండా పర్యావరణ మార్పులపై అవగాహన కల్పిస్తున్న సిద్దార్ధ ఇటీవల ప్రతిష్టాత్మక 14వ ఐకాన్ స్విమ్స్ కాన్ఫరెన్స్‌లో తన పరిశోధనా పత్రాన్ని సమర్పించారు. తీర ప్రాంత క్షీణత వల్ల నష్టపోతున్న స్థానిక మత్స్యకార కుటుంబాలతో నిరంతరం చర్చిస్తూ వారి జీవనోపాధిని, తీరప్రాంత పర్యావరణాన్ని రక్షించడానికి ప్రణాళికలను రూపొందిస్తున్నారు. యువతను ఏకం చేస్తూ క్యాంపస్ విద్యార్థులలో పర్యావరణ స్పృహను పెంచడానికి గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో గ్రీన్ పోయెట్స్ సొసైటీ ని స్థాపించారు. ఒక చిన్న ఆలోచనతో మొదలైన ఈ గ్రూప్‌లో ప్రస్తుతం లా, ఫార్మసీ, మేనేజ్‌మెంట్ వంటి వివిధ విభాగాలకు చెందిన 30 మందికి పైగా విద్యార్థులు చురుగ్గా పాల్గొంటున్నారు. అలాగే గీతం ప్రొఫెసర్ హరీష్ ప్రకాష్ వంటి అధ్యాపకుల మార్గదర్శకత్వంలో గ్రేట్ బ్యాక్‌యార్డ్ కౌంట్ లో భాగంగా గీతం క్యాంపస్‌లో "ఇండియన్ గ్రేహర్నబిల" వాటర్ హెన్ తో సహా 43 రకాల పక్షి జాతులను గుర్తించి, క్యాంపస్ ఒక అద్భుతమైన పర్యావరణ ఆశ్రయమని నిరూపించారు. అంతర్జాతీయ భాగస్వామ్యం :ఎఐఈఎసఈసి మరియు ప్లాటిపస్ ఫౌండేషన్ మధ్య ఒక ఒప్పందాన్ని కుదుర్చి అంతర్జాతీయ ఇంటర్న్‌షిప్ పైప్‌లైన్‌ను ఏర్పాటు చేశారు. దీని ద్వారా గ్లోబల్ టాలెంట్‌ను వైజాగ్ సముద్ర సంరక్షణ కార్యక్రమంలో భాగస్వాములను చేస్తున్నారు. మేము సముద్రంలో ఒక చిన్న నీటి చుక్క లాంటి వాళ్లమే కావచ్చు కానీ మా అధ్యాపకులు, మత్స్యకార సోదరులు మరియు గ్రీన్ పోయేట్స్ సొసైటీ లోని 30 మంది విద్యార్థులం కలిస్తే మా మాతృభూమిని, సముద్రాలను కాపాడుకునే ఒక గొప్ప సైన్యంగా మారుతాం అని సిద్దార్ధ నమ్మకంగా చెబుతున్నారు.

## హోం గార్డులకు సమగ్ర ఆరోగ్య బీమా పథకం

7వ పేజీ తరువాయి ..

పాటు రూ 30 లక్షల టాప్–అప్ కవరేజ్ అదనంగా రూ 3 లక్షల కాంప్లిమెంటరీ కవరేజ్ కల్పించబడుతోంది. మొత్తం రూ 33 లక్షల వరకు ఆరోగ్య బీమా సౌకర్యం అందించబడుతుంది. విశాఖ నగర పోలీస్ శాఖలో సేవలందిస్తున్న అన్ని హోం గార్డులు ఈ పథకానికి అర్హులు. భార్య లేదా భర్తతో పాటు ఇద్దరు పిల్లలకు కూడా బీమా రక్షణ వర్తిస్తుంది. ఒక్క కుటుంబానికి సంవత్సరానికి గరిష్టంగా రూ 10,264 ప్రీమియం ఉండగా, మొదటి సంవత్సరానికి సంబంధించిన ప్రీమియాన్ని పోలీస్ సంక్షేమ నిధి ద్వారా చెల్లించడం జరిగింది. ఈ పథకం ద్వారా మొత్తం 975 కుటుంబాలకు బీమా కల్పించబడగా, సుమారు 3,144 మంది లబ్ధి పొందనున్నారు. ఇందుకోసం సంక్షేమ నిధి నుండి రూ 87,97,809 వెచ్చించారు. ఈ కార్యక్రమం ద్వారా హోం గార్డ్ కుటుంబాలకు ఆర్థిక భద్రత కల్పించబడటంతో పాటు, మానసిక ఒత్తిడి తగ్గి విధి నిర్వహణలో మరింత ఉత్సాహం పెరుగుతుంది, అదేవిధంగా వైద్య ఖర్చుల కారణంగా అప్పుల పాలయ్యే ప్రమాదం కూడా తగ్గనుంది. ఈ పథకానికి సంబంధించి 24 గంటల ప్రత్యేక హెల్ప్‌లైన్, నగదురహిత చికిత్స సదుపాయం, ఆరోగ్య కార్డుల డేటాబేస్ నిర్వహణ, బీమా సంస్థలు ఆసుపత్రులతో సమన్వయం వంటి ప్రత్యేక సేవలు అందుబాటులో ఉంచబడినాయి.ప్రత్యేక హెల్ప్‌లైన్ నంబర్: 7995093606, ఈ –మెయిల్: హెల్త్ 4పోలీస్ ఎట్ ద రేట్ ఆఫ్ జీమెయిల్ ఈ కార్యక్రమం నందు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హోం, విపత్తు నిర్వహణ శాఖా మంత్రివర్యులు వంగలపూడి అనిత చేతుల మీదుగా హోం గార్డులు వారి కుటుంబ సభ్యులకు ఆరోగ్య బీమా పాలసీ పట్టాలను అందజేశారు.ఈ కార్యక్రమం లో సీపీ తో పాటుగా నగర పోలీసు ఉన్నతాధికారులు, హోం గార్డు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. అదే విధముగా దివీస్ యాజమాన్యం (సి ఎస్ ఆర్) కార్పోరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీలో భాగంగా విశాఖ నగర పోలీసు శాఖకు ఎమర్జెన్సీ హ్యాండ్లిగ్ నిమిత్తం రూపాయలు 19, 92,130/– విలువ గల రెండు ఎల్.ఎం.వి ( బోలేరో నియో ) వాహనాలను శుక్రవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హోం విపత్తు నిర్వహణ శాఖా మంత్రి వంగలపూడి అనిత చేతుల మీదుగా నగర పోలీసు శాఖకు అందజేశారు.

## వ్యర్థాల వేరు చేసి అందించడం ద్వారా పరిశుభ్రమైన నగర నిర్మాణం సాధ్యం

### - జీవీఎంసీ అడిషనల్ కమిషనర్ ఎస్.ఎస్.వర్మ

### పశ్చిమ జోన్ వార్డు నెం.91లో ఇంటింటా వ్యర్థాల విభజనపై అవగాహన కార్యక్రమం -తడి, పొడి వ్యర్థాలను వేర్వేరుగా అందించడం ప్రతి పౌరుడి బాధ్యత

విశాఖపట్నం, మే 22, ప్రభాతవార్త

గృహ స్థాయిలోనే తడి, పొడి వ్యర్థాలను వేర్వేరుగా విభజించి అందించడం ద్వారా పరిశుభ్రమైన ,సుస్థిరమైన నగర నిర్మాణానికి ప్రతి పౌరుడు భాగస్వామి కావాలని జీవీఎంసీ అడిషనల్ కమిషనర్ ఎస్.ఎస్. వర్మ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన పశ్చిమ జోన్ జోనల్ కమిషనర్ బి.హేమావతి తో కలసి పశ్చిమ జోన్ పరిధిలో స్వచ్ఛత, వ్యర్థాల శాస్త్రీయ నిర్వహణపై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు వార్డు నెం.91, పాత గోపాలపట్నం ప్రాంతంలో ఇంటింటా వ్యర్థాల విభజనపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన అధికారులతో కలసి ఇంటింటికీ వెళ్లి ప్రజలకు మూలస్థాయిలోనే వ్యర్థాల విభజన ప్రాముఖ్యతను వివరించారు. తడి వ్యర్థాలు, పొడి వ్యర్థాలను వేర్వేరుగా సేకరించి అందించడం వలన పర్యావరణ పరిరక్షణకు తోడ్పడటమే కాకుండా వ్యర్థాల నిర్వహణ సులభతరం అవుతుందని తెలిపారు. అలాగే పరిశుభ్రమైన పరిసరాలు, సుస్థిర పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి కుటుంబం వ్యర్థాలను విభజించి పారిశుద్ధ్య కార్మికులకు నిత్యం అందించాలని కోరారు. స్వచ్ఛతను ప్రతి ఒక్కరూ తమ బాధ్యతగా భావించి జీవన విధానంలో భాగం చేసుకోవాలని , జరుగనున్న స్వచ్ఛ సర్వేక్షన్ 2025 –26 లో దేశంలోనే విశాఖ నగరం పరిశుభ్ర నగర ఖ్యాతిలో ఉత్తమ స్థానం పొందేందుకు ప్రజలు విశాఖ నగర అభివృద్ధికి సహకారం అందించాలని అదనపు కమిషనర్ ప్రజలకు సూచించారు . ఈ కార్యక్రమంలో ఏఎంహెచ్ఓ, శానిటరీ ఇన్స్పెక్టర్, వార్డు శానిటేషన్ కార్యదర్శులు.,స్థానిక ప్రజలు , ఇతర జీవీఎంసీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## అయినాడలో నిధులు లేక అసంపూర్తిగా నిలిచిపోయిన భవనాలను పూర్తి చేయాలి

పద్మనాభం, మే 22, ప్రభాతవార్త



మండలంలో అయినాడ గ్రామంలో నిధులు లేక అసంపూర్తిగా నిలిచిపోయిన రైతు భరోసా, ఆరోగ్య కేంద్ర భవనాలను పూర్తి చేయాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు. గత ప్రభుత్వ హయామాలో లక్షలాది రూపాయల వ్యయంతో సచివాలయం వద్ద నిర్మాణం చేపట్టారు. నాలుగు సంవత్సరాల నుండి ఈ భవనాలు అసంపూర్తిగా నిలిచిపోయాయి.అప్పటి నుండి ప్రస్తుత పాలకులు ఈ భవనాలు ఊసెత్తలేదని ప్రజలు వాపోయారు. దీంతో వ్యవసాయ, ఆరోగ్య శాఖ అధికారులు విధులు నిర్వాహణకు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ఈ భవనాలను పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

## జివిఎంసి టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరమ్‌కు 16 వినతులు



విశాఖపట్నం మే 22, ప్రభాతవార్త

మహా విశాఖపట్నం నగరపాలక సంస్థ టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరమ్ కార్యక్రమంలో 16 వినతులు స్వీకరించడమైనదని జీవీఎంసీ చీఫ్ సిటీ ప్లానరు ఎ.ప్రభాకారరావు తెలిపారు. శుక్రవారం ఆయన జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో గల తన ఛాంబర్ లో డీసీపీలు, ఏసీపీలతో కలిసి ప్రత్యేకంగా టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరమ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. శుక్రవారం టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరమ్ కార్యక్రమానికి సంబంధించి 16 వినతులు స్వీకరించడం జరిగినదని, అందులో ముఖ్యంగా మధురవాడ జోన్ కు 02, ఈస్ట్ జోన్ కు 03, సౌత్ జోన్ కు 03, నార్త్ జోన్ కు 02, వెస్ట్ జోన్ కు 02, అనకాపల్లి జోన్ కు 04 వినతులు వచ్చాయని తెలిపారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయం ప్రాంగణంలో ఒక వినతి పత్రాన్ని ఒక దివ్యాంగుని వద్దకు వెళ్ళి స్వయంగా స్వీకరించడమైనదని తెలిపారు. స్వీకరించిన వినతులను /ఫిర్యాదులను నిర్ణీత సమయంలో టౌన్ ప్లానింగు అధికారులు వెంటనే స్పందించి పరిష్కరించాలని ఆదేశించడమైనదని సీసీపీ ప్రభాకర్ వివరించారు. పట్టణ ప్రణాళికా విభాగమునకు సంబంధించి ఫిర్యాదులు, అర్జీలు మొదలైనవి ప్రతి శుక్రవారం టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరం కార్యక్రమంలో ప్రజలు నమోదు చేసుకోవచ్చునని తెలిపారు.


వార్త VAARTHA CLASSIFIEDS — CLASSIFIEDS

CHANGE OF NAME

★ I, KONA VENKATA LAKSHMI W/O KONA SIMHACHALAM, previously called MOLLI VENKATA LAKSHMI R/O 19-7-17, MUSALI NAIDU PALEM, BC ROAD, PEDAGANTYADA, VISAKHAPATNAM, now changed my name from MOLLI VENKATA LAKSHMI to KONA VENKATA LAKSHMI. Hence forth I will be called as KONA VENKATA LAKSHMI for all purposes.
(Ro.No.7348)

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగినరీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో "వార్త" దినపత్రికకు ఏ విధమైన సంబంధం లేదు.

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
రీజనల్ ఆఫీస్, విజయనగరం, 2వ అంతస్తు, లలిత టవర్స్, కలెక్టరేట్ జంక్షన్ దగ్గర, పవర్‌హౌస్ ఎదురుగా, ఎస్.కోట రోడ్డు, విజయనగరం-535003.

బంగారు నగల వేలం ప్రకటన

ఈ క్రింద ఉదహరించిన ఖాతాదారు మా బ్యాంకు నందు బంగారు నగలు తనఖా పెట్టి అప్పు తీసుకున్నారు. రిజిష్టర్ పోస్ట్ ద్వారా ఋణగ్రహీతలకు పంపిన నోటీసు వారి తీసుకోని కారణంగా బ్యాంకు వారికి తిరిగి వచ్చినవి. తేది.29-05-2026 లోపు వారు తమ బకాయిలను తిరిగి చెల్లించి తాకట్టు పెట్టిన బంగారు ఆభరణములను విడిపించుకొనవలసినదిగా కోరడమైనది. లేనిచో తేది.30-05-2026, మ॥ 12.00 గం॥ల నుండి యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, దిగువ తెలిపిన బ్రాంచ్ ఆవరణలో బహిరంగ వేలం వేయబడును. వేలము వేయగా వచ్చిన సొమ్ముతో సదరు అకౌంటు పూర్తిగా చెల్లుబాటు కాని యెడల వారిపై చట్టరీత్యా తగు చర్యలు తీసుకొని మిగిలిన బకాయి వసూలు చేయబడును. ఈ దిగువ ఖాతాదారులు ఎవరైనా మరణించి యున్నచో వారి వారసులకు ఈ నోటీసు వర్తిస్తుంది. అప్పు నోటీసులు అందని వారికి మరియు నోటీసులను తిరస్కరించిన వారికి పత్రికా ముఖమున చివరిసారిగా ఈ నోటీసు ద్వారా తెలియజేయడమైనది.

| క్ర.సం | బ్రాంచ్ పేరు | ఋణగ్రహీత పేరు & చిరునామా | ఖాతా నెం. | లోన్ యొక్క తేది |
|---|---|---|---|---|
| 1 | తామరం ఫోన్: 94918 06165 | శ్రీ గొలుగూరి వెంకట రామ రెడ్డి, తండ్రి: లేటు జి వి రెడ్డి, హెచ్ నెం.8-75, కొత్తవీధి, పాకవరపాలెం గ్రామం & మండలం, ఆం.ప్ర-531113. | 255716540005724 | 24-12-2024 |
| | | | 255716540005756 | 18-01-2025 |

నియమ నిబంధనలు: (1) వేలంలో పాడిన సొమ్మును అంగీకరించుటకు లేక తిరస్కరించుటకు బ్యాంకు వారికి పూర్తి అధికారం కలదు. (2) ఏ స్థితిలోనైనా వేలం రద్దు చేయుటకు గాని, నిలుపుదల చేయుటకు గాని, నియమ నిబంధనలు మార్చుటకు గాని బ్యాంకు వారికి పూర్తి అధికారం కలదు. 3) వేలంలో పాల్గొనే ప్రతి బిడ్డరు మొత్తము విలువలో కనీసం 25% లేదా రూ.5,000/- (అక్షరాల ఐదు వేల రూపాయలు మాత్రమే) బిడ్ ధరావత్తు చెల్లించవలెను.

తేది : 22.05.2026 సం/- బ్రాంచ్ మేనేజర్
స్థలం: విజయనగరం యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
పూల్‌భాగ్ బ్రాంచ్, డోర్ నెం.21-13-9/3, పూల్‌భాగ్ రోడ్డు, విజయనగరం-535003. ఫోన్ : 08922-251106.
ఇ-మెయిల్ : ubin0825310@unionbankofindia.bank

స్థిరాస్తుల అమ్మకం కొరకు అమ్మకం ప్రకటన

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002లో రూలు 8 (6) ప్రొవిజన్‌తో చదివే సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం. 2002 ప్రకారం స్థిరాస్తుల ఇ-వేలం అమ్మకం ప్రకటన.

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, పూల్‌భాగ్ బ్రాంచ్ వారికి తనఖా పెట్టిన / ఛార్జ్ చేసిన, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అధీకృత అధికారిచే లాంఛనాత్మకంగా స్వాధీనం చేసుకున్న దిగువ తెలిపిన స్థిరాస్తులు దిగువ వివరించిన ఋణగ్రహీత(లు)/ హామీదారు(లు) నుండి యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, పూల్‌భాగ్ బ్రాంచ్‌కు రావల్సిన బకాయి దానిపై తదుపరి వడ్డీ మరియు ఛార్జీలు. వ్యయాలతో కలిపి మొత్తమును రాబట్టుకొనుటకు "ఎక్కడ ఎలా ఉన్నదో అలాగే" "అక్కడ ఏమి ఉన్నదో అదే" మరియు "అక్కడ ఏది ఉన్నా" పద్ధతిలో తేది. 24-06-2026న విక్రయించబడుతుందని ముఖ్యంగా దిగువ వివరించిన ఋణగ్రహీత (లు) మరియు హామీదారు(లు)కు మరియు సాధారణ ప్రజానీకానికి ఇందుమూలంగా నోటీసు జారీచేస్తూ తెలియజేయడమైనది.

ఇ-వేలం తేది & సమయం: 24-06-2026, మ॥ 12.00 గం.ల నుండి సా॥ 5.00 గం.ల వరకు
(అమ్మకం ముగిసేవరకు ప్రతి 10 నిమిషముల వ్యవధిలో అపరిమిత పొడిగింపుతో)
ధరావత్తును సమర్పించుటకు ఆఖరి తేది: వేలం ప్రక్రియలో పాల్గొనే ముందుగా ధరావత్తును డిపాజిట్ చేయాలి

ఋణగ్రహీత : 1) శ్రీ గుర్రాల శ్రీనివాసరావు, S/o. జి వెంకటేశ్వరరావు, డోర్ నెం. 53-33-1, కె ఆర్ ఎం కాలనీ, సీతమ్మధార, విశాఖపట్నం(అర్బన్), విశాఖపట్నం, ఆం.ప్ర.-530013. 2) శ్రీ గుర్రాల వెంకటేశ్వరరావు, S/o. జి లక్ష్మయ్య, డోర్ నెం. 53-33-1, కె ఆర్ ఎం కాలనీ, సీతమ్మధార, విశాఖపట్నం (అర్బన్), విశాఖపట్నం, ఆం.ప్ర.-530013.

బకాయి మొత్తం: తేది.18-05-2026 నాటికి రూ. 26,13,974.59/- (అక్షరాల ఇరవై ఆరు లక్షల పదమూడు వేల తొమ్మిది వందల డెబ్బై నాలుగు రూపాయల యాభై తొమ్మిది పైసలు మాత్రమే) + తదుపరి వడ్డీ, ఖర్చులు మరియు ఇతర ఛార్జీలు.

అమ్మకానికి పెట్టిన సెక్యూర్డ్ స్థిరాస్తి వివరములు

షెడ్యూల్-ఎ : విజయనగరం జిల్లా, విజయనగరం యస్ఆర్ఓ, విజయనగరం మున్సిపాలిటీ, బిట్-2 పూల్‌భాగ్ రోడ్ అనగా విజయనగరం-పాలకొండ రోడ్డు కు పడమరవైపు, డోర్ నెం.12-15-1 లైన్, సర్వే నెం. 167 భాగంలో 2348 చ॥గ॥ల విస్తీర్ణంలో ఖాళీ స్థలం. హద్దులు: తూర్పు: సీర కన్నంనాయుడు యొక్క ఆస్తి, దక్షిణం: రహదారి, పడమర: సీర గణపతి నాయుడు యొక్క ఆస్తి, ఉత్తరం: 40 అ॥ల రోడ్డు. మొత్తం 2348 చ॥గ॥లలో అవిభాజ్యపు మరియు అనిర్దేశ్యపు వాటా 31 చ॥గ॥లు.

షెడ్యూలు-బి: పైన తెలిపిన షెడ్యూల్-ఎ లో నిర్మించిన సాయికృపా ఎన్‌క్లేవ్ పేరు గల బిల్డింగ్ నందు స్టిల్ట్ ఫ్లోర్‌లో 80 చ॥అ॥ల కారు పార్కింగ్ మరియు నాల్గవ అంతస్తులో ప్లింత్ ఏరియా 960 చ॥అ॥ల (ఉమ్మడి ఏరియా కలుపుకొని) తో ఆర్‌సిసి స్లాబ్ రెసిడెన్షియల్ ఫ్లాట్ నెం.FF-7 కలదు. హద్దులు: తూర్పు: ఉమ్మడి వరండా, దక్షిణం: శూన్యాకాశం, పడమర: ఉమ్మడి వరండా, ఉత్తరం: ఫ్లాట్ నెం.FF-8.

రిజర్వు ధర: రూ. 14,00,000/- ధరావత్తు: రూ. 1,40,000/- బిడ్ పెంపుదల: రూ. 14,000/-

బ్యాంకుకు తెలిసిన ఏమైనా తాకట్టు ఋణభారములు: లేవు
బిడ్‌ను సమర్పించే ముందు మరియు ఇ-వేలం అమ్మకపు ప్రక్రియలలో పాల్గొనే ముందు, వేలం అమ్మకానికి సంబంధించిన వివరణాత్మక నిబంధనలు మరియు షరతుల కోసం సర్వీస్ ప్రొవైడర్ వెబ్‌సైట్: https://baanknet.com మరియు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వెబ్‌సైట్: https://www.unionbankofindia.bank.in/auction-property/view-auction-property.aspx లను పూర్తిగా పరిశీలించాలని బిడ్డర్లకు సూచించడమైనది. ఆస్తిపై బ్యాంకుకు తెలిసిన మేరకు ఎటువంటి ఎన్‌కంబ్రెన్స్ లేవు.

తేది : 19.05.2026, స్థలం : పూల్‌భాగ్ సం/- అధీకృత అధికారి, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

# నాలుగు ప్రభుత్వ ఆసుపత్రుల్లో వడదెబ్బ బాధితులకు ప్రత్యేక ఏసీ గదులు

**వేడి తీవ్రత నుంచి త్వరగా కోల్కొనేందుకు శీతల వాతావరణంలో చికిత్స -అగనంపూడి ఆసుపత్రిలో నాలుగు గోపాలపట్నం భీమిలి పెందుర్తి ఆసుపత్రుల్లో రెండేసి ఏసీ పడకల గదులు ఏర్పాటు -మందులు ఐవీ ఫ్లూయిడ్స్ ఆక్సిజన్ సిద్ధం -డిసీహెచ్‌యస్ డా.నరేంద్ర సింగ్**




విశాఖపట్నం మే 22, ప్రభాతవార్త

ఎండల తీవ్రత రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో వడదెబ్బకు గురయ్యే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు జిల్లా ఆస్పత్రుల సమన్వయ అధికారి డా.నరేంద్ర సింగ్ ఒక ప్రకటనలో తెలిపారు. వడదెబ్బ లక్షణాలతో ఆసుపత్రులకు వచ్చే రోగుల చికిత్స కోసం ప్రత్యేకంగా ఏసీ పడకలను ఏర్పాటు చేయడంతో పాటు అవసరమైన మందులు, ఐవీ ఫ్లూయిడ్స్, ఆక్సిజన్ సదుపాయాలను సిద్ధంగా ఉంచామని తెలిపారు. రోగులు వేడి తీవ్రత నుంచి త్వరగా కోలుకునేలా శీతల వాతావరణంలో చికిత్స అందించే విధంగా అగనంపూడి ఆసుపత్రిలో నాలుగు పడకల ఏసీ గదిని, గోపాలపట్నం భీమిలి, పెందుర్తి ఆసుపత్రులలో రెండు పడకలతో కూడిన ఏసి గదులు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. వడ దెబ్బ తగిలి వచ్చే రోగులకు తక్షణ చికిత్స అందించడం కోసం వైద్య సిబ్బందికి ప్రత్యేక సూచనలు జారీ చేశామని తెలిపారు. ఆసుపత్రి ఆవరణలో ఓఆర్ఎస్ కార్నర్, మంచినీటి సదుపాయం ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. వడదెబ్బ తగిలినట్లు ఎలాంటి లక్షణాలు కనిపించినా ఆలస్యం చేయకుండా వైద్యం సంప్రదించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. రోగుల కోసం సేవ భావం కలిగిన స్వచ్ఛంద సంస్థలు మజ్జిగ పంపిణీ కార్యక్రమం, ఆసుపత్రులకు ఎయిర్ కండిషనర్లు, కూలర్లు, మినీ హాట్ అండ్ కోల్డ్ వాటర్ డిస్పెన్సర్లు డొనేట్ చేయాలని డిసిహెచ్ఎస్ డా.నరేద్ర సింగ్ కోరారు.

# మెయిన్ రోడ్లపై స్టేజీల ఏర్పాటుకు అనుమతి లేదు

**ఉత్సవ కమిటీలు సహకరించాలి -సౌత్ సబ్ డివిజన్ ఏసీపీ శ్రీనివాసరావు**

**-ట్రాఫిక్ జాతర' వార్తకు ఏసీపీ తక్షణ స్పందన**

వార్త ప్రభావం

గాజువాక, మే 22,ప్రభాతవార్త

గాజువాక పోలీస్టేషన్ పరిధి హిందూస్థాన్ జింక్ ప్రధాన ద్వారం సమీపం మెయిన్ రోడ్లను బ్లాక్ చేస్తూ 18న నిర్వహించిన శ్రీ పెంటమాంబ ఉత్సవాలు, వాటి వల్ల ప్రజలు ఎదుర్కొంటున్న నరకయాతనపై ప్రముఖ దినపత్రిక "వార్త"లో ప్రచురితమైన 'గాజువాకలో ట్రాఫిక్ జాతర' ప్రత్యేక కథనానికి పోలీస్ శాఖ తక్షణమే స్పందించింది. ప్రజా సమస్యలపై సానుకూలంగా స్పందించిన విశాఖపట్నం సౌత్ సబ్ డివిజనల్ పోలీసు అధికారి ఏసీపీ శ్రీనివాసరావు కీలకమైన ఉత్తర్వులు శుక్రవారం జారీ చేశారు. ఇకపై మెయిన్ రోడ్లపై ఎలాంటి సాంస్కృతిక కార్యక్రమాలకు, స్టేజీల ఏర్పాటుకు అనుమతులు ఇచ్చే ప్రసక్తే లేదని ఆయన స్పష్టం చేశారు.

## ప్రజల ఇబ్బందులపై సీరియస్..

వివిధ ఉత్సవాల సందర్భంగా మెయిన్ రోడ్లపైనే పెద్ద ఎత్తున స్టేజీలు ఏర్పాటు చేసి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం వల్ల సాధారణ ప్రజలు, ఉద్యోగులు, అత్యవసర వాహనాలు తీవ్ర ట్రాఫిక్ ఇబ్బందులకు గురవుతున్నట్లు పోలీస్ శాఖ గుర్తించింది. పత్రికల్లో వచ్చిన కథనం ద్వారా ప్రజల ఇబ్బందుల తీవ్రత స్పష్టం కావడంతో, సౌత్ సబ్ డివిజన్ పరిధిలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు కఠిన చర్యలు చేపట్టారు.

## నిబంధనలు ఇవే..

ఉత్సవ కమిటీ సభ్యులు తమ తమ ప్రాంతాలలో ఉన్న ఖాళీ స్థలాలలో (మైదానాలలో) మాత్రమే కార్యక్రమాలు నిర్వహించుకోవాలి. ప్రజలకు, నిత్యం ప్రయాణించే వాహనదారులకు ఎలాంటి అంతరాయం కలగకుండా రోడ్ల పక్కన ఉన్న అనుకూలమైన ప్రదేశాలలో మాత్రమే స్టేజీల ఏర్పాటుకు ముందస్తు అనుమతులు పొందాలి. మెయిన్ రోడ్లపై స్టేజీల ఏర్పాటుకు ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతి ఇవ్వబడదు.

## పోలీసులకు సహకరించాలి....

ప్రజల భద్రత, రాకపోకల సౌకర్యం దృష్ట్యా తీసుకున్న ఈ నిర్ణయానికి ఉత్సవ కమిటీ సభ్యులందరూ గమనించి పోలీసు శాఖకు సహకరించవలసిందిగా సౌత్ సబ్ డివిజన్ సబ్ డివిజనల్ పోలీసు అధికారి శ్రీనివాసరావు విజ్ఞప్తి చేశారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

# ఒడిశా గవర్నర్ కంభంపాటి హరిబాబుకు ఘన స్వాగతం

గాజువాక,మే 22,ప్రభాతవార్త



ఒడిశా రాష్ట్ర గవర్నర్ కంభంపాటి హరిబాబుకు విశాఖపట్నం అంతర్జాతీయ విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది. మూడు రోజుల పాటు నగరంలో జరగనున్న పలు కార్యక్రమాల్లో పాల్గొనేందుకు ఆయన శుక్రవారం విశాఖ చేరుకున్నారు. ఈ సందర్భంగా విమానాశ్రయంలో ఆయనకు బీజేపీ నాయకులు, జిల్లా ప్రొటోకాల్ అధికారులు పుష్పగుచ్ఛాలు అందజేసి సాదరంగా ఆహ్వానం పలికారు. గవర్నర్ హరిబాబు మూడు రోజుల పాటు విశాఖపట్నంలోనే బస చేయనున్నారు. నగరంలో నిర్వహించనున్న పలు అధికారిక, సామాజిక కార్యక్రమాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొంటారు. అనంతరం తిరిగి సోమవారం ఉదయం ఆయన ఒడిశా రాజధాని భువనేశ్వర్‌కు తిరుగుపయనమవుతారని అధికారులు వెల్లడించారు. గవర్నర్‌కు స్వాగతం పలికిన వారిలో బీజేపీ జిల్లా అధ్యక్షులు పరశురామరాజు, రాష్ట్ర మీడియా ప్యానలిస్ట్ కరణంరెడ్డి నరసింగరావు, జిల్లా ప్రొటోకాల్ ఇన్‌ఛార్జ్ శ్రీనివాస్ పాత్రో, బీజేపీ నాయకులు మడక రమేష్ నాయుడు, శివపార్వతి, ఎస్సీ మోర్చా జిల్లా కార్యదర్శి కొల్లి మనోహర్, కోటేశ్వరరావు, సోషల్ మీడియా కన్వీనర్ రాకేష్ తదితరులు ఉన్నారు.

# జూన్ 15 నుండి ఇంటింటికీ ఓటర్ల సర్వే

**-ఈఆర్ఓ దయానిధి**

గాజువాక, మే 22ప్రభాతవార్త



గాజువాక తహసీల్దార్ కార్యాలయంలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియపై అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో శుక్రవారం అవగాహన సమావేశం జరిగింది. గాజువాక ఎంఆర్ఓ కార్యాలయంలో జరిగిన ఈ సదస్సులో ఈఆర్ఓ దయానిధి, పెదగంట్యాడ తహసీల్దార్ అమల, ఎలక్షన్ డిప్యూటీ తహసీల్దార్ సూర్యకళ, జివిఎంసి సిబ్బంది ధనలక్ష్మి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈఆర్ఓ దయానిధి మాట్లాడుతూ.. జూన్ 5 నుండి 14 వరకు బీఎల్ఏ-2 లకు శిక్షణ ఇస్తామని, జూన్ 15 నుండి జూలై 14 వరకు బీఎల్ఓలు, బీఎల్ఏలు కలిసి ప్రతి ఇంటికీ వెళ్లి కొత్త ఓటర్ల నమోదు ప్రక్రియ చేపడతారని తెలిపారు. అభ్యంతరాలను జూలై 21 నుండి ఆగస్టు 20 లోగా తెలియజేస్తే, వాటిని సెప్టెంబర్ 18 లోగా పరిష్కరించి, సెప్టెంబర్ 22న ఓటర్ల తుది జాబితా విడుదల చేస్తామని స్పష్టం చేశారు. గాజువాక బీజేపీ ఇంచార్జ్ కరణంరెడ్డి నరసింగరావు మాట్లాడుతూ.. ఈ ప్రక్రియ ద్వారా దొంగ ఓట్లు, చనిపోయిన వారి ఓట్లను తొలగించి, 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పిస్తారని, దీనివల్ల ఓటింగ్ శాతం పెరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో పల్లా రమణ (టీడీపీ), రౌతు గోవింద్ (జనసేన), రంజిత్, రామస్వామి (బీజేపీ)తో పాటు వైకాపా, సీపీఐ, సీపీఎం, బీఎస్పీ నేతలు పాల్గొన్నారు.

# నగరాన్ని తాకిన వాన చినుకు..

గాజువాక, మే 22,ప్రభాతవార్త

గత కొన్ని రోజులుగా తీవ్రమైన వేసవి తాపం, ఉక్కపోత, వడగాల్పులతో అల్లాడిపోతున్న విశాఖ నగర ప్రజలకు వాతావరణం ఒక్కసారిగా చల్లబడి ఊరటనిచ్చింది. శుక్రవారం సాయంత్రం వాతావరణంలో అనూహ్య మార్పులు చోటుచేసుకున్నాయి. ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమై.. ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం ముంచెత్తింది. ముఖ్యంగా గాజువాక,దాని పరిసర ప్రాంతాల్లో ఈదురుగాలుల బీభత్సం సాగింది. భానుడి భగభగలకు విలవిలలాడుతున్న జనం.. ఒక్కసారిగా వాతావరణం చల్లబడటంతో హర్షం వ్యక్తం చేస్తున్నారు. నగరంలోని పలు ప్రధాన కూడళ్లలో రహదారులు జలమయమయ్యాయి. అకస్మాత్తుగా కురిసిన గాలివానకు వాహనదారులు, బాటసారులు కొంత ఇబ్బంది పడ్డారు. రాగల గంటల్లో కూడా నగరంలో అక్కడక్కడా ఉరుములతో కూడిన జల్లులు పడే అవకాశం ఉందని అధికారులు పేర్కొంటున్నారు. ఉరుములు, మెరుపుల తీవ్రత ఎక్కువగా ఉన్నందున ప్రజలు చెట్ల కింద, విద్యుత్ స్తంభాల చెంత నిలబడకుండా సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని అధికారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# బి.ఎన్. రోడ్డు విస్తరణకు గంటా శంకుస్థాపన



భీమిలి, మే 22, ప్రభాతవార్త

భీమిలి - నర్సీపట్నం రోడ్డు విస్తరణ, అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే గంటా శ్రీనివాస రావు శుక్రవారం శంకుస్థాపన చేశారు. కుమ్మరిపాలెం నుంచి వై జంక్షన్ వరకు ప్రస్తుతం 2 లేన్లుగా ఉన్న 6 కిలో మీటర్ల రోడ్డును 4 లేన్లుగా విస్తరించనున్నారు. దీని కోసం ప్రభుత్వం రూ.34 కోట్లు కేటాయించింది. ఈ సందర్భంగా గంటా మాట్లాడుతూ నిర్దేశించిన 18 నెలల్లో నాణ్యతతో రాజీ పడకుండా పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ రోడ్డును విస్తరించి అభివృద్ధి చేయడం వల్ల వేలాది వాహన చోదకులకు ప్రయోజనం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు చిక్కాల విజయ్ బాబు, గాడు వెంకటప్పడు, కురుమిన రామస్వామి నాయుడు, గంటా నూకరాజు, గొలగాని నరేంద్ర, గాడు చిన్ని కుమారి లక్ష్మి, పాసి త్రినాథ్, కె.రామానాయుడు, చురకల రమణ, జీరు సత్యం, దండి వెంకటేష్, కనకల అప్పలనాయుడు, బోయి రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

# కుప్పకూలిన భారీ ఆర్చ్

**తప్పిన పెను ప్రమాదం -ఊపిరి పీల్చుకున్న వాహనదారులు, పాదచారులు**

ఆరిలోవ, మే 22, ప్రభాతవార్త



తోటగరువు ఎర్ని దుర్గమాంబ జాతర మహోత్సవాల్లో భాగంగా పెదగదిలి జంక్షన్ వద్ద సుమారు వందల పైగా కర్రలతో ప్రధాన ద్వారంగా చుట్టూ విద్యుత్ కాంతులతో భారీ ఆర్చ్ ను ఏర్పాటు చేశారు. శుక్రవారం 7 గంటల ప్రాంతంలో భారీగా ఈదురు గాలులు వేయడంతో ఒక్కసారిగా రహదారి మధ్యలో ఆర్చ్ కుప్పకూలి పోయింది. కుప్పకూలిన ఆర్చ్ విద్యుత్ స్తంభంపై పడడంతో అటువైపుగా వెళ్లే వాహనదారులు, పాదచారులు భయభ్రాంతులతో పరుగులు తీశారు. అదృష్టవశాత్తూ అటువైపుగా ఆ సమయంలో ఎవరూ సంచరించక పోవడంతో పెను ప్రమాదమే తప్పిందంటూ ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. వెంటనే స్పందించిన ఉత్సవ కమిటీ సభ్యులు అక్కడికి చేరుకొని రోడ్డుకి అడ్డంగా కుప్పకూలిన ఆర్చ్ ను తొలగించే ప్రయత్నం చేశారు.

# పెదగంట్యాడ యాదవులకు సామాజిక భవనం కావాలి



గాజువాక, మే 22ప్రభాతవార్త

పెదగంట్యాడ మండల పరిధిలోని యాదవ సామాజిక వర్గ గ్రామాలకు సంక్షేమ భవనం ఏర్పాటు చేయాలని అఖిలపక్ష విస్తృతస్థాయి సమావేశం డిమాండ్ చేసింది. మొల్లివానిపాలెం కమ్యూనిటీ హాల్ వద్ద టీడీపీ నాయకుడు మొల్లి పెంటిరాజు అధ్యక్షతన శుక్రవారం జరిగిన ఈ భేటీలో 'యాదవ గ్రామాల సంక్షేమ సంఘం' ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. సామాజిక వర్గంలో అసమానతలు తొలగించి, పేద విద్యార్థుల ఉన్నత చదువులకు సంఘం ద్వారా తోడ్పాటునందిస్తామన్నారు. భవన నిర్మాణం కోసం పెదగంట్యాడ ప్రాంతంలో 1000 గజాల స్థలం కేటాయించి, బీసీ కార్పొరేషన్ నిధులు మంజూరు చేయించాలని త్వరలోనే గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావును కలిసి విన్నవించనున్నట్లు తెలిపారు. సమావేశంలో మండలంలోని 12 గ్రామాల పెద్దలతో పాటు కోన చిన అప్పారావు (జనసేన), నమ్మి అప్పారావు (టీడీపీ ), ఉరుకుటి సింహాద్రి (వైస్సార్సీపీ ), కిలాడ ముసలయ్య (బీజేపీ ), నమ్మి రమణ (సీఐటీయూ ), నమ్మి అప్పలనాయుడు (కాంగ్రెస్) తదితర అఖిలపక్ష నాయకులు పాల్గొన్నారు.

# విశాఖకు అంతర్జాతీయ గుర్తింపు

**-గాజువాక టీడీపీ ఇంచార్జ్ ప్రసాదుల శ్రీనివాస్**

గాజువాక, మే 22,ప్రభాతవార్త



కూటమి ప్రభుత్వ ఆధ్వర్యంలో విశాఖపట్నం అంతర్జాతీయ స్థాయి అభివృద్ధి వైపు దూసుకుపోతుందని రాష్ట్ర సివిల్ సప్లైస్ డైరెక్టర్, గాజువాక నియోజకవర్గ సమన్వయ కర్త ప్రసాదుల శ్రీనివాస్ అన్నారు. గాజువాక టీడీపీ కార్యాలయంలో శుక్రవారం అనుబంధ కమిటీల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శుల సమావేశం ఆయన అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ ద్వారా వివిధ ప్రాజెక్టుల కింద రూ. 15,001 కోట్లు కేటాయించారని, ఇందులో భాగంగా రూ. 750 కోట్లతో నిరంతర మంచినీటి సరఫరా పనులు ప్రారంభిస్తున్నట్లు వెల్లడించారు. గత వైసీపీ పాలనలో రాష్ట్రం వెనకబడగా, ప్రస్తుతం టీసీఎస్, కాగ్నిజెంట్ సహా 12 ఐటీ కంపెనీలు ఉత్తరాంధ్రకు వచ్చాయని తెలిపారు. గాజువాక యారాడ కొండపై గల 450 ఎకరాల స్థలంలో ఐటీ హబ్ ఏర్పాటుకు ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు ఇప్పటికే ఐటీ దిగ్గజాలతో చర్చలు జరిపారని పేర్కొన్నారు. సమావేశంలో టీడీపీ నాయకులు మొల్లి పెంటిరాజు, డి.వి. సత్యారావు, గణపతి, భవాని, మురళి, షేక్ రెహమాన్ పాల్గొన్నారు.

# వివాద, సమస్యల రహిత గ్రామాల నిర్మాణమే ప్రభుత్వ ధ్యేయం

**'వన్ మంత్ - వన్ కానిస్టిట్యూయెన్సీ-ఫోర్ విజిట్స్" ప్రారంభంలో ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు -ఆనందపురం ఎంపీడీవో కార్యాలయ ప్రాంగణంలో ప్రజల నుంచి వినతులు స్వీకరించిన కలెక్టర్, ఎమ్మెల్యే - అధికారులు మరింత శ్రద్ధతో పనిచేసి ప్రజలకు న్యాయం జరిగేలా చూడాలి : జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ -రెవెన్యూ, రెవెన్యూయేతర సమస్యలపై 161 వినతులు సమర్పించిన ప్రజలు**

విశాఖపట్టణం(ఆనందపురం), మే 22 ప్రభాతవార్త



వివాద, రెవెన్యూ సమస్యల రహిత గ్రామాల నిర్మాణమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాస రావు పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న "వన్ మంత్ - వన్ కానిస్టిట్యూయెన్సీ - ఫోర్ విజిట్స్" కార్యక్రమం శుక్రవారం భీమిలి నియోజకవర్గంలోని ఆనందపురం మండల పరిషత్ సమావేశ మందిరంలో ప్రారంభమైంది. ప్రజల రెవెన్యూ సమస్యలను క్షేత్రస్థాయిలోనే పరిష్కరించేందుకు చేపట్టిన ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్, భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, ఆర్డీవో సంగీత్ మాధుర్ పాల్గొని ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు మాట్లాడుతూ గ్రామీణ స్థాయిలో రెవెన్యూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిందన్నారు. ప్రజల వద్దకే జిల్లా స్థాయి అధికారులు వెళ్లి సమస్యలను స్వీకరించి పరిష్కరించడం ద్వారా వేగవంతమైన సేవలు అందుతాయని తెలిపారు. ఇప్పటికే నిర్వహించిన "వన్ మంత్ -- వన్ విలేజ్" కార్యక్రమం మంచి ఫలితాలను ఇచ్చిందని గుర్తుచేశారు. వారం వారం నిర్వహిస్తున్న పీజీఆర్ఎస్ కు ఇది అదనపు బలమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవటం ద్వారా విజయవంతం చేయాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ మాట్లాడుతూ ప్రతి నియోజకవర్గంలో ఒక గ్రామాన్ని ఎంపిక చేసి నాలుగు దఫాలుగా అధికార యంత్రాంగం సందర్శిస్తుందని తెలిపారు. ప్రతి సోమవారం అందుతున్న వినతుల్లో అధిక భాగం రెవెన్యూ సమస్యలేనని, ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగకుండా వారి వద్దకే వెళ్లి పరిష్కారం చూపడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని చెప్పారు. నెల్లూరు జిల్లాలో పైలట్ ప్రాజెక్టుగా నిర్వహించిన ఈ విధానం మంచి ఫలితాలను ఇచ్చిందని, ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తున్నామని వెల్లడించారు. అనంతరం ఎమ్మెల్యే, భీమిలి ఆర్డీవో సంగీత్ మాధుర్ తో కలిసి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. వినతుల స్వీకరణ అనంతరం కలెక్టర్ అధికారులకు పలు సూచనలు జారీ చేశారు. రెవెన్యూ, నాన్-రెవెన్యూ ఫిర్యాదులను వేర్వేరుగా వర్గీకరించాలని, నాన్-రెవెన్యూ అంశాలను పీజీఆర్ఎస్‌లో నమోదు చేయించాలని ఆదేశించారు. ప్రతి ఫిర్యాదుపై క్షేత్రస్థాయి పరిశీలన, విచారణ, పరిష్కార నివేదిక దశలవారీగా చేపట్టాలని సూచించారు. సమస్యల పరిష్కారంలో పారదర్శకత ఉండాలని, తీసుకున్న చర్యలను ఫిర్యాదుదారులకు స్పష్టంగా తెలియజేయాలని పేర్కొన్నారు. అధికారులు మరింత శ్రద్ధతో పనిచేసి ప్రజలకు న్యాయం జరిగేలా చూడాలని ఆదేశించారు.

## 161 వినతులు సమర్పించిన ప్రజలు

ఆనందపురం వేదికగా నిర్వహించిన వన్ మంత్ - కానిస్టిట్యూయెన్సీ-ఫోర్ విజిట్స్ కార్యక్రమంలో ప్రజలు వివిధ సమస్యలపై 161 వినతులు సమర్పించారు. వాటిలో రెవెన్యూకు సంబంధించి 95 వినతులు ఉండగా, జీవీఎంసీ, పోలీసు, హౌసింగ్, సంక్షేమ పథకాలకు సంబంధించి 66 వచ్చాయి. జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే, భీమిలి ఆర్డీవో, పీజీఆర్ఎస్ నోడల్ అధికారి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. కార్యక్రమంలో పీజీఆర్ఎస్ నోడల్ అధికారి టి. గోవిందు, భీమిలి, ఆనందపురం, పద్మనాభం మండలాల తహశీల్దార్లు, ఎంపీడీవోలు, డ్వామా పీడీ నిర్మలాదేవి, సాంఘిక సంక్షేమ శాఖ డీడీ రామారావు, సమాచార శాఖ డీడీ సదారావు ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఏపీలో భారత్‌నెట్ అమలు..

**2.64 లక్షల గ్రామాలకు ఫైబర్ కనెక్టివిటీ.. డిజిటల్ విస్తరణతో గ్రామీణాభివృద్ధి - ఏపీ బీజేపీ చీఫ్ పీవీయన్ మాధవ్**



విశాఖపట్నం, ప్రభాతవార్త

ఆంధ్రప్రదేశ్‌లో గ్రామీణ ప్రాంతాల్లో డిజిటల్ కనెక్టివిటీ విస్తరణకు కేంద్ర ప్రభుత్వం భారత్‌నెట్ కార్యక్రమాన్ని వేగవంతంగా అమలు చేస్తోందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర భారతీయ జనతా పార్టీ అధ్యక్షులు పీవీయన్ మాధవ్ తెలిపారు. సవరించిన భారత్‌నెట్ కార్యక్రమం కింద దేశవ్యాప్తంగా 2.64 లక్షలకు పైగా గ్రామ పంచాయతీలకు ఫైబర్ కనెక్టివిటీ అందించే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. గ్రామీణ ప్రాంతాలకు హైస్పీడ్ ఇంటర్నెట్ సేవలు అందుబాటులోకి రావడం ద్వారా విద్యార్థులకు ఆన్‌లైన్ విద్య, రైతులకు ఆధునిక వ్యవసాయ సమాచారం, మహిళలకు డిజిటల్ సేవలు, యువతకు ఉపాధి అవకాశాలు మరింత చేరువ అవుతాయని ఆయన పేర్కొన్నారు. భారత్‌నెట్ ప్రాజెక్ట్ గ్రామీణ భారత అభివృద్ధికి కీలక మైలురాయిగా నిలుస్తుందని, గ్రామ సచివాలయాలు, ప్రభుత్వ పాఠశాలలు, ఆరోగ్య కేంద్రాలు డిజిటల్ కనెక్టివిటీతో మరింత సమర్థవంతంగా పనిచేసే అవకాశం కలుగుతుందని అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశవ్యాప్తంగా డిజిటల్ ఇండియా కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతోందని, గ్రామీణ ప్రజలను సాంకేతిక రంగంలో భాగస్వాములను చేయడమే కేంద్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పీవీయన్ మాధవ్ తెలిపారు.రాష్ట్రంలోని ప్రతి గ్రామానికి బ్రాడ్‌బ్యాండ్ కనెక్టివిటీ అందించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆయన సూచించారు. డిజిటల్ సేవల విస్తరణతో పారదర్శక పాలన, వేగవంతమైన సేవలందింపు, గ్రామీణ ఆర్థికాభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. భారత్‌నెట్ అమలు ద్వారా గ్రామాలు స్మార్ట్ గ్రామాలుగా మారే దిశగా ఆంధ్రప్రదేశ్ ముందుకు సాగుతోందన్న ఆశాభావాన్ని మాధవ్ వ్యక్తం చేశారు. భారత్‌నెట్ అనేది భారత ప్రభుత్వ ప్రతిష్టాత్మక డిజిటల్ కార్యక్రమం మాత్రమే కాకుండా ప్రపంచం లోనే అతిపెద్ద గ్రామీణ బ్రాడ్‌బ్యాండ్ ప్రాజెక్ట్‌గా గుర్తింపు పొందిందని ఆయన తెలిపారు. దేశవ్యాప్తంగా గ్రామ పంచాయతీలు మరియు మారుమూల గ్రామాలకు వేగవంతమైన, సరసమైన ఇంటర్నెట్ కనెక్టివిటీ అందించడం ద్వారా ఇ-హెల్త్, ఇ-ఎడ్యుకేషన్, ఇ-గవర్నెన్స్ సేవలను ప్రజలకు చేరువ చేయడమే దీని ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. భారత్‌నెట్ ద్వారా టెలికాం సేవా సంస్థలు, ఇంటర్నెట్ సేవా ప్రదాతలు, కేబుల్ ఆపరేటర్లు గ్రామీణ ప్రాంతాలకు లాస్ట్ మైల్ కనెక్టివిటీ అందించేందుకు అవకాశం కలుగుతోందని తెలిపారు. ప్రతి ఫైబర్-టు-ది-హోమ్ కనెక్షన్‌కు కనీసం 25 ఎంబిపిఎస్ డౌన్‌లోడ్ వేగం అందించే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. ఈ భారీ ప్రాజెక్ట్‌ను మూడు దశల్లో అమలు చేస్తున్నారని, మొదటి దశలో లక్ష గ్రామ పంచాయతీలకు ఆప్టికల్ ఫైబర్ కనెక్టివిటీ కల్పించగా, ప్రస్తుతం రెండో దశలో మిగిలిన ప్రాంతాలకు ఫైబర్, రేడియో, ఉపగ్రహ సాంకేతికతల ద్వారా సేవలు విస్తరిస్తున్నారని వివరించారు. మూడో దశలో 5జీ సాంకేతికతతో నెట్‌వర్క్‌ను మరింత బలోపేతం చేయనున్నట్లు తెలిపారు. భారత్ బ్రాడ్‌బ్యాండ్ నెట్‌వర్క్ లిమిటెడ్ (బి బి ఎన్ ఎల్) ఆధ్వర్యంలో ఈ ప్రాజెక్ట్ అమలు జరుగుతుండగా, బి ఎస్ ఎన్ ఎల్ ప్రాజెక్ట్ నిర్వహణ బాధ్యతలు చేపడుతోందని పేర్కొన్నారు. 2027 నాటికి దేశవ్యాప్తంగా గ్రామీణ డిజిటల్ మౌలిక సదుపాయాలను మరింత విస్తరించేందుకు కేంద్ర ప్రభుత్వం భారీ నిధులను కేటాయించినట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో డిజిటల్ విప్లవానికి భారత్‌నెట్ కీలక వేదికగా నిలుస్తుందని, ఇది గ్రామీణ భారత భవిష్యత్తును మార్చే ప్రాజెక్ట్‌గా అవతరిస్తోందని పీవీయన్ మాధవ్ పేర్కొన్నారు.

# హైటెన్షన్....ప్రాణ సంకటం!

**గాజువాకలో విద్యుత్ ఘాతానికి ఇద్దరు యువకులకు తీవ్ర గాయాలు -మేడపై ఇంటర్నెట్ కనెక్షన్ ఇస్తుండగా ప్రమాదం -కాసుల కక్కుర్తి.. అనాధికార నిర్మాణాలే శాపమా?-గతంలోనూ పలువురిని బలితీసుకున్న హై టెన్షన్ విద్యుత్ లైన్లు**

గాజువాక,మే 22,ప్రభాతవార్త



గాజువాక నియోజకవర్గంలో హైటెన్షన్ విద్యుత్ తీగలు మరోసారి అమాయకుల ప్రాణాల మీదకు తెచ్చాయి. స్థానిక సుందరయ్య కాలనీలో శుక్రవారం జరిగిన ఘోర విద్యుత్ ప్రమాదంలో ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. కొందరు అవినీతి రాజకీయ నాయకుల కాసుల కక్కుర్తి, అధికారుల ఉదాసీనత వల్లే హైటెన్షన్ లైన్ల కింద నిబంధనలకు విరుద్ధంగా భవనాలు వెలుస్తున్నాయని, ఈ అనాధికార నిర్మాణాలే ప్రజల పాలిట యమపాశాలుగా మారుతున్నాయని స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సుందరయ్య కాలనీకి చెందిన దేవర రవికుమార్, ఖాజా హేమంత్ అనే ఇద్దరు యువకులు తమ నివాసంలో ఇంటర్నెట్ కనెక్షన్ కోసం మేడపైకి వెళ్లారు. అక్కడ వైర్లు సరిచేస్తున్న క్రమంలో, భవనానికి అత్యంత సమీపంలో ఉన్న హైటెన్షన్ విద్యుత్ తీగలు ఒక్కసారిగా తగలడంతో తీవ్ర విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే కుప్పకూలిపోయారు. అదే సమయంలో హైటెన్షన్ లైన్ల నుండి భారీగా విద్యుత్ ప్రవహించడంతో చుట్టుపక్కల ఉన్న రెండు ఇళ్లలో ఒక్కసారిగా షార్ట్ సర్క్యూట్ సంభవించింది. దీంతో ఇళ్లలోని విలువైన ఎలక్ట్రానిక్ గృహోపకరణాలు, సామాగ్రి పూర్తిగా ధ్వంసమయ్యాయి.

## హుటాహుటిన ఆసుపత్రికి..

భారీ శబ్దంతో ప్రమాదం జరగడంతో కాలనీవాసులు ఒక్కసారిగా దిగ్భ్రాంతికి గురయ్యారు. తీవ్రంగా గాయపడిన రవికుమార్, హేమంత్‌లను హుటాహుటిన స్థానిక ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం వారి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. ఘటనా స్థలానికి చేరుకున్న గాజువాక పోలీసులు ప్రమాద వివరాలను సేకరించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## గత రికార్డులు భయపెడుతున్నా....నిర్లక్ష్యమేనా?

గాజువాక పరిధిలోని డ్రైవర్స్ కాలనీ, ఎల్‌వీ నగర్, శ్రీనగర్, సుందరయ్య కాలనీ తదితర ప్రాంతాల్లో హైటెన్షన్ విద్యుత్ తీగల కింద పట్టణ ప్రణాళిక నిబంధనలకు విరుద్ధంగా భవనాలు నిర్మించడంపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి. గతంలోనూ ఈ ప్రాంతాల్లో హైటెన్షన్ తీగలు తగిలి పలువురు ప్రాణాలు కోల్పోయిన విషాద సంఘటనలు ఉన్నాయి. రాజకీయ అండదండలతోనే ఇటువంటి ప్రమాదకర నిర్మాణాలకు అనుమతులు ఇస్తున్నారని, ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఇటువంటి అనాధికార భవనాలపై చర్యలు తీసుకోవాలని, ప్రమాదాలు పునరావృతం కాకుండా చూడాలని గాజువాక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# కూటమి ప్రభుత్వంలో పాఠశాలలకు మహర్దశ..

ఎలమంచిలి, మే 22, ప్రభాతవార్త

పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ప్రభుత్వం బడి చదువు అద్భుతమైన గెలుపు.. అభినందన కార్యక్రమం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఇటీవల విడుదలైన పదో తరగతి ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఎమ్మెల్యే ప్రత్యేకంగా సన్మానించారు. నియోజకవర్గ పరిధిలోని నాలుగు మండలాల్లో ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించిన మొత్తం 17 మంది విద్యార్థులకు ఎమ్మెల్యే స్వంత నిధుల నుంచి ఒక్కొక్కరికి నగదు బహుమతులు అందజేశారు. అదేవిధంగా అనకాపల్లి జిల్లాలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించి నగదు ప్రోత్సాహకాలు, సాలువాలు, మెమొంటోలు , ప్రశంసాపత్రాలు అందజేశారు. విద్యార్థులకు మంచి ఫలితాలు తీసుకురావడంలో కృషి చేసిన ఉపాధ్యాయులను కూడా ఎమ్మెల్యే సత్కరించారు. గత సంవత్సరం కూడా ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు స్వంత నిధులతో ప్రోత్సాహకాలు అందించిన విషయాన్ని ఉపాధ్యాయులు గుర్తు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం విద్యా రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చిందని తెలిపారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ చొరవతో ఏపీ విద్యా వ్యవస్థ అంతర్జాతీయ ప్రమాణాల దిశగా ముందుకు సాగుతోందన్నారు. వంద రోజుల ప్రణాళికలతో ఈసారి పదో తరగతి ఫలితాలు గతంలో ఎన్నడూ లేనంతగా ఫలితాలు వచ్చాయని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థుల ఫోటోలను పత్రికల్లో ప్రకటనల రూపంలో ప్రచురించడం కూటమి ప్రభుత్వ ప్రత్యేకత అని ఉన్నారు. ఈసారి పదో తరగతి ఫలితాల్లో బాలికలే అత్యుత్తమ ప్రతిభ కనబరిచారని, ఆడపిల్లలు బంగారు తల్లులని కొనియాడారు. విద్యార్థులు చిన్న చిన్న తప్పిదాలకు దూరంగా ఉండాలని, ప్రతి ఒక్కరికీ జీవితంలో ఒక స్పష్టమైన లక్ష్యం అవసరమని ఎమ్మెల్యే గ సూచించారు... ఈ అనకాపల్లి జిల్లా ఉప విద్యాశాఖ అధికారి అప్పారావు, ఎంఈఓ అరుణ్ కుమార్, నాలుగు మండలాల ఎంఈఓ లు, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు, ఉపాధ్యాయులు, కూటమి నాయకులు పాల్గొన్నారు..

# సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ..

విశాఖపట్నం, మే 22, ప్రభాతవార్త

సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో రిటైల్ క్రెడిట్ అవుట్‌రీచ్ ప్రోగ్రామ్ గురువారం విశాఖపట్నంలోని ద్వారకానగర్‌లో గల హోటల్ బెస్ట్ వెస్ట్రన్ ప్లస్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బ్యాంక్ జనరల్ మేనేజర్ (ఎంఎస్ఎంఈ) ఎస్.ఎస్.మూర్తి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఐఐఎం విశాఖపట్నం స్టూడెంట్ అఫైర్స్ మేనేజర్ రాయప్రోలు రాము, బీవీఎస్ఆర్ కన్స్ట్రక్షన్స్ బిల్డర్ బిజ్జాల దిలీప్ కుమార్ ప్రత్యేక అతిథులుగా పాల్గొన్నారు. రిటైల్ వినియోగదారులు ఉత్సాహంగా పాల్గొన్న ఈ కార్యక్రమంలో మొత్తం రూ.63.23 కోట్ల విలువైన 25 రుణ మంజూరు పత్రాలను పంపిణీ చేశారు. అదేవిధంగా రెండు బిల్డర్ టైఅప్స్, ఒక వెహికల్ డీలర్ టైఅప్‌ను కూడా పూర్తి చేశారు. కార్యక్రమంలో భాగంగా బ్యాంకు అందిస్తున్న వివిధ రిటైల్ రుణ పథకాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ నిర్వహించారు. కొందరు ఖాతాదారులు బ్యాంకుతో తమ అనుబంధాన్ని, విజయవంతమైన ప్రయాణాన్ని సభలో పంచుకున్నారు. రిటైల్ బ్యాంకింగ్ సేవల ద్వారా వినియోగదారులకు మరింత ఆర్థిక సాధికారత కల్పించడం, ఖాతాదారులతో సంబంధాలను మరింత బలోపేతం చేయడం లక్ష్యంగా ఈ అవుట్‌రీచ్ కార్యక్రమం నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు.

vsp10:vsp10.qxd 22-05-2026 22:25 Page 1






## మోడల్ ప్రైమరీ పాఠశాలలను సందర్శించిన రాష్ట్ర బృందం



అనకాపల్లి ,మే 22, (ప్రభాతవార్త) అనకాపల్లి మండలం, పట్టణ పరిధిలోని పలు మండల పరిషత్, జీవీఎంసీ ఆంగ్ల మాధ్యమ మోడల్ ప్రైమరీ పాఠశాలను రాష్ట్ర కమాండ్ కంట్రోల్ మోనటరింగ్ టీమ్ బృం దం శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. మామిడిపాలెం, కొప్పాక, తారకరామా కాలనీ పాఠశాలల పరిధిలోని గ్రామాలు, వార్డుల్లో తిరిగారు. విద్యార్థుల నివాసాలకు వెళ్లి తల్లిదండ్రులతో మాట్లాడారు. ఒకటవ తరగతిలో ప్రవేశాలను నమోదు చేశారు. రాష్ట్ర కమాండ్ కంట్రోల్ మోనిటరింగ్ బృందం బాధ్యులు ఏసుబాబు, రామానుజన్ రెడ్డి ఆయా ప్రాంతాల్లో జరిగిన కార్యక్రమాల్లో తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ప్రభుత్వ పాఠశాలల్లో అందుబాటులో ఉన్న సదుపాయాలు, సౌక ర్యాలను వివరించారు. వీరికి అనకాపల్లి మండల విద్యాశాఖ అధికారిని ఎన్ కె శ్రీదేవి ఆధ్వర్యంలో విద్యా శాఖ ప్రతినిధులు స్వాగతం పలికి పాఠశాలల వివరాలను అందజేశారు. క్లస్టర్ హెచ్ఎం లు శ్రీధర్ ( మామిడిపాలెం), వి ఎస్ సుమన్ (కొప్పాక ), జీవీఎంసీ వుడ్ పేట జార్జి స్పెషల్ ప్రధానోపాధ్యాయులు ఉమామహేశ్వర్ రావు, కృష్ణమోహన్, తారకరామా కాలనీ ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, ఆయా పాఠశాల ల ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు పాఠశాల పరిధిలో గల ఫైవ్ప్లస్ ఏజ్ చిల్డ్రన్ గుర్తించి ప్రవేశ దరఖాస్తు ఫీల్ చేసి పాఠశాల అడ్మిట్ చేశారు. వుడ్ పేటలో మూడు తారకరామా కాలనీలో 6 కొప్పాక ప్రైమరీ లో మూడు మామిడిపాలెంలో ఇద్దరు విద్యార్థులను డోర్ టు డోర్ క్యాంపెయిన్‌లో భాగంగా వీరు నేరుగా నమోదులు చేశారు. కార్యక్రమంలో సి ఆర్ పి లు ఎస్ శంకర్రావు, పి వెంకటేష్, పి దేవి, విపి శిరీష పాల్గొన్నారు.

## ఈవీఎం గోడౌన్ తనిఖీ చేసిన కలెక్టర్ విజయ క్రిష్ణన్



అనకాపల్లి, మే 22 (ప్రభాతవార్త): ఈవీఎం గోడౌన్ వద్ద సిబ్బంది అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ విజయ క్రిష్ణన్ సిబ్బందిని ఆదేశించారు. జిల్లా ఎస్పీ కార్యాలయం వద్ద ఉన్న ఈవీఎం గోడౌన్ ను నెలవారీ తనిఖీల్లో భాగంగా శుక్రవారం ఉదయం వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ తనిఖీ చేశారు. కలెక్టర్ అక్కడ పరిస్థితులను గమనించారు. సీసీ కెమెరాల పనితీరును, ప్రధాన ద్వారానికి ఉన్న సీళ్లను పరిశీలించారు. పరిస్థితులను క్షుణ్ణంగా పరిశీలించి, భద్రతా ప్రమాణాలపై అధికారులకు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. తనిఖీ క్రమంలో లాగ్ బుక్ లో సంతకం చేశారు. భద్రతా ప్రమాణాలు, లాగ్ బుక్ నిర్వహణ ఇతర అంశాలపై అధికారులు నేతలతో మాట్లాడారు. భద్రపరిచిన ఈవీఎంల స్థితిగతులను కలెక్టర్‌కు ఎన్నికల విభాగం అధికారులు వివరించారు. డి ఆర్ ఓ వై సత్యనారాయణ రావు, ఆర్డీఓ ఆయేషా, జిల్లా ఫైర్ ఆఫీసర్, టి.డి.పి నుండి బి.శ్రీనివాసరావు, ఏపి నుండి కే. హరినాథ్ బాబు, బీఎస్పీ నుండి ఎస్.వి.వి. రామచంద్రరావు, వైయస్సార్సీపి నుండి పి.గోవింద, సిపిఎం నుండి శ్రీరామ్, స్థానిక రెవెన్యూ, ఎలక్షన్ సెల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## నిందితులను అరెస్టు చేయడంలో పోలీసులు నిర్లక్ష్య వైఖరి విడనాడాలి



అనకాపల్లి, మే 22 (ప్రభాతవార్త): అనకాపల్లి జిల్లా పరవాడ మండలం తానం గ్రామానికి చెందిన బాలుడు రాయుడు శశికాంత్ ఆత్మహత్యకు ప్రేరేపించిన నిందితులను అరెస్టు చేయడంలో పోలీసులు ప్రేక్షకపాత్ర వహిస్తున్నారని అనకాపల్లి జిల్లా యాత సంక్షేమ సంఘం అధ్యక్షుడు పెంకే మారేష్ విమర్శించారు. శుక్రవారం అనకాపల్లిలో జరిగిన ఒక సమావేశంలో మారేష్ మాట్లాడుతూ గత నెల 21వ తేదీన పరవాడ మండలం తానం గ్రామానికి చెందిన కొంతమంది ఆధిపత్య వర్గాలకు చెందిన వ్యక్తులు బాలుడు రాయుడు శశికాంతపై దాడి చేసి తీవ్రంగా కొట్టడం వలన రాయుడు శశికాంత్ అవమానం తట్టుకోలేక ఆత్మహత్య చేసుకున్నాడని అన్నారు. బాలుడు చనిపోయే ముందు తన ఆత్మహత్యకు కారకులైన వ్యక్తుల పేర్లను తన మరణ వాంగ్మూలంలో స్పష్టంగా చెప్పారని మారిష్ గుర్తు చేశారు. పరవాడ పోలీసులు రాజకీయ ఒత్తిడికి లొంగి దోషులను రక్షించడానికి అన్ని ప్రయత్నాలు తీవ్రంగా చేస్తున్నారని విమర్శించారు. బాలుడు మరణానికి కారకులైన వ్యక్తులను అరెస్టు చేయాలని డిమాండ్ తో ఈనెల 1వ తేదీన చలో ఎస్పీ ఆఫీస్ కార్యక్రమాన్ని నిర్వహించి ఎస్పీకి ఒక మెమోరాండం సమర్పించామని మారేష్ గుర్తు చేశారు. మొక్కుబడిగా పరవాడ పోలీసులు ఒక వ్యక్తి ని అరెస్టు చేసి చేతులు దులుపుకున్నారని మారేష్ అన్నారు. నిందితులు అందరిని అరెస్టు చేయాలనే డిమాండ్ తో ఈ నెల 13న అనకాపల్లి కేంద్రంగా రిలే నిరాహార దీక్ష శిబిరాన్ని ఏర్పాటు చేసామని, ఆ సందర్భంలో పరవాడ డి.ఎస్.పి శిబిరాన్ని సందర్శించి నిందితులను 10 రోజుల్లో అరెస్ట్ చేస్తామని ఆందోళనకారులకు హామీ ఇచ్చి దీక్షలను విరమింప చేశారని ఈ సందర్భంగా మారిష్ గుర్తు చేశారు. సమావేశంలో సీనియర్ న్యాయవాది ఐ.ఆర్. గంగాధర్, అనకాపల్లి జిల్లా యాత సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గుత్తుర్తి అప్పారావు, జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎర్ర రాము, యువ న్యాయవాది ఓడిబోయిన రాంబాబు పాల్గొన్నారు.

## పరిశ్రమల నిర్వహణకు, కొత్త ప్రాజెక్టుల ఏర్పాటుకు పూర్తి సహకారం

### డీఐఈపీసీ సమావేశంలో జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్



అనకాపల్లి, మే 22 (ప్రభాతవార్త): పరిశ్రమల నిర్వహణకు, కొత్త ప్రాజెక్టుల ఏర్పాటుకు జిల్లా యంత్రాంగం నుంచి పూర్తి సహకారం ఉంటుందని జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ పేర్కొన్నారు. జిల్లాలోని వివిధ విభాగాల అధికారులతో కలెక్టరేట్ మీటింగు హాలులో శుక్రవారం మధ్యాహ్నం జరిగిన డీఐఈపీసీ (డిస్ట్రిక్ట్ ఇండస్ట్రియల్ ఎక్స్పోర్ట్ అండ్ ప్రమోషన్ కమిటీ) సమావేశంలో కలెక్టర్ పలు అంశాలపై అధికారులకు దిశా నిర్దేశం చేశారు. గత కమిటీ సమావేశంలో చర్చించిన అంశాలపై తీసుకున్న చర్యలు, పారిశ్రామిక అనుమతులు, ఏర్పాటుచేసిన యూనిట్లకు అందించవలసిన ప్రోత్సాహకాలు తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పరిశ్రమలు, పారిశ్రామిక యూనిట్ల ఏర్పాటుకు అవసరమైన ప్రోత్సహకాలు, అనుమతులు త్వరితగతిన మంజూరుచేసి ప్రోత్సహించాలని అధికారులకు తెలిపారు. పారిశ్రామిక అనుమతులు కొరకు సింగిల్ డెస్క్ పాలసీ లో వివిధ శాఖల వద్ద పెండింగులో గల ధరఖాస్తులపై అధికారులకు పలు సూచనలు చేశారు. పరిశ్రమలు స్థాపనకు వచ్చిన ధరఖాస్తులు పరిశీలించి అర్హత, ఆశక్తి గల వారికి వెంటనే అనుమతులు, మౌళిక సదుపాయాలు కల్పించాలని, రుణసదుపాయం పొందేందుకు సహకారం అందించాలని తెలిపారు. అనుమతులు మంజూరు చేసిన యూనిట్ల నిర్మాణ పనులు త్వరగా పూర్తిచేసి, ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలన్నారు. కేటాయించిన భూముల్లో నిర్ణీత సమయంలో సదరు నిర్వాహకులు పరిశ్రమలు నెలకొల్పేలా చర్యలు తీసుకోవాలని లేనిపక్షంలో అనుమతులు రద్దు చేసి కొత్త వారికి కేటాయించాలని ఆదేశించారు. జిల్లాలో మంజూరై ప్రారంభించిన యూనిట్లకు సబ్సిడీ ప్రోత్సాహకాలు అందించాలన్నారు. ముఖ్యంగా పారిశ్రామిక వాడల్లో అవస్థాపనా సౌకర్యాలు కల్పించటంపై దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి వై సత్యనారాయణ రావు, పరిశ్రమలు జనరల్ మేనేజరు కె.పి.కె. ప్రసాద్, ఎల్.డి.ఎం., కె. సత్యనారాయణ, కమిటీ సభ్యులు, వివిధ విభాగాల జిల్లా స్థాయి అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## సంతకు వచ్చే ప్రజలకు మజ్జిగ పంపిణీ!



(నక్కపల్లి ,ప్రభాతవార్త): నక్కపల్లి సత్య సాయిబాబా భజన మండలి ఆధ్వర్యంలో ప్రతి శుక్రవారం వారపు సంతకు వచ్చే ప్రజల దాహార్తిని తీర్చేందుకు సేవా కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మజ్జిగ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న ఆంజనేయస్వామి ఆలయం వద్ద మజ్జిగ చలివేంద్రాన్ని ఏర్పాటు చేసి భజన మండలి సభ్యులు కక్కిరాల సురేష్ తో పాటు నున్న విశ్వేశ్వరరావు, కొత్త భగవాన్ ,నున్న కాశీ విశ్వనాథ్ ,సత్తికొండ, నవర నూకరాజు శర్మ , కర్రి వెంకట సత్యనారాయణ (కే.వి) తదితరులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున భజన మండలి సభ్యులు పాల్గొన్నారు.

## వి.హనుమంతరావును సత్కరించిన తోట నగేష్





(నక్కపల్లి , ప్రభాతవార్త): తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక సలహాదారులుగా ఇటీవల నియమితులైన మాజీ రాజ్యసభ సభ్యులు ,ఉమ్మడి రాష్ట్రాల మాజీ పీసీసీ అధ్యక్షులు వి. హనుమంతరావును ఉమ్మడి విశాఖ జిల్లా మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ తోట నగేష్ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సచివాలయంలో శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా హనుమంతరావును తోట నగేష్ ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా నగేష్ హనుమంతరావుకు శుభాకాంక్షలు తెలిపారు. మీలాంటి అనుభవం కలిగిన వ్యక్తులు ప్రభుత్వ సలహాదారులుగా బాధ్యతలు చేపట్టడం సంతోషంగా ఉందని నగేష్ అన్నారు. ఈ సందర్భంగా నగేష్ ను హనుమంతరావు ఆశీర్వదించారు. అనంతరం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు హనుమంతరావు రాజకీయ జీవిత చరిత్ర పుస్తకాన్ని నగేష్‌కి ఆయన చేతుల మీదుగా తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో అందజేశారు. ఆయనతోపాటు అయినంపూడి రామకృష్ణంరాజు ఉన్నారు.

## అచ్చుతాపురంలో విద్యాశాఖ ప్రత్యేక దృష్టి

### ప్రభుత్వ పాఠశాలల్లో చేరికలపై వేగం పెంచిన అధికారులు

(అచ్చుతాపురం, మే 22, ప్రభాతవార్త): అచ్చుతాపురం మండలంలో ఐదేళ్లు పూర్తిచేసుకున్న చిన్నారులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేందుకు విద్యాశాఖ ప్రత్యేక చర్యలు చేపట్టింది. మండలంలో మొత్తం 920 మంది ఐదేళ్ల పిల్లలు ఉండగా, ప్రభుత్వ లక్ష్యాల ప్రకారం వీరిలో 55 శాతం మందిని ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాల్సి ఉంది.ఇప్పటివరకు 121 మంది చిన్నారులు మాత్రమే ప్రభుత్వ పాఠశాలల్లో చేరగా, ఇది 23.91 శాతంగా నమోదైంది. లక్ష్యాన్ని చేరుకునేందుకు ఇంకా 385 మంది పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాల్సి ఉందని మండల విద్యాశాఖ అధికారులు తెలిపారు.ఈ నేపథ్యంలో గ్రామాల వారీగా ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించేందుకు అధికారులు ప్రణాళిక సిద్ధం చేశారు. అంగన్‌వాడీ కేంద్రాలు, గ్రామ విద్యా కమిటీలు, ఉపాధ్యాయులతో కలిసి ఇంటింటి ప్రచారం చేపట్టి తల్లిదండ్రులకు ప్రభుత్వ పాఠశాలల్లో అందిస్తున్న నాణ్యమైన విద్య, మధ్యాహ్న భోజనం, ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫాంల గురించి వివరించనున్నారు.ప్రభుత్వ పాఠశాలల్లో చేరికలు పెంచేందుకు ఉపాధ్యాయులు సమిష్టిగా కృషి చేయాలని మండల విద్యాశాఖ అధికారి యం ఇ ఒ దేవరాయల్ సూచించారు. విద్యార్థుల భవిష్యత్తు దృష్ట్యా ప్రభుత్వ పాఠశాలలను వినియోగించుకోవాలని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు.

## చోద్యం...జమ్మవరంలో సమగ్ర భూ సర్వేకు శ్రీకారం



గొలుగొండ, మే 22, ప్రభాతవార్త: రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన సమయానికి సమగ్ర భూ సర్వే పూర్తి చేసి భూ సమస్యలను పరిష్కరించి సమర్థవంతమైన భూ రికార్డులను రైతులకు అందజేయాలని అధికారులకు కూటమి నాయకులు సూచించారు. చోద్యం రెవెన్యూ, జమ్మవరం రెవెన్యూ లో శుక్రవారం సమగ్ర భూ సర్వే పనులను పిఏసిఎస్ అధ్యక్షులు చిటికెల సాంబమూర్తి, మాజీ సర్పంచ్ ఆదుపురెడ్డి గోపాలకృష్ణ, వైస్ ఎంపీపీ సుర్ల ఆదినారాయణ చోద్యంలో ప్రారంభించారు. జమ్మవరంలో గ్రామ పార్టీ అధ్యక్షుడు కవల మహేష్, కన్వీనర్ బాబురావు తో కలిసి రీ సర్వే ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రైతులకు సమర్థవంతమైన భూ రికార్డులు అందించే విధంగా అధికారులను సిద్ధం చేసి రైతులను క్రోడీకరించి సర్వేను జరిపించాలని ఆదేశించిందన్నారు. సర్వేలో ఎటువంటి తలెత్తకుండా రైతులకు సర్వే ప్రాముఖ్యతను వివరించి తదుపరి సర్వే ప్రారంభించాలని ఈ సందర్భంగా సూచించారు. 2027 మార్చి నాటికి ప్రతి రైతు చేతిలో సమగ్ర భూ సర్వే అనంతరం పట్టాదారు పాస్ బుక్ చేతిలో ఉండాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నారు. సమగ్ర సర్వేలో జిరాయితీ భూములన్నీ లెక్కించి రైతు వద్ద ఉన్న ఆధారాలు కనుగుణంగా సాగు విధానాన్ని బట్టి నూతన రికార్డులు తయారు చేస్తారని అన్నారు. భూమి కలిగిన ప్రతి రైతు అధికారులు ఆదేశాల మేరకు సర్వేలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రీ సర్వే డీటీ కొండబాబు భూ రికార్డుల స్పష్టత, భూవివాదాల పరిష్కారానికి సమగ్ర సర్వే ఉపయోగపడుతుందని తెలిపారు. సర్వే సిబ్బంది, వీఆర్వో రాజు, మాజీ సర్పంచ్ ఆదుపురెడ్డి ప్రభాకర్ రావు, గ్రామ పార్టీ అధ్యక్షుడు అడిగేర్ల స్వామినాయుడు, కొరుప్రోలు మాధవరావు, బూత్ కన్వీనర్ బుచ్చిబాబు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## జలధార -జల హారతి పై విస్తృత ప్రచారం

### దాతలు ముందుకు రండి : ఇంచార్జి ఎంపీడీవో "దెందుకూరి"




(నక్కపల్లి రూరల్, ప్రభాతవార్త) : కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మంగా చేపట్టిన జల దార జల హారతి కార్యక్రమాన్ని గ్రామాల్లో ప్రతి ఒక్కరు జయప్రదం చేయాలని ఇన్చార్జి ఎంపీడీవో దెందుకూరు సీతారామరాజు పిలుపునిచ్చారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు శుక్రవారం మండలంలోని ఉపమాక గ్రామంలో కుమ్మరి గుంట చెరువు నందు పూడికతీత పనులను ఈ సందర్భంగా పరిశీలించారు. ముందుగా ఉపాధి హామీ కూలీలతో మాట్లాడిన సీతారామరాజు ఎండ అధికంగా ఉండడం వలన వృద్ధులు చాలా జాగ్రత్తలు తీసుకోవాలని, మంచినీటిని అందుబాటులో పెట్టుకోవాలని సూచించారు. జలహారతి కార్యక్రమం ద్వారా చెరువుల అభివృద్ధి జరుగుతుందని తద్వారా భవిష్యత్తులో ఆయికట్టుదారు రైతులకు ఎంత ఉపయోగపడుతుందని, దానికి మీ అందరి కృషి ఫలితమేనని అన్నారు .ఈ కార్యక్రమంలో దాతలను సంప్రదిస్తున్నామని ,వారు ముందుకు వస్తే మరింతగా ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేసేందుకు ఉపయోగపడుతుందని, కూలీలకు మరింత ఊరట కలుగుతుందని అన్నారు. అనంతరం నక్కపల్లి గ్రామంలో స్వచ్ఛ ఆంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ప్లాస్టిక్ వస్తువులు నిషేధంపై షాపులు వారీగా ప్రచారం నిర్వహించారు. అందులో భాగంగా స్థానిక వైన్ షాప్ వద్ద ఉన్న ప్లాస్టిక్ వస్తువులను స్వచ్ఛరథం వాహనానికి అప్పజెప్పారు. ఈ మేరకు నక్కపల్లి గ్రామంలో ఉన్న చెత్త నుంచి సంపద తయారు చేసే కేంద్రాన్ని పరిశీలించిన ఆయన కార్యదర్శి పివిపి రాజశేఖర్ కు పలు సూచనలు చేశారు. గ్రామంలో పెద్ద ఎత్తున ప్రచారం నిర్వహించాలని ఎక్కడ కూడా చెత్త ఉండడానికి వీలు లేదని తడి పొడి చెత్తను వేరు చేసి కేంద్రానికి పంపించే విధంగా చర్యలు చేపట్టాలని ,చెత్త సంపద కేంద్రంలో తయారైన ఎరువును రైతులకు కొనుగోలు చేసే విధంగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఆయనతోపాటు ఏపీవో భాగ్యలక్ష్మి, కార్యదర్శి చిన్నమనాయుడు తదితరులు ఉన్నారు.

## కూటమి ప్రభుత్వంలో ప్రభుత్వ పాఠశాలలకు మహర్దశ

### ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్



ఎలమంచిలి, మే 22, ప్రభాతవార్త: పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ప్రభుత్వం బడి చదువు అద్భుతమైన గెలుపు..అభినందన కార్యక్రమం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఇటీవల విడుదలైన పదో తరగతి ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఎమ్మెల్యే ప్రత్యేకంగా సన్మానించారు.నియోజకవర్గ పరిధిలోని నాలుగు మండలాల్లో ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించిన మొత్తం 17 మంది విద్యార్థులకు ఎమ్మెల్యే స్వంత నిధుల నుంచి ఒక్కొక్కరికి నగదు బహుమతులు అందజేశారు. అదేవిధంగా అనకాపల్లి జిల్లాలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించి నగదు ప్రోత్సాహకాలు, సాలువాలు, మెమొంటోలు , ప్రశంసాపత్రాలు అందజేశారు.విద్యార్థులకు మంచి ఫలితాలు తీసుకురావడంలో కృషి చేసిన ఉపాధ్యాయులను కూడా ఎమ్మెల్యే సత్కరించారు. గత సంవత్సరం కూడా ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు స్వంత నిధులతో ప్రోత్సాహకాలు అందించిన విషయాన్ని ఉపాధ్యాయులు గుర్తు చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం విద్యా రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చిందని తెలిపారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ చొరవతో ఏపీ విద్యా వ్యవస్థ అంతర్జాతీయ ప్రమాణాల దిశగా ముందుకు సాగుతోందన్నారు. వంద రోజుల ప్రణాళికలతో ఈసారి పదో తరగతి ఫలితాలు గతంలో ఎన్నడూ లేనంతగా ఫలితాలు వచ్చాయని అన్నారు.ప్రభుత్వ పాఠశాలల్లో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థుల ఫోటోలను పత్రికల్లో ప్రకటనల రూపంలో ప్రచురించడం కూటమి ప్రభుత్వ ప్రత్యేకత అని ఉన్నారు. ఈసారి పదో తరగతి ఫలితాల్లో బాలికలే అత్యుత్తమ ప్రతిభ కనబరిచారని, ఆడపిల్లలు బంగారు తల్లులని కొనియాడారు.విద్యార్థులు చిన్న చిన్న తప్పిదాలకు దూరంగా ఉండాలని, ప్రతి ఒక్కరికీ జీవితంలో ఒక స్పష్టమైన లక్ష్యం అవసరమని ఎమ్మెల్యే గ సూచించారు. అనకాపల్లి జిల్లా ఉప విద్యాశాఖ అధికారి అప్పారావు, ఎంఈఓ అరుణ్ కుమార్, నాలుగు మండలాల ఎంఈఓలు, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు, ఉపాధ్యాయులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

## స్వచ్ఛమైన పట్టణ నిర్మాణంలో ప్రతి పౌరుడు భాగస్వామి కావాలి



ఎలమంచిలి, మే 22, ప్రభాతవార్త: ఆపరేషన్ క్లీన్ స్లీప్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం నుండి జూన్ 20వ తారీకు వరకు పరిపాలక సంఘ పరిధిలో విజిబుల్ క్లీన్లీనెస్ మెరుగుపరుచుటకు ప్రధాన రహదారులు ఆర్టీసీ కాంప్లెక్స్ నుండి రైల్వే స్టేషన్ వరకు భవనం వీధిలోని పిచ్చి మొక్కలు తొలగించి కాలవలను క్లీనింగ్ చేయించి వెంటనే డాక్టర్ని చెత్త ఎక్కించడం జరుగుతుంది. అదేవిధంగా ప్రజల్లో పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తూ స్వచ్ఛమైన పట్టణ నిర్మాణంలో ప్రతిపౌరుడు భాగస్వామి కావాలనే ఉద్దేశంతో ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా పరిశుభ్రత చర్యలు, సుందరీ కరణ, పచ్చదనం అభివృద్ధి, ఆధ్యాత్మిక సందేశాలతో అలంకరణలు మెరుగైన నిర్వహణ చేపడుతున్నారు. దీని ద్వారా పట్టణ సౌందర్యం పెంపొందించడంతోపాటు ప్రజల్లో పరిశుభ్రత పర్యావరణ పరిరక్షణ సాంస్కృతిక విలువలపై చైతన్యం పెంపొందించబడుతుందని, ఈ కార్యక్రమంలో కమిషనర్ బి జె ఎస్ పి రాజు, సానిటరీ ఇన్స్పెక్టర్ పల్లా శ్రీనివాసరావు, సానిటరీ సెక్రటరీలు శానిటరీ మేస్త్రిలు సానిటరీ వర్కర్లు ప్రజలు పాల్గొన్నారు.

## పార్టీ బలోపేతానికి కృషి చేయండి: గొర్ల గోవిందు



(నక్కపల్లి రూరల్/ అడ్డురోడ్డు ,ప్రభాతవార్త): వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ గ్రామంలో బలోపేతం చేసేందుకు అందరం కలిసికట్టుగా పని చేద్దామని అందుకు ప్రతి ఒక్కరు ముందుకు రావాలని మండల వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గొర్ల గోవిందు పార్టీ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. మండలంలోని రేబాక గ్రామంలో శుక్రవారం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సమావేశం నిర్వహించారు . వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వీసం రామకృష్ణ నాయకత్వంలో మాజీసర్పంచ్ సాది రెడ్డి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో మండల పార్టీ అధ్యక్షులు గొర్ల గోవిందరావు గ్రామాల్లో బిఎల్ఓ లు నియామకం వెంటనే చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీ వెల్లంకి కాసుబాబు , మాజీ ఉప సర్పంచ్ శ్రీను, గ్రామ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, అనుబంధ విభాగాల అధ్యక్షులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## ప్రజా దర్బార్‌లో అర్జీలను స్వీకరించిన చలపతిరావు



ఎలమంచిలి, మే 22, ప్రభాతవార్త: పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో శుక్రవారం ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా మాజీ పార్లమెంట్ సభ్యులు, సీనియర్ తెలుగుదేశం నాయకులు పప్పల చలపతిరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చలపతిరావు సమస్యలపై వచ్చిన వారి వద్ద నుండి అర్జీలను స్వీకరించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సమస్యలన్నీ ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్తానని అన్నారు. కార్యక్రమంలో టిడిపి పట్టణ పార్టీ అధ్యక్షులు గొర్లె శివన్నారాయణ (నానాజీ), జిల్లా అధికార ప్రతినిధి దాడి రమేష్, క్లస్టర్ ఇంచార్జ్ బొద్దపు శ్రీనివాసరావు, కరణం రవికుమార్, యూత్ అధ్యక్షులు నమ్మి రమణ, పట్టణ తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు దంట్ల వెంకటస్వామి, సేనాపతి తులసీరామ్, ఎల్లపు గోపి, కోటి బాబు, అర్జున్ మూర్తి, పాల్గొన్నారు.

## 10వ తరగతి ప్రతిభావంతులకు ఆర్థిక నగదు,బహుమతి అందజేత



(ఎస్ రాయవరం, మే 22, ప్రభాతవార్త ): ఇటీవల జరిగిన మార్చి 10వ తరగతి పబ్లిక్ పరీక్షల్లో పెదగుమ్ములూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు కనిగిరి హరిణి, 591 ఎర్రంశెట్టి సులోచన షారోన్ 561, జామి అభిషేక్ ప్రవీణ్ 547, అధిక మార్కులు సాధించి పాఠశాల విద్యార్థులందరికీ ఆదర్శంగా నిలిచిన కారణంగా , గతంలో స్థానిక పాఠశాలలో విద్యను అభ్యసించిన పూర్వ విద్యార్థి బొడ్డా శివరామారావు ముగ్గురు విద్యార్థులకు పదివేల రూపాయల ఆర్థిక నగదును అందించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు శ్రద్ధగా క్రమశిక్షణతో విద్యను అభ్యసించి, ఉన్నత స్థానానికి ఎదగాలని గ్రామానికి ఆదర్శంగా నిలవాలని, ప్రభుత్వ పాఠశాల యొక్క కీర్తి ప్రతిష్టలను నలుదిశలా వ్యాప్తి చెందాలని విద్యార్థులకు సూచించారు. వారి విజయం పట్ల విద్యార్థులను, విద్యార్థుల తల్లిదండ్రులను అభినందించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఆర్థిక నగదు బహుమతిని అందించిన శివ రామారావును పాఠశాల ప్రధానోపాధ్యాయిని సుధా మాధురి,మోడల్ ప్రైమరీ ప్రధానోపాధ్యాయులు సత్యనారాయణ ఉపాధ్యాయ బృందం అభినందించారు.ఈ సహాయం విద్యార్థుల వ్యక్తిగత ఎదుగుదలకు ఉన్నత విద్యను అభ్యసించడానికి ఎంతో సహకరిస్తుందని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు సహాయం చేయడం దైవత్వంతో సమానమని ప్రధానోపాధ్యాయిని సుధామాధురి తెలియజేశారు. కార్యక్రమంలో బొడ్డా అప్పారావు, మంగ దంపతులు, ఉపాధ్యాయులు శ్రీనివాసరావు , తదితరులు పాల్గొన్నారు.

## మత్స్యకారులకు పంపిణీ చేసే సరుకుల్లో ఇబ్బందులున్నాయి



(నక్కపల్లి రూరల్, ప్రభాతవార్త): రాజయ్యపేటలో మత్స్యకారుల వేట నిషేధ సమయంలో ఆదుకోవడానికి 'హెటెరో' సంస్థ యాజమాన్యం రాజయ్యపేట మత్స్యకారుల కోసం నిత్యావసర సరుకులను పంపిణీ చేసిన సరుకుల లో తీవ్రమైన ఇబ్బందులు జరుగుతున్నాయని, అర్హులైన పేద మత్స్యకారులకు అందడం లేదని సి.పి.ఐ జిల్లా సమితి సభ్యులు బి. బాబ్జీ ఆవేదన వ్యక్తం చేశారు. రేషన్ డీలర్ల ద్వారా ప్రజలకు అందాల్సిన ఈ సరుకులు, అనేకమందికి "లిస్టులో పేరు లేదు" లేదా "ఆన్‌లైన్‌లో కనిపించడం లేదు" అనే సాకులతో నిరాకరిస్తున్నారని బాబ్జి ఆరోపించారు. హెటెరో సంస్థ నుండి వచ్చిన సరుకులు ఎంతమందికి పంపిణీ చేశారు? అవి కేవలం కొంతమందికే పరిమితం అయ్యాయా? లేక వచ్చిన సరుకులను ఇతర మార్గాలకు దారి మళ్లించారా? అనే అంశంపై సంబంధిత అధికారులు తక్షణమే స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు.

## ఉపాధి హామీ పథకం కూలీలకు అల్పాహారం అందజేత



(ఎస్.రాయవరం, మే22, ప్రభాతవార్త): మండలంలోని తిమ్మాపురం శివారు కోనవానిపాలెంలో శుక్రవారం ఉపాధి హామీ పథకం కూలీలకు అల్పాహారం అందించినట్లు జనసేన నాయకులు కోన దుర్గాప్రసాద్ తెలిపారు. తన మాతృమూర్తి కీ.శే. కోన దుర్గమ్మ 28వ వర్ధంతి స్మృత్యర్థం కుటుంబ సభ్యులు గ్రామంలో ఉపాధి హామీ పథకం శ్రామికులకు ఇడ్లీ, బొండాలు,చట్నీ, కూడిన అల్పాహారాన్నిఅందించారు. గ్రామస్తులు దుర్గమ్మ సేవలను స్మరించుకుని నివాళులర్పించారు. మామిడి నాగరాజు, కోన అప్పలరాజు, శానాపతి బాబురావు మాస్టారు, దారబోయిన సత్యనారాయణ, కోన గురాచార్యులు,పక్కుర్తి దుర్గబాబు,కోన రాజేష్,కోన మురళి కృష్ణ,కోన రామకృష్ణ, కోన సూర్యప్రకాష్, గొర్ల సాయి, తదితరులు పాల్గొన్నారు.

## ఎల్లయ్య గ్రేయిన్ నిర్మాణ పనులు పరిశీలించిన కొణతాల



అనకాపల్లి,మే 22:( ప్రభాత వార్త): అనకాపల్లి నియోజకవర్గం శారదా నదిపై గ్రోయిన్లు మరమ్మతు పనులను ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ శుక్రవారం పరిశీలించారు. కొణతాల రామకృష్ణ చొరవతో తుమ్మపాల గ్రామంలో స్మశాన వాటిక దగ్గర ఎల్లయ్య గ్రోయిన్ కు సుమారు కోటి 19 లక్షలు రూపాయల నిధులు మంజూరు చేశారు. ఈ నిధులతో నీటి సంఘాల పర్యవేక్షణలో గ్రోయిన్లు మరమ్మత్తుల పనులు మొదలైన సందర్భంగా రామకృష్ణ జరుగుతున్న పనులను స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా నీటి పారుదలశాఖ సహాయ ఇంజనీర్ రూపా ఇందుకు సంబంధించిన వివరాలు తెలియజేశారు. కొణతాల తగు సూచనలు చేశారు. వీలైనంత తొందరగా నాణ్యతతో కూడిన పనులు పూర్తి చేయాలని ఆదేశాలు ఇచ్చారు. మూలపేట గ్రామంలో వెలిసియున్న గంగాలమ్మ తల్లి అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో నీటి సంఘాల చైర్మన్లు, రైతులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

## రక్షిత నీటి వనరులను నిర్ణీత సమయంలో సరఫరా చేయాలి



(ఎస్ రాయవరం,మే 22, ప్రభాతవార్త ): మండలంలోని రక్షిత తాగునీటి వనరులను నిర్ణీత సమయంలో శుభ్రం చేసి.. క్లోరినేషన్ చేసిన తర్వాత మాత్రమే ప్రజలకు సరఫరా చేయాలని డిప్యూటీ ఎంపిడిఓ బంగారు సత్యనారాయణ పేర్కొన్నారు. శుక్రవారం దార్ల పూడి గ్రామ పంచాయతీలో గల తాగు నీటి సరఫరా వనరులను, పారిశుధ్య పనులు మరియు డ్రైన్స్ శుభ్రం చేస్తున్న పనులను ఆయన పరిశీలించారు. ప్రతి పంచాయతీ కార్యదర్శి ప్రభుత్వం నిర్దేశించిన విధంగా ప్రణాళికా బద్ధంగా పంచాయతీ పాలన నిర్వహించాలని, ఐవీఆర్ఎస్ కాల్స్ ద్వారా ప్రజల నుంచి పంచాయతీలలో అందిస్తున్న,వివిధ రకాల సేవలపై,అభిప్రాయ సేకరణ జరుగుతుందన్నారు.ప్రజలతో సమన్వయం కుదుర్చుకుని సానుకూల స్పందన సాధించాలన్నారు . దార్ల పూడి గ్రామ పంచాయతీలో దగ్గర ఉండి తాగు నీటి వనరులను, క్లోరినేషన్ ప్రక్రియను నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శి గంగరాజు, పంచాయతీ సిబ్బందిపాల్గొన్నారు.

## లాలం కొత్తూరులో కిశోర వికాసం కార్యక్రమం



కసింకోట, మే 22, ప్రభాతవార్త : మండలంలోని లాలం కొత్తూరు గ్రామంలో స్థానిక అంగన్వాడి కేంద్రం సిబ్బంది ఆధ్వర్యంలో మహిళల ఉజ్వల భవిష్యత్తుకు కిశోర వికాసం కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఐసిడిఎస్ సూపర్వైజర్ సునీత పాల్గొని మాట్లాడుతూ ఉత్సవాల భవిష్యత్తుకు కిశోర వికాసం ఎంతో దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమం ద్వారా ఆడపిల్లలకు ఆత్మస్థైర్యం, వ్యక్తిగత జీవన విధానం, సమాజంలో జరుగు బాల్యవివాహాలపై అవగాహన వంటివి బాధితులకు ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీలు, ఐసిడిఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక అర్జీదారులకు ఉచిత భోజన పంపిణీ

### ఉచిత భోజన పంపిణీని ప్రారంభించిన జిల్లా కలెక్టర్ టి.నిశాంతి



పాడేరు, మే 22, ప్రభాతవార్త

సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ పాడేరు, అన్న క్యాంటీన్' సంయుక్త ఆధ్వర్యంలో విశేషంగా కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ప్రతి వారం జిల్లా నలుమూలల నుండి తమ సమస్యల పరిష్కారం కోసం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (గ్రీవెన్స్ సెల్)కు వచ్చే అర్జీదారుల సౌకర్యార్థం ఉచిత భోజన పంపిణీ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ టి.నిశాంతి, జిల్లా జాయింట్ కలెక్టర్ తిరుమాని శ్రీపూజ, ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి ఆదిత్య వర్మ సంయుక్తంగా ఉచిత భోజన కార్యక్రమాన్ని అధికారికంగా శుక్రవారం ఐటిడిఏ ప్రాంగణంలో ప్రారంభించారు. సుదూర ప్రాంతాల నుండి వచ్చే గిరిజనులు, పేద ప్రజలు ఆకలితో అలమటించకుండా చూడటం, ఆకలి తీర్చడం బాధ్యతగా భావించి, కొంతమంది బయట భోజనం చేయలేక ఆకలితో తిరిగి వెళ్లే వారికి ఇదొక మంచి అవకాశం అని, అలాగె పిజిఆర్ఎస్‌లో వారి సమస్యలను తెలపడానికి వచ్చిన అర్జీదారుల ప్రతి ఒక్కరికి ఈ భోజన సదుపాయం అందించడం జరిగిందన్నారు. ఐటీడీఏ పాడేరు విభాగం, అన్న క్యాంటీన్ నిర్వాహకుల సంయుక్తంగా నిర్వహించే ఈ ఉచిత భోజనం కార్యక్రమం పిజిఆర్ఎస్ అర్జీదారు అందించడం జరుగుతుందన్నారు. ప్రతి శుక్రవారం గ్రీవెన్స్ సెల్‌కు వచ్చే అర్జీదారులందరికీ ఉచితంగా భోజన సదుపాయం కల్పించబడుతుందని కలెక్టర్ నిశాంతి పేర్కొన్నారు. సుదూర ప్రాంతాల నుండి ఎన్నో ఆశలతో ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే ప్రజలకు కనీస వసతులు కల్పించడం తమ బాధ్యతని, అందులో భాగంగానే ఈ ఉచిత భోజన పంపిణీ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామని కలెక్టర్ తెలిపారు. ఈ సదుపాయాన్ని అర్జీదారులందరూ సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు. అనంతరం ఉచిత భోజనం చేస్తున్న ముంచంగిపుట్టు మండలానికి చెందిన భోజనం ఎలా ఉందని కలెక్టర్ ఆరా తీశారు, అలాగే కొయ్యూరు మండలం, యూసిడి పాలెం గ్రామం నుండి వచ్చిన బలరాముని కలెక్టర్ భోజనం సదుపాయం ఏలాగ ఉంది..అని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ ఏవో హేమలత, ట్రైబల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ పీబికే పరిమిల, అన్ని శాఖల జిల్లా అధికారులు, అన్న క్యాంటీన్ ప్రతినిధులు,సిబ్బంది పాల్గొన్నారు.

## అటవీశాఖలో డ్రగ్స్ వద్దు బ్రో అవగాహన కార్యక్రమం

పాడేరు,మే22, ప్రభాతవార్త



ఈగల్ ఐ.జి.పి. ఆకే రవి కృష్ణ,ఎస్పీ లు కే.ఏం. మహేశ్వరరాజు నగేష్ బాబు ఆదేశాల మేరకు లిడ్రగ్స్ వద్దు బ్రో అవగాహన కార్యక్రమం ఈగల్ సెల్ పాడేరు జిల్లా ఆధ్వర్యంలో అటవీ శాఖ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈగల్ టీమ్ అధికారులు మాట్లాడుతూ గంజాయి సాగు మరియు అక్రమ రవాణా నిరోధంలో అటవీశాఖ కీలకపాత్ర పోషిస్తుందన్నారు. అటవీ శాఖ పకృతిని మాత్రమే కాదు సమాజ భవిష్యత్తును కూడా డ్రగ్స్ నుంచి కాపాడాల్సిన బాధ్యత ఉందన్నారు. ఇన్స్టాగ్రామ్ ఈగల్ ఐడి లింక్ ఏపీ 1972 వారి సిబ్బందితో ఫాలో చేయించారు. దేశాన్ని ప్రేమించేవారు డ్రగ్స్ ముట్టరన్నారు. ఈ మధ్యకాలంలో స్కూళ్లు, కాలేజీలు యూనివర్సిటీలు అలాగే చదువుకున్న వారు చదువు లేని వారు ఉద్యోగులు చాలామంది కూడా డ్రగ్స్ ఆడిట్ కావడం జరిగిందన్నారు. డ్రగ్స్ కు పెట్టే డబ్బు పొరుగు దేశాలకు టెర్రరిస్టులకు నక్సలైట్లకు చేరుతుందన్నారు. ఆ డబ్బు ద్వారా వారు ఆయుధాలు కొనుగోలు చేసి మన దేశం మీదనే దాడి చేస్తారు దీన్నే నార్కో టెర్రరిజం అంటారనీ పేర్కొన్నారు.. ఎన్డిపిఎస్ యాక్టు 1985 సెక్షన్ 47 గురించి ఫారెస్ట్ సిబ్బందికి వివరించారు. "ఆపరేషన్ చైతన్యం డ్రోన్ సరోలెన్స్ ద్వారా గంజాయి సాగు గుర్తించి నిర్మూలము చేయబడిందని ఎక్కడైనా పొరపాటున ఉంటే సమాచారం కచ్చితంగా ఈగల్ టీంకు తెలియజేయాలని కోరారు.డ్రగ్ ఫ్రీ ఫారెస్ట్ – డ్రగ్ ఫ్రీ సొసైటీ లక్ష్యంగా ముందుకు సాగాలన్నారు. అటవీ సంపదను కాపాడుదాం... యువత భవిష్యత్తును రక్షిద్దాం.. యువత డ్రగ్స్ అలవాటు పడితే ఈగల్ టోల్ ఫ్రీ నెంబర్ 1972 కి సమాచారం ఇవ్వాలని కోరారు. ఎన్డిపిఎస్ యాక్టు 1985 ఫారెస్ట్ సిబ్బందికి అవగాహన కల్పించి.ఈగల్ చేస్తున్నటువంటి అనేకమైన ఆపరేషన్ గురించి వివరించారు. అటవీ శాఖ ఈగల్ టీంకు సహకరించి కలిసి కట్టుగా డ్రగ్స్ రహిత రాష్ట్రం గా మార్చడానికి కృషి చేద్దాం అని టీమ్ అధికారులు పిలుపు నిచ్చారు. డ్రగ్స్ వల్ల నెక్స్ట్ జనరేషన్ చూడలేమని దీని విషయంలో చాలా అప్రమత్తంగా ఉండాలని డ్రగ్స్ ఫ్యాషన్ కోసం తీసుకుని అలవాటుగా మారి బానిసగా అయిపోయి చాలామంది యువత డ్రగ్స్ నుంచి బయటకు రాలేక కుటుంబానికి సమాజానికి నష్టం కలిగిస్తూ చివరికి ఆరోగ్యం కోల్పోయి చాలా నష్టపోతున్నారన్నారు.ఈ సందర్భంగా ఫారెస్ట్ సిబ్బందితో డ్రగ్స్ కు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో అటవీశాఖ అధికారి కె.ఉమామహేశ్వరి, ఈగల్ సిబ్బంది ,అటవీశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## చాపరాయి గెడ్డలో స్నానానికి దిగి గిరిజనుడి మృతి



డుంబ్రిగుడ, మే 22 ప్రభాతవార్త:

పర్యాటక కేంద్రం చాపరాయి జలవిహారికి సమీపంలోని హనుమరాయి గెడ్డలో సరదగా స్నానానికి దిగి గిరిజనుడు గల్లంతైన సంఘటన బాధిత గిరిజనుడి కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం ఇలా ఉన్నాయి. పోతంగి పంచాయతీ అంత్రిగుడ గ్రామానికి చెందిన కొర్రా సాంబ్రు(42) అనే గిరిజనుడు స్థానిక మండల కేంద్రంలోని ఓ చికెన్ దుకాణంలో రోజు వారిగా కూలి పని చేస్తున్నారు. దుకాణంలో పని చేసిన ఆయన శుక్రవారం మధ్యాహ్నం స్వగ్రామానికి బయలు దేరారు. మార్గ మధ్యలోని చాపరాయి గెడ్డకు ఆనుకుని హనుమరాయిలో స్నానానికి దిగారని జలవిహారిలో పని చేస్తున్న సిబ్బంది గమనించారు. ఆలోపు హఠత్తుగా గెడ్డలో జారిపడి తెలిపారు మునిగి గల్లంత్తయ్యారని తెలిపారు. జలవిహారి సిబ్బందితోపాటు స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. స్థానిక ఈతగాళ్లతోపాటు, ఎన్డీఆర్ఎఫ్ బృందం గాలింపు చర్యలు చేపట్టి మృతదేహాన్ని వెలికి తీశారు. సంఘటన స్థలంలో బాధిత గిరిజనుడి కుటుంబీకులు మృతదేహాన్ని చూసి బోరున విలపించారు. బాధిత గిరిజనుడికి ఇద్దరు కుమార్తెలు కుమారుడు, వికలాంగురాలైన భార్య ఉన్నారు. మృతదేహాన్ని అరకులోయ ప్రాంతీయ ఆసుపత్రికి తరలించి కేసును నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై సురేష్ తెలిపారు.

## ముఖ హాజరును రద్దు చేయాలని ఆందోళన

డుంబ్రిగుడ, మే 22 ప్రభాతవార్త



గ్రామీణ ఉపాధిహామీ పథకంలో భాగంగా శ్రామికుల ముఖ హాజరును రద్దు చేయాలని ఉపాధిహామీ శ్రామికుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పోతురాజు డిమాండ్ చేశారు మండ లంలోని రంగిలిసింగి పంచాయతీ కింజేరు గ్రామంలో ఉపాధిహామీ శ్రామికులు ముఖ హాజరును రద్దు చేయాలని ఆందోళన చేశారు. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో ఉపాధి పనికి శ్రామికులు ఇబ్బందులు పడాల్సిన దుస్థితి ఏర్పడుతుందన్నారు. ముఖ హాజరును రద్దు చేసి పాత విధానంలోనే పనులు కల్పించి గిరిజనులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని ఆయన కోరారు. గిరిజన సంఘం నాయకులు దొంబు మోహన్ దాసు సన్యాసిరావు, ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

## రూ.75 లక్షల చెక్కుల పంపిణీ

### జిల్లా కలెక్టర్ టి.నిశాంతి

పాడేరు,మే22,ప్రభాతవార్త:



గిరిజన ప్రాంతాల్లోని మహిళా రైతులను ఆర్థికంగా బలోపేతం చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం లక్ష్యమని, అల్లూరి జిల్లా కలెక్టర్ టి.నిశాంతి పేర్కొన్నారు. అల్లూరి జిల్లాలోని ఇంటిగ్రేటెడ్ ఫార్మింగ్ క్లస్టర్ – పథకం కింద ఐదు మండలాల రైతు ఉత్పత్తిదారుల సంఘాల డైరెక్టర్ల బోర్డు సభ్యులకు శుక్రవారం రూ.75, లక్షల రూపాయల చెక్కులను రైతు సభ్యులకు జిల్లా కలెక్టర్ టి.నిశాంతి శుక్రవారం అందజేశారు. ఈ మొత్తాన్ని మండలాల వారీగా నిధులను పాడేరు, జి. మాడుగుల, చింతపల్లి, డుంబ్రిగూడ, అనంతగిరి మండలాలకు ఒక్కొక్క మండలానికి రూ.15, లక్షల రూపాయల చొప్పున ఈ నిధులను కేటాయించారు. ఏడాది పొడవునా ఆదాయం, ఈ నిధుల ద్వారా ఎఫ్‌పిఓ పరిధిలో ఉన్న 300 మంది కిసాన్ మహిళా రైతులకు ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పించి, వారు 365 రోజులూ ఆదాయం పొందేలా ప్రోత్సహిస్తారు. తద్వారా ప్రతి మహిళా రైతు నెలకు రూ.10,వేల చొప్పున, సంవత్సరానికి కనీసం రూ 1,లక్ష రూపాయలు స్థిర ఆదాయం సంపాదించడమే ఈ పథకం యొక్క ముఖ్య ఉద్దేశ్యమని కంటిన్యూస్ హైరింగ్ సెంటర్ల ఏర్పాటు, వ్యవసాయాన్ని మరింత సులభతరం చేసేందుకు ఈ నిధులతో ఆధునిక వ్యవసాయ యంత్రాలైన ట్రాక్టర్, ట్రాలీ, రోటవేటర్, పవర్ టిల్లర్, పవర్ వీడర్, పవర్ స్ప్రేయర్లను కొనుగోలు చేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ తిరుమాని శ్రీ పూజ, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఆదిత్య వర్మ,ఎఫ్ పి ఓ ప్రతినిధులు, స్థానిక మహిళా రైతులు పాల్గొన్నారు.

## స్కూటీ ఢీకొన్న సంఘటనలో బాలునికి తీవ్ర గాయాలు



హుకుంపేట, మే 22,ప్రభాతవార్త

ద్విచక్ర వాహనం (స్కూటీ) ఢీకొన్న సంఘటనలో బాలునికి తీవ్ర గాయాల అయింది. దీనికి సంబంధించి వివరాల ప్రకారం హుకుంపేట మండలం మఠం పంచాయతీ దూరు వీధీ గ్రామానికి చెందిన రెండు సంవత్సరాల వయసు గల ప్రవీణ్ అనే బాలుడు రోడ్డు పక్కన ఆడుకుంటుండగా పాడేరు నుండి పెదబయలు రోడ్డుపై వెళ్తున్న ఏపీ 40 ఏపీ 64 85 స్కూటీ వేగంగా వస్తు బాలుని ఢీకొట్టింది. స్కూటీ ఢీకొనడంతో బాలుడు గాయాలతో పక్కకు పడుపోగా స్కూటీ నడుపుతున్న వ్యక్తి పరారయ్యాడు. సంఘటన స్థలంలో ఉన్న పాంగి గణేష్ అనే వ్యక్తి వారి కుటుంబ సభ్యుల సహాయంతో గాయపడిన బాలున్ని వెంటనే ఆటోలో పాడేరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ విషయం స్థానిక పోలీస్ స్టేషన్‌కి సమాచార అందించడంతో హుకుంపేట సీఐ విజయ్ కుమార్, ఎస్సై దుర్గాప్రసాద్‌లు పాడేరు ఆసుపత్రికి చేరుకుని గాయపడిన బాలుడిని తల్లిదండ్రులతో మాట్లాడి కేసు నమోదు చేశారు. మెరుగైన శిక్ష అందించడం కోసం విశాఖపట్నం కెజిహెచ్ తరలించాగా తమ సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకునే సంఘటన స్థలాన్ని పరిశీలించారు. సంఘటన జరిగిన విధానాన్ని అక్కడ ఉన్నటువంటి వారు ద్వారా తెలుసుకుని కేసును దర్యాప్తు చేస్తున్నారు. అనంతరం దుర్విరి గ్రామ ప్రజలకు రోడ్డు యాక్సిడెంట్లు జరుగుతున్న తీరు వాటిపై తీసుకోవాల్సిన జాగ్రత్తల కోసం అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, రైటర్ సత్యనారాయణ,బాలకృష్ణ పాల్గొన్నారు.

## అర్జీలను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలి..

### జిల్లా అధికారులు సమగ్ర సమాచారంతో హాజరు కావాలి -పిజిఆర్ఎస్‌కు 104 అర్జీలు : జిల్లా కలెక్టర్ టి.నిశాంతి

పాడేరు, మే22, ప్రభాతవార్త



సమీకృత గిరిజన అభివృద్ధి సంస్థలో శుక్రవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్)కు 104 వినతులు వచ్చాయి. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ టి.నిశాంతి, జాయింట్ కలెక్టర్ తిరుమాని శ్రీపూజ, పాడేరు ఐటిడిఏ పివో ఆదిత్య వర్మ, ఇంచార్జ్ డిఆర్వో ఎమ్‌విఎస్ లోకేశ్వరరావులతో కలసి సంయుక్తంగా వివిధ మండలాలలోని, గ్రామాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి వినతులు స్వీకరించారు. అర్జీ దారుల నుండి స్వీకరించిన ఫిర్యాదులను సంబంధిత శాఖ అధికారులకు అందించి త్వరితగతిన అర్జీదారుల సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. ఫిర్యాదులను ఎంత గడువులోగా పరిష్కరిస్తారో ఫిర్యాదుదారునికి తెలియజేయడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని అర్జితాలు సద్వినియోగం చేసుకోవాలని అర్జీదారులకు తెలిపారు. జిల్లాలో ప్రతి శుక్రవారం జరిగే పిజిఆర్ఎస్ కార్యక్రమానికి తప్పనిసరిగా జిల్లా అధికారి ఆ శాఖ సమగ్ర సమాచారంతో హాజరుకావాలని అలా హాజరుకాలేని అధికారి ముందుగానే అనుమతి పొందాలని ఆదేశించారు. పిజిఆర్ఎస్‌లో అధికారి మాత్రమే ఉండాలి, అర్జీదారుని నమోదు కౌంటర్ దగ్గర కింద స్థాయి శాఖ అధికారి ఉండాలని తెలిపారు. జిల్లా కలెక్టర్ నిశాంతి మాట్లాడుతూ ప్రతి సోమవారం మండల స్థాయిలో ఎంపీడీవో కార్యాలయంలో ప్రజా పరిష్కార వేదిక నిర్వహించాలని ఈ కార్యక్రమానికి మండల స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని అలా లేని ఎడల వారిపై తగు శాఖపరమైన చర్యలు ఉంటాయని తెలిపారు. గ్రామ సచివాలయ పరిధిలో ప్రతిరోజు ప్రజా ఫిర్యాదులను స్వీకరించి వారి సమస్యను వెంటనే పరిష్కరించే దిశగా ఆలోచన చేయాలన్నారు. మండల స్థాయిలో వచ్చే అర్జీలను మండల స్థాయి లోనే పరిశీలించినట్లయితే, జిల్లా స్థాయిలో ఎక్కువ మంది ప్రజా ఫిర్యాదులు చేసేందుకు రారని, అలాగే ఫిర్యాదులు తగ్గుతాయని తద్వారా వాటిని వెంటనే పరిష్కరించగలరని తెలిపారు. ప్రతి ఒక్కరికి జిల్లా అధికారుల వివరాలు తెలిసి ఉండాలని, మండల తహశీల్దార్, ఎంపీడీవో, మండలనికి సంబంధించిన అధికారుల వివరాలు తెలుసుకొని ఉండాలన్నారు. గ్రీవెన్స్‌లో ఇచ్చే అర్జీలు పూర్తిగా పరిశీలించి సంబంధిత శాఖకు పంపే విధంగా చూడాలన్నారు. అర్జిదారులు మీ కోసం కాల్ సెంటర్ 1100 సేవలను వినియోగించుకోవాలని,అర్జీలు నేటికీ పరిష్కారం కాకపోయినా, ఫిర్యాదులకు సంబంధించిన సమాచారం తెలుసుకోవడానికి 1100 నంబర్‌కు కాల్ చేయవచ్చన్నారు. అర్జీదారులు వారి అర్జీలు నమోదు చేసుకోవడానికి మీకోసం డాట్ ఏపీ డాట్ జివో వి డాట్ ఇన్) వెబ్సైట్ ను సంప్రదించవచ్చన్నారు.ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ సమస్యలకు పరిష్కారం పొందాలని జిల్లా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా వచ్చే సమస్యలపై ప్రభుత్వం ప్రత్యక్ష పర్యవేక్షణ చేస్తుందని ఐవిఆర్ ఎస్ ద్వారా ప్రజల నుండి అభిప్రాయాలను తీసుకుంటుందని, ప్రజల యొక్క ఫిర్యాదులు పరిష్కరించి వారి యొక్క సంతృప్తి స్థాయిలు పెంచాలని, ఈ ప్రక్రియలో జిల్లా అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపించి ఏ స్వర్ణ గ్రామం, స్వర్ణ వార్డు కార్యాలయాల నుంచి ఎక్కువ ఫిర్యాదులు వస్తున్నాయో ఆ స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు కార్యాలయాల పరిధిలో ఉన్నటువంటి ఫిర్యాదుదారులు లతో మాట్లాడి వారి సమస్యలను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని సమస్య ఎందుకు పరిష్కారం కాదో బాధ్యతగా ఫిర్యాదు దారుణకు వివరించాలన్నారు. ప్రత్యేకంగా భూ సంబంధిత సమస్యలపై వచ్చే ఫిర్యాదులపై ప్రత్యేక శ్రద్ధ వహించేటప్పుడు ఖచ్చితంగా ఫిర్యాదు దారుని భూ రికార్డులను తనిఖీ చేయాలని, ప్రభుత్వం వద్ద ఉన్న సమాచారంతో క్రోడీకరించి సమస్యలను పరిష్కరించాలన్నారు. సమస్యల పరిష్కారంలో అధికారులు అలసత్వం వీడాలన్నారు. మండల స్థాయి అధికారులు సమస్యలను పరిష్కరించుటలో కింది స్థాయి సిబ్బందితో సమన్వయం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ పిబికె పరిమళ, జిల్లా గృహ నిర్మాణ శాఖ అధికారి పి.బాబు, భూగర్భ జల వనరుల శాఖ డిప్యూటీ డైరెక్టర్ డి. శ్రీనివాస రావు, జిల్లా వ్యవసాయాధికారి ఎస్ బిఎస్ నంద్, డిఆర్డిఏ పిడి వి.మురళి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా.డి.కృష్ణ మూర్తి నాయక్, స్వర్ణ గ్రామ స్వర్ణ వార్డు కార్యాలయాల నోడల్ ఆఫీసర్ పి ఎస్ కుమార్, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి మోహన్, ఆర్ బ్ల్యూఎస్ ఈఈ నాగేశ్వరరావు, జిల్లా ఖజానా శాఖాధికారి ప్రసాద్ బాబు, జిల్లా స్త్రీ మరియు శిశు సంక్షేమ శాఖ అధికారిణి ఝాన్సీ రామ్ పడాల్, లీడ్ బ్యాంకు మేనేజర్ మాతు నాయుడు, వ్యవసాయ శాఖ అధికారి, ఉద్యానవన శాఖ అధికారి, జిల్లా పర్యాటక శాఖ అధికారి దాసు, ఐచర్య పరిపాలనాధికారి హేమలత, సోషల్ వెల్ఫేర్, బీసీ వెల్ఫేర్, ఎస్సీ కార్పొరేషన్ అధికారులు పలు మండలల తాహసిల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

## డోలి మోతలు అరికట్టాలి-రహదారి సౌకర్యం కల్పించాలి

### పనసబంద, కిన్నెరలోవ గ్రామస్తుల డిమాండ్



పాడేరు,మే22,ప్రభాతవార్త

అల్లూరి జిల్లా హుకుంపేట మండలం తిగలవలస పంచాయితీకి చెందిన పనస బంధ, కిన్నెర్లోవ పివిటిజి గిరిజన గ్రామాలకు మెరుగైన రహదారి సౌకర్యం కల్పించాలనీ గ్రామస్తులతో కలిసి ఆదివాసి గిరిజన సంఘం ఆధ్వర్యంలో ఐటిడిఏ పీఓ ఆదిత్య వర్మకు పిర్యాదు చేసినట్టు సంఘ నాయకులు టి క్రిష్ణరావు నాయకులు ఎస్ చంద్రుబాబు, కె,ఆసు గిరిజన సమాఖ్య జిల్లా కార్యదర్శి కూడ రాధాకృష్ణ పత్రికా ప్రకటన ద్వారా తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పనసబంధ, కిన్నెర్లోవ పివిటిజి గిరిజన గ్రామాలకు రహదారి సౌకర్యం లేక గర్భిణీ స్త్రీ సిదరి రహిల్ (35) ఈనెల 14 వ తేదీన డెలివరీ కోసం డోలి మోతతో ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో చనిపోయిన శిశువుకి జన్మనిచ్చింది. ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గర్భిణీ స్త్రీలు, బాలింతలు, వివిధ రకాల రోగగ్రస్తులు వైద్య సేవలు పొందడానికి ఆసుపత్రికి వెళ్లడానికి అవస్తలు పడుతున్నారన్నారు. నిత్యావసర సరుకులు తీసుకోవడా నికి, అటవీ ఉత్పత్తులు మార్కెట్లకు తరలించడానికి నానాయతన పడుతున్నారన్నారు. పనసబంధ, కిన్నెర్లోవ గ్రామలలో పీఎం జన్మన్ గృహాలు 65-70 మంజూరైతే నిర్మాణ సామగ్రి తరలించలేక గృహనిర్మాణాలు అర్థాంతరంగా ఆగిపోయిందని వారు తెలిపారు. కావున తక్షణమే రహదారి సౌకుమార్యం కల్పించి మెరుగైన అభివృద్ధికి కృషిచేయాలని వారు డిమాండ్ చేశారు లేనిపక్షంలో పెద్దఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. గిరిజన సంఘం నాయకులు ఆసు, చంద్రబాబు మేజిక్ బస్ ఎన్జీఓ ఈశ్వర్ మంగరాజు, బాబురావు నాగేశ్వరావు శ్రీను లింగన్న రాజమ్మా లక్కీ నయనతార గ్రామస్తులు పాల్గొన్నారు.

## రాజీవ్ గాంధీ దేశానికి ఆధునికతను పరిచయం చేసిన దార్శనికుడు: హాసిని వర్మ

### విశాఖలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఘనంగా రాజీవ్ గాంధీ వర్ధంతి కార్యక్రమం

విశాఖపట్నం, మే 21, ప్రభాతవార్త

మాజీ ప్రధాని, భారతరత్న రాజీవ్ గాంధీ 34వ వర్ధంతి సందర్భంగా విశాఖలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నివాళి కార్యక్రమం నిర్వహించారు. నగరంలోని జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమానికి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు హాసిని వర్మ నాయకత్వం వహించారు. ఈ సందర్భంగా రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం హాసిని వర్మ మాట్లాడుతూ, రాజీవ్ గాంధీ దేశానికి ఆధునికతను పరిచయం చేసిన దార్శనిక నాయకుడని కొనియాడారు. 21వ శతాబ్దపు భారతదేశానికి పునాదులు వేసిన మహానేతగా ఆయన చరిత్రలో నిలిచిపోతారని పేర్కొన్నారు. కంప్యూటర్లు, టెలికాం రంగాన్ని గ్రామీణ ప్రాంతాలకు విస్తరించి డిజిటల్ ఇండియాకు బాటలు వేసిన నాయకుడు రాజీవ్ గాంధీయేనని తెలిపారు. ప్రస్తుతం ప్రతి ఒక్కరి చేతిలో ఉన్న మొబైల్ ఫోన్ వెనుక ఆయన దూరదృష్టి ఉందన్నారు. ఓటు హక్కు వయసును 21 నుంచి 18 సంవత్సరాలకు తగ్గించి యువతను ప్రజాస్వామ్యంలో భాగస్వాములను చేశారని, గ్రామీణ మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించి మహిళా సాధికారతకు బీజం వేశారని గుర్తుచేశారు. దేశ సమగ్రత, శాంతి కోసం తన ప్రాణాలను అర్పించిన అమరజీవి రాజీవ్ గాంధీ ఆశయాల సాధన కోసం ప్రతి కాంగ్రెస్ కార్యకర్త పునరంకితం కావాలని హాసిని వర్మ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పీసీసీ కార్యదర్శి గాదం మహేష్, మహిళా నాయకురాలు కందవ గాయత్రి, సీనియర్ నాయకులు విజయ్, జిల్లా కార్యదర్శి వంకర ఆనంద్ కుమార్, ఎస్సీ సెల్ నాయకుడు కస్తూరి వెంకటరావు, ఆఫీస్ ఇన్‌చార్జి సబ్బవరపు శ్రీధర్, కృష్ణ, మధు, కొమారపు చైతన్య, సురేష్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.




## ప్రకృతి వ్యవసాయంలో జిల్లాను ప్రథమ స్థానంలో నిలపడమే లక్ష్యం

### జిల్లా కలెక్టర్ టి.నిశాంతి

### క్షేత్రస్థాయిలో ఎఫ్.పి.ఓలు, ఎన్జీఓలతో కలెక్టర్, జాయింట్ కలెక్టర్, ఐటిడిఏ పీఓ ముఖాముఖి చర్చలు

పాడేరు,మే22, ప్రభాతవార్త



అల్లూరు జిల్లాను ఆర్గానిక్ జిల్లాగా చేయడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు జిల్లాను ప్రకృతి వ్యవసాయంలో రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిపేందుకు జిల్లా యంత్రాంగం వ్యాపార అనుబంధ భాగస్వామ్యులతో జిల్లా కలెక్టర్ నిశాంతి ప్రత్యేక చర్చలు నిర్వహించారు. ఇందులో భాగంగా శుక్రవారం సాయంత్రం శంకరం కళ్యాణ మండపంలో ప్రకృతి వ్యవసాయ అభివృద్ధిపై ఏర్పాటుచేసిన ప్రత్యేక కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్, మరియు ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి స్వయంగా వ్యవసాయ, వ్యాపార, పారిశ్రామిక, మార్కెటింగ్, ఎన్జీవోల వద్దకు వెళ్లి జిల్లాలోని ఆర్గానిక్ కాఫీ, ప్రకృతి వ్యవసాయం, పసుపు, మిరియాలు, ఉద్యానవనాల పంటలు, మిల్లెట్స్ వంటి వివిధ వాటాదారులతో రైతు ఉత్పత్తిదారుల సంఘాల ప్రతినిధులను నేరుగా కలుసుకుని ముఖాముఖి చర్చలు జరిపారు. జిల్లాలో ప్రకృతి వ్యవసాయాన్ని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయడం, గిరిజన రైతులకు అండగా నిలవడం, మార్కెటింగ్ సదుపాయాలను మెరుగుపరచడం వంటి అంశాలపై కార్యక్రమంలో పాల్గొన్న వివిధ సంస్థల ప్రతినిధులతో ఉన్నతాధికారులు సుదీర్ఘంగా చర్చించారు. మా తోట ట్రైబల్ ఫార్మింగ్, మార్కెటింగ్ ప్రొడక్ట్స్ కంపెనీ లిమిటెడ్ మన్యాతోరణ ఫార్మర్ ప్రొడక్ట్స్ కంపెనీ దంతన్న దొర ఫార్మర్ కంపెనీ అవనిమిత్ర ఫార్మర్ కంపెనీ వివిధ ఎఫ్.పి.ఓలు, ఎన్జీఓలు సేంద్రీయ రైతు గ్రూపులతో చర్చించారు. సమస్యల పరిష్కారం, ప్రకృతి వ్యవసాయం, గిరిజన ప్రాంతాల ఉత్పత్తుల మార్కెటింగ్‌లో ఎదురవుతున్న సవాళ్లను అధికారులు స్వయంగా అడిగి తెలుసుకున్నారు. సమన్వయంతో ముందుకు జిల్లాను ప్రకృతి వ్యవసాయానికి ఒక మోడల్‌గా మార్చేందుకు అన్ని రైతు సంఘాలు, ప్రభుత్వ విభాగాలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. రైతులకు ప్రోత్సాహం, గిరిజన, సాధారణ రైతులకు ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై మరింత అవగాహన కల్పించి, పెట్టుబడి ఖర్చులు తగ్గించేలా చర్యలు తీసుకుంటామని ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి స్పష్టం చేశారు. జిల్లాలో ప్రకృతి వ్యవసాయ ప్రగతికి, రైతుల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వ పరంగా పూర్తి సహకారం ఉంటుందని ఈ సందర్భంగా ఉన్నతాధికారులు భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమానికి ఆర్‌వైఎస్ఎస్ నార్త్ కోస్టల్ ఏరియా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ టి.బాబురావు నాయుడు, డిఆర్‌ఓ ఎంవిఎస్ లోకేశ్వరరావు, ఉద్యానవన శాఖ అధికారి బాలకర్ణ, వ్యవసాయ శాఖ అధికారి ఎస్‌బిఎస్ నందు, సీఈవో ప్రసాదరావు, పిడిఐసిడిఎస్ సిహెచ్ ఝాన్సీరామ్ పడాల్, డిడి ట్రైబల్ వెల్ఫేర్ అధికారి పిబికే పరిమిల, పిఓ ఎస్ ఎస్ సి స్వామి నాయుడు, స్పైసెస్ బోర్డు అధికారి కళ్యాణి, సివిల్ సప్లై అధికారి, వివిధ ప్రాంతాల నుండి వచ్చిన టేక్ హోల్డర్స్, ఎఫ్ఈఓస్, మా తోట సిఈఓ, సెక్రెటరీ, టూరిజం అనుబంధ సంస్థల ప్రతినిధులు, మార్కెటింగ్ ప్రతినిధులు, పరిశ్రమల శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఆర్‌వి రమణారావు, ప్రకృతి వ్యవసాయ సంబంధిత ఫార్మింగ్ ప్రొడక్ట్స్ కంపెనీస్ ప్రతినిధులు, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## సౌత్ వెస్టర్న్ రైల్వే భద్రతా పనుల కారణంగా పలు రైళ్ల రీషెడ్యూల్, మార్గమళ్లింపు

విశాఖపట్నం, మే 21, ప్రభాతవార్త

బెంగళూరు కంటోన్మెంట్-వైట్‌ఫీల్డ్ మధ్య జరుగుతున్న క్వాడ్రుప్లింగ్ పనుల్లో భాగంగా వైట్‌ఫీల్డ్ యార్డ్ ఫేజ్-1 రీమోడలింగ్‌కు సంబంధించిన ప్రీ-నాన్ ఇంటర్‌లాకింగ్, నాన్ ఇంటర్‌లాకింగ్ భద్రతా పనుల కారణంగా పలు రైళ్లను రీషెడ్యూల్ చేయడంతో పాటు మార్గమళ్లింపు చేసినట్లు దక్షిణ పశ్చిమ రైల్వే అధికారులు వెల్లడించారు. ఈ మేరకు ఎస్ఎంవీటీ బెంగళూరు-న్యూ తిన్సుకియా ఎక్స్‌ప్రెస్, టాటానగర్-ఎస్ఎంవీటీ బెంగళూరు ఎక్స్‌ప్రెస్, హతియా-ఎస్ఎంవీ బెంగళూరు ఎక్స్‌ప్రెస్, మాల్దా టౌన్-ఎస్ఎంవీటీ బెంగళూరు అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ తదితర రైళ్లను వివిధ తేదీల్లో 30 నిమిషాల నుంచి 180 నిమిషాల వరకు ఆలస్యంగా నడపనున్నట్లు తెలిపారు. అలాగే మైసూరు-హౌరా ఎక్స్‌ప్రెస్, ఎస్ఎంవీటీ బెంగళూరు-గువాహటి సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్, హౌరా-మైసూరు సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్, హతియా-ఎస్ఎంవీ బెంగళూరు ఎక్స్‌ప్రెస్, బాలుర్‌ఘాట్-ఎస్ఎంవీటీ బెంగళూరు వీక్లీ ఎక్స్‌ప్రెస్ సహా పలు రైళ్లను ప్రత్యామ్నాయ మార్గాల్లో నడపనున్నట్లు పేర్కొన్నారు. ఈ మార్పుల కారణంగా కృష్ణరాజపురం, బంగారుపేట, జోలార్‌పేట, కాట్పాడి, రేణిగుంట, పెరంబూర్, ఆర్కోణం తదితర స్టేషన్లలో కొన్ని రైళ్ల నిలుపుదలలు రద్దు చేసినట్లు తెలిపారు. ప్రయాణికులు తమ ప్రయాణానికి ముందు సంబంధిత రైల్వే విచారణ కేంద్రాలు లేదా అధికారిక రైల్వే వెబ్‌సైట్ ద్వారా తాజా వివరాలు తెలుసుకోవాలని అధికారులు సూచించారు.

## స్టీల్‌ప్లాంట్‌లో ఆర్ఐఎన్ఎల్ సీఎండీని కలిసిన జిల్లా కలెక్టర్



విశాఖపట్నం, మే 21, ప్రభాతవార్త

జిల్లా కలెక్టర్ ఎం.అభిషిక్త్ కిశోర్ గురువారం విశాఖ ఉక్కు కర్మాగారంలో ఆర్ఐఎన్ఎల్ (రాష్ట్రీయ ఇస్పాత్ నిగమ్ లిమిటెడ్) ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎం.ఎన్.వి.ఎస్. ప్రభాకర్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఇటీవల ఆర్ఐఎన్ఎల్ సీఎండీగా బాధ్యతలు స్వీకరించిన ప్రభాకర్‌కు జిల్లా కలెక్టర్ పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. విశాఖ ఉక్కు పరిశ్రమ అభివృద్ధి, పారిశ్రామిక విస్తరణ, ఉపాధి అవకాశాలు, స్టీల్‌ప్లాంట్ పరిపాలనా, అభివృద్ధి అంశాలపై ఇరువురూ కాసేపు మాట్లాడుకున్నారు.

## ప్రకృతి వ్యవసాయంపై విద్యార్థులకు ప్రాయోగిక శిక్షణ

ఆనందపురం, మే 22, ప్రభాతవార్త:



ఆనందపురం మండలంలోని తర్లువాడ లో ఉన్న ప్రకృతి వ్యవసాయ మోడల్ ఫీల్డ్‌లో సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాల విద్యార్థినులు ప్రకృతి వ్యవసాయం పై నెలరోజుల పాటు ఇంటర్న్‌షిప్ శిక్షణ పొందారు. రైతు సాధికార సంస్థ జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ అల్లంసెట్టి మోహన్‌రావు, అదనపు డీపీఎం శ్యామల మార్గదర్శకత్వంలో హెచ్ఆర్ అండ్ జెండర్ థీమాటిక్ బి.శ్రీనివాస చక్రవర్తి మహిళా కళాశాల విద్యార్థినులకు శిక్షణ అందించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ప్రకృతి వ్యవసాయంలో 9 సూత్రాలు, బహుళ రకాల మిశ్రమ విత్తనాల విధానం, విత్తనాలకు పోషకాలు, జీవామృతం, మట్టి, గోమయం వంటి పదార్థాలను పూతలా పట్టించి చిన్న గుండ్రని గుళికల తయారు చేసే ప్రక్రియ, ప్రకృతి వ్యవసాయ ఇన్‌పుట్స్ తయారీ, కూరగాయలు, ఆకుకూరల సాగు విధానాలపై ప్రాయోగిక అవగాహన కల్పించారు. ప్రత్యేకంగా ఎనీ టైమ్ మనీ మోడల్ ద్వారా 365 రోజుల పాటు వివిధ పంటలు సాగు చేస్తూ రైతులు నిరంతర ఆదాయం ఎలా పొందవచ్చో శ్రీనివాస చక్రవర్తి వివరించారు. తక్కువ ఖర్చుతో స్థిరమైన ఆదాయం పొందే విధానాలను విద్యార్థులు ప్రత్యక్షంగా నేర్చుకున్నారు. ప్రాసెసింగ్ యూనిట్, అరకు సీడ్ గ్యాలరీ సందర్శన ద్వారా విత్తన సంరక్షణ, విలువ ఆధారిత ఉత్పత్తుల ప్రాముఖ్యతను విద్యార్థులు తెలుసుకున్నారు. ఈ ఇంటర్న్‌షిప్ ద్వారా ప్రకృతి వ్యవసాయంపై తమకు మరింత ఆసక్తి పెరిగిందని విద్యార్థులు ఈ సందర్భంగా తెలిపారు.

## పద్మనాభంలో బడిబాట ప్రచారంపై ఉపాధ్యాయులు చైతన్య ర్యాలీ



పద్మనాభం, మే 22, ప్రభాతవార్త

రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బడిఈడు పిల్లలను చేర్పించే లక్ష్యంగా శుక్రవారం పద్మనాభం గ్రామంలో మండల విద్యాశాఖ అధికారి పి.వి.రమణ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు చైతన్య ర్యాలీ నిర్వహించారు. మండల కాంప్లెక్స్ నుండి పద్మనాభం గ్రామం వరకు ఈ ర్యాలీని నిర్వహించారు. అనంతరం పద్మనాభం జంక్షనులో ప్రభుత్వం విద్యార్థులకు కల్పిస్తున్న పలు సంక్షేమ పథకాలకు మద్దతుగా నినాదాలు చేస్తూ మానవ హారం నిర్వహించారు. ఈ సంవత్సరం పదో తరగతిలో అత్యధికంగా మార్కులు సాధించిన విద్యార్థుల ఫోటోలతో కూడిన ఫ్లెక్స్‌తో ర్యాలీ చేసారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల ప్రాతినిధులు జగదీష్, అరుణ కుమార్, సూర్యనారాయణ, చిన్నారావు, పాల్గొన్నారు.

23 -5Pg9th cheli.qxdO/P:23 -5Pg9th cheli.qxd 1/1/02 7:40 AM Page 1



ఫ్యాషన్ ఫ్యాషన్

# ఆమని.. సాగేను కాటన్‌తో..







వేసవిలో చల్లదనంతోపాటు స్టైల్‌నీ కోరుకునే నూలు దుస్తులు చక్కని ఎంపిక. కుర్తీలతోపాటు అనార్కలీ, మాక్సీ డ్రెస్‌లు, ఫ్రాక్‌లు, పలాజోలు, కో–ఆర్డ్ సెట్‌లు యువతని ఆకట్టుకుంటున్నాయి. వీటికి జతగా ఫ్లోరల్, చారలు, పోల్కా డాట్స్ వంటి క్లాసిక్ ప్రింట్లు ట్రెండీగా మారాయి.చీరల్నీ ఎంచుకుంటోందీ తరం. కాసేపు ఎండలోకి వెళ్లొస్తే చాలు.. ఒళ్లంతా చెమట, జిగురు. వీటిని తట్టుకుని ఫ్రెష్‌గా ఉంచాలంటే కాటన్ వస్త్రధారణే మేలు. ఇందులోని ఫైబర్ సహజ ఎయిర్ కండిషన్‌గా, ఇన్సులేటర్‌గా పనిచేయడంతో వేసవిలో చల్లగా, చలికాలంలో వెచ్చగా ఉంటుంది. □

## ఆరోగ్య భాగ్యం ముల్లంగి

పోషకాలకు నిలయం ముల్లంగి. కాని చాలా మంది రుచి నచ్చకో, వాసన నచ్చకో చాలా మంది తినరు. కాని అందరికి అందుబాటులో, తక్కువ ధరలో ఉండే కూరగాయల్లో ముల్లంగి ఒకటి. దీనికున్న ప్రత్యేక రుచి ఆరోగ్య ప్రయోజనాల దృష్ట్యా ప్రపంచవ్యాప్తంగా దీన్ని తినడానికి ఉపయోగిస్తారు. దీని మూలక, మహాకంద, దీర్ఘమూలక, మూలీ, నీల్వర్న్ రాడీష్, గ్రీన్ లుయోబో, మిసాటో గ్రీన్, క్వింగ్ లువోబో, చైనీస్ గ్రీన్ అని వివిధ ప్రాంతాలో పిలుస్తారు. చల్లని వాతావరణంలో పెరిగే దీన్ని వసంత ముల్లంగి అంటారు. రాడిష్ అనే పదం లాటిన్ పదం రాడిక్స్ నుండి వచ్చింది దీని అర్థం రూట్ అని అర్థం. ఇది చాలా వేగంగా 3–4 వారాల్లో పరిపక్వం చెందుతాయి. కాని చల్లని వాతావరణంలో 6–7 వారాలు పెరగుతాయి. ముల్లంగికి పురాతన ఈజిప్టు గ్రీన్, రోమ్ కాలల నాటి చరిత్ర ఉంది దీన్ని 2000 సంవత్సరాలకు పైగా సాగుచేస్తు న్నారు. అమెరిన్లకు పరిచయం చేసిన మొట్టమొదటి యూరోపియనే పంట ముల్లంగా చైనాలో 7వ శతాబ్దం బి.సిలో చైనా సాగుచేస్తే, జపాన్‌లో 1,000 సంవత్సరాల క్రితమే సాగు చేసినట్లు అని మధ్య ఆసియాకు వ్యాపించినట్లు ఆధారాలున్నాయి. పురాతన కాలంలానే ఈజిప్టియన్లు ముల్లంగిని పండించినట్ల ఆధారాలున్నాయి. పురాతన గ్రీకులు ముల్లంగిని ఎంతగానో విలువైనదిగా భావించి వారి అపోలో దేవుడికి చిన్న బంగారు ముల్లంగిని అర్పించారు. దీన్ని బట్టి చూస్తే పురాతన కూరగాయల్లో ముల్లంగి ఒకటి అని తెలుస్తుంది ప్రపంచ వ్యాప్తంగా ముల్లంగిని చాలా విభిన్న మార్గాల్లో ఉపయోగిస్తారు. మెక్సికోలో ఓక్సాకా అనే నగరంలో డిసెంబర్ 23న ముల్లంగి ఉత్సవాన్ని జరుపుకున్నారు. ముల్లంగిని ప్రపంచవ్యాప్తగా 7మిలియన్ల టన్నులు ఉత్పత్తి చేస్తే ప్రపంచ ముల్లంగి ఉత్పత్తిలో 2% ప్రాతినిధ్యం వహిస్తాయి. అమెరికన్స్ ప్రతి సంవత్సరం 400 మిలియన్ పౌండ్స్ తింటారు. అమెరికా, ఆసియా, చైనా, జపాన్‌లో విస్తారంగా పండించే ముల్లంగి కూరగాయ బ్రాసికేసియో కుటుంబానికి చెందింది. ఇండియాలో పశ్చిమ బెంగాల్, బీహార్, యుపి, కర్నాటక పంజాబ్, అసాంలో విరివిగా సాగుచేసే ముల్లంగి శాస్త్రీయనామం రాఫనస్ సటైవా. **రకాలు :** అధిక పోషకాలుండడంవల్ల దీని 'మిటమిన్ ముల్లంగి' అని అంటారు. దీనికలర్, సైజ్, ఆకారాన్ని బట్టి, సీజన్ బట్టి అనేక రకాలుగా ఉంటుంది. **ఆసియా/స్వదేశీ రకం :** ఇది తెల్లని రంగులో శంఖు ఆకారంలో ఉంటుంది. **ఐరోపా/ విదేశీ రకం :** ఇది తెల్లని రంగు కల్గి గుండ్రంగా ఉండి లోపల గడ్డ తెల్లగా ఉంటుంది. **శీతకాల ముల్లంగి :** శీతకాలం ముల్లంగా । చైనా రోజ్ రకం ఇది పొడవుగా గ్రీన్ కలర్, నల్లనిరంగులో ఘాటుగా ఉంటుంది. **రింగ్ ముల్లంగి :** వసంత ముల్లంగి తెలుపు, పింక్ కలర్‌లో గుండ్రంగా, మైల్డ్‌గా ఉంటుంది.



**వేసవి ముల్లంగి:** ఘాటుగా తెల్లగా ఎర్రగా ఉంటాయి ఆ కూరగాయల్ని భూమిలో ఎక్కువ సేపు ఉంచితే చేదుగా, వగరుగా వారుతుంది. **పరిమాణంను బట్టి ముల్లంగి రకాలు ..**తెలుపు డైకాన్ ముల్లంగి: ఇది ఆసియా దేశాల్లో ప్రసిద్ధి చెందిన పెద్దతెల్లని ముల్లంగి ఇది తేలికపాటి,కొద్దిగాతీపి రుచిని కల్గి ఉంటాయి. **ఆకు పచ్చ ముల్లంగి/** పుచ్చకాయ ముల్లంగి: ఇది బైట పచ్చగా ఉండి, లోపల పుచ్చకాయ రంగులో ఉంటుంది. **కొరియన్ ముల్లంగి :** ఇది తెల్ల రంగులో, మైల్డ్‌గా ఉండి బంగాళా దుంపని పోలి ఉంటుంది. ఇది అనేక రకాల్లో రంగుల్లో ఉన్నప్పటి దాదాపు 10–12 రకాలు మాత్రమే ప్రాచు ర్యంలో ఉన్నాయనే చెప్పాలి.



డాక్టర్ కె.ఉమాదేవి
తిరుపతి

## సరదా.. సరదాగా..



వేసవి సెలవులు మొదలైన నాటి నుంచి జరిగే ప్రతి విషయమూ పిల్లలకెంతో నచ్చుతుంది. ఎన్నో మధుర అనుభూతుల్ని అందిస్తుంది. వాటిని పదిలంగా భద్రపర్చుకునే అవకాశం ఇవ్వండి. వారికి నచ్చేవన్నీ పొందుపరుస్తూ ఓ చక్కని స్క్రాప్ బుక్ తయారు చేసుకోనివ్వండి. కెమెరాలో నచ్చిన ప్రదేశాలూ, వస్తువులూ, వ్యక్తులను బంధించి.. వాటి కాపీలను అందులో జత చేస్తూ మనసు చెప్పినట్లు రాయనివ్వండి. ఎంత ఉత్సాహంగా చేస్తారో మీరే చూడొచ్చు. ఈ పని వారి సమయాన్ని చక్కగా సద్వినియోగం చేస్తుంది. చిన్నారుల ఊహలకూ, ఆలోచనలకూ ఊతం ఇస్తుంది. బంధాలనూ, చక్కగా వ్యక్తపరిచేందుకు తోడ్పడుతుంది. □

**చెలి** సామాజిక పరిణామ క్రమంలో మహిళల పాత్ర ఎంతో అనిర్వచనీయమైనది. దానికి అందం చేకూర్చా లంటే స్త్రీ పాత్ర ఉండాల్సిందే! అందుకే మీ రచనలు పరిచయం చేయాలని 'వార్త' సంకల్పించింది. మహిళ సంబంధిత అంశాలపై వ్యాసాలు ఆహ్వానిస్తున్నాం. మీరు అనుసరించే జాగ్రత్తలు పాటించే చిట్కాలు, ఇతర ఏ అంశాలైనా మీ పేరుతో ప్రచురిస్తాం. ఈ మెయిల్:Cheli@vaartha.com

## నానబెట్టిన శనగలే !

ఖాళీ కడుపుతో వ్యాయామం చేయడం మంచిది. నానబెట్టిన సెనగలు తిని చూడండి. ఎన్ని ప్రయోజనాలో..

నానబెట్టిన సెనగల్లో ఆరోగ్యానికి ఉపకరించే సంక్లిష్ట కార్బోహైడ్రేట్లు ఉంటాయి. ఇవి శక్తిని ఒకేసారి కాకుండా నెమ్మదిగా విడుదల



చేస్తూ.. వర్కవుట్లు చేసుకోవడానికి కావాల్సిన హుషారునీ, ఉత్తేజాన్ని అందిస్తాయి. రక్తంలో చక్కెర స్థాయిలను ఒక్కసారిగా కాకుండా నిదానంగా విడుదలయ్యేట్లు చేస్తాయి.దీనిలో గ్లైసమిక్ ఇండెక్స్ స్థాయిలు తక్కువ. అందువల్ల కాసిని తిన్నా నిదానంగా శక్తిని విడుదల చేస్తూ, చక్కెర స్థాయులు పెరగకుండా చూసుకుంటాయి. పైగా ఏదో ఒకటి తినాలనే కోరిక కలిగించవు. బరువు పెరిగే సమస్యా ఉండదు. నానబెట్టిన సెనగలు తింటే బ్రెస్ట్, లంగ్ క్యాన్సర్ల నుంచి రక్షణ లభిస్తుందని అధ్యయనాలు చెబుతున్నాయి. ముప్పై దాటిన తర్వాత ముఖంలో ముడతలు వస్తాయనే దిగులు మొదలవుతుంది. అలాంటి వారు కచ్చితంగా సెనగలు తిన్నాలినసందే వీటికి చర్మాన్ని మెరిపించే శక్తి ఉంది. □

## సౌందర్య పోషణకు టీకాలొద్దు సుమీ!



యువతులైనా, గృహిణులైనా సౌందర్య రక్షణ కోసం వివిధ రకాల లేపనాలు , లోషన్‌లు, కొన్ని సందర్భాలలో ఇంజెక్షన్‌లను కూడా వాడుతుండటం సహజం. కానీ తాజాగా ఇంజెక్షన్‌లు ప్రాణాపాయ మని ఔషధ నియంత్రణ సంస్థ హెచ్చరికలు జారీ చేస్తోంది. చర్మ రక్షణ ప్రక్రియలో ఇటీవల బొటాక్స్, గ్లుటాథియోన్ వంటి సమ్మేళనాలు ప్రాచుర్యం పొందిన నేపథ్యంలో ఈ హెచ్చరికను జారీ చేసింది. వినియోగదారులైనా, నిపుణులైనా, సౌందర్య చికిత్సాలయా లైనా సౌందర్య సాధనాన్ని ఇంజెక్షన్ రూపంలో ఉపయోగించడానికి వీలులేదని కేంద్ర ఔషధ ప్రమాణాల నియంత్రణ సంస్థ స్పష్టం చేసింది. సౌందర్య సాధనాలేవైనా సరే అవి మానవ శరీరంపై రుద్దడానికి, పోయడానికి, చల్లడానికి లేదా పిచికారీ చేయడానికి మాత్రమే ఉద్దేశించినవని వివరించింది. వాటిని ఇంజె క్షన్ రూపంలో మానవ శరీరంలోకి పంపడం ద్వారా తీవ్ర దుష్పరిణామాలు ఎదురవుతున్నాయని తెలిపింది. చాలాచోట్ల సౌందర్య చికిత్సాలయాల్లో నైపుణ్యం లేని వారు సైతం ఇటువంటి ప్రయోగాలకు దిగుతూ వినియోగదారులను తప్పుదోవ పట్టిస్తున్నందున ఆ సంస్థ జోక్యం చేసుకుంది. □

జీ స్టూడియోస్, ఎంఐజి ప్రొడక్షన్ స్టూడియోస్ సమర్పణ ఆకట్టుకునే పోస్టర్‌తో ఆసక్తిని రేకెత్తించిన ది ఇండియా స్టోర్లీ మేకర్స్

## 'ది ఇండియా స్టోరి' జూలై 24న విడుదల



తాజాగా మరో కీలక అప్డేట్ ఇచ్చారు. కాజల్ అగర్వాల్, శ్రేయాస్ తల్పాడే ప్రధానపాత్రల్లో నటిస్తున్న ఈ సోషియోనేషనల్ డ్రామా టీజర్ త్వరలో విడుదల కానుందని ప్రకటిం చారు. జీ స్టూడియోస్ సమర్పణలో, ఎంఐజీ ప్రొడక్షన్ స్టూడియోస్‌తో కలిసి రూపొందుతున్న ఈ చిత్రం 2026 జూలై 24న ప్రపంచవ్యాప్తంగా థియేటర్ల లో విడుదల కానుంది. చెట్టన్ డీకే దర్శకత్వంలో, సాగర్ బి షిండే రచించి నిర్మిస్తున్న ది ఇండియా స్టోరీ: స్లో పాయిజన్ ఇన్ ప్రోగ్రెస్ రసాయనాల దుర్వినియోగం, ముఖ్యంగా పురుగుమందుల వ్యవసాయం వల్ల ప్రజల ఆరోగ్యంపై పడుతున్న ప్రభావాలను ప్రధానాంశంగా తీసుకుని తెరకెక్కుతోంది. ఇటీవల విడుదలైన పోస్టర్ ఈ చిత్రంలోని తీవ్రమైన, ఆలోచింపజేసే అంశంపై ఒక బలమైన సంకేతాన్ని ఇచ్చింది. ఒక వ్యక్తి లేదా ఒక కుటుంబ కథను దాటి, దేశవ్యాప్తంగా లక్షలాది మందిని ప్రభావితం చేస్తున్న సామాజిక సంక్షోభాన్ని ఈ చిత్రం ప్రతిబింబించ నుంది. పరిశ్రమల నిరక్ష్యల్ల, దాని వల్ల దాగి ఉన్న ప్రమాదాలు, సమాజంలో అవగాహన, బాధ్యత ఎంత అవసరమో ఈ కథ ద్వారా చూపించబోతున్నారు. త్వరలో రానున్న టీజర్‌ప్రేక్షకులను ది ఇండియా స్టోరీ ప్రపంచంలోకి మరింతగా తీసుకెళ్తుందని మేకర్స్ తెలిపారు. తొలిసారి కలిసి నటిస్తున్న కాజల్ అగర్వాల్, శ్రేయాస్ తల్పాడే తమ ఎమోషనల్, ఇంటెన్స్ పెర్ఫార్మెన్స్‌తో కథకు మరింత బలం తీసుకురానున్నారు.

## 'సమవర్తి' టైటిల్ ఫస్ట్ లుక్ రిలీజ్



వైవిధ్యమైన చిత్రాల్లో నటిస్తూ హీరోగా తనకంటూ ఓ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు యంగ్ టాలెంటెడ్ హీరో సత్యదేవ్. ఆయన హీరోగా నటిస్తున్న కొత్త చిత్రానికి 'సమవర్తి' అనే టైటిల్ ను ఖరారు చేశారు. ఈ రోజు ఈ చిత్ర టైటిల్, ఫస్ట్ లుక్ పోస్టర్ రిలీజ్ చేశారు. సత్యదేవ్ హీరోగా నటిస్తున్న 16వ చిత్రమిది. 'సమవర్తి'సినిమాను రుద్ర పిక్చర్స్ బ్యానర్ పంచభూత ప్రొడక్షన్స్, స్ పై శివచరణ్ రెడ్డి జక్కిడి, శశిధర్ రెడ్డి పడమటి నిర్మిస్తున్నారు. అజయ్ నాగ్. వి దర్శకత్వం వహిస్తున్నారు. ఎకోలాజికల్ యాక్షన్ థ్రిల్లర్‌గా తెరకెక్కుతున్న ఈ సినిమా త్వరలోనే తెలుగుతో పాటు తమిళ, కన్నడ, మలయాళంలో గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది. "సమవర్తి" సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్‌లో సత్యదేవ్ చుట్టూ గొడ్డళ్లు, కత్తులతో కొందరు దూసుకురాగా, ఆయన ఎలాంటి భయం లేకుండా హెడ్ ఫోన్స్ లో పాటలు వింటూ ఇంటెన్స్ లుక్స్‌లో కనిపిస్తుండటం ఆసక్తి కలిగిస్తోంది. సమవర్తి అంటే యముడు, ఎవరి పట్ల పక్షపాతం లేనివాడు అని అర్థం. ఈ సమవర్తి శత్రువుల పాలిట యముడిలా మారి వారందరినీ ఎలాంటి తేడాలు లేకుండా ఒకేలా కనుమరుగు చేస్తాడని అనుకోవచ్చు. సత్యదేవ్ కెరీర్‌లో ఇదొక హై ఇంటెన్స్ యాక్షన్ మూవీ అవుతుందనే అంచనాలు టైటిల్, ఫస్ట్ లుక్ పోస్టర్‌తో ఏర్పడుతున్నాయి.

## 'పెద్ది' బిగ్గెస్ట్ స్పెషల్ సాంగ్ 'హెల్లల్లో' రిలీజ్,



మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ మోస్ట్ ఎవైటెడ్ యాక్షన్ డ్రామా 'పెద్ది' దేశవ్యాప్తంగా హ్యూజ్ బజ్ క్రియేట్ చేస్తోంది. ఈ చిత్రం ఇప్పటికే అద్భుతమైన గ్లింప్స్, రెండు చార్ట్ బస్టర్ పాటలు, పవర్ ఫుల్ థియేట్రికల్ ట్రైలర్‌తో ప్రేక్షకులను మెస్మరైజ్ చేస్తోంది. బుచ్చి బాబు సానా దర్శకత్వంలో మైత్రి మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పణలో వృద్ధి సినిమాస్ బ్యానర్‌పై వెంకట సతీష్ కిలారు ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు.ఈ చిత్రానికి ఏఆర్ రెహమాన్ సంగీతం అందించగా, ఈరోజు చిత్ర బృందం మూడవ సింగిల్ 'హెల్లల్లో'ప్రోమోను విడుదల చేసింది. ప్రోమో చూస్తుంటే ఇటీవలి కాలంలో వచ్చిన అత్యంత ఎనర్జిటిక్, కలర్‌ఫుల్ స్పెషల్ సాంగ్స్ లో ఒకటిగా నిలవనుందని అర్థమవు తోంది. పవర్ ఫుల్ డ్రమ్ బీట్స్, క్యాచీ రిథమ్, జాతర వాతావరణాన్ని తలపించే ట్యూన్‌తో పాట ప్రేక్షకులను వెంటనే ఆకట్టుకుంటోంది.ఈ పాటలో రామ్ చరణ్ తన రగ్డ్, స్టైలిష్ లుక్‌లో అదిరిపోయే స్టెప్పులతో ఆకట్టుకుంటున్నారు. ఆయనతో పాటు శ్రుతి హాసన్, జాన్వీ కపూర్ కూడా అలరించారు. శ్రుతి హాసన్ తన బోల్డ్ అటిట్యూడ్‌తో, జాన్వీ కపూర్ తన గ్రేస్‌ఫుల్ ఎనర్జీతో పాటకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. పూర్తి పాటను రేపు భోపాల్‌లో జరగనున్న భారీ మ్యూజికల్ ఈవెంట్‌లో విడుదల చేయనున్నారు. ఈ వేడుకలో ఏఆర్ రెహమాన్, ఆయన బృందం ఈ పాటను ప్రత్యక్షంగా ప్రదర్శించనుండ టంతో అభిమానుల్లో మరింత ఉత్సాహం నెలకొంది.

## 'మేము కాప్'లం' గ్రాండ్ ప్రివ్యూ ఈవెంట్



'మేము కాప్'లం' విజయం సాధించాలని కోరుకుంటున్నాను బండ్ల గణేష్.. 'మేము కాప్'లం' సిరీస్‌కు పని చేసిన ప్రతీ ఒక్కరికీ మంచి పేరు, సక్సెస్ రావాలని కోరుకుంటు న్నాను గ్రాండ్ ప్రివ్యూ ఈవెంట్‌లో కోన వెంకట్.. 'మేము కాప్'లం' సిరీస్ మంచి విజయం సాధించాలని కోరు కుంటున్నాను గ్రాండ్ ప్రివ్యూ ఈవెంట్‌లో తమన్..'మేము కాప్'లం' అనే మరో ఒరిజినల్ సిరీస్ వచ్చింది. ఎంటర్‌టైన్‌మెంట్స్ (ప్రొడక్షన్ నెం. 3) బ్యానర్‌పై బి.వి.ఎస్. రవి నిర్మించిన 'మేము కాప్'లం' సిరీస్‌కు 'వికటకవి' ఫేమ్ ప్రదీప్ మద్దాలి దర్శకత్వం వహించారు. ఈ సిరీస్‌లో నాగబాబు కొణిదెల ప్రధాన పాత్రను పోషించారు. గెటప్ శ్రీను, రవి తేజ నన్నిమాల వంటి ప్రముఖ తారాగణం నటించారు. ఈ సిరీస్ మే 22 నుంచి స్ట్రీమింగ్ కానుంది. ఈ క్రమంలో గురువారం నాడు గ్రాండ్ ప్రివ్యూ ఈవెంట్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తమన్, బండ్ల గణేష్, అజయ్ భూపతి, కోన వెంకట్ తదితరులు ముఖ్య అతిథులుగా విచ్చేశారు. ఈ మేరకు తమన్ మాట్లాడుతూ.. సాకేత్ ఈ 'మేము కాప్'లం' సిరీస్‌కు సంగీతం అందించడం ఆనందంగా ఉంది. అజయ్ భూపతి మాట్లా డుతూ.. 'మేము కాప్'లం'అనే టైటిల్ కాంట్రవర్సీ అవుతుందేమో అని అనుకున్నాను. కానీ ట్రైలర్ మాత్రం వినోదాత్మకంగా ఉంది. బండ్ల గణేష్ మాట్లాడుతూ.. ప్రదీప్ నాకు నచ్చాడు. ఆయన తన అమ్మానాన్నను తీసుకు వచ్చి ఇక్కడ కూర్చోపెట్టాడు. అందుకే నాకు ఆయన నచ్చాడు. కోన వెంకట్ మాట్లాడుతూ.. అనురాధ మేడం ఎప్పుడూ కూడా మంచి కంటెంట్‌ను ఎంచుకుంటారు. ఇదొక రిఫ్రెషింగ్ కంటెంట్‌లా ఉంది. నిర్మాత కౌముది మాట్లా డుతూ.. మాకు ఈ అవకాశం ఇచ్చిన అనురాధ మేడంకి థాంక్స్. ప్రదీప్ గారి వల్లే ఈ ప్రాజెక్ట్ మా వరకు వచ్చింది. ఈ జర్నీలో సపోర్ట్ చేసిన ప్రతీ ఒక్కరికీ థాంక్స్.

# తెర

## 'టాన్స్‌ఫర్ త్రిమూర్తులు' టీజర్ లాంచ్



వద్దే జిష్ణు సమర్పణలో వద్దే క్రియేషన్స్ బ్యానర్ మీద వద్దే నవీన్ హీరోగా, నిర్మాతగా రూపొందించిన చిత్రం 'టాన్స్ ఫర్ త్రిమూర్తులు' కమల్ తేజ నార్ల ఈ మూవీతో దర్శకుడిగా పరిచయం కాబోతో న్నారు. ఈ సినిమాలో వద్దే నవీన్, రాశి సింగ్, శిల్పా తులస్కర్, వివేక్ రఘువంశీ, రఘుబాబు, శివన్నారాయణ, వడ్లమాని శ్రీనివాస్, జ్వాలా కోటి, దేవి ప్రసాద్, సూర్య, బాబా బాస్కర్, ప్రమోదిని, సాత్విక్ రాజు, అంజలి ప్రియ, గాయత్రి చాగంటి తదితరులు ముఖ్య పాత్రల్ని పోషించారు. ఈ మూవీని జూన్ 19న విడుదల చేయనున్నారు. ఈ క్రమంలో మూవీ టీజర్‌ను రిలీజ్ చేశారు. ఈ మేరకు నిర్వహించిన టీజర్ లాంచ్ ఈవెంట్‌లో..హీరో, నిర్మాత వద్దే నవీన్ మాట్లాడుతూ.. .. మా నాన్న చనిపోయిన తరువాత నేను నటిస్తున్న, నిర్మిస్తున్న మొదటి చిత్రమిది. నేను ఎప్పుడూ హైదరాబాద్‌లోనే ఉన్నాను. ఫ్యామిలీతోనే ఉంటున్నాను. నేను ఎక్కువగా బయట కనిపించను. కానీ నా గురించి మీడియా, అభిమానులు మాత్రం ఎప్పుడూ గుర్తు చేసుకుంటూనే ఉన్నారు. అందుకు థాంక్స్. హీరోయిన్ రాశీ సింగ్ మాట్లాడుతూ.. ..'టాన్స్ ఫర్ త్రిమూర్తులు' సినిమాలో నాకు లక్ష్మీ ్మ అనే మంచి పాత్రను ఇచ్చిన దర్శక, నిర్మాతలకు థాంక్స్. దర్శకుడు కమల్ తేజ నార్ల మాట్లాడుతూ.. .'టాన్స్ ఫర్ త్రిమూర్తులు' మూవీకి ముందు నుంచీ మీడియా అద్భుతమైన సపోర్ట్ చేస్తూనే ఉంది. ఏడాదిన్నర పాటుగా కథ, స్క్రిప్ట్ మీద పని చేశాం. ఇలా మా టీజర్‌ను రిలీజ్ చేయడం ఆనందంగా ఉంది.

## 'CASTE ' రాజా రవీందర్ ఫస్ట్‌లుక్



వరుణ్ సందేశ్, గగన్, సత్యం రాజేష్, రవి ప్రధాన పాత్రల్లో ఎకె జంపన్న రచన దర్శకత్వంలో గోల్డెన్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై తోట లక్ష్మీ ్మ కోటేశ్వరరావు నిర్మిస్తున్న చిత్రం 'దితిళీగిని' ఈ సినిమా ఫస్ట్ లుక్, గ్లింప్స్‌కి మంచి రెస్పాన్స్ వచ్చింది. ఈ చిత్రంలో రాజా రవీందర్ కీలక పాత్ర పోషిస్తున్నారు. ఆయన పాత్రని మినిస్టర్ నారాయణగా పరిచయం చేస్తూ ఫస్ట్ లుక్ ని రిలీజ్ చేశారు మేకర్స్.మంత్రి నారాయణ గా రాజా రవీందర్ లుక్ పవర్‌ఫుల్‌గా ఆకట్టుకుం టోంది. తెల్లటి దుస్తులు, భుజంపై పార్టీ కండువా ధరించి ఇంటెన్స్‌గా కనిపిస్తున్నారు. ఈ చిత్రంలో కశికా కపూర్, దివి హీరోయిన్స్‌గా నటిస్తున్నారు.ఈ చిత్రానికి అనూప్ రూబెన్స్ మ్యూజిక్ అందిస్తున్నారు. మేకర్స్ త్వరలోనే ఈ సినిమా రిలీజ్ డేట్‌ని అనౌన్స్ చేయనున్నారు.

23-05pg10.qxd:23-05pg10.qxd 1/1/02 6:51 AM Page 1





## మూడు మ్యాచ్‌లు 4 జట్లు, ఒక సీటు

# చివరి బెర్త్ జాక్‌పాట్ ఎవరిదో?

**కాసుల క్రికెట్ ఇండియన్ ప్రీమియర్ లీగ్ చివరి స్టేజ్‌కు చేరువైంది. మార్చి 26న ప్రారంభమైన ఐపీఎల్‌లో మరో మూడు లీగ్ మ్యాచ్‌లు మాత్రమే మిగిలి ఉన్నాయి. ప్లే ఆఫ్ చేరే ఆ నాలుగు జట్లలో మూడు మాత్రమే ఖరారయ్యాయి. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, గుజరాత్ టైటాన్స్, సన్‌రైజర్స్ హైదరాబాద్ ప్లే ఆఫ్‌కు చేరుకున్నాయి. మరో బెర్త్ ఖరారవ్వాల్సి ఉంది. ప్లే ఆఫ్‌కు చేరే నాలుగో జట్టేది అన్నది ఆసక్తి రేపుతోంది.**

(వార్త క్రీడా విభాగం)

ప్లే ఆఫ్‌కు మొదటగా చేరే జట్లలో పంజాబ్ కింగ్స్ మొదటి స్థానంలో, రాజస్థాన్ రాయల్స్ రెండో స్థానంలో ఉంటాయని తొలి దశ తర్వాత అంతా ఊహించారు. దానికి భిన్నంగా ఆ జట్లు ప్లే ఆఫ్‌కు చేరడం అటుంచి ఇపుడు అక్కడికి అర్హత పొందుతాయా అన్న డైలమాలో పడ్డాయి. నాలుగో బెర్త్ కోసం రాజస్థాన్ రాయల్స్, పంజాబ్ కింగ్స్, కోల్‌కతా నైట్ రైడర్స్ పోటీపడుతున్నాయి. నేడు, రేపు జరిగే మ్యాచ్‌ల్లో ఎవరిది నాలుగో బెర్త్ అన్నది తేలిపోనుంది.

### పంజాబ్ గెలిచినా?

ప్రస్తుతం పంజాబ్ కింగ్స్ 13 పాయింట్లతో అయిదో స్థానంలో ఉంది. వరుసగా ఆడిన ఆరు మ్యాచ్‌ల్లోనూ గెలుపొంది జోరుమీద కనిపించిన పంజాబ్ ఆతర్వాత ఒక్కసారిగా ఢీలా పడింది. ఆ తరువాత వరుసగా ఆరు మ్యాచ్‌ల్లో ఓడి ప్రస్తుత స్థితికి వచ్చింది. నేడు లక్నో సూపర్ జెయింట్స్‌తో పంజాబ్ కింగ్స్ తలపడనుంది. సొంతగడ్డలో మ్యాచ్ జరుగుతుండడం లక్నోకు అనుకూలించే అంశం. గత కొన్నిమ్యాచ్‌ల్లో ప్రత్యర్థి జట్లకు షాకిస్తున్న లక్నోపై పంజాబ్‌కు గెలుపు తప్పనిసరి. 15 పాయింట్లతో నాలుగో స్థానానికి చేరుకుంటుంది. గెలిచినా ప్లేఆఫ్ ఖచ్చితంగా చేరుతుందన్న గ్యారంటీ లేదు. ఆదివారం రాజస్థాన్-ముంబై మ్యాచ్ ఫలితం కోసం ఎదురుచూడాల్సి ఉంటుంది. ఈమ్యాచ్‌లో రాజస్థాన్ రాయల్స్ ఓడిపోవాలని కోరుకోవాల్సి ఉంటుంది. ఇక పంజాబ్ కింగ్స్ ఓడితే ఆశలు గల్లంతే.

### రాజస్థాన్ గెలిస్తే ప్లేఆఫ్ బెర్త్

ఇక రాజస్థాన్ రాయల్స్ వరుసగా మూడు ఓటముల తర్వాత గెలిచి నిలవాల్సిన మ్యాచ్‌లో లక్నోపై గెలుపొంది ప్లే ఆఫ్ ఆశలను సజీవంగా నిలుపుకుంది. ప్రస్తుతం 13మ్యాచ్‌ల్లో 7విజయాలు, 6 పరాజయాలతో 14పాయంట్లతో నాలుగో స్థానంలో ఉంది. నేడు ముంబై ఇండియన్స్‌తో తలపడనుంది. ఇప్పటికే ముంబై ఇండియన్స్‌ను ఓడించిన రాయల్స్... ఈ మ్యాచ్‌లోనూ గెలుపొందితే 16 పాయిట్లతో ప్లే ఆఫ్‌కు చేరుకుంటుంది. పంజాబ్, కేకేఆర్, ఢిల్లీ ఇంటికే. రాజస్థాన్ ఓడితే 14పాయింట్లకే పరిమితమవుతుంది. అపుడు నేటి మ్యాచ్‌లో పంజాబ్ కింగ్స్ ఓడిపోతే 13 పాయింట్ల వద్దే నిలిచిపోతుంది. ఆదివారం జరిగే రెండో మ్యాచ్ కీలకమవుతుంది. కోల్‌కతా నైట్‌రైడర్స్, ఢిల్లీ క్యాపిటల్స్ మ్యాచ్‌లో ఢిల్లీ గెలవాలని కోరుకోవాల్సి ఉంటుంది. అపుడు తక్కువ నెట్‌రన్‌రేట్ ఉన్న ఢిల్లీకి బదులు రాజస్థాన్ ముందంజ వేస్తుంది.

### రాయల్స్ ఓడితేనే కోల్‌కతాకు ఛాన్స్

13 పాయింట్లతో ఉన్న కోల్‌కతా నైట్‌రైడర్స్ సొంతగడ్డ ఈడెన్ గార్డెన్స్ వేదికగా ఆదివారం ఢిల్లీ క్యాపిటల్స్‌తో తలపడనుంది. అంతకు ముందు మ్యాచ్‌లో రాజస్థాన్ గెలిస్తే మాత్రం ఈ మ్యాచ్ నామమాత్రమే. పంజాబ్, రాజస్థాన్ ఓడిపోయి.. కేకేఆర్ విజయం సాధిస్తే నాకౌట్‌కు చేరుకుంటుంది. ఢిల్లీ గెలిస్తే మాత్రం మళ్లీ నెట్ రన్‌రేట్ కీలకమవుతుంది. ఢిల్లీతో పోరు వర్షం కారణంగా రద్దైనా సరే కోల్‌కతాకు నాకౌట్ బెర్తు ఛాన్స్ ఉంటుంది. అప్పుడూ ఏ జట్టు నెట్ రన్ రేట్ ఎక్కువ ఉంటే వారిదే నాలుగో ప్లేస్. మొత్తానికి నాలుగో బెర్త్ సాధించేదెవరు అన్న ఉత్కంఠ సర్వత్రా నెలకొంది.

# ఆర్సీబీపై సన్‌రైజర్స్ ఘనవిజయం





**హైదరాబాద్, మే 22(వార్త క్రీడా ప్రతినిధి):** ఉప్పల్‌లో సన్‌రైజర్స్ బ్యాట్స్‌మెన్ పరుగుల సునామీ సృష్టించారు. ఓపెనర్ అభిషేక్ (22 బంతుల్లో 56; 4 ఫోర్లు, 5 సిక్స్‌లు), ఇషాన్ కిషన్ (46 బంతుల్లో 79; 8 ఫోర్లు, 3 సిక్స్‌లు), క్లాసెన్ (24 బంతుల్లో 51; 2 ఫోర్లు, 5 సిక్స్‌లు) హాఫ్ సెంచరీలతో విశ్వరూపం చూపారు. వీరికి తోడుగా ట్రావిస్ హెడ్(16 బంతుల్లో 26; 5 ఫోర్లు), నితీష్‌కుమార్ రెడ్డి(12 బంతుల్లో 29 నాటౌట్; 1ఫోర్, 3 సిక్స్‌లు) మెరుపులు మెరిపించడంతో ఆర్సీబీ నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 255 పరుగుల భారీ స్కోర్ చేసింది. అనంతరం లక్ష్య ఛేధనలో ఆర్సీబీని ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 200 పరుగులకు పరిమితం చేసింది. ఛేజింగ్ కింగ్ విరాట్ కోహ్లీ(15) నిరాశపరచగా, ఎవరూ పెద్ద స్కోర్లు చేయలేకపోయారు. వెంకటేశ్ అయ్యర్(44), దేవ్‌దత్ పడిక్కల్(21) రాణించారు. రజత్ పాటిదార్(56) కెప్టెన్ ఇన్నింగ్స్‌కు తోడు కృనాల్ పాండే(41 నాటౌట్) ధాటిగా ఆడినా భారీ స్కోరును అందుకోలేకపోయారు. 55పరుగుల తేడాతో నెగ్గి లీగ్ స్టేజ్‌ను సన్‌రైజర్స్ విజయంతో ముగించింది. సన్‌రైజర్స్ 18 పాయింట్లతో ఆర్సీబీ, గుజరాత్‌తో సమంగా నిలిచినా నెట్‌రన్ రేట్‌లో వెనకబడింది. టేబుల్‌లో ఆర్సీబీ మొదటి స్థానంలో.. గుజరాత్, సన్‌రైజర్స్ వరుసగా 2,3 స్థానాల్లో నిలిచాయి.

టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ ఎంచుకున్న ఆరెంజ్ టీమ్‌కు ఓపెనర్లు శుభారంభం అందించారు. ట్రావిస్ హెడ్, అభిషేక్ తొలి ఓవర్ నుంచే దంచడం మొదలుపెట్టారు. భువీ వేసిన తొలి ఓవర్లో ఫోర్, సిక్స్ బాదారు. ఇక రసిఖ్ ఓవర్లో మూడు ఫోర్లు బాదిన హెడ్... చివరి బంతికి క్లీన్‌బౌల్డ్ అయ్యాడు. దీంతో తొలి వికెట్ 45 పరుగుల వద్ద పడింది. ఈ దశలో ఇషాన్ తో జతకట్టిన అభిషేక్ మరింత జోరు చూపాడు. సుయాంష్ ఓవర్లో బ్యాక్ టు బ్యాక్ రెండు సిక్స్‌లు, షెఫర్డ్ ఓవర్లో రెండు సిక్స్‌లు, ఓ ఫోర్‌తో అర్ధసెంచరీ పూర్తి చేశాడు. కురిపించాడు. కేవలం 20 బంతుల్లోనే హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. అదే క్రమంలో సుయాంష్ బంతికి భారీ షాట్ ఆడబోయి అభి పెవిలియన్‌కు చేరాడు. ఈ దశలో జతకట్టిన ఇషాన్, క్లాసెన్.. ఎస్ఆర్‌హెచ్ ఇన్నింగ్స్‌ను మరో రేంజ్‌కు తీసుకెళ్లారు. తొలుత ఆచితూచి ఆడిన ఇద్దరూ ఆ తర్వాత గేర్ మార్చారు. పోటాపోటీగా ఫోర్లు, సిక్సర్లతో ఆర్సీబీ బౌలర్లను ఊచకోత కోశారు. హేజిల్‌వుడ్ వేసిన 13వ ఓవర్లో క్లాసెన్ మూడు సిక్స్‌లు, ఒక బౌండరీతో సహా 27 రన్స్ సాధించాడు. ఈ క్రమంలో క్లాసెన్ 23 బంతుల్లో ఇషాన్ 31 బంతుల్లో అర్ధసెంచరీలు పూర్తి చేశారు. ఎస్ఆర్‌హెచ్ స్కోరును 200 మార్కు దాటించారు. మాంచి ఊపుమీదున్న క్లాసెన్ (51) మరింత వేగంగా ఆడే క్రమంలో కృనాల్ పాండ్యా బౌలింగ్ లో వెనుదిరిగాడు. క్లాసెన్ ఔట్ అయ్యాక క్రీజులోకి వచ్చిన నితీష్ రెడ్డి కూడా మెరుపు ఇన్నింగ్స్ ఆడాడు. కేవలం 12 బంతుల్లోనే ఒక ఫోర్, మూడు సిక్సర్లు బాది 29 పరుగులు చేశాడు. ఫస్ట్ డౌన్ లో బ్యాటింగ్ కు వచ్చిన ఇషాన్ కిషన్ ఇన్నింగ్స్ లాస్ట్ బౌల్ కు ఔట్ అయ్యాడు. 46 బంతుల్లో 8 ఫోర్లు, మూడు సిక్సర్లు కొట్టి హైదరాబాద్ కు భారీ స్కోర్ అందించాడు. ఆర్సీబీ బౌలర్లలో రసిఖ్ సలాందార్ రెండు, సుయాష్, కృనాల్ పాండ్యా చెరో వికెట్ తీశారు.



# క్వార్టర్స్‌లో అష్మిత ఓటమి ముగిసిన భారత్ సవాల్

**కౌలాలంపూర్:** మలేషియా మాస్టర్స్ 2026 బ్యాడ్మింటన్‌లో భారత్ సవాల్ ముగిసింది. ఏకైక ఆశాకిరణంగా ఉన్న భారత రైజింగ్ స్టార్ అష్మిత చలిహా క్వార్టర్‌ఫైనల్లో పరాజయం పొందింది. డెన్మార్క్‌కు చెందిన మాజీ యూరోపియన్ ఛాంపియన్ లైన్ కెర్స్‌ఫెల్డ్ చేతిలో 23-21, 21-18, 21-11తో ఓడింది. చలిహా మొదటి గేమ్ నెగ్గి శుభారంభం చేసింది. రెండో సెట్‌లోనూ ఇద్దరూ పోటాపోటీగా పాయింట్లు రాబట్టారు. 17-17తో సమవుజ్జీగా నిలిచారు. ఈ దశలో అష్మిత ఒత్తిడికి లోనై పొరపాట్లు చేయగా, పుంజుకున్న కెర్స్ ఫెల్డ్ వరుసగా మూడు పాయింట్లు సాధించి సమం చేసింది. ఫలితం తేల్చే మూడో సెట్‌లో కెర్స్‌ఫీల్డ్ జోరు ముదు అష్మిత నిలవలేకపోయింది. హోరాహోరీగా సాగిన నిర్ణయాత్మక గేమ్ ఏకపక్షంగా మారింది. బ్యాడ్మింటన్ ర్యాంకింగ్స్‌లో అష్మిత ప్రస్తుతం 71వ స్థానంలో ఉంది. అంతకుముందు ప్రిక్వార్టర్ ఫైనల్లో రెండుసార్లు జూనియర్ ప్రపంచ ఛాంపియన్ మలేషియాకు చెందిన గో జిన్ వెయ్‌ను అష్మిత వరుస గేమ్‌లలో ఓడించింది. కాగా మహిళల సింగిల్స్‌లో మాళవిక, దేవిక సిహాగ్ ప్రి క్వార్టర్ ఫైనల్లో వెనుదిరగారు. ఇక లక్ష్య సేన్, హెచ్‌ఎస్ ప్రణయ్ ఓటమితో పురుషుల సింగిల్స్‌లో భారత ప్రయాణం మొదటి రౌండ్‌లోనే ముగిసింది. భారత షట్లర్లు మంగళవారం నుంచి ప్రారంభమయ్యే సింగపూర్ ఓపెన్ సూపర్ 750 బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో బరిలోకి దిగనున్నారు.

# ఐపిఎల్‌లో ధోనీ స్కామ్ : సీఎస్కేపై మండిపడ్డ శ్రీకాంత్

చెన్నై: ఐపీఎల్ పంతొమ్మిదో సీజన్‌లో ఎంఎస్ ధోనీ ఆట కోసం నిరీక్షించిన అభిమానులకు నిరాశే మిగిలింది. చెన్నై సూపర్ కింగ్స్ ప్లే ఆఫ్స్ రేసు నుంచి నిష్క్రమించడంతో ధోనీ ఆడుతాడనే ఆశ కూడా ఆవిరైంది. ఇదుగో వస్తుండు.. వచ్చే మ్యాచ్‌లో ఆడతాడు అని ఊరించిన చెన్నై యాజ మాన్యం.. చివరికి అభిమానులను పిచ్చోళ్లను చేసింది. సీఎస్‌కే యాజమాన్యం తీరుపై టీమిండియా మాజీ కెప్టెన్ కృష్ణమాచారి శ్రీకాంత్ ఓ రేంజ్‌లో మండిపడ్డాడు. ఐపీఎల్‌లో ధోనీ స్కామ్‌కు సీఎస్‌కే పాల్పడిందని విమర్శించారు. ఎంఎస్ ధోనీ ఫిటినెస్ మొత్తం ఓ మాయ అని పేర్కొన్నాడు. మొత్తానికి క్రికెట్ అభిమానులను సీఎస్కే యాజమాన్యం పిచ్చోళ్లను చేసిందని మండిపడ్డారు. ఎంఎస్ ధోనీ ఈ ఐపీఎల్‌లో ఒక్క మ్యాచ్ కూడా ఆడలేదు. గాయం నుంచి కోలుకుంటున్న ధోనీ త్వరలోనే ఫిట్‌నెస్ సాధిస్తాడని, లీగ్ దశ చివర్లో ఆడతాడని చెన్నై కెప్టెన్, కోచ్ చెప్పిన మాటలన్నీ అబద్దాలని తేలిందన్నారు.



# కేంద్రానికి ఆర్బీఐ 2.87 లక్షలకోట్ల డివిడెండ్



**ముంబయి, మే 22:** కేంద్ర ప్రభుత్వానికి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నుండి భారీ మొత్తంలో మిగులు నిధులు బదలీ అవుతున్నాయి. 2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను ప్రభుత్వానికి బదిలీ చేయాల్సిన మిగులు నిధులపై (డివిడెండ్) ఆర్బీఐ సెంట్రల్‌బోర్డు నిర్ణయం వెలువరించాల్సి ఉంది. ఈసారి డివిడెండ్ మొత్తం గత ఏడాది రికార్డును అధిగమించి రూ.3 లక్షల కోట్లకు పైగా ఉండవచ్చని ఆర్థికవేత్తలు అంచనా వేస్తున్నారు.

ఇది ప్రభుత్వ ఆర్థిక నిర్వహణకు పెద్ద ఊరటనివ్వనుంది. గతేడాది ఆర్బీఐ రూ.2.68 లక్షల కోట్ల రికార్డు స్థాయి డివిడెండ్‌ను ప్రభుత్వానికి బదిలీ చేసింది. ఈసారి అంతకుమించి సుమారు రూ.2.87 లక్షల కోట్ల నుంచి రూ.3.3 లక్షల కోట్ల మధ్య డివిడెండ్ ఉండవచ్చని బ్యాంక్ ఆఫ్ బరోడా, ఎంకే గ్లోబల్ వంటి సంస్థలు అంచనా వేస్తున్నాయి. పన్నేతర ఆదాయం రూపంలో అందే ఈ భారీ మొత్తం, ప్రపంచ ఆర్థిక అనిశ్చితుల నడుమ ప్రభుత్వానికి ఎంతగానో తోడ్పడనుంది. మార్కెట్ నుంచి అదనపు రుణాలు సమీకరించాల్సిన అవసరం లేకుండా ఆర్థిక లోటును అదుపులో ఉంచేందుకు మేలుచేస్తుంది. 2026-27 కేంద్ర బడ్జెట్‌లో ప్రభుత్వ రంగ సంస్థల నుంచి, ఆర్బీఐ నుంచి డివిడెండ్ల రూపంలో రూ.3.16 లక్షల కోట్లు వస్తాయని ప్రభుత్వం అంచనా వేసింది. ఈసారి అధిక డివిడెండ్‌కు ప్రధాన కారణం కంటింజెన్సీ రిస్క్ బఫర్(సీఆర్‌బీ)ను తగ్గించే అవకాశం ఉండటమేనని అంచనా. బ్యాంక్ ఆఫ్ బరోడా చీఫ్ ఎకనమిస్ట్ మదన్ సబ్నవిస్ మాట్లాడుతూ గతేడాది విదేశీ మారక నిల్వల వినియోగం ద్వారా వచ్చిన అధిక ఆదాయం వల్ల డివిడెండ్ పెరిగింది. కానీ ఈసారి సీఆర్‌బీని తగ్గించడం ద్వారా మిగులు నిధులు పెరిగే అవకాశం ఉంది. ఈసారి డివిడెండ్ రూ.3 3.2 లక్షల కోట్ల మధ్య ఉండొచ్చని వివరించారు.

ఆర్బీఐ ఎకనమిక్ క్యాపిటల్ ఫ్రేమ్‌వర్క్ ప్రకారం కంటింజెన్సీ రిస్క్ బఫర్‌ను 4.5 శాతం నుంచి 7.5 శాతం మధ్యలో నిర్వహించాలి. ప్రస్తుతం ఇది గరిష్ఠ స్థాయిలో అంటే 7.5 శాతం వద్ద ఉంది. దీనిని స్వల్పంగా 7 శాతానికి తగ్గించినా కూడా ప్రభుత్వానికి బదిలీ చేసేందుకు భారీగా నిధులు అందుబాటులోకి వస్తాయి. అధిక వడ్డీ ఆదాయం, బఫర్ అవసరాలు తగ్గడం వంటి కారణాలు ఈసారి అధిక చెల్లింపులకు మద్దతుగా నిలుస్తాయని ఎంకే గ్లోబల్ చీఫ్ ఎకనమిస్ట్ మాధవి అరోరా పేర్కొన్నారు.



# స్వల్ప లాభాలతో ముగిసిన సెన్సెక్స్, నిఫ్టీ

**ముంబయి, మే 22:** ఈక్విటీ మార్కెట్లు వారాంతంలో స్వల్పలాభాలతోనే సరిపెట్టాయి. సానుకూలంగా న్న ప్రపంచ మార్కెట్‌ధోరణులు, ఇరాన్ అమెరికామధ్య శాంతి ఒప్పందం జరుగుతుందన్న అంచనాలు ఇన్వెస్టర్లలో పెట్టుబడులకు సానుకూలత కనిపించింది. అయితే చివరిదశలో ఎంపిక చేసిన షేర్లలో లాభాల స్వీకరణ కూడా జరిగింది. ప్రైవేటు బ్యాంకులు, ఆర్థికరంగ స్టాక్స్ లాభాల్లో వెళ్లాయి. హెల్త్‌కేర్, ఫార్మారంగషేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. మొత్తంగాచూస్తే ఇన్వెస్టర్లు అప్రమత్తంగా వ్యవహరించినట్లు తెలుస్తోంది. బిఎస్‌ఇ ఎన్సెక్స్ 231.99 పాయింట్లుపెరిగి 75,415.35 పాయింట్లవద్ద స్థిరపడితేనిఫ్టీ 50 సూచీ 64.60 పాయింట్లవద్దకు చేరి 23,719.30 పాయింట్లవద్దట్రేడింగ్ ముగించింది.

బిఎస్ఇలో మిడ్‌క్యాప్ సూచీ 0.11శాతంపెరిగితే స్మాల్‌క్యాప్ సూచీ 0.26శాతం క్షీణించింది. బిఎస్ఇలో 2168 కంపెనీల షేర్లుపెరిగితే 2027 షేర్లుక్షీణించగా మరో 174షేర్లు స్థిరంగా కొనసాగాయి. విదేశీ కరెన్సీ మార్కెట్‌లో డాలరుతో రూపాయి మారకం విలువలు 95.68వద్ద నిలిచాయి. అంతకుముందు రోజు 96.36వద్ద ట్రేడ్ అయిన సంగతి తెలిసిందే. ఎంసిఎక్స్‌లో పసిడి ఫ్యూచర్లు జూన్ ఐదునాటి సెటిల్‌మెంట్ ధరలు లక్షా 59వేల 127కి చేరాయి. కమోడిటీ మార్కెట్లలో బ్రెంట్ ముడిచమురు 2.32 డాలర్లు పెరిగి బ్యారెల్‌కు 104.90 చొప్పున ట్రేడ్ అయింది. అమెరికా డౌజోన్స్ ఫ్యూచర్‌లు 151 పాయింట్లు పెరిగింది. యూరోపియన్ షేర్లు వారాంతంలో గరిష్టంగానే ట్రేడ్ అయ్యాయి. యుకె మార్కెట్‌షేర్లు ఒత్తిడులకులోను కాగా ఆసియా షేర్లు మాత్రం గరిష్ట స్థాయిలోనే ట్రేడ్ అయ్యాయి. అమెరికా ఇరాన్ దౌత్య చర్చలే ఇందుకు కారణమని తెలుస్తోంది. వాల్‌స్ట్రీట్ డౌజోన్స్ పారిశ్రామిక సగటు 276.31 పాయింట్లుపెరిగితే ఎస్అండ్‌పి 500 సూచీ 0.17 శాతం, నాస్‌డాక్ కాంపోజిట్ 0.09శాతంపెరిగాయి. ఇక నిఫ్టీలోప్రైవేటు బ్యాంక్‌సూచీ 1.49శాతం, ఐసిఐసిఐ బ్యాంకు 1.96 శాతం, బంధన్‌బ్యాంకు 1.79, యస్‌బ్యాంకు 1.44, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు 1.30, ఇండస్‌ఇండ్ 1.13, ఫెడరల్ బ్యాంకు 1.06, కోటక్ మహీంద్ర 0.908, ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంకు 0.95శాతం పైపైకి వెళ్లాయి. ఎస్‌బిఐ షేర్లు 1.59శాతంపెరిగాయి. గెయిల్ 3.12,3ఎం ఇండియా 3.46శాతం పెరిగితే మారుతిసుజుకి 0.18 శాతం క్షీణించింది. లక్ష్మీడెంటల్ 20శాతంపెరిగింది. రామ్‌కో సిస్టమ్స్ కూడా 20శాతానికి వెళ్లింది. సెంట్రల్ బ్యాంక్ 7.81శాతంపెరిగింది. క్విక్ హీల్ టెక్నాలజీస్ 7.06 శాతం, విఎ టెక్ వాబాగ్ 1.48శాతంచొప్పున పెరిగాయి.

# స్వల్పంగా తగ్గిన పసిడి వెండి మాత్రం అదే జోరు



**ముంబయి, మే 22:** కొన్ని రోజులుగా వరుసగా పెరుగుతూ వచ్చిన బంగారం ధరలకు శుక్రవారం స్వల్పంగా బ్రేక్ పడింది. పసిడి ధర కాస్త తగ్గడంతో కొనుగోలుదారులకు కొద్దిగా ఊరట లభించింది. అయితే, వెండి ధర మాత్రం తన పరుగును కొనసాగిస్తూ మరోసారి భారీగా పెరిగింది. ఈరోజు ఉదయం 10.30 గంటల సమయానికి హైదరాబాద్ మార్కెట్లో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధరరూ.440 తగ్గి రూ.1,59,490 వద్ద స్థిరపడింది. 22 క్యారెట్ల ఆభరణాల బంగారం ధర 10 గ్రాములకు రూ.400 తగ్గి రూ.1,46,200కు చేరింది. మరోవైపు కిలో వెండి ధర నిన్నటితో పోలిస్తే ఏకంగా రూ.5,000 పెరిగి రూ.2,95,000కు చేరుకుంది. విజయవాడలో కూడా దాదాపు ఇవే ధరలు కొనసాగాయి. దేశంలోని ఇతర ప్రధాన నగరాల్లో ధరలను పరిశీలిస్తే చెన్నైలో 24 క్యారెట్ల బంగారం ధరరూ.1,61,240గా ఉండగా, ముంబైలో రూ.1,59,490గా ఉంది. దేశ రాజధాని ఢిల్లీలో 24 క్యారెట్ల పసిడి ధర రూ.1,59,640 వద్ద ట్రేడ్ అవుతోంది. దేశవ్యాప్తంగా వెండి ధరలు కిలోకు రూ.2.85 లక్షల నుంచి రూ.2.95 లక్షల మధ్య కొనసాగాయి. హైదరాబాద్‌లో రూ. 2.95 లక్షలుగా కొనసాగింది. ఏడాదిపాటు బంగారం కొనుగోలు చేయవద్దన్న ప్రధాని పిలుపుతో బులియన్ మార్కెట్ ఒక్కసారిగా ఢమాల్ మంది. అయితే వెండిపరంగా పారిశ్రామిక వినియోగం పెరుగుతుండటంతో డిమాండ్ ఏర్పడింది. చిప్స్ తయారీ, సోలార్ ఫోటోవోల్టాయిక్ ప్యానెళ్ల తయారీలోను వెండి వినియోగం భారీగా పెరిగిన సంగతి తెలిసిందే.

# కాల్గేట్ పామోలివ్ రాబడులు రూ.1595 కోట్లు





**ముంబయి, మే 22:** కాల్గేట్ పామోలివ్ ఇండియా త్రైమాసిక ఫలితాలు ఆశించిన స్థాయిలో రాలేదు. రాబడులు మాత్రం ఏడుశాతం పెరిగాయి. రాబడులు పెరగడంతో కంపెనీ రూ.24 డివిడెండ్ ప్రకటించింది. మార్జిన్లపై ఎక్కువ వ్యయాలు ప్రభావంచూపించాయి, ఎఫ్‌ఎంసిజి విభాగంలో రూ.353 కోట్లు లాభం వచ్చింది. గత ఏడాదికంటే స్వల్పంగా తగ్గింది. రాబడులు మాత్రం 7.3 శాతం పెరిగి రూ.1486 కోట్ల నుంచి రూ.1595 కోట్లకు పెరిగాయి. ఎబిడిటా కూడా 2.3శాతం క్షీణించింది. 522 కోట్లనుంచి రూ.510 కోట్లకు పడిపోయింది. ఎబిడిటా మార్జిన్‌కూడా 35.1 నుంచి 31.9శాతానికి తగ్గింది. నాలుగోత్రైమాసికంలో నికర అమ్మకాలు 9శాతం వృద్ధితో ఉంది. ప్రీమియం పోర్టుఫోలియోల్లో అమ్మకాలుపెరిగాయి. వ్యాపార ప్రకటనలు కూడా ఈ త్రైమాసికంలో వ్యయం 10శాతంపెరిగాయి. ఎక్కువగా ప్రీమియం కేటగిరీపైనే కంపెనీ ఫోకస్ పెంచింది. ప్రతి రూపాయి విలువ కలిగిన షేరుపై బోర్డు రూ.24 డివిడెండ్ సిఫారసుచేసింది. జూన్ 17న చెల్లిస్తారు. రికార్డు తేదీ జూన్ 1గా తేలింది. ఎండి ఇఇఒ ప్రభా నరసింహమ్ మాట్లాడుతూ కంపెనీ ఈ ఏడాది అమ్మకాల్లో వృద్ధి నమోదుచేసింది. దేశీయంగా బిజినెస్ 9.2శాతం పెరిగిందన్నారు. కంపెనీ ప్రీమియం పోర్టుఫోలియో అమ్మకాల్లో మంచి వృద్ధి కనిపించిందని, కంపెనీ వృద్ధి మూడురెట్లు పెరుగుతుందన్న నమ్మకాన్ని వ్యక్త చేసారు.

## క్షీణించిన ఫారెక్స్ ఖజానా

ముంబయి, మే 22: భారత ఫారెక్స్ నిల్వలు 8.094 బిలియన్ డాలర్లు క్షీణించి 688.894 బిలియన్ డాలర్లకు చేరాయి. మే 15తో ముగిసిన వారంలో నిల్వలు కొంత మేర కరిగాయి. డాలర్ చెల్లింపులు పెరగడమే ఇందుకు కారణమని తెలుస్తోంది. గత వారంలో ఆర్బీఐ రిజర్వులు 6.295బిలియన్ డాలర్లు పెరిగి 696.988 బిలియన్ డాలర్లకు పెరిగిన సంగతి తెలిసిందే. ఈ ఏడాది ఫిబ్రవరి 27తో ముగిసిన వారంలో ఆర్బీఐ కరెన్సీ రిజర్వులు ఆల్‌టైమ్ రికార్డు స్థాయికి చేరాయి. 728.494 బిలియన్ డాలర్లకు చేరాయి. మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతలు, డాలర్ చెల్లింపులు పెరగడంతో విదేశీ కరెన్సీ ఖజానా ఒత్తిడికి లోనయింది. విదేశీ కరెన్సా ఆస్తులు పరంగాచూసినా 6.483 బిలియన్ డాలర్లు క్షీణించి 545.904బిలియన్ డాలర్లకు చేరాయి. డాలరేతర కరెన్సీలు యూరో, పౌండ్, యెన్ ఇతరవిదేశీ కరెన్సీ మార్పిడిలో వచ్చే హెచ్చుతగ్గుల విలువలే విదేశీ కరెన్సీ ఆస్తులుగా పరిగణిస్తారు. ఇక బంగారం నిల్వలపరంగా చూస్తే 1.536 బిలియన్‌డాలర్లు క్షీణించి 119.317 బిలియన్ డాలర్లకు చేరాయి. ఇక ఐఎంఎఫ్‌వద్ద స్పెషల్ డ్రాయింగ్ హక్కులు కూడా 49 మిలియన్ డాలర్లు తగ్గి 18.824బిలియన్ డాలర్లకు చేరినట్లు వెల్లడించింది. ఐఎంఎఫ్ వద్ద రిజర్వుస్థాయి కూడా 25 మిలియన్ డాలర్లు క్షీణించి 4.85 బిలియన్ డాలర్లకు చేరాయి.









# ఎల్‌ఐసి నికరలాభం 57,419 కోట్లు

**ముంబయి, మే 22:** ప్రభుత్వరంగంలోని జీవితబీమా సంస్థ పూర్తి ఆర్థిక సంవత్సరానికి రూ.57,419 కోట్లు నికరలాభం ఆర్జించింది. గత ఏడాది కంటే 19.25 శాతం లాభాలు పెంచుకోవడంతో ఎల్‌ఐసి బోర్డు తుది డివిడెండ్ ప్రతి పది రూపాయల ఈక్విటీ షేరుకు రూ.10 డివిడెండ్ ప్రకటించింది. వ్యక్తిగత బిజినెస్ 43.78శాతం పెరిగి రూ.15,214కోట్లకు చేరింది. కొత్త బిజినెస్ విలువలు 41.63శాతం పెరిగి రూ.14,179 కోట్లకు చేరింది. కొత్త బిజినెస్ ప్రీమియం కూడా 8.29శాతం పెరిగి రూ.67,676 కోట్లకు చేరింది. మొత్తం ప్రీమియం ఆదాయి 9.80శాతం పెరిగి రూ.5,35,984 కోట్లుగా ఉందని ఎల్‌ఐసి పెరిగింది. భారత్ బీమా విలువలు 1.58శాతంపెరిగి రూ.7,89,185 కోట్లకు చేరింది. అలాగే ప్రీమియం కూడా 5.59శాతంనుంచి 7.51శాతానికి పెరిగింది.

వ్యయ నిష్పత్తి కూడా 51 బేసిస్ పాయింట్లు తగ్గింది. 12.42శాతం నుంచి 11.91శాతానికి చేరింది. పాలసీ దారులకు బోనస్ రూపంలోనే ఈ ఏడాది రూ.59,726 కోట్లు చెల్లించినట్లు ఎల్‌ఐసి వివరించింది. సంస్థ ఎండిసిఇఒ ఆర్.దరైస్వామి మాట్లాడుతూ సంవత్సరంలో పనితీరు సంతృప్తికరంగానే మారిందని అన్నారు. అకౌంటింగ్ ప్రమాణాలు భారతీయ ప్రమాణాలకు అనుసరించి ఇండాస్ వ్యవస్థనే అనుసరిస్తున్నట్లు తెలిపారు. రానున్న సంవత్సరాల్లో మరిన్ని కొత్త మైలురాళ్లు చేరుకోగలమని దొరైస్వామి చెప్పారు. మొత్తం 20 కోట్లమందికిపైగా పాలసీదారుల విశ్వాసం చూరగొన్నామని, భవిష్యత్తులో కూడా ఇదే తీరులో ముందుకు వెళతామన్నారు. ప్రస్తుతం నిర్వహణ ఆస్తులు ఎల్‌ఐసికి రూ.57,29,396కోట్ల వరకూ ఉన్నాయి. గతఏడాది కొంటే 5.08శాతంపెరిగినట్లు తెలిపారు. వాటాదారుల నమ్మకాన్ని వమ్ముచేకుండా 1:1 నిష్పత్తిలోనే బోనస్ ప్రకటించినట్లు సిఇఒ ఎండి గుర్తుచేసారు.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at Flat.No. 22, G Block ,Industrial park Auto Nagar , Gajuwaka, Visakhapatnam-530 012, Phones:2706784,2706785,2706786,2706787,2706622, Fax: 2706522, RNI No.64864/96, Editor : *Damerla Sai Baba, *Responsible for selection of News under the PRB Act. Regd.No. H/SD/337/12-14.